


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 111

శనివారం 12-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 12-7-2025





బొమ్మలు చిన్నపిల్లల కోసమే అనుకుంటారు చాలా మంది. బొమ్మలు పెద్దల్లో ఉన్న పిల్లల కోసం కూడా! బొమ్మలను చూడటం, వాటిని తాకడం, షెల్ఫ్‌లలో పెట్టుకుని దాచుకోవడం ఇవన్నీ ఆనందాన్ని ఇస్తాయని అంటారు నిపుణులు. 'నా చిన్నప్పటి సంతోషాలను ఇప్పటికీ పొందుతున్నాను' అంటుంది 34 ఏళ్ల శైలీ పాడ్వాల్. ముంబైలో ఉన్న శైలీ ఇంటికి వెళితే ఇంటి నిండా బొమ్మలే. వీటి సేకరణ కూడా ఒక ఇన్వెస్ట్‌మెంటే అంటున్న శైలీ పరిచయం.

బొమ్మలు నయం చేస్తాయి

'కొత్త బొమ్మ కొన్నప్పుడల్లా నాకు ఉత్సాహంగా ఉంటుంది' అంటుంది 34 ఏళ్ల శైలీ పాడ్వాల్.

ఆమె ఇంటికి వెళితే గదులు, అరలు, అల్మారాలు, గోడలు... అన్నీ బొమ్మలతో నిండి ఉంటాయి. అయితే అవేవీ దేశీయమైన బొమ్మలు కాదు. ఈ కాలపు పిల్లలు కూడా తక్కువగా చూసే ఆధునిక బొమ్మలు. చాలా మటుకు చైనా బొమ్మల తయారీ దిగ్గజం పాప్ మార్ట్ తయారు చేసి వదిలేవే. హాట్సునే మికు, స్మిస్కిస్, క్రై బేబీస్... 'వీటన్నింటి కంటే నాకు లబుడు బొమ్మలు ఇష్టం' అంటుంది శైలీ పాడ్వాల్.

ఫ్యాషన్ డిజైనర్‌గా దేశ విదేశాలు తిరిగే శైలీ తనకు స్నేహితులెవరైనా ఉన్నారంటే బొమ్మలనే అంటుంది. 'కొత్త కొత్త బొమ్మలను చూడటం, తాకడం వాటిని ఇంట్లో అలంకరించుకోవడం థెరపీ అనే అనిపిస్తుంది నాకు. బొమ్మలు కేవలం పిల్లలవి కాదు. బొమ్మలకు ఆకారాలుంటాయి. ప్రాణం లేకపోయినా అవి మనల్ని ఆకర్షిస్తాయి. వాటితో అనుబంధం ఏర్పడుతుంది. బొమ్మలు తోడుంటే ఒంటరితనం బాధ ఉండదు' అంటుంది శైలీ.

ఈ బొమ్మల మీద ఆసక్తి ఆమెకు బార్బీ బొమ్మల నుంచి వచ్చింది. 'నా చిన్నప్పుడు అమ్మ పాకెట్ మనీ ఇచ్చేది. వాటిని దాచి దాచి మొదటిసారి బార్బీ రెయిన్, బార్బీ సన్ డాల్ అనే రెండు బొమ్మలు కొన్నాను. నా చిన్నప్పుడు అవే పెద్ద ఫ్రెండ్స్‌గా ఉన్నాయి. బొమ్మలను నేను చూసే పద్ధతి, వాటిని అలంకరించే పద్ధతి, ఆకర్షణీయమైన బొమ్మలను చూసే పద్ధతి గమనించిన మా అమ్మ నేను ఫ్యాషన్ రంగంలో రాణిస్తానని ఊహించింది. ఫ్యాషన్ డిజైనింగ్ చదవడం వల్ల బొమ్మల్లోని అంద చందాలు నాకు మరింత బాగా అర్థమయ్యాయి' అంది శైలీ.

అయితే ఇంటి నిండా బొమ్మల్ని చూసి 'ఇన్ని ఎందుకు' అని తెలియని వారు ఆశ్చర్యపోవచ్చు.







'ఈ బొమ్మలు కొని పెట్టడం కూడా ఒక పెట్టుబడే. బొమ్మలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. ఒకసారి వచ్చిన బొమ్మలు మళ్లీ రావు. ఇలా కలెక్ట్ చేసి పెడితే కొన్నాళ్లకు అవి అరుదైనవిగా మారుతాయి. వాటిని భారీ రేటు ఇచ్చి కొనేవారూ ఉంటారు' అంటుంది శైలీ.

పసిపిల్లలు బొమ్మను పక్కన పెట్టుకుని నిద్రపోవడం అందరికీ తెలిసిందే. బొమ్మలు మానసిక ఓదార్పుని ఇస్తాయి. దేశీయ బొమ్మలు ఒకప్పుడు పిల్లలందరి దగ్గరా ఉండేవి. ఇప్పుడు ఏ బొమ్మలు లేకపోతే కనీసం టెడ్డీ బేర్‌ను అయినా పెట్టుకుంటున్నారు. 'అది మంచిదే' అంటుంది శైలీ.

'పిల్లలున్న ఇంట్లో బొమ్మలు లేవంటే వారు సరిగా పెరగడం లేదని అర్థం. మరొకటి పిల్లలకు బొమ్మలు ఇచ్చాక వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పొద్దు. వాటితో ఎలా వ్యవహరించాలో పిల్లలకు తెలుసు. వాటిపై ప్రయోగాలు జరిపినా... విరగ్గొట్టినా అదంతా ఎదుగుదలలో భాగంగా చూడాలి' అంటుంది శైలీ.

అయితే మితిమీరిన బొమ్మలను కొనడం ఒక వ్యసనంగా చూసేవారు కూడా ఉన్నారు. ఆ విధంగా చూస్తే శైలిది సేకరణా... లేకుంటే వ్యసనమా... అనిపిస్తుంది. ఒకవేళ వ్యసనమైనా హాని లేని వ్యసనమే అనుకుని సరిపెట్టుకోవచ్చు. 'మీరేమైనా అనుకుంటే నా బొమ్మల ప్రపంచం నాది' అంటోంది శైలీ.

ఫస్ట్ టైమ్

'సంస్కృతం పలకడానికి నీకు నోరు తిరగదు. నేర్చుకోవడం నీ వల్ల కాదు' అన్నారు సంస్కృతం టీచర్. 'నీలాంటి మొద్దు బుర్రలకు లెక్కలు అర్థం కావు' అన్నారు మ్యాథ్స్ టీచర్. బాగా చదువుకోవాలనే ఆశతో స్కూల్‌లోకి అడుగు పెట్టిన ఆదివాసీ అమ్మాయికి అడుగడుగునా అవమానాలు ఎదురయ్యాయి. ఆ అవమానాలకు తన ప్రతిభతో జవాబు చెప్పింది. యూనివర్శిటీ వైస్-చాన్స్‌లర్ స్థాయికి ఎదిగింది జార్ఖండ్‌కు చెందిన సోనాజ్ హరియ మింజ్. తాజాగా యునెస్కోలోని ఇండిజినస్ నాలెడ్జ్, రీసెర్చ్ అండ్ గవర్నెన్స్ (ఐకెఆర్‌జీ) కో-చైర్‌పర్సన్‌గా నియామకం అయిన తొలి ఆదివాసీ మహిళగా చరిత్ర సృష్టించింది...

అడవి నుంచి ఐరాస వరకు...


సోనాజ్ హరియ మింజ్

సోనాజ్ మింజ్‌కు బాగా చదువుకోవాలని కోరిక. అడవిలో ఉండేవాళ్లకు చదువు ఎందుకు! అనే వాళ్లు చాలామంది. 'సంస్కృతం అనేది ఆర్యుల భాష. నీలాంటి వాళ్లకు ఎలా వస్తుంది!' అన్నారు సంస్కృతం టీచర్. 'నీలాంటి వాళ్లకు లెక్కలు ఎలా వస్తాయి!' అన్నారు మ్యాథ్స్ టీచర్.

స్కూల్లో చేరిన కొత్తలో భాషాపరమైన సమస్యలను మింజ్ ఎదుర్కొంది. ఇంట్లో మాట్లాడే ఆదివాసీ భాష తప్ప మరే భాషా తనకు రాదు. అయితే మ్యాథ్స్ బాగా చేసేది.

ఆదివాసీ అమ్మాయి అనే కారణంగా మింజ్‌ను చేర్చుకోవడానికి రాంచీలోని ఒక ఇంగ్లిష్ మీడియం స్కూల్ నిరాకరించింది.

'నన్నే ఎందుకు అవమానిస్తున్నారో మొదట్లో అర్థం కాలేదు. చాలా కాలానికి అర్థమైంది. నేను ఆదివాసీ అమ్మాయిని అనే కారణంగానే అవమానిస్తున్నారు అని' గతాన్ని గుర్తు తెచ్చుకుంది మింజ్.

అయితే అవమానాలు ఆమె చదువుకు అడ్డుగోడలు కాలేకపోయాయి.

బాగా చదువుకోవాలి అనే కసిని పెంచాయి.

మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ తరువాత దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో ఎంఫిల్ చేసింది మింజ్. భోపాల్‌లోని బర్కతుల్లా యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసింది. కొన్ని సంవత్సరాల తరువాత తమిళనాడులోని మదురై కామరాజ్ యూనివర్శిటీలో పనిచేసింది. కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసిన మింజ్ జేఎన్‌యూలో ప్రొఫెసర్‌గా పనిచేసింది.

ఆ మాటను సవాలుగా తీసుకొని...

స్కూల్లో హోంవర్క్ ఇచ్చినప్పుడు సింగిల్ మిస్టేక్ లేకుండా చేసేదాన్ని. 'ఇది చాలదు. నువ్వు అందరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలి' అన్నారు ఒక టీచర్. ఆమె మాటలను సవాలుగా తీసుకొని ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకున్నాను. ఇక అప్పటి నుంచి ఫస్ట్ ర్యాంక్ ఎప్పుడూ నాతోనే ఉండిపోయింది. మొదట్లో వెటకారాలు, అవమానాల సంగతి ఎలా ఉన్నా స్కూల్ ఫస్ట్ రావడంతో ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు. చదువుతో పాటు ఆటలు అన్నా ఇష్టం. యూనివర్శిటీ లెవెల్లో హాకీ ఆడాను. అయితే చదువు మీదే ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల ఆటలకు దూరం అయ్యాను.

– సోనాజ్ హరియ మింజ్

జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధనాత్మక వ్యాసాలు రాసింది. అంతర్జాతీయ సదస్సులలో పరిశోధన వ్యాసాలు సమర్పించింది.

జేఎన్‌యూలో 'స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ సిస్టమ్స్ సైన్సెస్' డీన్‌గా, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్స్ అధ్యక్షురాలిగా పనిచేసింది.

ఎంత స్థాయికి ఎదిగినా తాను నడిచి వచ్చిన దారి మరవలేదు మింజ్. దళిత, ఆదివాసీ హక్కుల కోసం పనిచేసింది. జేఎన్‌యూలో ఈక్వల్ ఆపర్చునిటీ ఆఫీస్ (ఈవోవో) ప్రధాన సలహాదారుగా పనిచేసింది.

జార్ఖండ్‌లోని ఎస్‌కేఎం యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఆమె ప్రస్థానం మరో స్థాయికి చేరింది. వైస్ చాన్స్‌లర్ హోదాలో ఆదివాసీ కళలు, భాష కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించింది.

తాజాగా... యునెస్కోలోని ఇండిజినస్ నాలెడ్జ్, రిసెర్చ్. గవర్నెన్స్ (ఐకెఆర్‌జీ) కో- చైర్‌పర్సన్‌గా నియామకం అయింది.

'నేను భవిష్యత్‌లో మ్యాథ్స్ టీచర్ అవుతాను' అని స్కూల్ రోజుల్లో బలంగా అనుకునేది మింజ్.

అయితే మింజ్ పడిన కష్టం, ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని పట్టుదల ఆమెను మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడమే కాదు ఎంతోమంది ఆదివాసీ అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చేలా చేసింది.

ఇంటిప్స్





- బట్టలమీద పడిన ఇంక్ మరకలు పోవాలంటే... ఇంక్ మరకలపై కొద్దిగా నీళ్లు చల్లాలి. ఇప్పుడు టూత్‌పేస్టును అప్లై చేసి బ్రష్‌తో రుద్ది నీటితో వాష్ చేస్తే ఇంక్‌మరకలు ఇట్టే పోతాయి.
- రంధ్రాలు పడిన స్టీల్ గిన్నెలు కారుతూ ఇబ్బంది పెడుతుంటాయి. గిన్నెకు బయట వైపు ఉన్న రంధ్రంపైన నెయిల్ పాలిష్ అప్లై చేసి ఆరనివ్వాలి. పాలిష్ చక్కగా ఆరాక నాలుగు కోటింగ్‌లు అలాగే అప్లై చేసి ఆరనివ్వాలి. ఇప్పుడు ఈ గిన్నెలో ఏది పోసినా కారకుండా ఉంటుంది. నెయిల్ పాలిష్ శాశ్వతంగా ఉండదు కాబట్టి, పాలిష్ పోయినప్పుడల్లా కోటింగ్ వేసుకుంటే రంధ్రాల గిన్నెకూడా ఉపయోగపడుతుంది.

బులియన్	జూలై 11న ముగింపు
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)	రూ.లలో
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,510
బంగారం (22 క్యారెట్లు)	91,340
వెండి	1,11,800
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,320
బంగారం (22 క్యారెట్లు)	90,750
వెండి	1,12,900
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,000
బంగారం (22 క్యారెట్లు)	90,750
వెండి	1,21,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,320
బంగారం (22 క్యారెట్లు)	93,470
వెండి	1,12,900
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,600
బంగారం (22 క్యారెట్లు)	89,790
వెండి	1,11,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,000
బంగారం (22 క్యారెట్లు)	90,750
వెండి	1,21,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

• డిజిటల్ వరల్డ్

ఓన్లీ ఇండియన్


ప్రజక్త కోలి

'టైమ్ 100 క్రియేటర్స్' జాబితాలో చోటు సాధించిన ఏకైక భారతీయురాలిగా ప్రత్యేకత నిలుపుకుంది యూట్యూబర్ ప్రజక్త కోలి. డిజిటల్ మీడియాలో 2015 నుంచి కోలి విజయపరంపర కొనసాగుతోంది.

'టైమ్ 100 క్రియేటర్స్'లో చోటు సాధించిన నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌తో అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేసింది కోలి.

'నాలో ఎన్నో భావాలు పొంగిపొర్లుతున్నాయి. నేను మీతో చెప్పాలి అనుకుంటున్న వాటి కంటే చాలా విషయాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం చెప్పడానికి రెండు మాటలే ఉన్నాయి... థ్యాంక్స్' అని రాసింది.

తల్లిదండ్రులు, స్నేహితులు, అభిమానులకే కాదు తన పేరుకు కూడా కృతజ్ఞతలు తెలియజేసింది. 'థ్యాంక్ యూ ప్రజక్త. వ్యూహం, ప్లాన్, రోడ్ మ్యాప్... ఇలాంటివేమీ లేకుండానే తన ప్రయాణాన్ని ప్రారంభించింది. తనను తాను నమ్ముకుంది. తాను చేయాలనుకున్నది ధైర్యంగా చేసింది' అని రాసింది.

2015లో యూట్యూబ్ చానల్ లాంచ్ చేసింది కోలి. మొదట్లో కామెడీ స్కిట్‌లు షేర్ చేసేది. తక్కువ కాలంలోనే తన చానల్‌కు ఏడు మిలియన్‌ల సబ్‌స్క్రైబర్‌లు ఏర్పడ్డారు.

'మోస్ట్ సక్సెస్‌ఫుల్ ఇండియన్ యూట్యూబర్'గా పేరు తెచ్చుకున్న ప్రజక్త నెట్‌ఫ్లిక్స్ రొమాంటిక్ సిరీస్ 'మిస్ మ్యాచ్‌డ్'లో నటించింది.

'టు గుడ్ టు బి ట్రూ' అనే నవల రాసింది.

బామ్మా... తాత వచ్చాడహో!!

• సాంకేతికం



'ఆ రోజుల్లో మా ఆయన' అంటూ కీర్తిశేషులైన భర్త జ్ఞాపకాలలోకి వెళ్లే బామ్మలు చాలామంది ఉంటారు. ఈ బామ్మ కూడా అలాంటిదే.

బామ్మకు తాత మీద ఉన్న ప్రేమ గురించి బాగా తెలిసి ఉన్న మనవరాలు అపూర్వ వినయ్‌కుమార్, బామ్మ బర్త్‌డే గిఫ్ట్‌ను వెరైటీగా ప్లాన్ చేసింది.

బామ్మ, తాత చేయిలో చేయి వేసి ఉల్లాసంగా నడుస్తున్నట్లు ఏఐ టెక్నాలజీతో ఒక వీడియోను సృష్టించి బామ్మకు బర్త్ డే కానుకగా ఇచ్చింది.

ఊహించని ఈ వీడియోను చూసి బామ్మ చిన్న పిల్లలా అరిచింది, నవ్వింది, ఏడ్చింది!

బ్యూటిప్స్

ముఖంపై ముడతలు మాయం



బెల్లంతో తయారు చేసిన ఫేస్‌వాష్ యాంటీ ఏజింగ్‌గా పనిచేసి ముడతలను కనిపించనియ్యదు.

- చిన్న బెల్లం ముక్క తీసుకుని ఒక గిన్నెలో వేసి, టీస్పూను నీళ్లుపోసి ఉంచాలి. బెల్లం కరిగిన తరువాత టీస్పూను శనగపిండి, మజ్జిగవేసి బాగా కలుపుకోవాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఏడు నిమిషాల పాటు వలయాకారంలో మర్దన చేయాలి. ఇరవై నిమిషాలపాటు ఆరనిచ్చి చల్లటి నీటితో కడిగేయాలి. ముఖాన్ని పొడిగా తుడుచుకుని మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్ రాసుకోవాలి.
- ఈ ఫేస్‌వాష్‌ను వాడడం వల్ల ముఖం కాంతిమంతంగా కనిపిస్తుంది. వారానికి రెండుసార్లు క్రమం తప్పకుండా వాడడం వల్ల ముఖం మీద ముడతలు తగ్గుముఖం పడతాయి.

నేచురల్ హెయిర్‌కేర్...



- బాదం నూనె, ఆలివ్ ఆయిల్, ఆముదం సమపాళ్లలో కలిపిన మిశ్రమం కేశాలకు మంచి టానిక్‌లా పని చేస్తుంది. దీనిని వాడుతుంటే జుట్టు ఆరోగ్యంగా, దృఢంగా పెరుగుతుంది.
- గోరింటాకు, మందార, అలొవెరా, నువ్వులు తరచుగా వాడటం ద్వారా చిన్న వయసులోనే జుట్టు తెల్లబడడాన్ని నివారించవచ్చు. ఇవి జుట్టుకు మంచి మెరుపును, నలుపునిస్తాయి.
- లేత వెదురు ఆకులను తుంచి కొబ్బరినూనెలో వేసి అలాగే ఉంచాలి. ఆకులలోని పత్రహరితం నూనెలోకి దిగి, నూనె కొద్దిగా పచ్చగా మారుతుంది. దీనిని తలకు పట్టిస్తుంటే జుట్టు తెల్లబడదు, అప్పుడప్పుడే తెల్ల వెంట్రుకలు వస్తున్నప్పుడు దీనిని వాడితే అవి నల్లబడుతాయి.
- ఆవనూనెలో అంతే మోతాదులో నిమ్మరసం కలిపి తలకు పట్టించి మర్దన చేస్తే చుండ్రు వదలడంతోపాటు కేశాలు నిగనిగలాడతాయి.
- ఉల్లిరసం డాండ్రఫ్‌ను పోగొడుతుంది. ఒక టేబుల్ స్పూన్ రసాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేయాలి.

అరటితో అదిరే రుచులు

వంటిల్లు

మనకు విరివిగా దొరికే బనానాతో ఇలాంటి వెరైటీలు ఎప్పుడైనా ట్రై చేశారా? పిల్లలకైనా పెద్దలకైనా నచ్చే రుచులివి. ప్రయత్నించండి!

హల్వా



కావలసినవి: పండిన అరటి పండ్లు – 4; నెయ్యి – 5 టేబుల్ స్పూన్లు; పంచదార – అర కప్పు (లేదా రుచికి సరిపడా); ఏలకుల పొడి – అర టీ స్పూన్; జీడిపప్పు, బాదం పప్పు – కొన్ని (సన్నగా తరిగినవి, నేతిలో వేయించుకోవాలి); చాక్లెట్ పౌడర్ – అర కప్పు (అభిరుచిని బట్టి);

తయారీ: అరటి పండ్లను మెత్తగా చిదుముకోవాలి. ఒక పాన్‌లో నెయ్యి వేడి చేసి, అరటి పండు ముద్దను వేసి మధ్యస్థ మంట మీద, బాగా కలపాలి. అరటిపండు ముద్ద రంగు మారిన తర్వాత పంచదార, చాక్లెట్ పౌడర్ వేసి బాగా కలపాలి. పంచదార కరిగి, హల్వా దగ్గర పడ్డాక ఏలకుల పొడి వేసి మరోసారి కలపాలి. చివరగా, నెయ్యిలో వేయించిన జీడిపప్పు, బాదం పప్పులతో కలిపి, సర్వ్ చేసుకుంటే సరిపోతుంది.

ఘీ రోస్ట్



కావలసినవి: అరటిపండ్లు – 3 (మరీ పండినవి కాకుండా, కొంచెం గట్టిగా ఉన్నవి తీసుకుని ముక్కలు చేసి పెట్టుకోవాలి); పంచదార – సరిపడా; ఏలకుల పొడి – అర టీస్పూన్; నెయ్యి (ఘీ)– సరిపడా.

తయారీ: ముందుగా పాన్‌లో రెండు లేదా మూడు టేబుల్ స్పూన్ల నెయ్యి వేసుకుని, వేడి చేసుకోవాలి. ఆ నేతిలో అరటిపండు ముక్కలను పాన్ మొత్తం పరచుకోవాలి. చిన్న మంట మీద వేయించుకుంటూ పంచదారను అరటిపండు ముక్కలపై జల్లుకుని, దోరగా వేయించుకుంటూ ఇరువైపులా తిప్పుకుంటూ ఉండాలి. అవసరం అయితే నెయ్యి, పంచదార మరికాస్త వేసుకోవచ్చు. చివరిగా ఏలకుల పొడి జల్లుకోవాలి. అరటిపండు ముక్కలు దోరగా వేగి, పంచదార కరిగి పాకం– ముక్కలకు పట్టిన తర్వాత ప్లేట్‌లోకి తీసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

ఓట్స్ స్మూతీ



కావలసినవి: పండిన అరటి పండు – ఒకటి; ఓట్స్ – 2 టేబుల్ స్పూన్లు; పాలు – ఒక కప్పు (ఆవు పాలు లేదా బాదం పాలు); తేనె – 2 టీ స్పూన్లు (లేదా రుచికి సరిపడా); చియా సీడ్స్ – ఒక టీ స్పూన్; ఐస్ క్యూబ్స్ – కొన్ని.

తయారీ: ఓట్స్ ను 5 నిమిషాల పాటు పాలలో నానబెట్టాలి. ఒక మిక్సీజార్‌లో నానిన ఓట్స్, అరటి పండు, పాలు, తేనె, చియా సీడ్స్, ఐస్ క్యూబ్స్ వేసి మెత్తగా అయ్యేవరకు మిక్సీ పట్టుకుని, నచ్చిన విధంగా గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవాలి.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 111

శనివారం 12-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు



ఇక బ్యాటర్లదే భారం

బుమ్రాకు 5 వికెట్లు. ఇంగ్లండ్ 387 ఆలౌట్. భారత్ 145/3 -15లో



టెస్లా కారు వచ్చేస్తోంది..

టెస్లా వచ్చే వారం భారత మార్కెట్లో లాంఛనంగా అడుగుపెట్టనుంది -15లో



ఒక్క సాక్ష్యమైనా ఉందా?

ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌కు నష్టం వాటిల్లినట్లు సాక్ష్యాలు చూపాలని విదేశీ మీడియాకు అజిత్ దోవల్ సవాల్ విసిరారు.

వివరాలు 6లో ▸



ఎన్నికల హైజాక్‌కు బీజేపీ కుట్ర

బిహార్ అసెంబ్లీ ఎన్నికలను హైజాక్ చేయడానికి బీజేపీ కుట్రలు చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



రెండు రోజుల్లో రెండోసారి!

దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం రాత్రి మరోసారి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.7గా నమోదైంది.

వివరాలు 6లో ▸



గతి తప్పిన వాతావరణం

దేశంలో సాధారణం కంటే భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

వివరాలు 6లో ▸



వర్షం లోటు.. సాగు తడబాటు!

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు..

ఈ ఏడాది వ్యవసాయానికి తగ్గట్టుగా వర్షాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నం. నాతో పాటు చాలామంది రైతులు అప్పులు చేసి విత్తనాలు కొనుగోలు చేసి పత్తి పంట వేశారు. కానీ వర్షాలు సరిగా లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేదు. నేను మూడున్నర ఎకరాల్లో రెండుసార్లు గింజలు పెడితే గీ ఎకరన్నరలోనే ఓ తీరుగా మొలిచినయ్. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– మురావత్ రాంసింగ్, లోక్యతండా, వేలేరు మండలం, హనుమకొండ జిల్లా

సాగు ముందుకు సాగక ఆందోళనలో రైతాంగం

- రాష్ట్రవ్యాప్తంగా ఈ సమయానికి సగటున 185 సెం.మీ. వర్షం కురవాల్సి ఉండగా 165 సెంటీమీటర్లే నమోదు
- ఏకంగా 20 సెం.మీ. లోటు వర్షపాతంతో సాగుకు ఇబ్బందులు
- ఈ సీజన్‌లో పంటల సాగు అంచనా 1.32 కోట్ల ఎకరాలు
- ఇప్పటివరకు సాగైంది కేవలం 56.26 లక్షల ఎకరాలే
- చాలాచోట్ల వేసిన విత్తనాలు మొలకెత్తలేదు
- మొలకలు వచ్చినా ఎండిపోయే పరిస్థితి
- పెట్టుబడి కూడా వచ్చేలా లేదంటున్న రైతులు
- ప్రతికూల పరిస్థితుల్లోనూ అధికంగా సాగైన పత్తి.. వరి అంతంతే!

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఈ వానాకాలం సీజన్‌లో నెలకొన్న ప్రతికూల పరిస్థితులతో రైతాంగం సతమతమవుతోంది. ముఖ్యంగా జూలైలో పది రోజులు దాటినా ఇప్పటివరకు సరైన వర్షాలు లేకపోవడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. మేలో వర్షాలు కురవడంతో మురిసిపోయిన రైతాంగం.. గతేడాదిలా ఈసారి కూడా సాగు సాఫీగా సాగుతుందని భావించారు. కానీ వానాకాలం సీజన్ ముగింపు దశకు చేరుకున్నా ఇంకా లోటు వర్షపాతమే ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా 42.48 శాతం విస్తీర్ణంలోనే పంటల సాగు జరిగింది. ఈ సీజన్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేయగా, ఇప్పటివరకు కేవలం 56,26,243 (42.48 శాతం) ఎకరాల్లోనే రైతులు వివిధ పంటలు వేశారు. అయితే సరైన వర్షాలు లేక విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకలు ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని

మిగతా 14వ పేజీలో ▶

బీఆర్‌కేఆర్ భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న హరీశ్. చిత్రంలో కాలేరు, సుధీర్‌రెడ్డి తదితరులు



సీఎంకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టాలి

ప్రాజెక్టులపై ఆధారాలతో వచ్చి మాట్లాడతాం: హరీశ్‌రావు

- నదీ జలాలపై సీఎంది 'కవర్ పాయింట్ ప్రజెంటేషన్'
- కేబినెట్ నిర్ణయాలు, నోట్ అడిగితే ఇవ్వడం లేదు
- కమిషన్‌కు ఇచ్చిన వివరాలు మాకెందుకు ఇవ్వరు?
- కాళేశ్వరంపై ఘోష్ కమిషన్‌కు అదనపు వివరాలు అందజేత

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర చర్చకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటుచేయాలని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు సవాల్ చేశారు. తాము పూర్తి సమాచారంతో వచ్చి అసెంబ్లీలో మాట్లాడుతామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశాల్లో ఆరుసార్లు నిర్ణయాలు జరిగాయని, శాసనసభలో మూడుమార్లు ఆమోదం పొందాయని తెలిపారు. కేబినెట్, అసెంబ్లీ సమావేశాల తేదీలు, అందులో జరిగిన చర్చ, ఇతర అంశాల వివరాలను కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న 'పీసీ ఘోష్ కమిషన్'కు అందజేసినట్లు చెప్పారు. కేబినెట్ నిర్ణయాల కంటే శాసనసభ ఆమోదం మరింత ఉత్తమం అని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ నేతలు సి.లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

త్వరలో రోహిత్ వేముల చట్టం



పరిశోధక విద్యార్థి రోహిత్ వేములను ఆత్మహత్యకు ప్రేరేపించిన రాంచందర్‌రావుకు బీజేపీ పెద్దపీట వేసి రాష్ట్ర అధ్యక్షుడ్ని చేసిందని డిప్యూటీ సీఎం భట్టి ధ్వజమెత్తారు. రాంచందర్‌రావు గతంలో హెచ్‌సీయూ ఎదుట ఆందోళన చేశారని గుర్తుచేశారు.

- వివరాలు 2లో▶

కృష్ణా, గోదావరికి వరద



కృష్ణా, గోదావరి నదులకు వరద పోటెత్తుతోంది. దీంతో జలాశయాలన్నీ జలకళ సంతరించుకుంటున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం సమీపంలో జాతీయ రహదారిపైకి శుక్రవారం గోదావరి వరద చేరింది.

- వివరాలు 5లో▶

ఏడాదిన్నరలో రూ. 50 వేల కోట్ల పెట్టుబడులు



తెలంగాణను 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్'గా మార్చేందుకు కృషి చేస్తున్నామని.. ఈ క్రమంలో లైఫ్ సైన్సెస్‌లోనే ఏడాదిన్నరలో రూ. 50 వేల కోట్లకుపైగా పెట్టుబడులను ఆకర్షించామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

- వివరాలు 12లో▶

క్రిప్టోలో వలపు వల!



కరీంనగర్ 'క్రిప్టో కరెన్సీ' వ్యవహారం మరో మలుపు తిరిగింది. విదేశీ ప్రయాణాల ఆశ జూపి పెట్టుబడులు పెట్టించేందుకు నిర్వాహకులు వీరికి వలపు వల విసిరారు. మీటింగ్‌ల పేరిట థాయ్‌లాండ్, మలేసియా తదితర దేశాలకు తీసుకెళ్లి మర్యాదలు చేయించారు.

- వివరాలు 14లో▶

కోటాకు కాపు కాద్దాం!



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కృష్ణయ్య తదితరులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై సీఎం రేవంత్

- కోర్టుల్లో కేసులు పడకుండా చూడండి
- సామాజిక సామరస్యం దెబ్బతినకుండా చూడాలి
- బీసీ సంఘాలతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- హైకోర్టు, సుప్రీంలో కేవియట్లు వేయాలి: ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్

రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల ప్రజలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు దక్కేంతవరకు అందరం కలిసి కాపలా కాద్దామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. 'మా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది. మా పక్షం నుంచి పూర్తిస్థాయిలో మద్దతుగా ఉంటాం. ఏం జరుగుతుందనేది గమనిస్తూనే ఉంటాం. మీరు కూడా కాపలా కాయాలి. బీసీ రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కులు రాకుండా చూసుకోవాలి'అని బీసీ సంఘాల నేతలతో సీఎం అన్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ జారీచేయాలని మంత్రివర్గం నిర్ణయించిన నేపథ్యంలో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పలు బీసీ సంఘాల నేతలు శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారితో సీఎం దాదాపు 45 నిమిషాలపాటు పలు అంశాలపై చర్చించినట్టు తెలిసింది. ముఖ్యంగా ఆర్డినెన్స్ అనంతరం అటు రాష్ట్ర ప్రభుత్వం పరంగా, ఇటు న్యాయపరంగా చిక్కులు రాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. రిజర్వేషన్లను సాధించుకునేంత వరకు బీసీ వర్గాలు సమన్వయంతో ఉండాలని, సామాజిక సామరస్యం దెబ్బతినకుండా చూసుకోవాలని సీఎం సూచించినట్టు సమాచారం. న్యాయస్థానాల్లో కేసులు పడకుండా చూడాలని, ఒకవేళ ఎవరైనా

మిగతా 13వ పేజీలో ▶

బీసీల రిజర్వేషన్లకు సహకరించండి

రాష్ట్రంలోని రాజకీయ పార్టీలకు మంత్రి పొన్నం వినతి

- రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదంతో గాంధీ భవన్‌లో సంబురాలు.. టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకున్న కాంగ్రెస్ నేతలు

13 లో



బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం గాంధీ భవన్‌లో రాహుల్ ఫొటోతో కాంగ్రెస్ నేతల సంబురాలు. చిత్రంలో పొన్నం, వాకిటి, కేకే తదితరులు

రాజాసింగ్ రాజీనామాకు బీజేపీ ఓకే

- ఎమ్మెల్యే పదవికి రాజీనామా లేఖను స్పీకర్‌కు ఇవ్వాలని సూచన.. బీజేపీతో ముగిసిన 11 ఏళ్ల అనుబంధం..
- గోషామహల్ నుంచి వరుసగా మూడు సార్లు గెలుపు

12 లో



రాష్ట్రంలో అణు విద్యుత్ ప్లాంట్లు!



- ఇతర రాష్ట్రాల్లో వీటి పనితీరుపై అధ్యయనానికి సీఎం ఆదేశం
- ప్లాంట్ల ఏర్పాటు, ఖర్చు, ఉత్పత్తి, ధరలు పరిశీలించాలని సూచన
- 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసే యోచన
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా తక్కువ ధరకు లభించే విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి
- ఇప్పటికే మణుగూరులో భార జల ఉత్పత్తి కేంద్రం - వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



● యోగా

మెదడును ఉత్తేజపరిచే ఆసనాలు

మానసిక ఆందోళనలు తగ్గడానికి, స్పష్టత లేని ఆలోచనలను కట్టడి చేయడానికి, మెదడు ఆరోగ్యానికి యోగా శక్తివంతమైన టెక్నిక్‌లా ఉపయోగపడుతుంది. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే వాటిలో.. మత్స్యాసన, గరుడాసన, ధనురాసన, వజ్రాసన, అర్ధమత్స్యేంద్రాసన, బాలాసన, శవాసన.. మొదలైనవి ఉన్నాయి.

● ఛాతీ, మెడను విస్తరించి, ఆక్సిజన్ మెరుగుపరుస్తుంది మత్స్యాసన. ఊపిరితిత్తులను, నాడీ వ్యవస్థను ఉత్తేజరుస్తుంది. మానసిక అలసట తగ్గుతుంది. శక్తి పెరుగుతుంది. మెదడు పనితీరు మెరుగుపడుతుంది. ● గరుడాసన ద్వారా జ్ఞాపక శక్తి మెరుగుపడుతుంది. ఏకాగ్రతను పదునుపెడుతుంది. ఒత్తిడి నిర్వహణలో సహాయపడుతుంది. ● వజ్రాసన ద్వారా శరీ



రంపై అవగాహన పెరుగుతుంది. జీర్ణక్రియ పనితీరుకు సహాయపడుతుంది.
● భావోద్వేగాలను సమతుల్యం చేసే ధనురాసనం ఏకాగ్రతను పెంచుతుంది.
● అర్ధ మత్స్యేంద్రాసన వల్ల వెన్నెముక నరాలను ఉత్తేజపరచడం ద్వారా అంతర్గత అవయవాల పనితీరు మెరుగవుతుంది. మెదడుకు రక్తప్రవాహం పెరుగుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. భావోద్వేగాలు అదుపులో ఉంటాయి.
● మోకాళ్లపై వంగి, చేతులు చాచి, ముందుకు వంగడం వల్ల శ్వాస తీసుకోవడంలో మెరుగవుతుంది. ఆందోళనలు తగ్గుతాయి. మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపుతుంది. ● శవాసనలో పూర్తి విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల భావోద్వేగాల సమతుల్యత కుదురుతుంది. మెదడు ఆరోగ్యం మెరుగుపడుతుంది.

మారాం చేస్తున్నారా... ముద్దుగా పంపండి

స్కూళ్లు ప్రారంభం అయ్యాయి. సమ్మర్ హాలిడేస్ అంతా సరదాగా... జాలీగా గడిపేసిన పిల్లలు ఇప్పుడు పొద్దున్నే లేచి స్కూలుకు వెళ్లాలంటే నిరాసక్తతతో లేదా బద్ధకంతో బడికెళ్లకుండా మారాం చేస్తుంటారు. వీరు గాకుండా ఇప్పుడిప్పుడే ప్లేస్కూల్‌కు వెళ్లే చిన్నారులు... ప్లే స్కూల్ నుంచి ఎల్‌కేజీ యూకేజీలోకి ప్రమోట్ అయిన పిల్లలు ఏడవకుండా కిలకిలలాడుతూ స్కూలుకు వెళ్లేలా చేయడానికి కొన్ని టిప్స్.



ముందుగా పిల్లలతో పాటు పేరెంట్స్ కూడా స్కూలుకు వెళ్లి క్లాస్ టీచర్, తోటి విద్యార్థులు, ఇతర స్కూలు సిబ్బందితో మాట్లాడి, వారితో స్నేహంగా మెలగాలి. అప్పుడు అది దగ్గర నుంచి చూసిన పిల్లలు స్కూలు వాతావరణాన్ని కొత్తగా భావించరు. దీంతో పాటు వీలు చిక్కినప్పుడల్లా పిల్లలకు కామిక్ స్టోరీస్, జోక్స్ లాంటివి చెబుతూ ఉండాలి.



గదమ కూడదు

పిల్లలు స్కూలుకు వెళ్లను అని మారాం చేసినప్పుడు గట్టిగా తిట్టడం, అరవడం, కోప్పడటం చేయకూడదు. ఇలా చేస్తే వాళ్లు మరింత భయపడతారు. వారు స్కూలుకు ఎందుకు వెళ్లనంటున్నారో బుజ్జగిస్తూ కారణాలు తెలుసుకోవాలి. కారణాన్ని బట్టి వాళ్లను స్కూలుకు వెళ్లడానికి అనుకూలంగా ఆలోచించేలా వివరిస్తూ, వాళ్లల్లో స్కూలు పట్ల ఇష్టాన్ని కలిగించాలి.

● **అనుకూలంగా మాట్లాడాలి:** స్కూలు ప్రారంభంలో పిల్లలను స్కూలో దింపడం, స్కూలు అయిపోయాక తీసుకు రావడం చేస్తుండాలి. బాక్స్‌లో వాళ్లకిష్టమైన టిఫిన్ లేదా స్నాక్స్ పెట్టాలి. స్కూలు నుంచి వచ్చాక ''స్కూల్లో ఎలా గడిచింది? ఈరోజు కొత్తగా ఏం నేర్చుకున్నావు?'' అని అడగాలి. స్కూల్లో తమ పిల్లలు ఎలా ఉంటున్నారో పిల్లలకు తెలియకుండా టీచర్‌ను అడిగి తెలుసుకుంటూ ఉండాలి. టీచర్ చెప్పిన సలహాలు, సూచనలు పాటించాలి.

● **ప్రోత్సహించాలి**

స్కూలుకు వెళ్లేందుకు ఆసక్తి కలిగేలా పిల్లలను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తుండాలి. స్కూల్లో స్నేహితులను ఏర్పర్చుకోమని చెబుతుండాలి. ఇవన్నీ చేయడానికి తల్లిదండ్రులు కాస్త సహనం పాటిస్తే.. పిల్లలు సంతోషంగా స్కూలుకు వెళ్లి చదువుకుంటారు.

పరగడుపున ఇవి తింటున్నారా?

మనం తినే ఆహార పదార్థాలు లేదా తీసుకునే ద్రవపదార్థాలు ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపిస్తుంటాయి. పరగడుపున కొన్ని రకాల ఆహార పదార్థాల్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యం పాడవుతుంది. ఎందుకంటే ఉదయం వేళ కడుపు ఖాళీగా ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో మనం ఏం తిన్నా అది నేరుగా కడుపు లోపలి భాగాలపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా కడుపు లో మంట, నొప్పి, ఛాతీలో మంట, అజీర్తి వంటి సమస్యలు ఎదురవుతాయి. ఉదయం వేళ పరగడుపున ఏయే పదార్థాలు తినకూడదో తెలుసుకుందాం.

ఉదయం వేళల్లో మసాలాలు, డీప్ ఫ్రైస్ తినడం వల్ల కడుపులో మంట, అజీర్తి వంటి సమస్యలు తలెత్తుతాయి. అంతేకాకుండా కడుపు లేదా ఛాతీ బరువుగా అన్పించి ఇబ్బంది కలుగుతుంది. అదేవిధంగా కడుపుకి మంచిదే కదా అని పీచు పదార్థాలు ఎక్కువ మోతాదులో తీసుకుంటే మాత్రం కడుపులో నొప్పి, కడుపు పట్టేయడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే పరిమిత మోతాదులోనే పీచుపదార్థాలు తీసుకోవాలి.



చాలామంది బ్రష్ చేసుకోగానే కాఫీ లేదా టీ తాగకపోతే ఏ పనీ చేయలేరు. అయితే అలా కాఫీ లేదా టీ తాగడం వల్ల ఛాతీలో మంట, డీహైడ్రేషన్ వంటి సమస్యలు ఎదురవుతాయి. దానికి బదులు పరగడుపున నీళ్లు తాగడం చాలా మంచిది. అలాగని చల్లటి నీళ్ళు తాగితే జీర్ణ సమస్యలు ఎదురై..ఏం తిన్నా సరే కడుపులో అజీర్ణం మొదలవుతుంది.

పరగడుపున ఆల్కహాల్ తీసుకోవడం చాలాప్రమాదకరం. ఇది కాలేయంపై నేరుగా ప్రభావం చూపిస్తుంది. ఖాళీ కడుపుతో మద్యం పుచ్చుకోవడం వల్ల రక్తంలో ఆల్కహాల్ వేగంగా వ్యాపిస్తుంది. దానిమూలంగా రకరకాల అనర్థాలు సంభవిస్తాయి కాబట్టి వీలయినంత వరకు పైన చెప్పుకున్న ఆహారం లేదా ద్రవపదార్థాలను వీలయినంత వరకు పరగడుపున తీసుకోకుండా ఉండటం చాలా మేలు.

● రిలేషన్ షిప్స్

చిటపటలే బంధానికి బలం

భార్యాభర్తలన్నాక గొడవలు సహజం. కానీ కొన్ని జంటలు అసలు గొడవ పడకుండా ఒకరినొకరు ఎంతగానో ప్రేమించుకుంటున్నట్లు మనం చూస్తుంటాం. 'ఓహ్, చిలకా గోరింకల్లా ఎంత ముచ్చటైన జంట, ఒకరినొకరు ఎంత ప్రేమించుకుంటున్నారు!' అని మెచ్చుకుంటాం. అయితే అలా గొడవలు పడని వారి మధ్య బంధం ఏమంత దృఢంగా ఉండదని, భార్యాభర్తలు అప్పుడప్పుడు చిన్న చిన్న గొడవలు పడటం వల్ల వారి మధ్య బంధం బలపడుతుందంటున్నారు మనస్తత్వ శాస్త్రవేత్తలు.

గొడవలు, వాదోపవాదాల వల్ల బంధాలు తెగిపోవడం మనం చూస్తునే ఉంటాం. కానీ బొత్తిగా గొడవ పడకపోవడం కూడా బంధం విడిపోవడానికి ఒక కారణం కావచ్చు. చాలామంది జంటలు తమకు గొడవలు రావని గర్వపడతారు, ఇది బంధానికి మంచిది కాదు. వినడానికిది ఆశ్చర్యం కలిగించవచ్చు. వైవాహిక బంధంలో గొడవలు పడటం రెడ్ ఫ్లాగ్ కానప్పటికీ, పింక్ ఫ్లాగ్ అని చెప్పవచ్చు.

బంధంలో పింక్ ఫ్లాగ్ అనేది ఒక ప్రమాద హెచ్చరిక. దీనివల్ల బంధం వెంటనే తెగిపోకపోయినా, జంటలకు ఇది చాలా కష్టమైన పరిస్థితిని సృష్టించవచ్చు. పింక్ ఫ్లాగ్‌లో జంటలు కలిసి ఉన్నప్పటికీ, వారి మధ్య దూరం ఉన్నట్లు అనిపిస్తుంది.

రిలేషన్‌షిప్ నిపుణురాలు ఆశితా భరద్వాజ్ మాటల్లో చెప్పాలంటే పింక్ ఫ్లాగ్ అనేది బంధంలో తలెత్తే సమస్యలకు ఒక లక్షణం. జంటలు దీన్ని సకాలంలో అర్థం చేసుకుంటే, వారి బంధాన్ని కాపాడుకోవచ్చు. ఇద్దరు భాగస్వాములు ప్రేమను వ్యక్తపరిచే విధానాలు వేర్వేరుగా ఉండవచ్చు. ఒక భాగస్వామి శారీరక స్పర్శను ప్రేమను వ్యక్తపరిచే మార్గంగా భావిస్తే, మరొక భాగస్వామికి ప్రేమను వ్యక్తపరచడం అంటే కలిసి బయటకు వెళ్లడం, సినిమాలు చూడటం లేదా ఇంట్లో పనులలో సహాయం చేయడం కావచ్చు. ఈ ఆలోచనల వ్యత్యాసం వల్ల జంటల మధ్య సామరస్యం లోపించి వారి మధ్య ఎమోషనల్ బాండేజ్‌లో బీటలు వారవచ్చు.



భార్యాభర్తల మధ్య గొడవలు ఆరోగ్యకరమైన బంధానికి లక్షణం. ఎందుకంటే గొడవలు ఇద్దరు భాగస్వాముల ఆలోచనలను బయటకు తీసుకువస్తాయి, ఇద్దరూ ఒకరికొకరు తమ ఆలోచనలను పంచుకుంటారు. గొడవలు పడని జంటలు తమ భావాలను అణచివేసుకుంటారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు విభేదాలు తలెత్తుతాయి, ఇది ఎప్పుడైనా బంధంలో ఒత్తిడిని సృష్టించి, బంధం ముగియడానికి దారితీయవచ్చు.

ప్రతి బంధంలో సంభాషణ చాలా ముఖ్యం. మీ భాగస్వామితో సరైన సంభాషణ లేకపోతే, అది పింక్ ఫ్లాగ్ హెచ్చరిక, ఎందుకంటే ఇది అపార్థాలకు దారితీస్తుంది. అదే సమయంలో, భాగస్వాముల ఆశయాలు ఒకదానికొకటి విరుద్ధంగా ఉంటే అది పింక్ ఫ్లాగ్ లక్షణమే. ఉదాహరణకు, భర్త తండ్రి కావడానికి బదులుగా తన కెరీర్‌పై దృష్టి పెట్టాలని కోరుకుంటే, భార్యకు పిల్లలు కావాలని ఉంటుంది. దీనివల్ల ఇద్దరి మధ్య ఒత్తిడి ఏర్పడి దూరం పెరగవచ్చు.

పింక్ ఫ్లాగ్‌ను గ్రీన్ ఫ్లాగ్‌గా ఎలా మార్చాలి? మీ బంధం పింక్ ఫ్లాగ్ దశలో ఉంటే, దాన్ని గ్రీన్ ఫ్లాగ్‌గా మార్చడానికి ప్రయత్నించండి. మీరు మీ భాగస్వామితో మాట్లాడినప్పుడే ఇది సాధ్యమవుతుంది.

జంటల మధ్య అరమరకలు లేని సంభాషణ ఉంటే, వారు ఒకరినొకరు బాగా అర్థం చేసుకోగలుగుతారు, దీనివల్ల ఎటువంటి విభేదాలు రాకుండా నివారించవచ్చు. ఇద్దరూ ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించడం ప్రారంభిస్తారు. దీనితో పాటు, మీ భాగస్వామికి ప్రైవేట్ స్పేస్ ఇవ్వడం చాలా ముఖ్యం, ఎందుకంటే వారికి కూడా సొంత వ్యక్తిగత జీవితం ఉంటుంది. అంతేకాదు, ప్రతి జంట తమకు తాముగా హద్దులను ఏర్పరచుకోవడం మంచిది. అయితే అలా చేయడం ద్వారా వారు ఒకరికొకరు భారం కాకూడదు.

సాక్షి సినిమా

సార్... మేడమ్ వస్తున్నారు



● నిత్యా మీనన్, విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ జంటగా నటించిన చిత్రం 'సార్ మేడమ్'. పాండిరాజ్ దర్శకత్వంలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. పెళ్లికి ముందు ఓ అమ్మాయికి మెట్టినింటి వాళ్లు చెప్పే మాటలతో మొదలయ్యే టీజర్ భార్యాభర్తల మధ్య జరిగే ఫన్నీ గొడవతో సాగుతుంది. టీజర్ ప్రారంభంలో వంట మాస్టర్‌లా కనిపించిన విజయ్ సేతుపతి చివర్లో గన్ పట్టుకొని మాస్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. ''రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రంలో విజయ్, నిత్యల నటన హైలెట్‌గా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

వింటారా!



● శ్రీ గౌరీ ప్రియ, అశోక్ గల్లా

అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ, రాహుల్ విజయ్, శివాత్మికా రాజశేఖర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'విసా-వింటారా సరదాగా'. నూతన దర్శకుడు ఉద్భవ్ దర్శకత్వంలో ఈ సినిమాని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శుక్రవారం ఫస్ట్ లుక్ విడుదలైంది. ''హృద్యమైన కథతో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం ఇది. వినోదం, ప్రేమ, భావోద్వేగాలతో నిండిన ఈ యూత్‌ఫుల్ రైడ్ అమెరికా నేపథ్యంలో సాగుతుంది. విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల జీవితాలను, వారి కలలను, సందిగ్ధతలను, స్నేహాలను, మధుర క్షణాలను ప్రేక్షకుల మనసుకి తాకేలా చూపించే సినిమా ఇది'' అని పేర్కొన్నారు మేకర్స్.

గదాధారి...



● రవికిరణ్

''గదాధారి హనుమాన్' సినిమా కథ చాలా బలమైనది. అందుకే ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. చిన్న వాళ్ల నుంచి పెద్ద వాళ్ల వరకు మా సినిమా ఆకట్టుకుంటుంది'' అని రవికిరణ్ తెలిపారు. ఆయన హీరోగా రోహిత్ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'గదాధారి హనుమాన్'. రేణుకా ప్రసాద్, బసవరాజ్ హురకడ్లి నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి నిర్మాతలు సి. కల్యాణ్, రాజ్ కందుకూరి, దర్శకుడు సముద్ర ముఖ్య అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. రోహిత్ కొల్లి మాట్లాడుతూ– ''గదాధారి హనుమాన్'తో మూడేళ్ల ప్రయాణం చేశాను. గద ఎంత పవర్‌ఫుల్ అనేదానిపై మా చిత్రంలో ఓ సీక్వెన్స్ అద్భుతంగా ఉంటుంది'' అని తెలిపారు. ''మా దర్శకుడు రోహిత్ ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు'' అన్నారు రేణుకా ప్రసాద్. ''కుటుంబ కథా చిత్రంగా ఈ ప్రాజెక్ట్ ఉంటుంది. సినిమాని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'' అని బసవరాజ్ హురకడ్లి చెప్పారు.

రాజా సాబ్ సెట్‌లో తెలుగు నేర్చుకుంటున్నాను

- సంజయ్ దత్



● సంజయ్ దత్, శిల్పా శెట్టి, ధ్రువ సర్జా

''వెంకీ సార్, సుప్రీత్‌లకు సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. అందుకే 'కేడీ: ది డెవిల్'ని గొప్పగా నిర్మించారు. ధ్రువ నా తమ్ముడు లాంటివారు. శిల్పా శెట్టితో ఎప్పుడు పని చేసినా అదే ఎనర్జీ ఉంటుంది. మా 'కేడీ: ది డెవిల్' సినిమాకి విజయం అందించాలి'' అని సంజయ్ దత్ పేర్కొన్నారు. ధ్రువ సర్జా హీరోగా, రీష్మా నానయ్య హీరోయిన్‌గా ప్రేమ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కేడీ: ది డెవిల్'. సంజయ్ దత్, శిల్పా శెట్టి, నోరా ఫతేహి ముఖ్య పాత్రలు పోషించారు. వెంకట్ కె. నారాయణ నిర్మించిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. సంజయ్ దత్ మాట్లాడుతూ– ''హైదరాబాద్‌తో నాకెంతో అనుబంధం ఉంది. ఎంతో మందితో కలిసి పని చేశాను. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్' సినిమా చేస్తున్నాను. ఆ సెట్‌లో తెలుగు నేర్చుకుంటున్నాను'' అని పేర్కొన్నారు. ధ్రువ సర్జా మాట్లాడుతూ–''సంజయ్ దత్, శిల్పా శెట్టి వంటి వారితో పని చేయడం సంతోషంగానే ఉంటుంది. త్వరలో విడుదల కానున్న మా సినిమాని ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''మా సినిమా అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను'' అని నమ్మకం వ్యక్తం చేశారు ప్రేమ్. శిల్పా శెట్టి మాట్లాడుతూ– ''నేను నా తొలి చిత్రం హిందీలో కాకుండా తెలుగులో (సాహసవీరుడు సాగరకన్య) చేశాను. ఇప్పుడు చేసిన ఈ 'కేడీ: ది డెవిల్'లో అన్ని వాణిజ్య అంశాలున్నాయి.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. హీరోయిన్ రీష్మా నానయ్య, కేవీఎన్ ప్రొడక్షన్ బిజినెస్ హెడ్ సుప్రీత్ మాట్లాడారు.


ఇట్స్ మోనికా టైమ్



● పూజా హెగ్డే

రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమిర్ ఖాన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతిహాసన్ ఇతర పాత్రలు పోషించారు. కళానిధి మారన్ నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీ ఆగస్టు 14న విడుదలవుతోంది. ఈ సినిమా తెలుగులో నిర్మాతలు డి. సురేష్ బాబు, 'దిల్' రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా రిలీజ్ కానుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'మోనికా...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు మేకర్స్. ఈ పాటలో హీరోయిన్ పూజా హెగ్డే సందడి చేయగా, సౌబిన్ షాహిర్ కూడా కనిపించారు. అనిరుధ్, శుభాలక్ష్మి ఈ పాటని హై ఎనర్జీతో పాడారు.

అభీ అని పిలిస్తే...



● కిరీటి రెడ్డి

అభీ అని పిలిస్తే వినాలనిపిస్తోంది అని ప్రేయసితో గారాలు పోతుంటాడు అభి. ఇంతలో 'అభీ' అనే పిలుపు వినిపిస్తుంది. ఆ పిలిచింది ఎవరో కాదు అభి తండ్రి. ప్రముఖ వ్యాపారవేత్త గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి (అభి పాత్ర) హీరోగా పరిచయమవుతున్న 'జూనియర్' చిత్రం టీజర్‌లో కనిపించిన సన్నివేశాలివి. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ టీజర్‌ని లాంచ్ చేశారు. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా, కన్నడ స్టార్ రవిచంద్రన్, జెనీలియా కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 18న ఈ చిత్రం విడుదల కానుంది. ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫాదర్–సన్ ఎమోషన్, ఊరి నేపథ్యం తదితర అంశాలతో రూపొందిన 'జూనియర్' మాస్, క్లాస్ ఆడియన్స్‌కి నచ్చేలా ఉంటుంది'' అని మేకర్స్ తెలిపారు.

పల్లెటూరి ప్రేమ



● అరుణాచలం, జనని


టి. అరుణాచలం, జననీ గుణశీలన్ జోడీగా రాశి ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'ఉసురే'. నవీన్ డి. గోపాల్ దర్శకత్వంలో శ్రీకృష్ణ ప్రొడక్షన్స్ సమర్పణలో మౌళి ఎం. రాధాకృష్ణ నిర్మించారు. ఈ సినిమా ఆగస్టు 1న విడుదల కానుంది. నవీన్ డి. గోపాల్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనలతో రూపొందిన ఓ వైవిధ్యమైన పల్లెటూరి ప్రేమకథ 'ఉసురే'. రొమాన్స్, కామెడీ, డ్రామా నేపథ్యంలో సహజత్వానికి దగ్గరగా ఉండే మా సినిమా అందరి హృదయాలను హత్తుకునేలా ఉంటుంది'' అన్నారు.

ఓటీటీ | ఇది చూడొచ్చు

ఊహకందని యాక్షన్ కామెడీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం హెడ్స్ ఆఫ్ స్టేట్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఏదైనా సినిమా చూసే ప్రేక్షకులకు తాము చూసే ఆ సినిమా పై కొంత అవగాహన, కొంత ఊహ ఉంటాయి. ఆ ప్రేక్షకుల అవగాహనను, ఊహను పటాపంచలు చేస్తూ ఉత్కంఠభరితంగా సినిమాని తీసుకువెళ్లగలిగితే అప్పుడు ప్రతిభగల దర్శకుడు అనిపించుకుంటారు. ఆ విషయంలో ఈ సినిమా దర్శకుడు ఓ అయిదాకులు ఎక్కువే తిన్నారని చెప్పవచ్చు. నాయిషుల్లర్ దర్శకత్వంలో వచ్చిన 'హెడ్స్ ఆఫ్ స్టేట్' ఓ ఊహకందని యాక్షన్ కామెడీ మూవీ అనొచ్చు. ప్రైమ్ వీడియో వేదికగా ఈ పూర్తి యాక్షన్ థ్రిల్లర్ కామెడీ స్ట్రీమ్ అవుతోంది. ఈ సినిమా ప్రేక్షకుడి ఊహకు పూర్తి విభిన్నంగా ఉంటుంది. కథ సింపుల్ అయినా ఆ స్టోరీ లైన్ విచిత్రంగా ఉంటుంది. అంతలా ఈ సినిమాలో ఏముందో ఓసారి చూద్దాం. ఈ సినిమా కథ ప్రకారం యూఎస్, యూకె ప్రెసిడెంట్లు బద్ధ శత్రువులు. కానీ ఓ అనుకోని మీటింగ్‌లో ఇద్దరూ కలవాల్సి వస్తుంది. అయితే అదే మీటింగ్ నుండి ఈ ఇద్దరినీ ఓ ప్లాన్ ప్రకారం ఒకే ఫ్లైట్‌లో ఓ ఐల్యాండ్‌కు పంపుతాడు విలన్. ఎడ మొహం అంటే పెడ మొహం అనుకునే అత్తా కోడళ్ళలా కొట్టుకునే ఈ ఇద్దరి మధ్య పెద్ద వాగ్వాదమే నడుస్తుంది. ఇంతలో ఆ ఫ్లైట్‌ను విలన్ అనుచరులు దాడి చేసి, కూల్చేస్తారు. యూఎస్, యూకె ప్రెసిడెంట్లు ప్రయాణిస్తున్న ప్రైవేట్ జెట్ ఎక్కడో మారుమూల చిట్టడివిలో కూలిపోతే ప్రపంచమంతా ఉలిక్కిపడుతుంది. దాదాపుగా అందరూ వీళ్లిద్దరూ చనిపోయారనుకుంటారు. కానీ అక్కడి నుండి బయటపడి వీరిద్దరూ విలన్‌ని ఎలా కట్టడి చేస్తారనేది సినిమాలోనే చూడాలి. ప్రముఖ నటులు జాన్ సేనా, ఇద్రిస్ ఎల్బా ప్రధాన పాత్రలలో నటించి తమ పాత్రలకు న్యాయం చేశారు. వీళ్ళకి తోడుగా ఏజెంట్ పాత్రలో మన భారతీయ బాలీవుడ్ నటి ప్రియాంకా చోప్రా నటించడం విశేషం. పైన చెప్పుకున్నట్టు ఈ సినిమా లైన్‌తో పాటు ప్రతి సన్నివేశం ప్రేక్షకుడి ఊహతో సంబంధం లేకుండా నడుస్తుంది. అంతేకాదు... సినిమా అంతా సరదా సరదాగా సాగిపోతుంది. మస్ట్ వాచ్ ఫర్ ది వీకెండ్



– హరికృష్ణ ఇంటూరు

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 111
శనివారం 12-7-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'


గిడ్డంగుల్లో రోబోల సందడి!
పనులను చక్కబెడుతున్న పారిశ్రామిక రోబోలు
-12లో


ఇక దేశీయంగా రేర్ మాగ్నెట్స్
రెండు సంస్థలకు రూ. 1,345 కోట్ల ప్రోత్సాహక స్కీము
-15లో


హల్వాదే హవా
భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తన వెంట తీసుకెళ్లిన క్యారెట్ హల్వాను ఐఎస్ఎస్‌లోని సహచరులతో పంచుకున్నారు.
వివరాలు 6లో ▸


హడలెత్తిస్తున్న ఈగ
అమెరికాలో స్క్రూ వార్మ్ బగ్ వన్యప్రాణులతో పాటు పెంపుడు జంతువులు, మాంసం పరిశ్రమను హడలెత్తిస్తోంది.
వివరాలు 6లో ▸


నేడు రోజ్‌గార్ మేళా
దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో భాగంగా ప్రధాని మోదీ శనివారం 51 వేల మందికి నియామక పత్రాలను అందించనున్నారు.
వివరాలు 6లో ▸

ఈసీకి అన్ని అధికారాలెందుకు?
ప్రతిపాదిత వన్ నేషన్-వన్ ఎలక్షన్ చట్టంలో ఈసీకి విస్తృత అధికారాలు కల్పించడాన్ని సుప్రీం మాజీ జడ్జీలు ప్రశ్నించారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మీ లైఫ్‌స్టైలే కొంప ముంచుతుంది!



మీ జీతం పెరుగుతున్న కొద్దీ మీ ఖర్చులనూ పెంచుకుంటూ పోతున్నారా? అయితే మీ జేబును నెలనెలా మీరే కొట్టేసుకుంటున్నారు అని అర్థం! పెరిగిన జీతంతో సమానంగా.. ఖర్చూ పెరుగుతోందంటే మీ జీవన విధానం మీ చేయి దాటి పోయిందనే లెక్క!
- వివరాలు 16లో▶

హెచ్‌సీఏ కేసులో రంగంలోకి ఈడీ..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై ఈడీ దృష్టి పెట్టింది. తెలంగాణ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్ట్ సహా ఇప్పటికే సీజ్ చేసిన హెచ్‌సీఏ రికార్డులను అందించాలని శుక్రవారం సీఐడీకి లేఖ రాసింది.
- వివరాలు 12లో▶

సత్వర ఉత్తర్వులివ్వలేం

ఫీజు పెంపుపై ఇంజనీరింగ్ కాలేజీలకు హైకోర్టు స్పష్టీకరణ

- ఆరు వారాల్లోగా సర్కార్‌కు టీఏఎఫ్‌ఆర్‌సీ నివేదిక ఇవ్వాలి
- ఆ తర్వాత ఫీజులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి
- ఈ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలి.. అధికారిక వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్ చేయాలి
- ఈ దశలో కాలేజీల అభ్యర్థన ఆమోదయోగ్యం కాదు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపు అంశంపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అడ్మిషన్, ఫీజు నియంత్రణ కమిటీ (టీఏఎఫ్‌ఆర్‌సీ)ని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి ఆరు వారాల్లోగా ప్రభుత్వానికి నివేదించాలని స్పష్టం చేసింది. ఆ తర్వాత ఫీజుల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. ఈ విషయాన్ని కాలేజీల్లో అడ్మిషన్లు పొందే విద్యార్థులకు తెలియజేయాలని.. అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఈ దశలో ఫీజుల పెంపునకు అనుమతివ్వాలంటూ పలు ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు చేసిన అభ్యర్థన ఆమోదయోగ్యం కాదని తేల్చిచెప్పింది. ఇప్పటికిప్పుడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సరైన కారణాలను చూపించడంలో కాలేజీలు విఫలమయ్యాయని స్పష్టంచేసింది. వారికి అనుకూలంగా ఎలాంటి మధ్యంతర ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమని చెప్పింది.

అయితే, వాదనలన్నీ ముగిసి తీర్పు తమకు అనుకూలంగా వచ్చినా విద్యార్థుల నుంచి పెంచిన ఫీజు వసూలు ఇబ్బందిగా మారుతుందని, అది కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తుందని కాలేజీలు విజ్ఞప్తి చేసినందున.. పెంపు అంశాన్ని ముందే విద్యార్థులకు తెలియజేయాలని టీజీఈఏపీసెట్‌కు ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గత బ్లాక్ పీరియడ్ ఫీజులే వర్తిస్తాయంటూ ప్రభుత్వం జీవో 26 జారీ చేసింది. ఆ జీవోను సవాల్ చేస్తూ గోకరాజు రంగరాజు, గురునానక్ సహా పలు ఇంజనీరింగ్ కాలేజీలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టి.. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

వాదనలు సాగాయిలా..
కాలేజీల తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ..
మిగతా 12వ పేజీలో ▶

తీర్పునకు లోబడి ఫీజుల పెంపు

'టీఏఎఫ్‌ఆర్‌సీ ఎలైట్ గ్రూప్‌లో చైర్మన్, రిటైర్డ్ హైకోర్టు జడ్జి సహా 10 మంది నిపుణులు ఉంటారు. ఇంజనీరింగ్, వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సుప్రీంకోర్టు నిర్ణయించిన కాలక్రమాల గురించి వారికి తెలుసు. ఈ కమిటీ కళాశాలల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని మూడేళ్లకోసారి ఫీజులను నిర్ణయించాలి. డిసెంబర్–2024లో ప్రతిపాదనలు స్వీకరించి మార్చి 2025లో విచారణ నిర్వహించాలి. ఫీజు నిర్ధారణ ప్రక్రియను పూర్తి చేసి, టీజీఎప్‌సెట్ ద్వారా అడ్మిషన్ షెడ్యూల్ జారీ చేయడానికి ముందే ప్రభుత్వానికి పంపాలి. తర్వాత జూన్ 18 వరకు వేచి చూడాలి. టీఏఎఫ్‌ఆర్‌సీ జూన్ 18 నాటి నిర్ణయాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయనే వాదనతో సహా పిటిషనర్లు లేవనెత్తిన వాదనలు, ప్రతివాదుల కౌంటర్లపై వివరణాత్మక పరిశీలన అవసరం. జూన్ 30న జీవో జారీ చేసినా.. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఆప్షన్ల ఫ్రీజింగ్ తర్వాత ఆప్షన్లను నమోదు చేయడానికి చివరి తేదీ జూలై 10 వరకు పిటిషనర్లు వేచి ఉండటం గమనార్హం. మధ్యంతర అప్లికేషన్‌పై ఉపశమన ఆదేశాలు పొందేందుకు పిటిషనర్లు అర్హులు కాదు. అయితే, ఫీజుల పెంపు కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుంది. ఇదే విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలి' అని న్యాయమూర్తి చెప్పారు. తదుపరి విచారణను ఆగస్టు 12కు వాయిదా వేశారు.

కలుపుకొని తాగేస్తున్నారు!

ప్రాణాలు తీస్తున్న గడ్డిమందు

- కలుపు నివారణకు పారాక్వాట్ హెర్బిసైడ్ వినియోగం
- దాన్నే తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్న వైనం..
- ఒక్క చుక్క సైతం ప్రాణం తీస్తుందంటున్న వైద్యులు
- 70 దేశాల్లో ఈ గడ్డి మందు వాడకంపై నిషేధం
- సరైన ప్రత్యామ్నాయం లేకపోవడంతో నిషేధంపై ప్రభుత్వాల మీనమేషాలు..



- నిర్మల్ జిల్లా నర్సాపురం గ్రామానికి చెందిన సిందే శివకుమార్ (17) అనే పాలిటెక్నిక్ విద్యార్థి కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. తండ్రి మందలించడంతో జూన్ 6న గడ్డిమందు తాగాడు. నిజామాబాద్‌లో చికిత్స పొందుతూ జూన్ 9న మృతి చెందాడు.
- కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన ఎడ్ల తేజసాయిశ్రీ (30) అనే వివాహిత జూన్ 9న గడ్డి మందుతాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.
- జూన్ 17న కడుపునొప్పితో కరీంనగర్ జిల్లా దుర్శేడ్ గ్రామానికి చెందిన గాజుల కొండయ్య అనే వ్యక్తి, జూన్ 26న ఆర్థిక ఇబ్బందులు తాళలేక తిర్యాణికి చెందిన మరో వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నారు.

సాక్షి, హైదరాబాద్: ఒక్క జూన్ నెలలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యలు చేసుకున్నవారు పదుల సంఖ్యలో ఉన్నారు. ఏ నెలలోనైనా ఆత్మహత్య మరణాల లెక్కలు చూస్తే అందులో గడ్డిమందు తాగి చనిపోయిన వారే అధికంగా ఉంటున్నారు. ఈ గడ్డి మందు అత్యంత విషపూరితమైన 'పారాక్వాట్ డైక్లోరైడ్' అనే హెర్బిసైడ్. మనిషి నోట్లోకి వెళితే చావు తప్ప విరుగుడు లేని ఈ విషపూరిత కలుపు నివారణ మందు దేశంలోనే అత్యంత ప్రమాదకరమైనదిగా మారింది. ప్రతి రైతు కుటుంబంలో ఉండే ఈ హెర్బిసైడ్.. ఇప్పుడు తెలంగాణలో మరణ శాసనం రాస్తోంది. పర్యావరణాన్నీ నాశనం చేస్తోంది. దీని వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించాలని పర్యావరణవేత్తలు, చివరికి వైద్యులు కూడా డిమాండ్ చేస్తున్నప్పటికీ... పొలాల్లో గడ్డి నిర్మూలనకు ఈ మందుకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోంది.

ఒక్క చుక్క అయినా ప్రాణం తీస్తుంది
పారాక్వాట్‌ను తాగితే అది శరీరంలో వేగంగా విస్తరిస్తుంది. వాంతులు లేక గ్యాస్ట్రిక్ లావేజీ చేసే అవకాశం లేకపోతే చికిత్స ప్రారంభించకముందే ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. దీనిని తీసుకున్న వ్యక్తిని కాపాడటం చాలా కష్టమైన పని. ఈ మందుకు
మిగతా 2వ పేజీలో ▶






భారతదేశ వివాహ ఆచారాలను ప్రపంచ వేదికపై నిలబెట్టిన వేడుక

రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌వివాహం దేశాన్ని, ప్రపంచాన్ని ఆకర్షించిన ఒక సాంస్కృతిక సంఘటనగా నిలిచింది. గతేడాది వీరి వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది క్రితం జరిగిన ఈ వివాహ వేడుక కేవలం ఒక సామాజిక ఈవెంట్‌గా మాత్రమే కాకుండా, భారతదేశ సంస్కృతిని ప్రపంచ వేదికపై ప్రదర్శించిన ఒక మహోత్కృష్ట ఘట్టంగా నిలిచింది. ప్రధాన స్రవంతి మీడియాతో పాటు సోషల్ మీడియా ద్వారా కోట్లాది మంది ఈ వివాహం ద్వారా హిందూ సాంప్రదాయాలు, పురాతన ఆచారాలను వీక్షించారు.

హిందూ వివాహం యొక్క పవిత్రత

హిందూ సంప్రదాయంలో, వివాహం కేవలం సామాజిక ఒప్పందం కాదు, అది ఒక పవిత్రమైన, జీవితకాల బాధ్యత. ఇది ఇద్దరు వ్యక్తులు, వారి కుటుంబాలు, సమాజాల మధ్య దైవిక సంబంధాన్ని సూచిస్తుంది. ఈ వివాహం ధర్మం (మత బాధ్యతలు) నెరవేర్చడం, సామాజిక సౌహార్దానికి దోహదపడటం వంటి ఉన్నత లక్ష్యాలను కలిగి ఉంటుంది. ఆధునిక జీవనశైలి కారణంగా అనేక వివాహాలలో పురాతన ఆచారాలను పూర్తిగా పాటించడం కష్టమైనప్పటికీ, అనంత్ మరియు రాధికా ఈ ఆచారాలను ఖచ్చితంగా అనుసరించారు. వారి ఈ నిర్ణయం సంప్రదాయాల పట్ల వారి గౌరవాన్ని, ఆధ్యాత్మిక నాయకుల ఆశీస్సులతో వివాహ జీవితాన్ని ప్రారంభించాలనే వారి లోతైన కోరికను ప్రతిబింబిస్తుంది. ఈ వివాహం ద్వారా భారతీయ సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటారు.

భారతదేశం యొక్క ప్రపంచ చిత్రణ

భారతదేశం ఆర్థిక, సాంకేతిక, పారిశ్రామిక రంగాలలో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచ వేదికపై తన స్థానాన్ని గట్టిగా నిలబెడుతున్న సమయంలో, ఈ వివాహం భారతదేశాన్ని ఆధ్యాత్మిక రాజధానిగా మరింత ఉన్నతంగా చూపింది. వివాహానికి హాజరైన అంతర్జాతీయ ప్రముఖుల జాబితా భారతదేశం యొక్క పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ, మేధాపర, శాస్త్రీయ శక్తిని సూచి స్తుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మరియు అంబానీ కుటుంబం ఈ గొప్ప వేడుకను నిర్వహించడం ద్వారా, సమగ్రమైన, అర్థవంతమైన సంబంధాలను పెంపొందించడానికి, భారతదేశాన్ని ప్రపంచ నాయకుడిగా నిలబెట్టడానికి తమ నిబద్ధతను చాటారు.

మానవ సేవలో దైవ సేవ

'మానవ సేవ హీ మాధవ సేవ' (మానవ సేవ దైవ సేవకు సమానం) అనే స్ఫూర్తితో, అంబానీ కుటుంబం తమ వివాహ వేడుకలను నవీ ముంబైలోని రిలయన్స్ కార్పొరేట్ పార్క్‌లో 50 నిరుపేద జంటలకు సమూహ వివాహంతో ప్రారంభించింది. 800 మందికి పైగా అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా, అంబానీ కుటుంబ సభ్యులు నవ దంపతులకు ఆశీస్సులు, బహుమతులు అందించారు. అంతేకాకుండా, వివాహ వేడుకల సమయంలో మూడు వారాల పాటు ఎవరూ ఆకలితో ఉండకుండా చూసారు. సముదాయ రసోయిలో రోజూ 1,000 మందికి పైగా భోజనాలు అందించే భండారాన్ని నిర్వహించారు, ఇది మానవ సేవకు నిదర్శనంగా నిలిచింది.

వివాహ వేడుకలు అనేక రోజుల పాటు వివిధ ఆచారాల్లో జరిగాయి

మొసలు : వరుడి మేనమామ వధూ, వరుడికి సాంప్రదాయ బహుమతులు అందించే గుజరాతీ సంప్రదాయం.
వ్యాలీ ఆఫ్ గాడ్స్ : జామ్‌నగర్ ఆలయ సముదాయంలో స్మత్. నీతా అంబానీ నాయకత్వంలో భక్తిపూర్వక నృత్య ప్రదర్శనలు, తల్లి ప్రేమను, భారతీయ ఆధ్యాత్మికతను ప్రదర్శించాయి.
సంగీత్ : కుటుంబ సభ్యులు జంట కోసం ఆనందకరమైన సంగీత, నృత్య ప్రదర్శనలు చేసిన సందర్భం.
గ్రహ శాంతి : లార్డ్ గణేశుడు, నవగ్రహాలను ఆరాధించి అడ్డంకులను తొలగించడానికి, సంతోషం, శ్రేయస్సును తీసుకురావడానికి జరిగిన పూజ.
పీఠి/హల్దీ : కుటుంబాలను ఒకచోట చేర్చే, సాంప్రదాయాన్ని కొనసాగించే ఆహ్లాదకరమైన ఆచారం.
భజనలు మరియు శివ శక్తి పూజ : దైవిక శక్తుల సమతుల్యతను జరుపుకునే గంభీరమైన ఆచారం.
వివాహం : పవిత్ర అగ్ని, ఆధ్యాత్మిక నాయకుల సమక్షంలో జరిగిన పవిత్ర వివాహ ఆచారాలు.
వివాహ స్వాగత కార్యక్రమాలు : మూడు రోజుల పాటు స్నేహితులు, కుటుంబ సభ్యులు, సహచరుల కోసం జరిగిన స్వాగత కార్యక్రమాలు, అంబానీ కుటుంబ సిబ్బంది కోసం ఒక ప్రత్యేక స్వాగతం కూడా ఉంది.

బనారస్‌కు నీరాజనం

వివాహ రోజు అలంకరణ 'బనారస్‌కు నీరాజనం' థీమ్‌తో రూపొందించబడింది. ఈ థీమ్ బనారస్ ఘాట్‌ల ద్వారా అతిథులను ఒక సాంస్కృతిక యాత్రలో తీసుకెళ్లింది. జియో వరల్డ్ సెంటర్‌లోని వివాహ వేదికలో బనారస్ సంప్రదాయాలు, కళలు, వంటకాలను ప్రతిబింబించే వాతావరణం సృష్టించబడింది.

భారతీయ సంప్రదాయ దుస్తులు

'రెస్పెండెంట్లీ ఇండియన్' థీమ్‌తో అతిథులందరూ సాంప్రదాయ భారతీయ దుస్తులలో హాజరయ్యారు. ఈ దుస్తులు భారతదేశ గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని, రంగులు, ఫాబ్రిక్‌లు, టెక్స్టైల్స్‌ను ప్రదర్శించాయి.

అనంత్ అంబానీ మరియు రాధికా మర్చంట్ వివాహం కేవలం ఇద్దరు వ్యక్తుల సమ్మిళనం మాత్రమే కాదు, ఇది సంప్రదాయం, ఆధ్యాత్మికత, ప్రపంచ సంబంధాలతో నేయబడిన ఒక గొప్ప సాంస్కృతిక వస్త్రం, భారతదేశ సాంస్కృతిక దృశ్యంలో చెరగని ముద్ర వేసింది.

ఈ వివాహం వివిధ వైదిక హిందూ సంప్రదాయాల నుండి ఆధ్యాత్మిక నాయకుల సమావేశంగా నిలిచింది. ఇటీవలి కాలంలో ఇంత పెద్ద సంఖ్యలో ధర్మగురువులు ఒక వివాహ వేడుకలో పాల్గొనడం ఇదే మొదటిసారి. ఈ వేడుకలకు హాజరైన ప్రముఖ ధర్మగురువులు:

స్వామి సదానంద సరస్వతి, శంకరాచార్య, ద్వారక
స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి, శంకరాచార్య, జోషిమఠ్
గౌరంగ్ దాస్ ప్రభు, డివిజనల్ డైరెక్టర్, ఇస్కాన్
గౌర్ గోపాల్ దాస్, సన్యాసి, ఇస్కాన్
రాధానాథ్ స్వామి, గవర్నింగ్ బాడీ సభ్యుడు, ఇస్కాన్
పూజ్యశ్రీ రమేష్‌భాయ్ ఓజా
గౌతంభాయ్ ఓజా
పూజ్యశ్రీ దేవప్రసాద్ మహారాజ్
విజుబెన్ రాజని, శ్రీ ఆనందబావ సేవా సంస్థ
శ్రీ బాలక్ యోగేశ్వర దాస్ జీ మహారాజ్, బద్రీనాథ్ ధామ్
పూజ్యశ్రీ చిదానంద సరస్వతి, అధిపతి, పరమార్థ నికేతన్ ఆశ్రమం
శ్రీ సత్రుముని మహారాజ్, జైన ముని, స్థాపకుడు-ప్రసాధం



ధీరేంద్ర కుమార్ గార్గ్, గురు, బాగేశ్వర్ ధామ్
బాబా రామ్‌దేవ్, యోగా గురు
స్వామి రామభద్రాచార్య
స్వామి కైలాసానంద, మహామండలేశ్వర్, నిరంజని అఖారా
అవధేశానంద గిరి, మహామండలేశ్వర్, జునా అఖారా
శ్రీ దేవకినందన్ ఠాకూర్జీ మహారాజ్, విశ్వశాంతి సేవాట్రస్ట్
దీదీ మా సాధ్వి రితంభర జీ, వాత్సల్య గ్రామం
స్వామి పరమాత్మనాద్ జీ, స్థాపకుడు, పరమ శక్తి పీఠం
శ్రీ విశాల్ రాకేష్ జీ గోస్వామి, ప్రధాన పూజారి, శ్రీనాథ్‌జీ ఆలయం

అనేక మంది భారతీయ రాజకీయ నాయకులు మరియు మంత్రులతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాజకీయ ప్రముఖులు ఈ వేడుకలను అలంకరించారు, ఇది భారతదేశం యొక్క పెరుగుతున్న అంతర్జాతీయ ఆకర్షణను మరింత హైలైట్ చేస్తుంది. వీరిలో వీరు ఉన్నారు:

జాన్ కెర్రీ (అమెరికన్ రాజకీయ నాయకుడు)
టోనీ బ్లెయిర్ (మాజీ ప్రధాన మంత్రి, యూకే)
బోరిస్ జాన్సన్ (మాజీ ప్రధాన మంత్రి, యూకే)
మాటియో రెంజి (ఇటలీ మాజీ ప్రధాన మంత్రి)
సెబాస్టియన్ కుర్జ్ (ఆస్ట్రియా మాజీ ప్రధాన మంత్రి)
స్టీఫెన్ హార్పర్, కెనడా మాజీ ప్రధాన మంత్రి
కార్ల్ బిల్డ్‌ట్ (స్వీడన్ మాజీ ప్రధాన మంత్రి)
మొహమ్మద్ నషీద్ (మాజీ మాల్దీవులు అధ్యక్షుడు)
హెచ్. ఇ. సామియా సులుహు హసన్ (టాంజానియా అధ్యక్షుడు)

వివాహ ఆచారాల కోసం అనేక మంది ప్రపంచ వ్యాపార నాయకులు కూడా భారతదేశానికి వచ్చారు, వీరిలో :

అమిన్ నాసర్ (అధ్యక్షుడు - సీఈఓ, అరాంకో)
హెచ్. ఇ. ఖల్దూన్ అల్ ముబారక్, సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్, ముబాదలా
ముర్రే ఆచిన్‌క్లోస్ (సీఈఓ, బీపీ)
రాబర్ట్ డడ్లీ (మాజీ సీఈఓ- బీపీ, బోర్డు సభ్యుడు - అరాంకో)
మార్క్ టక్కర్ (గ్రూప్ చైర్మన్, హెచ్ఎస్‌బీసీ హోల్డింగ్స్)
బెర్నార్డ్ లూనీ (మాజీ సీఈఓ, బీపీ)
శాంతను నారాయణ్ (సీఈఓ, అడోబ్)
మైఖేల్ గ్రిమ్స్ (మేనేజింగ్ డైరెక్టర్, మోర్గాన్ స్టాన్లీ)
ఇగోర్ సెచిన్, సీఈఓ, రోస్నెఫ్ట్
జే లీ, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, శామ్సంగ్ ఎలక్ట్రానిక్స్
దిల్హాన్ పిళ్లై (సీఈఓ, టెమాసెక్ హోల్డింగ్స్)
ఎమ్మా వాల్మ్స్లీ (సీఈఓ, గ్లాక్సోస్మిత్‌క్లైన్)
డేవిడ్ కాన్‌స్టేబుల్ (సీఈఓ, ఫ్లోర్ కార్పొరేషన్)
జిమ్ టీగ్ (సీఈఓ, ఎంటర్‌ప్రైజ్ జీపీ)
జియాని ఇన్ఫాంటినో (ఐఓసీ సభ్యుడు, ఫిఫా అధ్యక్షుడు)
జువాన్ ఆంటోనియో సమరాంచ్ (వైస్ ప్రెసిడెంట్, ఐఓసీ)
న్గోజీ ఒకోంజో-ఇవెలా (డైరెక్టర్ జనరల్, డబ్ల్యూటీఓ)
కిమ్ కర్దాషియాన్, మీడియా పర్సనాలిటీ, సోషలైట్
ఖ్లో కర్దాషియాన్, మీడియా పర్సనాలిటీ, సోషలైట్
దినేష్ పాలివాల్ (భాగస్వామి, కేకేఆర్)
లిమ్ చౌ కియాట్, సీఈఓ, జీఐసీ
మైఖేల్ క్లైన్, మేనేజింగ్ పార్టనర్, ఎం. క్లైన్ - కంపెనీ
బాదర్ మొహమ్మద్ అల్-సాద్ (డైరెక్టర్, కియా)
యోషిహిరో హయాకుటోమ్, సీనియర్ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎస్ఎంబీసీ
ఖలీల్ మొహమ్మద్ షరీఫ్ ఫౌలాతి, వైస్ చైర్మన్, ఏడీఐఏ
పీటర్ దయామండిస్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సింగులారిటీ యూనివర్సిటీ
జే శెట్టి (పాడ్‌కాస్టర్, రచయిత, కోచ్)
జెఫ్ కూన్స్ (కళాకారుడు)
జనవరి మకాంబ (విదేశీ వ్యవహారాలు - తూర్పు ఆఫ్రికా సహకారం)
జేమ్స్ టైక్లెట్ (సీఈఓ, లాక్‌హీడ్ మార్టిన్)
ఎరిక్ కాంటర్ (వైస్ చైర్మన్, మోయిలిస్ - కంపెనీ)
ఎన్రిక్ లోర్స్ (ప్రెసిడెంట్, సీఈఓ, హెచ్‌పీ)
బోర్జే ఎఖోల్మ్ (ప్రెసిడెంట్, సీఈఓ, ఎరిక్సన్)
విలియం లిన్ (ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, బీపీ)
టామీ యుట్టో, ప్రెసిడెంట్, నోకియా మొబైల్ నెట్‌వర్క్స్



రాష్ట్రంలో అణు విద్యుత్ ప్లాంట్లు!

ఇతర రాష్ట్రాల్లో వీటి పనితీరుపై అధ్యయనానికి సీఎం ఆదేశం

- ప్లాంట్ల ఏర్పాటు, ఖర్చు, ఉత్పత్తి, ధరలు పరిశీలించాలని సూచన
- 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసే యోచన
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా తక్కువ ధరకు లభించే విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి
- రాష్ట్రంలో ఇప్పటికే మణుగూరులో భారజల ఉత్పత్తి కేంద్రం


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అణు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. కనీసం 4 వేల మెగావాట్ల కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఇటీవల దీనిపై సమీక్ష నిర్వహించింది. అణు ఇంధన ఉత్పత్తికి గల అవకాశాలపై అధికారుల నుంచి నివేదిక కోరింది. ఇతర రాష్ట్రాల్లో వీటి ఏర్పాటు, అయిన ఖర్చు, పనితీరు, విద్యుత్ ఉత్పత్తి ధరలను పరిశీలించాలని వారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో విద్యుత్ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టారు. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ త్వరలో నిపుణులతో సంప్రదింపులు జరపాలని యోచిస్తున్నారు. ఇందుకోసం అవసరమైతే నిపుణులతో కూడిన కన్సల్టెన్సీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. 2047 నాటికి దేశవ్యాప్తంగా లక్ష మెగావాట్ల అణు ఇంధన ఉత్పత్తి జరగాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు పెంచింది. మరోవైపు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో అణు ఇంధన ఉత్పత్తికి వనరులున్నాయని అధికారులు చెబుతున్నారు. దేశంలోనే అతిపెద్ద భారజల ఉత్పత్తి కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఉంది. ఇక్కడి నుంచి భారజలం దేశంలోని అన్ని అణు విద్యుత్ కేంద్రాలకూ అందుతోంది. సహజ యురేనియంను ఉపయోగించే అణు రియాక్టర్లలో శీతలీకరణకు (కూలెంట్‌గా) దీనిని ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తే వనరులను ఇక్కడే వినియోగించుకోవచ్చని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే అణు విద్యుత్ ప్లాంట్ల మంజూరు, స్థాపన, ఉత్పత్తి వినియోగం మొత్తం కేంద్ర ప్రభుత్వ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉండటం గమనార్హం.

కర్బన ఉద్గారాలకు చెక్!

ప్రస్తుతం 14 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. థర్మల్, జల విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి జరుగుతోంది. అయితే థర్మల్‌కు అవసరమైన బొగ్గుకు ఇబ్బందులున్నాయి. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు వచ్చే ఫిబ్రవరికి 50 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం. ఇంత మొత్తం సింగరేణి అందించే పరిస్థితి కన్పించడం లేదు. మరోవైపు బొగ్గు మండించడం వల్ల వచ్చే కర్బన ఉద్గారాలు సమస్యగా మారుతున్నాయి. దీంతో సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టారు. థర్మల్ విద్యుత్ యూనిట్ సగటున రూ.4 వరకు ఉండగా, సోలార్ విద్యుత్ యూనిట్ రూ.2.15కు లభిస్తోంది. కానీ సాయంత్రం, రాత్రి వేళల్లో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొంటే యూనిట్ రూ.9 వెచ్చించి కొనాల్సి వస్తోంది. జలవిద్యుత్ చవక అయినా అది పరిమితంగానే ఉంది. కాగా వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్ మరో 9 వేల మెగావాట్లకు పెరిగే వీలుంది. దీంతో అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అణు విద్యుత్ ప్లాంట్లు 90 శాతం ప్రాజెక్టు లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) ఇస్తున్నాయి. అంటే ప్రతి వంద మెగావాట్లు 24 గంటలు పనిచేశాయనుకుంటే 2.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దేశంలో 8 అణు విద్యుత్ కేంద్రాలున్నాయి. వీటిలో 25 రియాక్టర్లు పనిచేస్తున్నాయి, వీటి మొత్తం సామర్థ్యం 8,880 మెగావాట్లు. ప్రస్తుతం ఈ విద్యుత్ యూనిట్ రూ.3.15కు లభిస్తోంది. మరో పది కేంద్రాల ఏర్పాటు జరుగుతోంది. గుజరాత్, రాజస్తాన్‌లో ఒక్కో యూనిట్ 700 మెగావాట్లతో నిర్మిస్తున్నారు.

ఆధునిక సాంకేతికతతో ఉత్పత్తి ఇలా..

అణు ఇంధన రంగంలో ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నారు. దీనివల్ల ప్లాంట్ నిర్మాణ వ్యయం తగ్గుతోంది. అణు రియాక్టర్‌లోని భారజలంలో యురేనియం, థోరియం పరమాణువులను విచ్ఛిన్నం చేస్తారు. దీంతో వెలువడే వేడిమితో నీటి ఆవిరి తయారవుతుంది. దాన్ని ఉపయోగించి టర్బైన్లను తిప్పడం ద్వారా విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. అణు విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన యురేనియం, థోరియం నిల్వలు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లోనూ ఉన్నట్టు ఇటీవల పరిశోధనల్లో తేలింది.



ప్రయోజనాలెన్నో..

థర్మల్, అణు విద్యుత్ కేంద్రాలకు చాలా తేడా ఉంది. విద్యుత్ ప్లాంట్‌కు అవసరమైన యురేనియం, థోరియం సూట్‌కేస్ పరిణామంలోనే తీసుకెళ్ళొచ్చు. థర్మల్ కేంద్రాలకు వాడే బొగ్గును రైల్వే వ్యాగన్ల ద్వారా పంపాలి. అణు విద్యుత్తు కేంద్రాల స్థాపనకు, థర్మల్‌తో పోలిస్తే నాలుగో వంతు భూమి సరిపోతుంది. ఇటీవల కాలంలో చిన్న మాడ్యులర్ రియాక్టర్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. వీటికి ఇంకా తక్కువ స్థలం వాడొచ్చు. థర్మల్ విద్యుత్ కేంద్రాల కాల పరిమితి 20 ఏళ్ళు. అణు కేంద్రాల కాల పరిమితి 40 ఏళ్ళ పైనే. అణు విద్యుత్ కేంద్రాల్లో హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా అదనపు ప్రయోజనం పొందవచ్చు.

దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలు

దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలు
తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం మహారాష్ట్ర
రాజస్తాన్ అణు విద్యుత్ కేంద్రం రాజస్తాన్
మద్రాస్ అణు విద్యుత్ కేంద్రం తమిళనాడు
నరోరా అణు విద్యుత్ కేంద్రం ఉత్తరప్రదేశ్
కైగా అణు విద్యుత్ కేంద్రం కర్ణాటక
కుడంకుళం అణు విద్యుత్ కేంద్రం తమిళనాడు
కాక్రపార అణు విద్యుత్ కేంద్రం గుజరాత్

అణువిద్యుత్ ఉత్పత్తి పెరుగుతోంది

అణు ఇంధన విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై అన్ని రాష్ట్రాలూ దృష్టి పెట్టాయి. కేంద్రం కూడా అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. భవిష్యత్ విద్యుత్ ఉత్పత్తి అవసరాలు తీర్చేందుకు అణు ఇంధన ప్లాంట్ల ఏర్పాటు అవసరం. వనరులు పుష్కలంగా ఉన్న తెలంగాణలో అణు ఇంధనం ప్రయోజనకరం.



– జి.వీర మహేందర్ (టీజీ జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్)

క్లుప్తంగా...

కాన్‌స్టిట్యూషన్ క్లబ్ కోశాధికారిగా జితేందర్ రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా కోశాధికారిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో సభ్యులు జితేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ నుంచి రెండుసార్లు ఎంపీగా సేవలందించిన జితేందర్.. ప్రస్తుతం ఢిల్లీలోని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కోశాధికారి పదవిలో జితేందర్‌రెడ్డి ఐదేళ్ల పాటు కొనసాగనున్నారు. క్లబ్ గౌరవాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు.

ఆన్‌డ్యూటీలో ఉంటేనే వేతనాలు

నిషేధాన్ని ఉల్లంఘించి బదిలీ అయిన ఇంజనీర్ల జీతాలపై సర్కారు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సామూహిక నిషేధాన్ని ఉల్లంఘించి నీటిపారుదల శాఖలో బదిలీ చేసిన ఇంజనీర్లకు ఏడాదికాలంగా జీతాల చెల్లింపు నిలిచిపోయింది. నిబంధనలను సడలించి వారికి జీతాలు చెల్లించాలని నీటిపారుదల శాఖ పంపిన ప్రతిపాదనలను సీఎం కార్యాలయం తిరస్కరించినట్టు తెలిసింది. అయితే, బదిలీ అయిన ఇంజనీర్లు పాత స్థానాల్లో 'ఆన్ డ్యూటీ' విధులు నిర్వర్తించినట్లు ఉత్తర్వులను పంపిస్తే.. వారికి జీతాలు చెల్లించేందుకు అనుమతిస్తామని సీఎం కార్యాలయం స్పష్టం చేసింది. దీంతో వారంతా ఆన్ డ్యూటీలో ఉన్నట్లు ఉత్తర్వులను తయారుచేసి పంపించాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. మొత్తం 81 మంది ఇంజనీర్లు.. దాదాపు ఏడాది కాలంగా జీతాలు నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఉద్యోగ సంఘాలు సీఎంని కలిసి విజ్ఞప్తి చేయగా, ప్రతిపాదనలు పంపించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

మహారాష్ట్ర, తెలంగాణ బోర్డు కార్యదర్శిగా విజయ్ కుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, మహారాష్ట్ర మధ్య జల వ్యవహారాలను పర్యవేక్షించే అంతర్రాష్ట్ర బోర్డు కార్యదర్శిగా.. రాష్ట్ర నీటిపారుదల శాఖ అంతర్రాష్ట్ర జల వనరుల విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయ్‌కుమార్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

త్వరలో రోహిత్ వేముల చట్టం

రోహిత్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించిన వారికి ఉన్నత పదవులా?

- ఇప్పటి బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు... అప్పుడు హెచ్‌సీయూ వద్ద ధర్నా చేసి రోహిత్‌పై ఒత్తిడి తెచ్చారు
- దళితులను ఇబ్బందిపెట్టే వారికి బీజేపీ పట్టం కడుతోంది
- ఢిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో రాజేంద్ర పాల్ గౌతమ్

సాక్షి, న్యూఢిల్లీ: పరిశోధక విద్యార్థి రోహిత్ వేములను ఆత్మహత్యకు ప్రేరేపించిన వారికి బీజేపీ పెద్దపీట వేసి, ఉన్నత పదవులను కట్టబెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. అప్పట్లో ఎమ్మెల్సీగా ఉన్న ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హెచ్‌సీయూ ఎదుట ఆందోళన చేశారని గుర్తు చేశారు. రాంచందర్‌రావు ఒత్తిడి కారణంగా ఆ సమయంలో అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్‌లో ఉన్న విద్యార్థులపై యూనివర్సిటీ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇంతటి ఘటనకు కారకుడైన రాంచందర్‌రావుపై చర్యలు తీసుకోకుండా అధ్యక్ష పదవి ఇచ్చిన బీజేపీ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో ఏఐసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్‌తో కలిసి భట్టి మీడియాతో మాట్లాడారు. రోహిత్ వేముల కేసును తాము పునర్విచారణ చేసేందుకు కోర్టును ఆశ్రయించినట్లు భట్టి చెప్పారు. అతని మృతికి కారకులైన వారిని వదిలేది లేదని హెచ్చరించారు. రోహిత్ ఆత్మహత్య వంటి ఘటనలు దేశంలో పునరావృతం కాకుండా ఉండేందుకు ముందుగా రాష్ట్రంలో ప్రత్యేక చట్టాన్ని తెస్తున్నట్లు చెప్పారు.

పదవులు కట్టబెడతారా?

'హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అడ్మిషన్లు తీసుకునే దళిత విద్యార్థులందరికీ అడ్మిషన్‌తోపాటు ఇంత విషం, ఒక తాడును కూడా ఇస్తే ఉరి వేసుకోవడానికి పనికొస్తుందని రోహిత్ వేముల వీసీకి రాసిన సూసైడ్ నోట్‌లో ఉంది. అప్పట్లో ఈ సూసైడ్ నోట్ దేశ ప్రజల మనసులను కలచివేసింది. వర్సిటీలో ఆత్మగౌరవంతో బతకడానికి కావలసిన హక్కులు కల్పించండి అంటూ అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ యూనివర్సిటీలో జరుగుతున్న ఘటనలపై వీసీకి వినతి పత్రం ఇచ్చింది. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని వర్సిటీ ఏబీవీపీ యూనిట్ అధ్యక్షుడు సుశీల్ కుమార్.. రోహిత్‌తోపాటు మరో నలుగురు అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ వీసీకి ఫిర్యాదు చేశారు. ఆ నలుగురిపై పోలీసు కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని వీసీపై ఒత్తిడి తీసుకురావడమే కాకుండా, కేంద్ర మానవ వనరుల శాఖ నుంచి నుంచి వీసీపై ఒత్తిడి తెచ్చారు. అదే సమయంలో ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఒత్తిడి తేవడంతో పోలీసులు యూనియన్ సభ్యులపై కేసులు నమోదు చేశారు. నలుమూలల నుంచి వచ్చిన ఒత్తిడిని తట్టుకోలేక వర్సిటీ అధికారులు రోహిత్‌తోపాటు మరో నలుగురిని సస్పెండ్ చేయడంతో గత్యంతరం లేక రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డారు'అని భట్టి విక్రమార్క చెప్పారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసు నమోదు చేయించిన నాటి ఎమ్మెల్సీ రాంచందర్‌రావును ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారని, రోహిత్ ఆత్మహత్యకు ప్రధాన కారకుడుగా భావిస్తున్న సుశీల్ కుమార్‌ను ఢిల్లీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించారని మండిపడ్డారు.

మా ప్రభుత్వంలో ఇబ్బందుల్లేవు

- పవర్ షేరింగ్ అనేది లేదు.. అందరం కలిసి పనిచేస్తున్నాం
- బీఆర్ఎస్ నేతల మాటలు మితిమీరాయి: భట్టి

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల కాలంలో బీఆర్ఎస్ నేతలు మితిమీరి వ్యాఖ్యలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో, వారి నిర్ణయం ఏంటనేది వారికే తెలియదన్నారు. వీటిపై తాము ప్రశ్నిస్తే.. మితిమీరిన మాటలు మాట్లాడుతూ విచిత్రంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో భట్టి మీడియాతో చిట్‌చాట్ చేశారు. 'మా ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు లేవు. పవర్ షేరింగ్ అనేది ఏమీ లేదు. అందరం కలిసి టీం వర్క్‌గా పనిచేస్తున్నాం. మా ప్రభుత్వం బాగుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కోటి పూర్తిస్థాయిలో అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం. ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాం. మహిళలకు ఉచిత బస్సు క్లిక్ అయ్యింది.. ఎంచక్కా మహిళలంతా ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఫోర్త్‌సిటీ పనులు జరుగుతున్నాయి, మూసీ సుందరీకరణను కచ్చితంగా ఈ హయాంలోనే పూర్తి చేస్తాం. రీజినల్ రింగ్ రోడ్ కూడా వస్తుంది. రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రాదు. బీజేపీ వాళ్ల మాటలు వినడం ప్రజలు ఎప్పుడో మానేశారు'అని భట్టి అన్నారు.

కలుపుకొని తాగేస్తున్నారు!

▶ మొదటి పేజీ తరువాయి

విరుగుడు లేదు. ఒక్క చుక్క మందు అయినా మరణానికి దారి తీస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. పురుగు మందులన్నీ విషపూరితమే అయినప్పటికీ పారాక్వాట్‌ను మించిన విషపు మందు మరోటి లేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా ఒప్పుకుంటున్నారు.

70 దేశాల్లో నిషేధం

పారాక్వాట్‌ను ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 దేశాలు నిషేధించాయి. భారత్‌లో మాత్రం ఇది ఇన్‌సెక్టిసైడ్ యాక్ట్–1968 కింద చట్టబద్ధంగా రైతులకు అందుబాటులో ఉంది. వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలలో కలుపు మొక్కల నివారణకు ఉపయోగించేందుకు ఇది లభ్యమవుతోంది. ఒడిశా ప్రభుత్వం 2023 అక్టోబర్ నుంచి దీని వాడకంపై తాత్కాలికంగా నిషేధం విధించింది. అయితే, అక్కడి రైతులు మాత్రం పారాక్వాట్ మీద నిషేధం ఎత్తివేయాలని కోరుతుండడం గమనార్హం.

ప్రత్యామ్నాయం లేకనే..

దేశంలో కలుపు నివారణకు గతంలో పారాక్వాట్‌తోపాటు గ్లైఫోసైట్ అనే హెర్బిసైడ్‌ను వాడే వారు. గ్లైఫోసైట్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఇప్పుడు మిగిలింది పారాక్వాట్ ఒక్కటే. ఇటీవలి కాలంలో గ్లూఫోసినేట్ అమోనియం అనే మందును కూడా వినియోగిస్తున్నారు. కానీ, ఇది ఖరీదైనది కావటంతో అందరికీ అందుబాటులో లేదు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పారాక్వాట్‌ను వాడుతున్నారు. రాష్ట్రంలో కూలీల కొరత అధికంగా ఉండటంతో పత్తి, మొక్కజొన్నతో పాటు వరిలో దీనిని విరివిగా వాడుతున్నారు.

> **పారాక్వాట్ వినియోగాన్ని తగ్గించాలి**
>
> పంటలకు వినియోగించే ఏ మందైనా విషపూరితమే. అయితే, విరుగుడు లేని మందు పారాక్వాట్. ప్రతి రైతు కలుపు నివారణకు పారాక్వాట్‌ను వాడుతుండడంతో రైతు కుటుంబాల వద్ద అధికంగా అందుబాటులో ఉండే హెర్బిసైడ్ ఇదొక్కటే. దీంతో రైతులు, రైతు కుటుంబంలోని ఇతర సభ్యులు ఏ చిన్న సమస్య వచ్చినా దీనిని తీసుకుంటున్నారు. పారాక్వాట్ విచ్చలవిడి అమ్మకాలను, వినియోగాన్ని నిరోధించాలి. వ్యవసాయంలో పారాక్వాట్ వినియోగాన్ని తగ్గించాలి. పంట వేసిన మొదటి నెలలోనే కేవలం ఒకసారి మాత్రమే కలుపు మందు వాడేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.
>
> – డాక్టర్ రాంప్రకాశ్, శాస్త్రవేత్త, పీజేటీఎస్ఏయూ

మండలానికి ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లు

భూవిస్తీర్ణాన్ని బట్టి నియమిస్తాం: మంత్రి పొంగులేటి

- శిక్షణ పొందిన వారికి మళ్లీ పరీక్ష
- రెవెన్యూ గ్రామానికో జీపీవో... ఈనెల 27న మరోమారు అర్హత పరీక్ష
- నక్షా లేని ఐదు గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి మండలానికీ 4 నుంచి 6 దాకా లైసెన్సుడు సర్వేయర్లను నియమిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఆ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న భూమి విస్తీర్ణాన్ని బట్టి సర్వేయర్ల నియామకం చేపడతామన్నారు. శుక్రవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో పొంగులేటి మాట్లాడారు. తొలివిడతలో భాగంగా ఇప్పటికే 7వేల మంది లైసెన్సుడు సర్వేయర్లకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. వీరికి ఈనెల 27న తుది పరీక్ష నిర్వహిస్తామని, 28, 29 తేదీల్లో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని, ఈ పరీక్ష ఫలితాలను ఆగస్టు 12న ప్రకటిస్తామన్నారు. ఉత్తీర్ణులైన వారికి మరో 40 రోజులపాటు అప్రెంటిస్ శిక్షణ ఇచ్చి గ్రామాలకు పంపుతామని వెల్లడించారు. లైసెన్సుడు సర్వేయర్ల నియామకం కోసం మరో 3 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీరికి ఆగస్టు రెండో వారం నుంచి శిక్షణ ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అనే నిబంధనను భూభారతి చట్టంలో పేర్కొన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్ల కొరత లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పొంగులేటి చెప్పారు. గత పదేళ్ల కాలంలో నిర్వీర్యమైన సర్వే వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామపాలనాధికారి (జీపీవో)ని నియమించే ప్రక్రియ కూడా పూర్తవుతోందని చెప్పారు. ఇప్పటికే పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలకు పరీక్ష నిర్వహించి 3,554 మందిని ఎంపిక చేశామని, మరోమారు పరీక్ష నిర్వహించాలన్న రెవెన్యూ సంఘాల విజ్ఞప్తి మేరకు పరీక్ష రాయలేకపోయిన వారి కోసం ఈనెల 27న పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు.

2988 ఎకరాల్లో భూమి సర్వే పూర్తి

గత ప్రభుత్వం నక్షా లేని గ్రామాలను గాలికి వదిలేస్తే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ గ్రామాలకు నక్షాలు ఇవ్వాలన్న ఆలోచన చేసిందని మంత్రి పొంగులేటి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 413 గ్రామాలకు నక్షా లేదని, వీటిలో ఐదింటిని పైలట్‌గా ఎంచుకుని భూముల రీసర్వే చేపట్టామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని సలార్ నగర్‌లో 422 ఎకరాలు, జగిత్యాల జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామంలో 626 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మొలుగుమాడలో 845 ఎకరాలు, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురులో 502 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం షాహిద్ నగర్‌లోని 593 ఎకరాలను కలిపి మొత్తం 2,988 ఎకరాల భూమిని ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సర్వే చేసినట్టు వెల్లడించారు. తద్వారా భూమి సమాచారం లభించడంతోపాటు యాజమాన్య హక్కులపై స్పష్టత వస్తుందని చెప్పారు. నక్షా లేని మిగిలిన గ్రామాల్లో కూడా రీ సర్వే చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పొంగులేటి పేర్కొన్నారు.

సీజేఐ జస్టిస్ గవాయ్‌కి ఘనస్వాగతం



సీజేఐ జస్టిస్ గవాయ్‌కి స్వాగతం పలుకుతున్న సీఎస్ రామకృష్ణారావు. చిత్రంలో జస్టిస్ నర్సింహ, జస్టిస్ శామ్ కోషి

సాక్షి, హైదరాబాద్ / శంషాబాద్: రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కి శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. జస్టిస్ గవాయ్‌తోపాటు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పగిడిఘంటం నర్సింహకు హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ శామ్ కోషితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు, డీజీపీ డా.జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ మహంతి, ఏజీ సుదర్శన్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సీజేఐ శనివారం నల్సార్‌లో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొనడంతోపాటు ఉస్మానియా వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే 'భారత రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర' అనే అంశంపై విశిష్ట ఉపన్యాసం ఇస్తారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ నర్సింహతోపాటు హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొంటారు.

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు



అమ్మవారి బోనంతో గవర్నర్ దంపతులు. చిత్రంలో మంత్రి పొన్నం, కలెక్టర్ హరిచందన

సనత్‌నగర్: సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. గవర్నర్ సతీ మణి అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం పట్టువస్త్రాలు అందజేశారు. అమ్మవారి రూపంతో ఉన్న ఫొటోను ఆలయ అధికారులు గవర్నర్ దంపతులకు బహూకరించారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ దాసరి హరిచందన, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, ఆలయ ఈవో మనోహర్‌రెడ్డి.. గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. గవర్నర్ రాక నేపథ్యంలో నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. గవర్నర్ దంపతులతో పూజలు చేసిన అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ జంట నగరాల్లో ఆషాఢ మాస బోనాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. గత నెల 26న గోల్కొండ జగదాంబ తొలి బోనాలు ప్రారంభమై జూలై 1న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం జరిపినట్లు గుర్తుచేశారు. ఈనెల 13న ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు, 14న భవిష్యవాణి (రంగం) జరుగుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లష్కర్ బోనం సమర్పిస్తారని పొన్నం తెలిపారు. ప్రభుత్వం తరఫున జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

లండన్‌లో వైభవంగా 'టాక్ బోనాల జాతర'

ప్రత్యేక ఆకర్షణగా తొట్టెల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పూజలు, లండన్ వీధుల్లో తొట్టెల ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు యూకే నలుమూలల నుంచి 2 వేలకు పైగా ప్రవాస కుటుంబ సభ్యులు హాజరయ్యారు. టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, ఉపాధ్యక్షుడు శుష్మణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు నాయకత్వంలో ప్రారంభమైన వేడుకలకు.. వ్యాఖ్యాతలుగా ఉపాధ్యక్షుడు సురేశ్ బుడగం, కమ్యూనిటీ అఫైర్స్ చైర్‌పర్సన్ గణేశ్ కుప్పాల, కార్యదర్శి శైలజా జెల్ల వ్యవహరించారు. రత్నాకర్ కడుదుల మాట్లాడుతూ ప్రవాస తెలంగాణ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రవాస తెలంగాణ సంఘాలు ఏర్పడి తెలంగాణ సంస్కృతి విశ్వవ్యాప్తం అయ్యే కృషి జరుగుతుందంటే మన ప్రత్యేక రాష్ట్రం మనకు ఏర్పాటు అవడమే కారణమన్నారు.

క్లుప్తంగా...

పునరుత్పాదక విద్యుత్‌ను ప్రోత్సహించాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



బీఈఈ నివేదికను స్వీకరిస్తున్న గవర్నర్

సాక్షి, హైదరాబాద్: భూతాపానికి కారణమైన వాయు ఉద్గారాలను తగ్గించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. పునరుత్పాదక విద్యుత్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ), ఈఈఎస్ఎల్ అధికారులు శుక్రవారం గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ సూచనలను బీఈఈ దక్షిణ భారత ప్రాంతీయ మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖర్‌రెడ్డి మీడియాకు వివరించారు. వాతావరణ మార్పు ప్రభావాలను తగ్గించడంలో ఇంధన సామర్థ్యం 40 శాతం కంటే ఎక్కువ దోహదపడుతుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఇంధన సామర్థ్య చర్యల ప్రాముఖ్యతను గుర్తించిన గవర్నర్, ఈఈఎస్ఎల్ ద్వారా రాజ్‌భవన్, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)లలో సమగ్ర ఇంధన ఆడిట్ నిర్వహించాలని సిఫార్సు చేశారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఒక రోల్ మోడల్‌గా తయారుచేసేందుకు ఇంధన సామర్థ్య అధికారులు ముందుండి నడిపించాలని కోరారు. ఇంధన పరిరక్షణ, స్థిరమైన ఇంధన పద్ధతులను ప్రోత్సహించడానికి పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల ద్వారా పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు తేదీల మార్పు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 34 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకునే తేదీలను మెడికల్ అండ్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మార్చింది. ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు ఈ దరఖాస్తులను స్వీకరించాల్సి ఉండగా, డాక్టర్ల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు తేదీలను మారుస్తున్నామని, ఈనెల 20 నుంచి 27 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో బోర్డు తెలిపింది. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, కుల ధ్రువీకరణ, ఇతర సర్టిఫికెట్ల కోసం కొంత సమయం కావాలని డాక్టర్లు కోరిన నేపథ్యంలో తేదీలు మార్చామని, ఈనెల 20 నుంచి బోర్డు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు సమయంలోనే అన్ని సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని ఆ ప్రకటనలో బోర్డు వర్గాలు సూచించాయి.

'ఉస్మానియా' తరలింపుపై వివరణ ఇవ్వండి

- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలించడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించడాన్ని సవాల్ చేస్తూ స్థానికుడు జి.రాము హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. స్టేడియం, ఇతర భూమిని వైద్యారోగ్య శాఖకు గత జనవరి 30న బదిలీ చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఆస్పత్రి నిర్మాణం కోసం ఆ స్థలాన్ని వినియోగించాలని సర్కార్ తీసుకున్న నిర్ణయం ఏకపక్షమని, జీవో 45ను కొట్టివేయాలని చెప్పారు. ఈ జీవో మాస్టర్ ప్లాన్–2031 జోనల్ నిబంధనలు, తెలంగాణ అర్బన్ ఏరియాస్ డెవలప్‌మెంట్ యాక్ట్ 1975 రూల్స్‌కు విరుద్ధమని వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎంఏయూడీ, హోం, వైద్యారోగ్య, టూరిజం శాఖల ముఖ్య కార్యదర్శులు, ఆర్‌అండ్‌బీ, ఫైనాన్స్ ఈబీఎస్‌వీ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీలతోపాటు హైదరాబాద్ కలెక్టర్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది.

గత ఆగస్టులోనే ఒప్పందం

- కార్బన్ క్రెడిట్స్ కోసమే హరిత సౌభాగ్యం ప్రాజెక్టు
- కార్బన్ క్రెడిట్స్‌తో పంచాయతీలకు ప్రయోజనం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచాలన్న ఉద్దేశంతో హరిత సౌభాగ్యం (తెలంగాణ) ప్రాజెక్టులో భాగంగా ఐటీఆర్ఏ ఎకోలాజికల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. 'పంచాయతీ స్థలాలు ప్రైవేట్‌పరం?' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆ శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. కార్బన్ క్రెడిట్స్ వల్ల పంచాయతీలకు కూడా ప్రయోజనం కలుగుతుందనే ఉద్దేశంతో గత ఆగస్టులో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. పచ్చదనాన్ని 24 శాతం నుంచి 33 శాతానికి పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఈ ఒప్పందం జరిగిందని పేర్కొన్నారు. భూములపై హక్కులను ఆ సంస్థకు ఇవ్వడంలేదని స్పష్టంచేశారు. కార్బన్ ప్రాజెక్ట్ నమోదు, పర్యవేక్షణ, పంచాయతీలకు లాభాలను ఆర్జించి పెట్టడమే ఆ సంస్థ పని అని వివరించారు. అన్ని జిల్లాలకు పంపిణీ చేసిన స్వచ్ఛంద, ముందస్తు సమాచార ఒప్పందం (ఎఫ్‌పీఐసీ) ఫార్మాట్‌లో అన్ని వివరాలు ఉన్నాయని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద పెంచిన మొక్కల వివరాలను నమోదు చేస్తారని వెల్లడించారు.



అయితే, కన్సెంట్ ఫార్మాట్‌లోనే 30 ఏళ్లపాటు ఆ సంస్థకు హక్కులు ఉంటాయని స్పష్టంగా ఉన్నా.. పంచాయతీరాజ్ శాఖ మాత్రం అదేమీ లేదని వివరణ ఇవ్వడం గమనార్హం.

ఏమిటీ కార్బన్ క్రెడిట్స్?

ఒక ఎకరా భూమిలో 400 మొక్కలు ఉంటే, అవి 30 సంవత్సరాల్లో సుమారు 200 టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను పీలుస్తాయి. ఒక టన్నుకు ఒక క్రెడిట్‌గా లెక్కించి, ఆ క్రెడిట్‌ను రూ.500కు విక్రయిస్తే...ఒక ఎకరాకు 30 సంవత్సరాల్లో రూ.లక్ష ఆదాయం వస్తుంది. ఈ కార్బన్ క్రెడిట్స్ అనేది పూర్తిగా మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ఉంటుంది.

ఎవరు కొంటారు?

విపరీతమైన కాలుష్యం వెదజల్లే పరిశ్రమల్లో ప్రధానంగా విమానసేవలు, సిమెంట్ కంపెనీలు, ఆయిల్ కంపెనీల లాంటివి ఉన్నాయి. వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి వారు ఎంత కాలుష్యం అయితే విడుదల చేస్తారో.. ఆ మేరకు కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత కూడా ఆ పరిశ్రమపై ఉంటుంది. ఆ పరిశ్రమ అందుకోసం కాలుష్యాన్ని తగ్గించుకోవడంలో భాగంగా మొక్కలు పెంచడంలాంటివి చేయాలి. కానీ అవి చేయవు. అందుకు బదులుగా ఇలా కార్బన్ క్రెడిట్స్‌ను కొనుగోలు చేసి.. ఆ మేరకు కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించినట్లు చూపించుకోవడానికి ఉపయోగపడుతుంది.

ఎక్కడ కొనుగోలు చేస్తారు?

కార్బన్ క్రెడిట్స్ అంతర్జాతీయ మార్కెట్లు, వాలంటరీ కార్బన్ మార్కెట్ల (VCM)లో విక్రయిస్తారు. వీర్రా, గోల్డ్ స్టాండర్డ్, ఇండియన్ కార్బన్ మార్కెట్ (భవిష్యత్తులో) సంస్థలు ధ్రువీకరించిన ప్రాజెక్టులను లిస్టు చేస్తాయి. వాటిలోని కార్బన్ క్రెడిట్‌లను కంపెనీలు కొనుగోలు చేస్తాయి.

రాష్ట్రంలో ఏం జరుగుతోంది?

ఇప్పటికే గ్రామ పంచాయతీల్లోని స్థలాల్లో పెంచిన మొక్కలు, చెట్ల ద్వారా ఏ మేరకు వాతావరణం పరిశుభ్రంగా మారుతుందో.. ఒక చెట్టు ఎంత కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుంటుందో శాస్త్రవేత్తలు లెక్కిస్తారు. కార్బన్ క్రెడిట్స్‌ను ఐటీఆర్ఏ సంస్థ విక్రయించి, ఆదాయం సమకూర్చాలి. అయితే, ఎంత మొత్తం విక్రయిస్తారు? దానివల్ల ఎంత డబ్బు వచ్చిందన్న వివరాలు పూర్తిగా గ్రామ పంచాయతీలకు వెల్లడిస్తారా లేదా? అన్న అనుమానాలు ఉన్నాయి.

విద్య, వైద్యం.. మాదే బాధ్యత



నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు

- అన్ని మెడికల్ కళాశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తాం: మంత్రి దామోదర
- నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న కోమటిరెడ్డి, జూపల్లి

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకే రకమైన సౌకర్యాలు కల్పించేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన ప్రారంభం, జనరల్ ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన, కల్వకుర్తిలో వంద పడకల ఆస్పత్రి భవన శంకుస్థాపన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడారు. ప్రజలకు సాగునీటి ప్రాజెక్టులు, విద్యతోపాటు నాణ్యమైన వైద్యసేవలు సైతం ముఖ్యమన్నారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని, నిమ్స్, ఉస్మానియా ఆస్పత్రుల తరహాలోనే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రులు కూడా ఒకేవిధంగా సేవలందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో కొత్తగా 213 కొత్త అంబులెన్స్‌లను సమకూర్చామని, అన్ని వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేసి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పూర్తిస్థాయిలో నీరందిస్తాం: కోమటిరెడ్డి

త్వరలోనే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం విస్తరణతోపాటు పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేసి ఆయకట్టు రైతులకు నీరందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. పెండింగ్‌లో ఉన్న రోడ్లు, విస్తరణ పనులకు ఆగస్టు మొదటి వారంలో టెండర్లు పిలిచి పూర్తి చేస్తామన్నారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీఎస్సార్ నిధులతో జిమ్, రిక్రియేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానన్నారు.

ఎలక్ట్రిక్ మినీ బస్సులు మంజూరు: మంత్రి జూపల్లి

ఆస్పత్రులకు వస్తున్న రోగులకు మందులతో పాటు రోగాలు రాకుండా ఉండేందుకు జాగ్రత్తలు, నివారణ చర్యలను ప్రిస్క్రిప్షన్‌లో రాయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు వైద్యులకు సూచించారు. రోజుకు గంటసేపు నడక, వ్యాయామానికి కేటాయిస్తే ఎన్నో వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలకు ఎలక్ట్రిక్ మినీ బస్సులు, రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.

ప్రజలతో కలిసి ఉద్యమించండి

- పార్టీ ముఖ్య నేతలందరూ క్షేత్రస్థాయి నుంచి కదలొద్దు
- బీఆర్ఎస్ ముఖ్య నేతలతో టెలి కాన్ఫరెన్స్‌లో కేటీఆర్, హరీశ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఉద్యమించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వంపై చేసే పోరాటంలో వారిని భాగస్వాములను చేయాలని ఆదేశించారు. శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా పరిషత్, ప్రభుత్వ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో ఇద్దరు నేతలు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గంటకు పైగా సాగిన ఈ కార్యక్రమంలో పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. 'రైతులు వర్షాభావంతోపాటు యూరియా, విద్యుత్ కోతలు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. గతంలో పల్లె ప్రగతిలో భాగంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజలతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలి' అని కేటీఆర్, హరీశ్‌రావు పిలుపునిచ్చారు. నేతలంతా క్షేత్రస్థాయిలోనే ఉంటూ పార్టీ కేడర్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు.

బీసీ రిజర్వేషన్ల పేరిట సర్కారు నాటకం

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలకు తెరలేపారు. కేంద్రం వద్ద బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం పెండింగులో ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభిస్తుందా? అనే అంశంపై అనేక అనుమానాలు ఉన్నాయి. ఆర్డినెన్స్‌కు ఆమోదం దక్కదని తెలిసినా మోసగించే చర్యలకు పాల్పడుతున్నారు. ఈ అంశంపై పార్టీ కేడర్‌తోపాటు ప్రజలకు అవగాహన కల్పించండి' అని నేతలకు కేటీఆర్, హరీశ్‌రావు సూచించారు.

సీఎంకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టాలి

▶ మొదటి పేజీ తరువాయి

కలిసి శుక్రవారం ఉదయం 11 గంటలకు పీసీ ఘోష్ కమిషన్‌ను కలిసి కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అదనపు సమాచారాన్ని హరీశ్‌రావు అందజేశారు. అనంతరం బీఆర్‌కే భవన్ వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'కమిషన్‌కు మా వద్ద ఉన్న అదనపు సమాచారం అందజేశాం. ఈ అంశానికి సంబంధించిన డాక్యుమెంట్లు ప్రభుత్వం వద్ద ఉన్నందున గతంలో తీసుకున్న కేబినెట్ నిర్ణయాలు, కేబినెట్ నోట్ తదితర సమాచారం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఏడీ, నీటిపారుదల శాఖ కార్యదర్శులకు లేఖలు రాసినా స్పందన లేదు. దీంతో మాకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి నోట్ అందజేశాం. ప్రభుత్వం వద్ద పూర్తి వివరాలు ఉన్నా కమిషన్‌కు అందజేసిన సమాచారం మాకు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించకుండా కమిషన్‌ను తప్పుదోవ పట్టించేలా వివరాలు ఇస్తోందని మాకు అనుమానాలు ఉన్నాయి' అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

సీఎంది కవర్ పాయింట్ ప్రజెంటేషన్..

'సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాభవన్ వేదికగా 50 ఏండ్ల ద్రోహ చరిత్రపై ఇచ్చింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదు. అది 'కవర్ పాయింట్ ప్రజెంటేషన్'. కృష్ణా నదీ జలాల్లో గత ప్రభుత్వం 299:512 నిష్పత్తిలో వినియోగానికి శాశ్వత ఒప్పందం చేసుకుని సంతకాలు పెట్టిందని రేవంత్ పదేపదే పచ్చి అబద్ధాలు చెప్తున్నారు. ఉమ్మడి ఏపీలో జానారెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి చేతగాని నాయకుల వల్లే తెలంగాణకు 299 టీఎంసీలు తాత్కాలికంగా కేటాయించారు. ఆ అన్యాయాన్ని సరిదిద్దేందుకు కేసీఆర్ కేంద్రంతో పోరాడి సెక్షన్ 3ని సాధించి 763 టీఎంసీల వాటా కోసం పోరాటానికి బాటలు వేశారు. కానీ, అధికారంలోకి వచ్చిన వెంటనే 299 టీఎంసీలు చాలు అంటూ రేవంత్, ఉత్తమ్ సంతకాలు చేసి వచ్చారు. నదుల బేసిన్స్ గురించి బేసిక్స్ తెలియని సీఎం రేవంత్.. అహంకారం, వెటకారం వదిలి తెలంగాణకు ఉపకారం చేసే రీతిలో నడుచుకోవాలి. కాకతీయులు, నిజాం నవాబుల కాలంలో నిర్మించిన చెరువులు, ప్రాజెక్టులను కూడా రేవంత్ కాంగ్రెస్ ఖాతాలో వేసి 54 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చామని చెప్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో 48 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తే అంతకు మునుపు పదేళ్లలో కాంగ్రెస్ ఇచ్చింది ఆరు లక్షల ఎకరాలకు మాత్రమే' అని హరీశ్‌రావు వివరించారు.

తమ్మిడిహెట్టిపైనా అబద్ధాలే..

'తమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పినందునే మేడిగడ్డకు బరాజ్ మారిందని చెప్తున్నా సీఎం రేవంత్ పదేపదే అబద్ధాలు చెప్తున్నారు. జలాశయాల సామర్థ్యం, నీటి వినియోగం, ఆయకట్టు, పంపింగ్ సామర్థ్యం, భూసేకరణ పరిహారం పెరగడం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలు పెరిగాయి. గత ఏడాది తెలంగాణ వాటాలో కేవలం 28 శాతం కృష్ణా జలాలను వాడుకుని, చంద్రబాబుకు గురుదక్షిణగా 65 టీఎంసీలు ఆంధ్రాకు మళ్లించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి అన్ని ఆధారాలతో వస్తాం. దమ్ముంటే సీఎం రేవంత్‌కు నచ్చిన తేదీల్లో అసెంబ్లీలో చర్చ పెట్టాలి. కానీ ఒక్కటే షరతు.. మైక్ కట్ చేసి అసెంబ్లీని వాయిదా వేసి పారిపోవద్దు' అని హరీశ్‌రావు సూచించారు. ప్రఖ్యాత ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి సందర్భంగా హరీశ్‌రావు నివాళి అర్పించారు.

14న ఎడ్‌సెట్, పీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: ఎడ్‌సెట్, పీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూళ్లు ఈనెల 14న విడుదలవుతాయి. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలో సెట్ కమిటీ శుక్రవారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సమావేశంలో సెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి, మండలి వైస్ చైర్మన్లు పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. కౌన్సెలింగ్ తేదీల వివరాలిలా ఉన్నాయి.

	ఎడ్‌సెట్	పీఈసెట్
నోటిఫికేషన్	14.7.25	14.7.25
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్	21.7.25 - 31.7.25	23.7.25 - 29.7.25
ధ్రువపత్రాల పరిశీలన	23.7.25 - 26.7.25	25.7.25 - 26.7.25
తప్పుల సవరణ	2.8.25	30.7.25
వెబ్ ఆప్షన్లు ఫేజ్-1	4.8.25 - 5.8.25	31.7.25 - 1.8.25
వెబ్ ఆప్షన్ల ఎడిట్	6.8.25	2.8.25
సీట్ల కేటాయింపు	9.8.25	4.8.25
కాలేజీలో రిపోర్టింగ్	11.8.25-14.8.25	5.8.25 - 8.8.25
క్లాసులు ప్రారంభం	18.8.25	11.8.25

నాకు కర్మములంటవు. నాకు వాని ఫలమందు ధ్యాన లేదు.
నేనిట్టివాడనని ఎవడెరుగునో, వానికి కర్మబంధనములు కలుగవు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 12 జూలై 2025

ఘోరం... ఇది దారుణం!


'గర్భ' గుడిలో జీవం పోసుకోవటంతో మొదలై కడదాకా అడుగడుగునా వివక్ష ఎదుర్కొంటున్న ఆడపిల్లకు మృత్యువు తరచు తారసపడుతుంటుంది. అది పుట్టినిల్లా, మెట్టినిల్లా, నడివీధా, జనసమ్మర్దం లేని ప్రాంతమా అనే తారతమ్యం లేదు. హంతకులు ఏ రూపంలో వుంటారో, ఎక్కడ కాపుగాస్తారో తెలియదు. తండ్రా, సోదరుడా, కట్టుకున్నవాడా, అపరిచితుడా అనే తేడా కూడా లేదు. ఉసురు తీసేవాడు ఎవడైనా కావొచ్చు. కారణం ఏదైనా ఉండొచ్చు. హరియాణాలోని గురుగ్రామ్‌లో కన్నతండ్రే కాలయముడై నిష్కారణంగా తన కంటిపాపను చిదిమేసిన ఈ ఉదంతం దిగ్భ్రాంతికరమైనది. తండ్రి దీపక్ యాదవ్ తుపాకి గుళ్లకు బలైపోయిన టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ చేసిన 'నేరం' ఏమీ లేదు. చిన్న వయసులోనే ఆ క్రీడలో రాణించి, ప్రతిభా పాటవాలు సొంతం చేసుకుని, అంచెలంచెలుగా ఎదగటమే ఆమె నేరం. కేవలం ఇరవై అయిదేళ్లకే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ సర్క్యూట్‌లో ఆమె ర్యాంకు 113. ఆ విధంగా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా కూడా నిరూపించుకుంది. సొంతంగా టెన్నిస్ అకాడెమీ నెలకొల్పింది. తన వంటి బాలికలకు శిక్షణనిస్తున్నది. వారు ఎదగటానికి ఆసరాగా నిలుస్తున్నది. అటువంటి రాధిక, కన్నతండ్రికి కంట్లో నలుసుగా మారిందంటే నమ్మగలమా? ఆమెను కాల్చిచంపటం తప్ప మరో దారిలేదని విశ్వసించాడంటే ఊహించగలమా? యువతరంలో చాలా మందికి ఆ వయసుకల్లా ఏం ఎంచుకోవాలో, ఎటుపోవాలో తెలియని అయోమయం ఆవరిస్తుంది. సంకోచం వెనక్కు లాగుతుంది. కింకర్తవ్య విమూఢత కాటేస్తుంది. ఆశించిన ఉద్యోగం అందక, ఇష్టంలేని కొలువుతో సరిపడక నిస్పృహలో కూరుకుపోతారు. కానీ రాధిక అలా కాదు. టెన్నిస్ రంగంలో ఎదిగి ఒక సానియా మీర్జాలా, ఒక సెరెనా విలియమ్స్‌లా మెరిసిపోవాలనుకుంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి ఎన్నో అవార్డులూ, రివార్డులూ సాధించింది. జాతీయ స్థాయి టెన్నిస్‌లో సైతం స్థానం సంపాదించుకోవాలని తపన పడుతోంది. కన్నవారికే కాదు... దేశానికే పేరు ప్రఖ్యాతులు తీసుకురాగలదన్న భరోసానిచ్చింది. ఇవన్నీ ఆమె తండ్రి దృష్టిలో నేరాలయ్యాయి.

రాధికా యాదవ్ ఉదంతం మనందరం నమ్ముతున్న విలువల్ని ప్రశ్నార్థకం చేస్తోంది. చిన్ననాటి నుంచీ టెన్నిస్‌లో ఆమెను వెన్నుతట్టి ప్రోత్సహించినవాడే హఠాత్తుగా ఎలా హంతకుడయ్యాడు? మెచ్చిన నోటితోనే దుర్భాషలాడే స్థితికి అతగాడు చేరటం వెనకున్న పరిణామాలెలాంటివి? పోలీసులకిచ్చిన వాంగ్మూలంలో అతను ప్రస్తావించిన అంశాలు వింటే ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్న మన సమాజం నిజస్వరూపం బట్టబయలవుతుంది. అంతా సవ్యంగా వుందని ఆత్మవంచనతో బతికేవారిని నిలదీస్తుంది. అందరూ దీపక్‌లాగే స్పందించక పోవచ్చుగానీ ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రుల్లో చాలామందికి కన్నకూతురు గురించి నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడటం, ఆమెను చిన్నచూపు చూడటం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం కనబడుతూనే వుంటుంది. ఇలాంటి దుర్మార్గ ధోరణులను ప్రతిఘటించాల్సిన దీపక్ యాదవ్ తానూ ఆ తానులో ముక్కయ్యాడు. వారు ప్రవచిస్తున్న విలువల పరిధిలో, పరిమితిలో వుండకుండా కుటుంబాన్ని రాధిక వీధిన పడేస్తున్నదని అపోహపడ్డాడు. టెన్నిస్ క్రీడ గురించీ, తానిస్తున్న శిక్షణలో పాటించే ప్రమాణాల గురించీ ఆమె చేసిన వీడియోపై వచ్చిన కామెంట్లు తట్టుకోలేక సోషల్ మీడియా ఖాతాను అప్పటికే తీయించేశాడు. అకాడెమీని సైతం మూసేయాలన్న సలహా కూడా పాటించాలని కోరుకున్నాడు. దాన్ని తిరస్కరించిందన్న ఉన్మాదంతో మానవత్వాన్ని మరిచాడు. కూతురి సంపాదనపై బతుకుతున్నావని ఛీత్కరించిన మృగాల్లో కనీసం ఒక్కరికి తన లైసెన్స్ రివాల్వర్‌ను గురిపెట్టివుంటే ఆ బాపతు నోళ్లు మూతబడేవి. స్వయంశక్తితో ఎదుగుతున్న కన్నకూతురి కోసం దృఢంగా నిలబడిన ఒక మంచి నాన్నగా నిలిచేవాడు. ఏమైంది ఇవాళ? యుక్తాయుక్త విచక్షణ కోల్పోయి హంతకుడిగా మిగిలాడు!

ఆడపిల్లను పెంచటం, ఆమె అభీష్టానికి అనుగుణంగా ఎదగనివ్వటం, ఇష్టపడిన చదువు చదివించటం, కోరుకున్న వాడికిచ్చి పెళ్లిచేయటం వర్తమానంలో పెను సవాలుగా మారిందన్నది వాస్తవం. తల్లిదండ్రులు విద్యావంతులైనా, ఉన్నతోద్యోగాలు చేస్తున్నా, సమాజం పెట్టిన ప్రమాణాలను ఆడపిల్ల మీరితే ఎలా అన్న విచికిత్సలో పడుతున్నవారు చాలామందే తారసపడతారు. వారిలో అనేకులు చుట్టూవున్నవారి ఒత్తిళ్లకు లొంగి ఇంటి ఆడపిల్లను అదుపు చేయటానికి ప్రయత్నించేవారే. ఆ క్రమంలో అనేకమంది పిల్లలు తమ ఇష్టాలను వదులుకుని బతుకులు వెళ్లదీస్తున్నారు. అసలు బయటికెళ్లిన ఆడపిల్ల సురక్షితంగా ఇంటికొస్తుందో లేదో తెలియని ఆందోళనతో నిత్యం భయంభయంగా బతుకుతున్న తల్లిదండ్రులకు మేమున్నామంటూ భరోసానిచ్చే వ్యవస్థలున్నాయా? సామాజిక కట్టుబాట్ల పేరుతో రూపొందుతున్న తప్పుడు విలువలు ఇళ్లల్లోకి చొరబడకుండా, వాటి దుష్ప్రభావాలు కుటుంబాలపై పడకుండా నివారించే సంస్కృతి ఆచూకీ ఏది? మన ప్రభుత్వాలు తీసుకుంటున్న కనీస చర్యలేమిటి? ఆడవాళ్లను కించపరిచే సినిమాలనూ, ఇతరేతర మాధ్యమాలనూ ఏ మేరకు కట్టడి చేయగలుగుతున్నాం? ఎటువంటి వివక్షకూ తావు లేకుండా దేశ పౌరులందరికీ సమాన అవకాశాలు లభించాలన్న మన రాజ్యాంగం సక్రమంగా అమలవుతున్నదా? ఇవన్నీ సరిగా లేనప్పుడు దీపక్‌లాంటివారు రూపొందుతారు. వారికి నారూ నీరూ పోస్తున్నవారు ఎప్పటికీ పదిలంగా వుంటారు. రాధికా యాదవ్ వంటి మణిపూసలు నిస్సహాయంగా నేల రాలుతారు.

మారక నిల్వలు కరిగిస్తేనే కదలిక!

విశ్లేషణ



మోహన్ గురుస్వామి

మోదీ ప్రభుత్వం చెప్పుకొనే గొప్పల్లో తరచూ వినిపించేవి... విదేశీ మారక ద్రవ్య నిల్వలు! ఆయన వచ్చిన తర్వాత ఫారిన్ ఎక్స్ఛేంజ్ (ఫారెక్స్) రిజర్వులు 700 బిలియన్ డాలర్లకు పెరిగాయి (2025 జూన్ నాటికి). ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న చైనా వద్ద 3 ట్రిలియన్ (3,000 బిలియన్లు లేదా 3 లక్షల కోట్లు) డాలర్లు ఉన్నాయి. గతంలో చైనా ఫారెక్స్ నిల్వలు 4 ట్రిలియన్ డాలర్లుగా ఉండేవి. చైనా తర్వాత జపాన్ (1.25 ట్రిలియన్ డాలర్లు), స్విట్జర్లాండ్ (800 బిలియన్ డాలర్లు) అగ్రస్థానంలో నిలుస్తాయి.

మారక ద్రవ్య నిల్వలు ఇంత అధికంగా ఉన్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ ఆశించిన స్థాయిలో లేదు. ఎన్డీయే ప్రభుత్వం ఆర్థిక చక్ర వ్యూహంలో చిక్కుకుంది. ఎలా బయట పడాలో తెలియడం లేదు. ఆర్థిక వ్యవస్థను మళ్లీ ఉత్తేజపరచడానికి కొత్త పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా రావాలి. కానీ ప్రభుత్వం వాటిని ఆకర్షించలేక పోతోంది. 2004–14 మధ్య మన ఎకానమీ అసాధారణ వృద్ధి సాధించింది. తర్వాత ఆ ఊపు కనబడటం లేదు. యూపీఏ పాలన సాగిన పదేళ్లలో సాధించిన ప్రగతికి 7.7 శాతం సగటు వృద్ధి రేటే నిదర్శనం. గడచిన పదేళ్లలో ఈ సగటు అంతకంటే తక్కువగా 6.2 గానే నమోదైంది.

ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవు!

అయితే, యూపీఏ హయాం చివరి రెండేళ్లలో ఎకానమీ మందగించింది. పెట్టుబడుల వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ – క్యాపెక్స్) భారీగా క్షీణించడం ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొనాలి. దురదృష్టవశాత్తూ అదే ట్రెండ్ ఎన్డీయే హయాంలోనూ కొనసాగుతోంది. భారత ఆర్థిక వృద్ధి నేటికీ చాలావరకు ప్రభుత్వ పెట్టుబడి మీదే ఆధారపడుతోంది. పెట్టుబడులు ఎందుకు పడిపోతున్నాయి? ప్రభుత్వం దగ్గర కాసులు లేవు. యూపీఏ పాలన నాటి అధిక సబ్సిడీలను ఎన్డీయే ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. దీనికి తోడు, ఏడో వేతన సంఘం సిఫారసులు అమలు వల్ల వేతనాలు 23 శాతం (రూ. లక్ష కోట్లు) పెరిగాయి.

తనకు ముందు సంవత్సరాల మందగమనాన్నుంచి ఎకానమీని గట్టెక్కించి పరుగులు తీయిస్తానని మోదీ హామీ ఇచ్చారు. ప్రభుత్వ పెట్టుబడులను గణనీయంగా పెంచుతానన్నారు. 100 కొత్త సిటీలు, హైస్పీడ్ రైళ్ల నేషనల్ నెట్‌వర్క్, దేశ వ్యాప్త నదుల అనుసంధానం, ఇంకా ఇలాంటి పలు భారీ ప్రాజెక్టులు చేపట్టబోతున్నట్టు వాగ్దానం చేశారు. 100 కొత్త నగరాల నిర్మాణం కాస్తా 100 స్మార్ట్ సిటీలకు పరిమితమైంది. స్మార్ట్ సిటీలంటే ఉచిత వైఫై నెట్‌వర్కులు ఏర్పాటు చేయడమే. ఇక దేశవ్యాప్త హైస్పీడ్ రైళ్ల నెట్‌వర్క్ కాస్తా అహ్మదాబాద్ – ముంబాయి బుల్లెట్ ట్రెయిన్‌గా రూపాంతరం చెందింది. అది కూడా ఆర్థికంగా ఓ గుదిబండ అయ్యేట్లుంది. ఇతర వాగ్దానాలు సైతం 'ప్రతి భారతీయుడి ఖాతాలో 15 లక్షల రూపాయల జమ' లాంటి జుమ్లాల జాబితాలో చేరాయి.

దెబ్బ మీద దెబ్బ

ఆ తర్వాత రెండు అనూహ్య ఘటనలు చోటు చేసుకున్నాయి. వీటిలో ఒకటైన పెద్దనోట్ల రద్దు (డీమానిటైజేషన్) చర్య అసంఘటిత రంగపు దినసరి వేతన జీవులను చావుదెబ్బ తీసింది. దేశ జీడీపీలో 40 శాతం ఈ రంగం నుంచే సమకూరుతుంది. ఉపాధి పరంగా చూసినా, మొత్తం 45 కోట్ల మందిలో 90 శాతం మంది ఈ రంగం నుంచే ఉపాధి పొందుతున్నారు. రెండో చర్య జీఎస్టీ తొందరపాటు అమలు. ఈ రెండు చర్యల వల్ల కచ్చితంగా ఎంత మంది ఉపాధి కోల్పోయారో ఇప్పటికీ గణాంకాలు లభ్యం కావడం లేదు. అంచనాలు పరస్పర విరుద్ధంగా ఉంటాయి. ముఖ్యంగా నిర్మాణ రంగం, ఫుడ్, రిటెయిల్ రంగాల్లో ఉపాధి నష్టం భారీగా జరిగింది. ఈ నిర్ణయాలు 2–3 కోట్ల మంది పొట్ట గొట్టి ఉంటాయని అంచనా.

సరైన ఆలోచన లేకుండా జీఎస్టీని తొందరపడి అమలు చేయడం వల్ల ఉత్పత్తిపై ప్రభావం పడింది. తుది గడువు తక్కువగా ఉండటంతో డీలర్లు స్టాక్స్ తగ్గించుకున్నారు. దాంతో కంపెనీలు ఉత్పత్తి తగ్గించాయి. జీఎస్టీ ఇన్‌పుట్, ఔట్‌పుట్ రేట్లు పొంతన లేకుండా ఉండటం వల్ల గందరగోళం మరింత పెరిగింది. మొదటి నెల రూ. 95 వేల కోట్ల వసూళ్లు ఉన్నా, అందులో రూ. 65 వేల కోట్లు తర్వాత రీఫండ్ చేయాల్సి వచ్చింది. కానీ అన్ని నిధులు ప్రభుత్వం వద్ద లేవు.

దాదాపు రూ. 50 వేల కోట్ల వ్యయానికి నిధులు సమకూర్చుకునేందుకు వీలుగా జీడీపీలో 3.2 శాతం మించకూడదన్న ద్రవ్య లోటు లక్ష్యాన్ని సడలించుకోవలసి వచ్చింది. ఈ స్వయంకృత అపరాధాలకు కోవిడ్ వైపరీత్యం తోడైంది. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. వినియోగం తగ్గింది. దాంతో ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా వినియోగం మరింత తగ్గింది. ఈ విషవలయం నుంచి ఆర్థిక వ్యవస్థను తిరిగి ఒడ్డున పడేయాలంటే, ప్రభుత్వ వ్యయాలు భారీగా పెరగాలి. తద్వారా ప్రజల చేతికి డబ్బు వస్తుంది. తిరిగి వినియోగం, ఉత్పత్తి పెరుగుతాయి. ప్రభుత్వం సబ్సిడీలను అర్థవంతంగా తగ్గిస్తే తప్ప పెట్టుబడి వ్యయం పెంచలేదు. రాజకీయంగా ఇది సాధ్యం కానిది.

కానీ ఎలాగైనా పెట్టుబడులు పెంచాలి. వాస్తవికతను విస్మరించకుండానే సృజనాత్మక ప్రణాళికలు రూపొందించుకోవాలి. పెట్టుబడులు పెంచాలి. తద్వారా వినియోగం పెరగాలి. ఈ పెట్టుబడుల ప్రణాళిక కోసం నిధులు అవసరం. ఈ డబ్బు సమ కూర్చుకోడానికి మోదీ అటూ ఇటూ పరుగులు తీయాల్సిన పని లేదు.



◆ భారత ఆర్థిక వృద్ధి నేటికీ చాలావరకు ప్రభుత్వ పెట్టుబడి మీదే ఆధారపడుతోంది. కానీ ప్రభుత్వం దగ్గర కాసులు లేవు. అందుకే ఆర్థిక వ్యవస్థలో ఊపు కనబడటం లేదు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అధికంగా (700 బిలియన్ డాలర్లు) ఉన్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థ ఆశించిన స్థాయిలో లేదు. 6 నెలల దిగుమతులకు సరిపడా మారక ద్రవ్యం నిల్వ పెట్టుకుంటే చాలని 'వాషింగ్టన్ కన్సెన్సస్' నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా దేశీయ వినియోగదారుల కోసం తాము ఎందుకు చౌకగా నిధులు సమకూర్చాలన్న భావనతో చైనా తన విదేశీ మారక నిల్వలను ట్రిలియన్ డాలర్లు తగ్గించుకుంది. మనం కూడా అదే చేయాలి.

దబ్బే డబ్బు!

ప్రభుత్వం డబ్బు పాతర మీద కూర్చుని ఉంది. దశాబ్దాలుగా పోగుపడిన విదేశీ మారక ద్రవ్య నిల్వలు (ఇందులో అమెరికా బ్యాంకుల్లో మూలుగుతున్నవి 135 బిలియన్ డాలర్లు) కొండంత అండగా కలిసి వస్తాయి. ఈ రిజర్వులు మన విదేశీ రుణాల్లో(736 బిలియన్ డాలర్లు) సుమారు 95 శాతానికి సమానం. ఫారెక్స్ రిజర్వుల్లో నాలుగో వంతు హాట్ మనీ (అంటే ఎన్ఆర్ఐ ఇన్వెస్టర్లు, విదేశీ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల స్వల్ప కాలిక పెట్టుబడులు) ఉపసంహరణల కోసం పక్కన పెట్టినా, మన దగ్గర ఇంకా చాలా డబ్బు చేతిలో ఉంటుంది. ఇందులో ఎంత వాడుకోగలమన్నది ఇప్పుడు ఆలోచించాలి. కౌశిక్ బసు (ప్రపంచ బ్యాంకు మాజీ ప్రధాన ఆర్థికవేత్త) ప్రకారం, విదేశీ మారక ద్రవ్య నిల్వలు మన కరెంట్ అకౌంట్ డెఫిసిట్ (సిఏడీ)కి సరిపడా ఉంటే చాలు. (ప్రస్తుత కరెంట్ ఖాతా లోటు 11 బిలియన్ డాలర్లు – వస్తుసేవల ఎగుమతులు, విదేశీ పెట్టుబడుల మీద వచ్చే ఆదాయం కంటే దిగుమతులకు చేసే చెల్లింపులు, విదేశీ పెట్టుబడుల మీద వెనక్కు పోయే ఆదాయం ఎక్కువగా ఉన్నప్పుడు ఆ వ్యత్యాసాన్ని కరెంటు ఖాతా లోటు అంటారు).

సింపుల్‌గా చెప్పాలంటే, కనీసం 6 నెలల దిగుమతులకు సరిపడా మారక ద్రవ్యం నిల్వ పెట్టుకుంటే చాలని 'వాషింగ్టన్ కన్సెన్సస్' నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా దేశీయ వినియోగదారుల కోసం తాము ఎందుకు చౌకగా నిధులు సమకూర్చాలన్న భావనతో చైనా తన విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఒక ట్రిలియన్ డాలర్లు తగ్గించుకుంది. మనం కూడా దాన్ని 100 బిలియన్ డాలర్లకు తగ్గించుకునే యోచన చేయాలి. ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ నెలకొల్పి, దానిలోకి అదనపు ఫారెక్స్ రిజర్వులను కొంచెం కొంచెంగా తరలిస్తూ పోవాలి. ఇది ఇండియాలో పెట్టుబడి పెట్టే ఇండియా సావరిన్ ఫండ్ అవుతుంది. దీని ద్వారా పెట్టుబడులు సమకూర్చుకునే సంస్థలు తమకు అవసరమైన వాటిని దేశీయంగా సమకూర్చుకోవాలన్న నిబంధన పెట్టాలి. తద్వారా 'మేక్ ఇన్ ఇండియా' నినాదం ఆచరణలోకి వస్తుంది. పెట్టుబడులు ఊపందుకుని ఆర్థిక వ్యవస్థ ఒడ్డున పడేందుకు ఇదొక అత్యుత్తమ మార్గం.

వ్యాసకర్త విధాన నిర్ణయాల విశ్లేషకుడు, రచయిత
mohanguru@gmail.com

సోషల్ మీడియా

గట్టిగా చెప్పాలిగా!



అరుణాచల్ ప్రదేశ్ 1,200 కిలో మీటర్ల సరిహద్దును చైనాతో కాదు, టిబెట్‌తో పంచుకుంటుంది. ఈ విషయాన్నే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సూటిగా ఎత్తిచూపారు. హిమాలయ సరిహద్దు మొత్తానికీ ఇదే వర్తిస్తుంది. సంప్రదాయంగా ఇది ఇండో–టిబెట్ సరిహద్దుగానే తెలుసు. ఇండియా–చైనా సంబంధాల్లో టిబెట్ కీలకం. అయినప్పటికీ భారత పిరికితనం దీన్ని అస్పష్టంగా ఉంచుతోందనేది వాస్తవం.

– బ్రహ్మ చెల్లానీ, విధాన నిపుణులు

మంచి విధానం



నేను బీజేపీ వ్యతిరేకిని. కానీ యురేనియం, టంగ్‌స్టన్, బంగారం, వజ్రాలను అత్యధికంగా ఎగుమతి చేస్తున్న దేశాల్లో నమీబియా ఒకటి. అలాగే ఇండియాకు ఆఫ్రికాతో చారిత్రక సంబంధాలు ఉన్నాయి. అక్కడి కీలకమైన ఖనిజాలు మన సుస్థిరతకూ, వృద్ధికీ అవసరం. అయినా ఆఫ్రికాతో సంబంధాలు పెంచుకోవాలన్న మోదీ ప్రభుత్వ విధాన నిర్ణయాన్ని కొందరు గుడ్డిగా ప్రశ్నిస్తున్నారు.

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

ఘనంగా విరమించాలి!



రాజకీయ నాయకులు 75 ఏళ్లకు రిటైర్ కావాలన్న మోహన్ భాగవత్ ప్రకటన పూర్తిగా సరైనది. 11 ఏళ్ల తన అద్భుత పాలన తర్వాత మోదీజీ వచ్చే నెలలో ఘనంగా పదవీ విరమణ చేయాలి. మార్గదర్శకులుగా అద్భుతమైన పని చేస్తున్న ఇతర సీనియర్ పార్టీ నాయకుల సరసన చేరాలి.

– ఎం.కె. వేణు, సంపాదకుడు

వింటున్నారా?




వినికిడి లోపానికి చికిత్స తీసుకోకపోతే డిమెన్షియా రిస్కు 2–5 రెట్లు పెరుగుతుంది. హియరింగ్ ఎయిడ్ వాడితే ఆ రిస్కు 48 శాతం తగ్గుతుంది. వినికిడి లోపం ఉన్నవాళ్లలో శబ్దాన్ని ప్రాసెస్ చేసుకోవడానికి మెదడు ఎక్కువ కష్టపడాల్సి ఉంటుంది. దానివల్ల జ్ఞాపకం, ఆలోచన మీద ఫోకస్ తగ్గుతుంది. అందుకే 50 ఏళ్ల పైబడినవాళ్లు రెగ్యులర్ చెకప్ చేసుకోవాలి.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

ఇన్ బాక్స్

భారత విప్లవపంథా నిర్మాత

భారత విప్లవోద్యమ మార్గదర్శుల్లో ఒకరైన కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ) ఉద్యమానికి సర్వస్వాన్నీ త్యాగం చేశారు. ఆయన స్వగ్రామం నల్లగొండ జిల్లా సూర్యాపేట ప్రాంతంలోని బండమీది చందుపట్ల. 1917 జూన్ 1వ తేదీన ఒక భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఏ చదువుతూ 'వందేమాతరం' ఉద్యమంలో పాల్గొని నిజాం ప్రభుత్వంచే విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరణకు గురయ్యారు. 1939లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించిన డీవీ పూర్తిస్థాయి కార్యకర్తగా నల్లగొండ జిల్లాలో ఉద్యమ నిర్మాణం ప్రారంభించారు. తెలంగాణ సాయుధ పోరాటం (1946–51) అన్ని దశల్లోనూ ఆయన చాలా కీలకమైన పాత్ర నిర్వహించారు. ఆనాడు భూస్వాముల క్రూరమైన దోపిడీ, దౌర్జన్యాల నుండి ప్రజలను రక్షించడానికీ, భూమి సమస్యను విప్లవోద్యమంతో ముడిపెట్టి ఉన్నతస్థాయి పోరాటాలకు ప్రజలను సమాయత్తం చేయటానికీ డీవీ అనుసరించిన విధానాలు, ఎత్తుగడలు చాలా కీలకమైనవి. తెలంగాణ సాయుధ పోరాటాన్ని విరమించాలనే ధోరణిని ఆయన తీవ్రంగా ఖండిస్తూ 1949లోనే ఒక డాక్యుమెంటును రచించారు.



దేవులపల్లి వెంకటేశ్వరరావు

'భారతదేశ ప్రజలు నేడు ఫ్యూడల్ భూస్వాముల, బడా పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల దోపిడీలు అనే మూడు బరువులను మోస్తున్నారనీ, ఈ దోపిడీలను సమూలంగా రద్దు చేసి ఒక నూతన ప్రజాతంత్ర వ్యవస్థను స్థాపించుకున్నప్పుడే దేశంలోని అన్ని రంగాల ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయనీ డీవీ ఉద్ఘాటించారు. ఈ లక్ష్యసాధనకు, దేశప్రజల విముక్తి కోసం ఆయన విప్లవ కార్యక్రమాన్నీ, పంథానూ రూపొందించారు. భారత పాలకవర్గాలు కుట్రకేసు బనాయించినపుడు కోర్టులో తమ విప్లవ కార్యక్రమాన్నీ, పంథానూ, లక్ష్యాలనూ బహిరంగంగా డీవీ ప్రకటించారు. 1975 ఏప్రిల్‌లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి (టీఎన్)తో కలిసి యూసీసీఆర్ఐ (ఎంఎల్)ను స్థాపించారు. 1984 జూలై 12వ తేదీన మరణించే వరకూ విప్లవ పంథాను వదలలేదు. డీవీ చూపిన బాటలో నడవడమే ఆయనకు అందించే నిజమైన నివాళి.

– సి. భాస్కర్ I యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్)
(నేడు దేవులపల్లి వెంకటేశ్వరరావు వర్ధంతి)

నస్ బందీ, నోట్ బందీ దారిలో ఓట్ బందీ!

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

ఎమర్జెన్సీ విధించి యాభై ఏళ్లయిన సందర్భంగా సంజయ్ గాంధీ ప్రోద్బలంతో 1975–77ల్లో జరిగిన నస్ బందీ (బలవంతపు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స) గురించి చాలామంది తలచుకున్నారు. అలాగే, తొమ్మిదేళ్ల కిందటి నోట్ బందీ (పెద్ద నోట్ల రద్దు) పర్యవసానాలు అందరికీ స్వానుభవమే. సరిగ్గా ఎమర్జెన్సీని గుర్తు చేసుకునే రోజు (జూన్ 25)కు ఒక రోజు ముందు కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాన్ని ఇప్పుడు ప్రతిపక్షాలు 'వోట్ బందీ' అంటున్నాయి. అది గత జూన్ 24న ఎన్నికల సంఘం బిహార్‌లో ప్రత్యేక తీవ్రతర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్– సర్) కోసం ఇచ్చిన ఆదేశం. బిహార్‌లోని 7,80,22,933 మంది వోటర్లలో 2003లో ఉండిన నాలుగు కోట్ల మంది పోగా, మిగిలిన వోటర్లలో ప్రతి ఒక్కరినీ కలిసి అర్హులా అనర్హులా ధ్రువీకరించి, కొత్త వోటర్ల జాబితా తయారు చేయాలనేది ఈ ఆదేశం.

ప్రస్తుతం ఉన్న వోటర్ల జాబితా తప్పుల తడక అనీ, అందులో పేర్లన్నీ అనుమానాస్పదమైనవనీ ఎన్నికల సంఘం అంటున్నది. విపరీతమైన వర్షాలతో, రాష్ట్రంలో 70 శాతం భూభాగం వరదల్లో చిక్కుకుని ఉన్న ప్రస్తుత స్థితిలో ఈ ఇంటింటి పర్యటన సాధ్యమా అనుమానమే.

2003 జాబితా తర్వాత చేరిన వోటర్లందరూ బర్త్ సర్టిఫికెట్, ప్రభుత్వోద్యోగి ఐడెంటిటీ కార్డ్, పెన్షన్ కార్డ్, పాస్ పోర్ట్, విద్యార్హతల సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం, అటవీ హక్కుల సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, జాతీయ పౌర రిజిస్టర్, స్థానిక అధికారులు తయారు చేసిన కుటుంబ పట్టిక, ప్రభుత్వం భూమి పంపిణీ చేసి ఉంటే ఆ పత్రం వంటి పదకొండు పత్రాలలో ఏదైనా ఒకటి చూపితేనే అర్హుడైన వోటర్‌గా లెక్కిస్తారు. ఈ అర్హతా పత్రాలలో ఆశ్చర్యకరంగా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, గ్రామీణ ఉపాధి హామీ పథకపు జాబ్ కార్డ్ లేవు. చివరికి ఎన్నికల కమిషన్ తానే స్వయంగా జారీ చేసిన వోటర్ కార్డ్ కూడా లేదు. బిహార్ లాంటి వెనుకబడిన రాష్ట్రంలో ఆ పదకొండు పత్రాలలో ఏదో ఒకటి కన్నా వోటర్ కార్డ్, జాబ్ కార్డ్, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్ ఉండే అవకాశమే ఎక్కువ. కొన్ని రోజులు గడిచాక, 'అర్హత నిర్ధారణను బూత్ లెవల్ ఆఫీసర్ల విచక్షణకు వదులుతున్నాం' అని ఎన్నికల సంఘం అంది. అంటే ఒక వ్యక్తి వోటరా కాదా అన్నది స్థానిక అధికారి ఇష్టాయిష్టాల మీద ఆధారపడుతుందన్నమాట!

ఈ కార్యక్రమం అనుమానాస్పదంగా ఉన్నదనీ, దీన్ని ఆపాలనీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను కలిసి ప్రతిపక్షాలు విజ్ఞప్తి చేసినప్పుడు ఆయన స్వయంగా బిహార్ వోటర్ల జాబితా నుంచి కనీసం ఇరవై శాతం పేర్లు తొలగించవలసి ఉంటుందని అన్నారు. అంటే ఒక కోటీ అరవై లక్షల వోటర్ల అర్హత ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వాళ్లలో కొందరు నిజంగానే అనర్హులు కావచ్చు గాని, ఈ పేరుతో అధికార పక్షం చాలామంది పేర్లు తొలగించదలచుకున్నదన్న అనుమానాలు విస్తారంగా ఉన్నాయి.



◆ 2003 నుంచి ఇప్పటివరకూ జరిగిన ఐదు లోకసభ ఎన్నికలలో, ఐదు శాసనసభ ఎన్నికలలో వోటు వేసినవారందరినీ ఇప్పుడు అనర్హులుగా, అర్హత రుజువు చేసుకోవలసినవారిగా ఎన్నికల సంఘం ప్రకటిస్తున్నది. అంటే ఆ ఐదు లోకసభలూ, శాసనసభలూ ఈ అనర్హులైన వోటర్ల వల్ల ఏర్పడ్డాయని ఎన్నికల సంఘం భావిస్తున్నదా? అలా అయితే వాటి సాధికారత, చట్టబద్ధత ఎంత?

2003లో వోటర్ల జాబితా సవరించడానికి 700 రోజులు పట్టింది. ఇప్పుడు నిర్దేశించిన నెల రోజుల్లో శిక్షణ, మెటీరియల్ తరలింపునకు పట్టిన కాలాన్ని మినహాయిస్తే 19 రోజుల్లో కార్యక్రమాన్ని ముగించాల్సి ఉంది. అంటే తూతూమంత్రంగా ముగిస్తారన్నమాట.

ఎన్నికల సంఘం ప్రకటనలను బట్టి మొత్తం కోటీ అరవై లక్షల వోటర్ల అర్హత ప్రశ్నార్థకమయింది. అసలు వోటర్ల జాబితాలు ఎప్పటికప్పుడు పునర్నవీకరణ చెందుతూనే ఉంటాయి. 2003 నుంచి ఇప్పటివరకూ జరిగిన ఐదు లోకసభ ఎన్నికలలో, ఐదు శాసనసభ ఎన్నికలలో వోటు వేసిన వారందరినీ ఇప్పుడు అనర్హులుగా, అర్హత రుజువు చేసుకోవలసినవారిగా ఎన్నికల సంఘం ప్రకటిస్తున్నది. అంటే ఆ ఐదు లోకసభలూ, శాసనసభలూ ఈ అనర్హులైన వోటర్ల వల్ల ఏర్పడ్డాయని ఎన్నికల సంఘం భావిస్తున్నదా? అలా అయితే వాటి సాధికారత, చట్టబద్ధత ఎంత?

వోటర్ల జాబితాల సవరణ ఎప్పటికప్పుడు చేయవలసిన పనే గనుక ఎన్నికల నిబంధనలు అది ఎట్లా చేయాలో నిర్దేశించాయి. ఆ నిబంధనల్లో ఇంటెన్సివ్ రివిజన్ ఉంది గాని ఇప్పుడు ప్రకటించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లేదు. అటువంటి పని చేసే అధికారం చట్ట ప్రకారం ఎన్నికల సంఘానికి ఉందా అనే ప్రశ్నకు జవాబు లేదు. బిహార్ నుంచి ప్రతి జూన్–జూలై–ఆగస్ట్ నెలల్లో కనీసం 21 శాతం వోటర్లు ఇతర రాష్ట్రాలకు పనుల కోసం వలస వెళ్తారని ఎన్నికల సంఘమే ఇది వరకు అంచనా వేసింది. మరి సరిగ్గా అదే సమయంలో ప్రతి వోటర్‌నూ కలిసి జాబితాను సంస్కరించాలనడంలో ఔచిత్యం ఏమిటి? ఇంకా విచిత్రం, ఇదే ఎన్నికల సంఘం గత సంవత్సరం జూన్‌లో వోటర్ల జాబితాను సంస్కరించమని బిహార్ ఎన్నికల అధికారులను ఆదేశించింది. వారు ఆరు నెలల పాటు శ్రమించి 2025 జనవరిలో జాబితా ప్రకటించారు. దాన్ని జూన్ 24 వరకూ ఎన్నికల సంఘం కూడా ఆమోదిస్తూ వచ్చింది.

ఇప్పుడు హఠాత్తుగా బిహార్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే, ప్రతిపక్షానికి వోటు వేస్తారనే అనుమానం ఉన్న లక్షలాది వోటర్లను అనర్హులుగా మార్చడమే ఏకైక మార్గంగా ఏలినవారు భావించినట్టున్నారు. అందుకు అనుగుణంగా ఎన్నికల సంఘం ఈ వోట్ బందీ ప్రకటించినట్టుంది. నస్ బందీ తలపెట్టినవారు 1977లో ఓటమి పాలయ్యారు. 2016 నోట్ బందీ ప్రకటిత లక్ష్యాలు సాధించలేక బొక్కబోర్లా పడింది. ఇప్పుడు 2025 వోట్ బందీకి ఏమవుతుంది?

వ్యాసకర్త 'వీక్షణం' సంపాదకుడు

సమయం వస్తే...

'కమలజ ఘటనా సమయంబైన, నసంభావ్యములైనను సంభవించు'నన్నాడు 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యకర్త కొఱవి గోపరాజు. ఆ 'సమయం' రావాలే కాని, ఇది అసంభవం అనుకున్నది కూడా జరుగుతుంది. ఆది దేవుడైన శ్రీహరి నాభికమలం నుండి పుట్టిన బ్రహ్మదేవుడి తలపులనుంచి ఉద్భవించినవే ఈ సృష్టిలోని సకల చరాచర వస్తు సంచయమంతా. కనుక, బ్రహ్మదేవుడు తలచుకోవాలే కాని, ఇదెలా సాధ్యం అనిపించేవి కూడా జరుగుతాయి అని రెండు ఉదాహరణలతో చెప్పాడు. అందులో ఒకటి, ఐదు కంటె ఎక్కువ ముఖాలు కలిగినవాడు, ఏడేండ్ల బాలుడి చేతిలో మాత్రమే మరణం సంభవించే వరం పొందిన తారకాసురుడి బాధను పోగొట్టడానికి శివపార్వతులకు జన్మించిన కుమారస్వామికి సంబంధించినది. మరొకటి ప్రహ్లాదుడికి సంబంధించినది.

జ్యోతిర్మయం

ప్రహ్లాదుడు హరిభక్తుడు. ప్రహ్లాదుడి తండ్రి హిరణ్యకశిపుడు హరిద్వేషి. హరి నామ శబ్దం చెవిన పడితే చాలు అగ్గి మీద గుగ్గిలమయ్యేంతటి ద్వేషం హిరణ్యకశిపుడిది. దేవతల చేత, దేవతల సంతతి చేత, దైత్యులు, గ్రహములు, తారకలు, మునులు, అగ్ని, వాయువు, యముడు, నరులు, గిరులు, తరులు పశుపక్ష్య మృగకీటకములలో దేని చేతనూ, ఏ రకమైన ఆయుధముల చేతనూ; అవనిపైన, అంతరిక్షంలోను, పగటి యందు, రాత్రియందు తనకు మరణం లేకుండా బ్రహ్మదేవుడి నుండి పొందిన వరంతో హిరణ్యకశిపుడి ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. ఆ పరిస్థితులలో ముల్లోకాలలో అందరూ ఏ బాధలూ లేకుండా పూర్వంలా సుఖంగా ఉండాలంటే హిరణ్యకశిపుడి మరణం ఒక్కటే మార్గం కాగా, ఆ మరణం ఇలా సంభవించింది కదా అని ఈ క్రింది కంద పద్యంలో అలతి మాటలలో అందంగా చెప్పాడు కొఱవి గోపరాజు, సింహాసన ద్వాత్రింశిక ప్రథమాశ్వాసంలో.

ఇది మానిసి యిది సింగ
బిది దేవత యను వివేక మెడలగ బలసం
పద నుక్కుగంబమున హరి
యుదయింపడె దైత్యవరుని నుక్కడగింపన్.

'ఇది మనిషి, ఇది సింహము, ఇది దేవత అని గుర్తించి, విడదీసి చెప్పడానికి వీలు లేని ఆకారంలో, అటు భూమి మీద గాని, ఇటు ఆకాశం గానీ కాని ఉక్కు స్తంభములో నృసింహావతారంలో ఉదయించి హిరణ్యకశిపుడిని పరిమార్చాడు కదా శ్రీహరి!' అని పై పద్యం భావం. కనుక కమలజుడైన బ్రహ్మ కల్పనకు సమయం వస్తే, జరగనిది ఏదీ ఉండదు.

– భట్టు వెంకటరావు

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.విదియ సా.6.23 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.7.25 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.11.29 నుండి 1.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.32 నుండి 7.17 వరకు, **అమృతఘడియలు:** రా.9.14 నుండి 10.53 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.35.

క్లుప్తంగా...

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయశాఖలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును.. అసోసియేషన్ వ్యవస్థాపకుడు కె.రాములు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాల్మోన్ నాయక్, తిరుపతి నాయక్ కలిసి వినతి పత్రం సమర్పించారు. వ్యవసాయశాఖలో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు ఇచ్చినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఒక అటెండర్, ఇతర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగం రావడం లేదని..

- రైలు కింద పడి యువకుడి బలవన్మరణం


అఖిల్

చిట్యాల: ఉన్నత చదువులు చదివినా మంచి ఉద్యోగం రావటం లేదని జీవితంపై విరక్తితో ఓ యువకుడు రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాలలో చోటు చేసుకుంది. చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన రూపని కృష్ణ ఏకైక కుమారుడు రూపని అఖిల్ (24) బీటెక్ పూర్తి చేసి ఏడాదిన్నర కిందట హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేశాడు. అక్కడ అతి తక్కువ వేతనం ఇస్తుండటంతో ఆ ఉద్యోగం మానేసి స్వగ్రామానికి వచ్చి ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే, ఏడాది కాలంగా ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉండాల్సి రావటంతో అఖిల్ జీవితంపై విరక్తి చెందాడు. దీంతో శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు చిట్యాల పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోకి చేరుకున్నాడు. అదే సమయంలో తిరుపతి నుంచి లింగంపల్లి వైపునకు వెళ్తున్న నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై రామకృష్ణ తెలిపారు.

వీఐటీ చెన్నైలో ఫ్రెంచ్ లాంగ్వేజ్ క్లబ్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఎంబీఏ ఫ్రెషర్స్ ఇండక్షన్ ప్రోగ్రామ్ సందర్భంగా వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) చెన్నైలో ఫ్రెంచ్ లాంగ్వేజ్ క్లబ్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. కార్యక్రమానికి పుదుచ్చేరి, చెన్నైలలో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ అయిన ఎటియన్ రోలాండ్ పీగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పోటీతత్వ ప్రాముఖ్యత గురించి తెలిపారు. 'సాంస్కృతిక మార్పిడి ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. వీఐటీ చెన్నైలో ఫ్రెంచ్ లాంగ్వేజ్ క్లబ్ ప్రారంభం ద్వారా ఇక్కడి విద్యార్థులు ఫ్రెంచ్ సంస్కృతిని తెలుసుకుంటారు' అని పేర్కొన్నారు. వీఐటీ వ్యవస్థాపకుడు, చాన్స్‌లర్ విశ్వనాథన్ మాట్లాడుతూ ఎంబీఏ స్పెషలైజేషన్ విద్యార్థులకు విస్తృతజ్ఞానం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వీఐటీ ప్రొవైస్ చాన్స్‌లర్ త్యాగరాజన్, అడిషనల్ రిజిస్ట్రార్ పీకే మనోహరన్, పుదుచ్చేరి, చెన్నైలలో ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ అధికారులు పాల్గొన్నారు.

'రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఒక కుట్ర'

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఒక కుట్ర అని ఇండియన్ స్టూడెంట్ యూనియన్ (ఐఎస్‌యూ) అధ్యక్షుడు పాపని నాగరాజు ఒక ప్రకటనలో ఆరోపించారు. '2018లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 9 ప్రకారం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించింది. ఆ తర్వాత జూన్, 2018లో జీఓ నం.396 జారీ చేసి స్థానిక సంస్థలన్నింటిలోనూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేయాలంది. అయితే హైకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించి పోతున్నాయని ఈ జీఓను కొట్టేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీల్‌కు వెళ్లగా.. సుప్రీంకోర్టు ఆమోదించకపోవడంతో దాన్ని వెనక్కి తీసుకుంది. ఆర్డినెన్స్ 2/2018 జారీ చేసి బీసీలకు 22 శాతం రిజర్వేషన్ మాత్రమే కల్పించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. ఇప్పుడు మళ్లీ అదే ప్రయోగాన్ని మరోసారి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తుంది. దీనిపై బీసీ మేధావులు, నాయకులు, సంఘాలు ఎందుకు నిలదీయలేకపోతున్నారు' అని నాగరాజు ప్రశ్నించారు.

'కల్తీ కల్లు' ఘటనపై నివేదిక ఇవ్వండి

- ఎక్సైజ్ అధికారులకు లోకాయుక్త ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కల్తీ కల్లు తాగి ఐదుగురు మృతి చెందిన సంఘటనపై లోకాయుక్త స్పందించింది. దీనిపై పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించింది. ఈ నెల 18న వివరాలు తమ ముందు ఉంచాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధికారులకు స్పష్టం చేసింది. కీసరలో రహదారి నిర్మాణం సరిగ్గా లేక ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో.. లారీ కిందపడి ఒక వ్యక్తి చనిపోయిన సంఘటనను కూడా లోకాయుక్త విచారణకు స్వీకరించింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, నాగారం మున్సిపల్ కమిషనర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, ఎస్ఈకి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 18లోగా నివేదిక అందజేయాలని ఆదేశించింది.

కృష్ణా, గోదావరికి పోటెత్తుతున్న వరద

- ములుగు జిల్లాలో మునిగిన జాతీయ రహదారి
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ మధ్య నిలిచిన రాకపోకలు
- కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11.790 మీటర్ల ఎత్తులో ప్రవాహం
- నాగార్జునసాగర్‌లో 545 అడుగులకు చేరిన నీటిమట్టం

వాజేడు/కాళేశ్వరం/నాగార్జునసాగర్: కృష్ణా, గోదావరి నదులకు వరద పోటెత్తుతోంది. దీంతో జలాశయాలన్నీ జలకళ సంతరించుకుంటున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం సమీపంలో 163 నంబరు జాతీయ రహదారిపైకి శుక్రవారం గోదావరి వరద నీరు చేరింది. దీంతో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరద క్రమేపీ పెరుగుతుండటంతో రేగుమాకు ఒర్రె నుంచి రహదారిపైకి వరద నీరు వచ్చి చేరింది. అప్రమత్తమైన అధికారులు ఆ దారిగుండా ఎవరూ వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అనుసంధాన జాతీయ రహదారి 163 పై గల వంతెనను మూసివేస్తున్నట్టు ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ శుక్రవారం తెలిపారు. పేరూరు వద్ద గురువారం సాయంత్రం గోదావరి నీటిమట్టం 14.28 మీటర్లు ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 15.420 మీటర్లకు చేరుకుంది. పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది.


ములుగు జిల్లాలో నీట మునిగిన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని జాతీయ రహదారి

కాళేశ్వరం ఘాట్ వద్ద...

మహారాష్ట్రలో కురుస్తున్న భారీవర్షాలతో ప్రాణహిత నది ఉగ్రరూపం దాల్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11.790 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద సరస్వతీనది పుష్కరాల్లో ఏర్పాటు చేసిన రెండు జ్ఞానదీపాలు నీటమునిగి కొంత పైకి కనిపిస్తున్నాయి. మేడిగడ్డ(లక్ష్మీ)బరాజ్‌కు 8.68 లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా మొత్తం 85 గేట్లు ఎత్తి అదే స్థాయిలో నీటిని ఔట్‌ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు.

సాగర్ క్రస్ట్‌గేట్లను తాకిన కృష్ణమ్మ

సాగర్ ప్రాజెక్టులో నీరు క్రస్ట్‌గేట్లను తాకింది. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు శుక్రవారం 1,19,989 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. నాగార్జునసాగర్ జలాశయ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 545.30 అడుగులకు చేరింది. త్వరలోనే సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మరోపక్క సాగర్ ఎడమ కాల్వకు నీటిని నిలిపి వేశారు.

పదమూడు నెలలకే నూరేళ్లు

- నిద్రిస్తున్న తండ్రీకొడుకులకు పాము కాటు
- 13 నెలల పసివాడు మృత్యువాత
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రి


వేదాన్ష్

బెల్లంపల్లి: తండ్రీకొడుకులను పాము కాటేసిన సంఘటనలో.. పదమూడు నెలల చిన్నారి కన్నుమూశాడు. తండ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వన్‌టౌన్ ఏఎస్ఐ మహేందర్, బస్తీవాసులు తెలిపిన వివరాలివి. బెల్లంపల్లి బస్తీకి చెందిన జంగపల్లి ప్రవీణ్, ఆయన భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు వేదాన్ష్(13 నెలలు) గురువారం రాత్రి ఇంట్లో నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో మంచం పైకి ఎక్కిన పాము ప్రవీణ్‌ను కాటేసింది. కలవరపాటుకు గురైన ఆయన నిద్ర నుంచి మేల్కొని చూసేసరికి కాట్లు కనిపించాయి. మంచం కింద పాము కనిపించడంతో కర్రతో కొట్టి చంపాడు. భార్య, కొడుకును తీసుకుని మోటార్‌సైకిల్‌పై స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ ప్రవీణ్‌కు ప్రథమ చికిత్స చేస్తున్న సమయంలో.. వేదాన్ష్ ఒక్కసారిగా వాంతులు చేసుకోవడంతో అనుమానంతో పరీక్షించారు. చిన్నారికి సైతం కాట్లు కనిపించాయి. దీంతో తండ్రీ కొడుకులను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆస్పత్రిలో చేరిన కొద్దిసేపటికే వేదాన్ష్ మృతి చెందాడు. ప్రవీణ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్య

- అనారోగ్య సమస్యలు, భవిష్యత్‌పై బెంగతో ఘాతుకం
- సిద్దిపేట జిల్లా గౌరారంలో ఘటన


భారతమ్మ


కవిత

వర్గల్(గజ్వేల్): అనారోగ్య సమస్యలు, భవిష్యత్‌పై బెంగ.. తల్లీకూతుళ్లను ఆత్మహత్యకు పురిగొల్పాయి. పుట్టుకతోనే వికలాంగురాలైన కూతురు నడవలేని స్థితికి చేరింది. ఆమెను కంటికి రెప్పలా చూసుకుంటున్న తల్లిని నరాలవ్యాధి పీడిస్తోంది. ఈ పరిస్థితులకు తోడు కుటుంబ బాగోగులు చూసుకునే అల్లుడు తీవ్ర అనారోగ్యానికి గురవడం ఆ తల్లి, కూతురును ఆందోళనకు గురిచేసింది. దీంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో వెలుగుచూసింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. గౌరారం గ్రామానికి చెందిన వెల్దుర్తి మంజునాథ్ హెయిర్‌కటింగ్ సెలూన్ నిర్వహిస్తున్నాడు. అతని భార్య కవిత (32) పుట్టుకతోనే వికలాంగురాలు. వారికి నయనిక(13), అక్షయ్(10) అనే ఇద్దరు పిల్లలున్నారు. ఇల్లరికం కావడంతో మంజునాథ్ అత్త భారతమ్మ(65) వికలాంగురాలైన కూతురుకు అన్నీతానై చేదోడుగా నిలుస్తున్నది. ఈ క్రమంలో కవిత ఆరోగ్యం దెబ్బతిని తల్లి సాయంగా నిలిస్తే తప్ప అడుగేయలేని పరిస్థితికి చేరింది. కూతురును కంటికి రెప్పలా చూసుకుంటున్న తల్లి భారతమ్మ కొంత కాలం నుంచి నరాల వ్యాధితో బాధపడుతోంది. మరో పక్క కవిత భర్త మంజునాథ్ నెల రోజుల నుంచి జాండిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 7న చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లాడు. పరిస్థితి విషమించి అతనికి ఏమైనా జరిగితే తమను చూసుకునే వారెవరని భవిష్యత్‌పై బెంగ, తల్లీకూతుళ్లను ఆత్మహత్య వైపు నడిపించింది. దీంతో గురువారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం తెల్లవారినా తల్లి, అమ్మమ్మ లేవకపోవడంతో పిల్లలు ఇరుగుపొరుగువారికి చెప్పారు. వారు చూసి తల్లీకూతుళ్లు ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. భార్య, అత్త మృతివార్త తెలిసి గ్రామం చేరుకున్న మంజునాథ్ బోరుమన్నాడు. మంజునాథ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్..

- పల్టీకొట్టిన వాహనం
- పలువురు పిల్లలకు స్వల్ప గాయాలు
- డ్రైవర్‌పై కేసు నమోదు

జైపూర్: డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం.. స్కూల్ పిల్లలను ప్రమాదంలోకి నెట్టింది. కళ్లు మూసి తెరిచేలోగా టాటా ఏస్ వాహనం పల్టీకొట్టింది. పిల్లల అరుపులు, కేకలు విని సమీపంలోని వారు వచ్చి బయటకు తీయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ గ్రామం వద్ద శుక్రవారం ఉదయం 8 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్వ గ్రామానికి చెందిన 20 మంది, రసూల్‌పల్లి గ్రామానికి చెందిన నలుగురు పిల్లలు శ్రీరాంపూర్ ఆర్కే–6 కాలనీలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. వీరంతా నర్వ గ్రామానికి చెందిన దూట రాజ్‌కుమార్ వాహనంలో స్కూల్‌కు వెళ్తుంటారు. శుక్రవారం రాజ్‌కుమార్ తన ఇద్దరు పిల్లలతోపాటు మరో 20 మంది పిల్లలను వాహనంలో స్కూల్‌కు తీసుకెళ్తుండగా.. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల వాహనం అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి వెళ్లి పల్టీ కొట్టింది. దీంతో పిల్లలు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న గొర్లకాపరులు అక్కడికి చేరుకుని డ్రైవర్‌తో పాటు పిల్లలను కాపాడారు. విషయం తెలియడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్షర, అఖిల్, ఆధ్యశ్రీ, రోహన్, శ్రీయాన్, శ్రీరామ్‌చరణ్, శ్రీమహానంత్, రాజశ్రీ, ఆదిత్రి, ప్రియాన్స్, రుచి, రిష్విత్, రిషివర్ధన్‌లకు స్వల్ప గాయాలు కాగా మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్ తెలిపారు.


నర్వ వద్ద బోల్తాకొట్టిన వాహనం

సీసా పగలగొట్టి.. గొంతులో పొడిచి..

ఆపై బండరాయితో మోదీ అన్నను కిరాతకంగా చంపిన తమ్ముడు

- హత్య దృశ్యాల వీడియో వైరల్
- మెదక్ జిల్లాలో ఘటన

కొల్చారం(నర్సాపూర్): సొంత అన్ననే తమ్ముడు కిరాతకంగా హతమార్చిన ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... వసురాంతండాకు చెందిన రామావత్ మంత్యా (48)కు తండా పక్కనే పొలం ఉంది. ఇతని సొంత తమ్ముడు మోహన్ కూడా ఇదే తండాలో నివాసం ఉంటున్నాడు. గత యాసంగి సీజన్‌లో మోహన్ ట్రాక్టర్‌తో మంత్యా తన పొలాన్ని దున్నించాడు. కిరాయి డబ్బు చెల్లించలేదు. ఈ విషయమై అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మోహన్ ఇంట్లో తరచూ కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలవుతుండటం, నెల క్రితం అతడి మనవరాలు అనారోగ్యంతో చనిపోయింది. అన్న మంత్యా మంత్రాలు చేయడం కారణంగానే ఇలా జరిగిందని భావించాడు. రెండు రోజుల క్రితం పొలం దున్నడానికి అదే తండాకు చెందిన భిక్షపతి ట్రాక్టర్‌ను మంత్యా మాట్లాడాడు. విషయం తెలుసుకున్న మోహన్ తన డబ్బులు ఇవ్వకుండా ఎవరూ పొలం దున్నేది లేదంటూ గొడవపడ్డాడు. ఉదయం కల్లు దుకాణంలో మోహన్, భిక్షపతి కల్లు తాగారు. దున్నకం విషయమై మాట్లాడాలంటూ భిక్షపతి మంత్యాకు ఫోన్ చేయగా అక్కడకు వచ్చాడు. డబ్బుల విషయమై అన్నదమ్ముల మధ్య మాటామాట పెరిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న మోహన్ పక్కనే ఉన్న కల్లు సీసాను పగలగొట్టి మంత్యా గొంతులో ఇతర శరీర భాగాల్లో విచక్షణారహితంగా పొడిచాడు. ఆపై బండరాయితో తలపై, మర్మాంగాలపై మోదాడు. చేతి రుమాలుతో మెడకు బిగించి నేలపై తలను కొట్టి, కొద్ది దూరం వరకు ఈడ్చుకెళ్లాడు. విషయం తెలుసుకున్న మంత్యా భార్య లక్ష్మి, కుమారుడు ఘటనా స్థలానికి చేరుకొని రక్తపు మడుగులో ఉన్న మంత్యాను కొల్చారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు తెలిపారు. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి వచ్చారు. నిందితుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు. ఈ ఘటన మొత్తాన్ని కల్లు దుకాణంలో ఉన్న కొందరు ఫోన్‌లో చిత్రీకరిస్తూ నిలుచున్నారే తప్ప ఘోరాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కల్తీ కల్లు ఘటనలో 9కి చేరిన మృతులు

- శుక్రవారం గాంధీలో గంగారాం అనే బాధితుడు మృతి
- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న 61 మంది
- నిమ్స్‌లో 9 మందికి డయాలసిస్
- ప్రధాన నిందితుడు కూన సత్యంగౌడ్ అరెస్టు
- బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్ సస్పెండ్

సాక్షి, హైదరాబాద్/ లక్డీకాపూల్/కూకట్‌పల్లి/బాలానగర్: కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృతుల సంఖ్య 9కి చేరింది. వివిధ ఆస్పత్రుల్లో 61 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. వీరిలో 9 మందికి డయాలసిస్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చాకలి పెద్ద గంగారాం (70) మృతి చెందాడు. నిమ్స్‌లో 34 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 11 మంది ఆరోగ్యం కుదుటపడగా.. మరో 12 మందిని వైద్యులు నిరంతర పర్యవేక్షణలో పెట్టారు. 9 మందికి డయాలసిస్ చేస్తున్నారు. మరో ఇద్దరికి ముందు నుంచే కిడ్నీ సమస్యలు ఉన్నట్టు గుర్తించి డయాలసిస్ అందిస్తున్నారు. వీరందరికి పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న ట్లు నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 19 మంది బాధితులకు చికిత్స కొనసాగుతోంది. అలాగే ఈఎస్ఐ ఆస్పత్రిలో ఒకరు, ప్రైవేట్ ఆస్పత్రిలో మరో ఏడుగురు బాధితులకు చికిత్స అందిస్తున్నారు. హైదరాబాద్‌లోని 5 కల్లు కాంపౌండ్‌ల నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు నమూనాలు సేకరించి పరీక్షల నిమి త్తం నారాయణగూడ ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపించారు.

ప్రధాన నిందితుడి అరెస్టు

కల్తీ కల్లు కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న కల్లు కాంపౌండ్ నిర్వాహకుడు, కాంగ్రెస్ నేత కూన సత్యం గౌడ్‌ను బాలానగర్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఎక్సైజ్ పోలీసులు నలుగురిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. కూన సత్యం గౌడ్ అరెస్టుతో ఆ సంఖ్య ఐదుకు చేరింది. కల్తీ కల్లు ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్‌ను శుక్రవారం సస్పెండ్ చేశారు. కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ యాదయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎక్సైజ్ అధికారులు శుక్రవారం కూకట్‌పల్లిలోని శంషీగూడ, హైదర్‌నగర్, భాగ్యనగర్, సర్దార్ పటేల్‌నగర్, సాయిచరణ్ కాలనీల్లోని కల్లు దుకాణాలను సీజ్‌చేశారు.

కల్లులో ఏం కలిపారు?

కూకట్‌పల్లిలో 9 మంది మరణానికి కారణమైన కల్లులో దుకాణాల నిర్వాహకులు ఏం కలిపారన్నదానిపై ఎక్సైజ్ శాఖ దృష్టి పెట్టింది. సాధారణంగా మత్తు, రుచి కోసం క్లోరల్ హైడ్రేట్, ఆల్ప్రాజోలం, డైజోఫామ్ లాంటి రసాయనాలు కలుపుతుంటారు. అవి కాకుండా హెచ్ఎంటీ హిల్స్, ఎస్పీ నగర్, హైదర్‌నగర్ కల్లు కాంపౌండ్లకు వచ్చిన కల్లులో ఏదైనా ప్రమాదకరమైన రసాయనం కలిసిందా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ కాంపౌండ్ల నుంచి సేకరించిన శాంపిళ్లను నారాయణగూడ ల్యాబ్‌తోపాటు స్టేట్ ఫుడ్ లేబొరేటరీ, ఎఫ్ఎస్ఎల్, ఎఫ్ఎస్ఎస్ఐ లాంటి ల్యాబ్‌ల్లోనూ పరీక్షిస్తున్నారు. ఈ పరీక్షల నివేదికలు వస్తేగానీ ఎలాంటి రసాయనాలతో కల్లు తయారు చేశారన్నది తేలదని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఉన్న మొత్తం 4,697 కల్లు డిపోల నుంచి శాంపిళ్లు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది.

బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ చరిత్రాత్మక నిర్ణయం

- జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడం చారిత్రాత్మక నిర్ణయమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. ఆయన శుక్రవారం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్ బయట విలేకరులతో మాట్లాడారు. ఆర్డినెన్స్‌ను తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

రెండు రోజుల్లో రెండోసారి..!

భూకంపంతో మళ్లీ వణికిన ఢిల్లీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం మరోసారి భూమి కంపించింది. రాత్రి 7.49 గంటల సమయంలో ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.7గా నమోదైంది. జజ్జర్‌కు ఈశాన్యంగా 10 కిలోమీటర్ల దూరంలో ఈ భూకంపం కేంద్రీకృతమై ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ(ఎన్‌సీఎస్) తెలిపింది. దీని ప్రభావంతో రొహతక్, ఫరీదాబాద్, కురుక్షేత్ర, గురుగ్రామ్, ఘజియాబాద్, నోయిడాల్లోని పలు ప్రాంతాల్లో ప్రకంపనలను జనం చవిచూశారు. గురువారం సైతం జజ్జర్‌కు సమీపంలో రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రతతో భూకంపం సంభవించడం తెల్సిందే. వరుసగా భూమి కంపించడంపై సోషల్ మీడియా వేదికలపై జనం ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో రెండు భూకంపాలా..ఏం జరుగుతోంది? అంటూ గురుగ్రామ్‌కు చెందిన ఓ వ్యక్తి ఎక్స్‌లో ఆందోళన చెందారు. 'మరో రోజు..మరో భూకంపం. ఢిల్లీని భూకంపం మరోసారి కుదిపేసింది. వారంలో రెండోసారి! టెక్టోనిక్ ప్లేట్లకు ఏమయింది? ఢిల్లీ వాసులు నిజంగా షేకవుతున్నారు..!' అని మరొకరు వ్యాఖ్యానించారు.

ఒక్క సాక్ష్యమైనా ఉందా?

విదేశీ మీడియాకు అజిత్ దోవల్ సవాల్

- ఆపరేషన్ సిందూర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- భారత్‌కు నష్టం జరిగినట్లు నిరూపించగలరా?
- కనీసం ఒక్క ఫొటో అయినా చూపించగలరా?
- పాక్‌పై దాడులు చేసి వస్తుండగా గాజు ముక్క కూడా పగిలిపోలేదని స్పష్టీకరణ


చెన్నై: ఆపరేషన్ సిందూర్ విషయంలో విదేశీ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మండిపడ్డారు. ఈ ఆపరేషన్‌లో భారత్‌కు నష్టం వాటిల్లినట్లు కనీసం ఒక్క ఫొటో అయినా చూపించగలరా? కనీసం ఒక గాజు ముక్క అయినా పగిలినట్లు నిరూపించగలరా? అని సవాల్ విసిరారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల భరతం పట్టడానికి భారత వైమానిక దళం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ భారత్‌కు గర్వించదగ్గ ఘట్టమని అభివర్ణించారు. ఈ ఆపరేషన్‌లో భారత్ సైతం భారీగా నష్టపోయిందంటూ అంతర్జాతీయ మీడియాలో వస్తున్న కథనాలను ఆయన తీవ్రంగా ఖండించారు. తమిళనాడు రాజధాని చెన్నైలో శుక్రవారం ఐఐటీ–మద్రాసు 62వ స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి అజిత్ దోవల్ ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) భూభాగంలో తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఒక్క టార్గెట్ కూడా గురి తప్పలేదని స్పష్టంచేశారు. ఎవరు(ఉగ్రవాదులు) దాక్కున్నారో తమకు తెలుసని, మే 7వ తేదీన కేవలం 23 నిమిషాల్లో తొమ్మిది శిబిరాలు నేలమట్టం అయిపోయాయని పేర్కొన్నారు. సరిహద్దుకు దూరంగా సరిగ్గా ఉగ్రవాద శిబిరాలపైనే దాడి చేశామని తెలిపారు.

అవన్నీ పాకిస్తాన్ ఫొటోలే..

"పాకిస్తాన్‌లో 13 ఎయిర్‌బేస్‌లు ధ్వంసమైనట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. మే 10వ తేదీకి ముందురోజు, తర్వాతి రోజు ఫొటోలను ప్రచురించింది. అవి పాకిస్తాన్‌లోని సర్గోధా, రహీంయార్‌ఖాన్, చాక్లాలా ప్రాంతాలకు సంబంధించిన చిత్రాలే. వాటిలో భారత్‌కు సంబంధించిన ఫొటో ఒక్కటైనా ఉందా? అలాంటప్పుడు భారత్‌కు నష్టం జరిగిందని ఎలా అంటారు? పాకిస్తాన్ సైన్యం ఇండియాకు వ్యతిరేకంగా అది చేసింది, ఇది చేసింది అంటూ అంతర్జాతీయ మీడియా చెబుతున్నదాంట్లో ఎలాంటి వాస్తవం లేదు. ఇండియాకు నష్టం జరిగినట్లు ఒక్క సాక్ష్యం ఉన్నా చూపించాలి. పాకిస్తాన్‌పై దాడులు చేసి వెనక్కి వస్తుండగా ఒక్క గాజు ముక్క కూడా పగిలిపోలేదు. పాక్ ప్రయోగించిన క్షిపణులను మన గగనతల రక్షణ వ్యవస్థ మధ్యలోనే కూల్చివేసింది. ఆపరేషన్ సిందూర్‌లో దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృత స్థాయిలో ఉపయోగించినందుకు గర్వపడుతున్నాం. అత్యంత కచ్చితత్వంతో కూడిన దాడులు చేయగలమని ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం నిరూపించింది. మన సైన్యం శక్తి ఏమిటో ప్రపంచానికి తెలిసొచ్చింది'' అని అజిత్ దోవల్ వివరించారు.

ఏఐ ఒక గేమ్ చేంజర్

యుద్ధ తంత్రానికి టెక్నాలజీ అనుసంధానించడం చాలా కీలకమని అజిత్ దోవల్ చెప్పారు. మన అవసరాలకు తగ్గట్టుగా దేశీయంగానే టెక్నాలజీని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ క్షిపణులు, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కంట్రోల్, కమాండ్ సిస్టమ్ ఉపయోగించామని, ఇవి దేశీయంగానే అభివృద్ధి చేసుకున్నవేనని గుర్తుచేశారు. కృత్రిమ మేధ(ఏఐ) ఒక గేమ్‌చేంజర్ అని తెలియజేశారు. దానిని కేంద్ర బిందువుగా చేసుకోవాలన్నారు.



ఈసీకి అన్ని అధికారాలెందుకు?

పార్లమెంటరీ కమిటీతో మాజీ సీజేఐలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జేఎస్ ఖేహర్, డీవై చంద్రచూడ్‌లు శుక్రవారం జమిలి ఎన్నికల బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీతో సమావేశమయ్యారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించడం లేదని వారు పేర్కొన్నారు. అదే సమయంలో, ప్రతిపాదిత చట్టంలో ఎన్నికల సంఘానికి మరిన్ని విస్తృత అధికారాలను కల్పించడాన్ని వారు ప్రశ్నించారు. దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రయాణంలో పలు పరిణామాలను గుర్తు చేస్తూ పలు సూచనలను వారు అందజేశారు. బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వంలోని జాయింట్ పార్లమెంటరీ కమిటీ బిల్లుపై పలువురు న్యాయ నిపుణులు, న్యాయ నిర్ణేతల అభిప్రాయాలను తీసుకుంటోంది. కాగా, ఈ కమిటీతో మాజీ సీజేఐలు యూయూ లలిత్, రంజన్ గొగోయ్‌లు ఇప్పటికే సమావేశమయ్యారు.

అమెరికాను హడలెత్తిస్తున్న ఈగ



న్యూ వరల్డ్ స్క్రూవార్మ్.. అగ్రరాజ్యం అమెరికాకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఈగ. ముఖ్యంగా పాడి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ఈ ఎగిరే జీవుల సంతతిని నియంత్రించడానికి ఏకంగా ప్రభుత్వమే రంగంలోకి దిగింది. ఆడ ఈగల్లో సంతానోత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీయడానికి స్టెరిలైజ్ చేసిన మగ ఈగలను వదలడానికి ఏర్పాట్లు చేస్తోంది. న్యూ వరల్డ్ స్క్రూవార్మ్‌ను సైన్స్ పరిభాషలో కొష్లియోమియా హోమినివోరెక్స్ అంటారు. ఇవి ప్రధానంగా పరాన్న జీవులు. అంటే ఆవులు, గేదెలు, గుర్రాలు, గొర్రెల వంటి జంతువులపై ఆవాసం ఏర్పర్చుకుంటాయి. వాటి శరీరంపై గాయాలు చేసి, మాంసాన్ని భక్షిస్తాయి. దాంతో ఆయా జంతువులకు ప్రాణాపాయం సంభవిస్తుంది. అమెరికాతోపాటు దక్షిణ అమెరికా దేశాల్లో ఈగలు పెద్ద సమస్యగా మారిపోయాయి. 2023 నుంచి సెంట్రల్ అమెరికాలో వీటి వ్యాప్తి పెరిగిపోయింది. పనామా, కోస్టారికా, నికరాగ్వా, హోండూరస్, గ్వాటెమాలా, ఎల్‌సాల్వెడార్ తదితర దేశాల్లో ఎన్నో కేసులు నమోదయ్యాయి. ఈగలు గత ఏడాది దక్షిణ మెక్సికోకు చేరుకున్నాయి. అటునుంచి అమెరికా దక్షిణ సరిహద్దు ప్రాంతాలకు వ్యాప్తి చెందాయి. వీటి దెబ్బకు అమెరికా–మెక్సికో సరిహద్దుల్లో పశువుల వ్యాపార కేంద్రాలు మూసివేయాల్సి వచ్చింది. మెక్సికో నుంచి పశువుల దిగుమతి నిలిపివేశారు. పాలు ఇచ్చే ఆవులు, గేదెలు మరణిస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. 2023 నుంచి ఇప్పటివరకు 35,000 న్యూవరల్డ్ స్క్రూవార్మ్ ఇన్ఫెక్షన్ కేసులు నమోదయ్యాయి. నమోదు కానివి మరెన్నో ఉన్నాయి.

ఎలా నియంత్రిస్తారు?

స్క్రూవార్మ్ ఈగలను అరికట్టడానికి పెద్ద తతంగమే ఉంటుంది. వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి అన్నట్లుగా ఈగలను ఈగలతోనే నియంత్రిస్తారు. మగ ఈగలను సేకరించి, ప్రయోగశాలలో స్టెరిలైజ్ చేస్తారు. ఇలాంటి కోట్లాది మగ ఈగలను హెలికాప్టర్ల ద్వారా ప్రభావిత ప్రాంతాల్లో వదులుతారు. ఇవి ఆడ ఈగలతో జతకడతాయి. దాంతో ఆడ ఈగల్లో సంతానోత్పత్తి సామర్థ్యం క్షీణిస్తుంది. అవి గుడ్లు పెట్టలేవు. ఫలితంగా సంతానోత్పత్తి తగ్గిపోతోంది. కొన్ని దశాబ్దాలుగా ఇదే వ్యూహం అమలు చేస్తున్నారు. అయితే, అమెరికాలో స్టెరిలైజేషన్ కేంద్రం ప్రస్తుతం ఒక్కటే ఉన్నట్లు తెలుస్తోంది. మరికొన్ని కేంద్రాలు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని అమెరికా చట్టసభ సభ్యులు జూన్ 17న ప్రభుత్వానికి లేఖ రాశారు. అమెరికా వ్యవసాయ శాఖ వెంటనే స్పందించింది. 'ఫ్లై ఫ్యాక్టరీ' ప్రారంభిస్తామని ప్రకటించింది. టెక్సాస్–మెక్సికో సరిహద్దుల్లో ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిసింది. పశువుల రక్తమాంసాలు రుచి మరిగిన ప్రాణాంతక ఈగలను అంతం చేయడం చెప్పినంత సులువు కాదు. ఇది చాలా వ్యయప్రయాసలతో కూడిన ప్రక్రియ. మెక్సికోలో ఈగల లార్వాల ఉనికిని గుర్తించడానికి జాగిలాలు ఉపయోగిస్తున్నారు. ఇవి వాసన ద్వారా లార్వాలను పసిగడతాయి. ఇందుకోసం జాగిలాలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మనుషులకు ముప్పు స్వల్పమే

పూర్తిగా ఎదిగిన స్క్రూవార్మ్ పశువులపై గాయాలున్న చోట వందల సంఖ్యలో గుడ్లు పెడుతుంది. గుడ్ల నుంచి బయటకు వచ్చిన లార్వాలు అక్కడే మాంసం తింటూ ఎదుగుతాయి. పశువుల పుండే వాటికి ఆవాసం. రెక్కలొచ్చిన తర్వాత ఎగిరిపోతాయి. మరో పశువుపై వాలి సంతతిని వృద్ధి చేస్తాయి. అమెరికాలో ఇలాంటి ఈగల బెడద ఇదే మొదటిసారి కాదు. 1960, 1970వ దశకంలో విపరీతంగా బాధించాయి. అప్పట్లో పాడి పరిశ్రమకు భారీగా నష్టం వాటిల్లింది. మగ ఈగల ద్వారా అతికష్టంమీద, ఎంతో ఖర్చుతో వీటిని నియంత్రించగలిగారు. స్క్రూవార్మ్‌లు మృత పశువుల కంటే బతికి ఉన్న పశువులపై ఉండడానికే ఇష్టపడతాయి. ఇంట్లో పెంచుకొనే శునకాలు, పిల్లులకు కూడా ఇవి వ్యాప్తి చెందుతాయి. మనుషులకు కూడా ముప్పు ఉన్నప్పటికీ అది చాలా స్వల్పమే.



ఐఎస్‌ఎస్‌లో సహచర వ్యోమగాములతో కలిసి విందు ఆరగిస్తున్న శుభాంశు

హల్వాదే హవా

సహచరులతో పంచుకున్న శుభాంశు
రుచికి ఫిదా అయిపోయిన ఆస్ట్రోనాట్లు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లో రెండు వారాలుగా ఎటు చూసినా భారతీయతే ఉట్టిపడుతోంది. తన కుశాగ్రబుద్ధి, మానసిక స్థైర్యం, పైలట్ నైపుణ్యాలతో ఇప్పటికే యాగ్జియం–4 మిషన్‌లోని సహచరులను అబ్బురపరిచిన భారత వ్యోమగామి, వాయుసేన గ్రూప్‌కెప్టెన్ శుభాంశు శుక్లా తాజాగా భారతీయ రుచులతో వారితోపాటు ఐఎస్‌ఎస్‌లోని మిగతా సహచరుల మనసు కూడా దోచుకున్నారు! తనతో పాటు ఐఎస్‌ఎస్‌లోకి వెంట తీసుకెళ్లిన క్యారెట్ హల్వాను వారితో పంచుకున్నారు. రెండు వారాలుగా ఊపిరి సలపని పనులతో తలమునకలుగా ఉన్న వ్యోమగాములంతా శుక్రవారం ఆటవిడుపుగా, సరదా సరదాగా గడిపారు. చివరగా భోజనంలోకి నచ్చిన రుచులను తనివితీరా ఆస్వాదించారు. రొయ్యల వేపుడు స్టార్టర్‌తో మొదలుపెట్టి చవులూరించే చికెన్ వంటకాల దాకా పలురకాలను ఆరగించారు. చివర్లో శుభాంశు వడ్డించిన క్యారెట్ హల్వా, పెసరపప్పు హల్వా విందుకే హైలైట్‌గా నిలిచాయి. ఇంతటి రుచి ఇంతకు ముందెన్నడూ ఎరగమంటూ సహచరులంతా ఆయన్ను మెచ్చుకున్నారు. హల్వాను జీవితంలో మర్చిపోలేనని వ్యోమగామి జానీ కిమ్ చెప్పుకొచ్చారు. రుచిలో తేడా రాకుండా దీర్ఘకాలం పాటు నిల్వ ఉండేలా ఆ మిఠాయిలను ఇస్రో, డీఆర్‌డీవో శుభాంశు కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేశాయి.

శుభాంశును అలా కాపాడుకున్నాం: ఇస్రో చీఫ్

రాకేశ్ శర్మ తర్వాత 41 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అంతరిక్షంలో అడుగుపెట్టిన, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లోకి ప్రవేశించిన తొలి భారతీయునిగా శుభాంశు పేరు కొద్ది వారాలుగా దేశమంతటా మార్మోగిపోతోంది. యువతతో పాటు దేశంలోని బాల బాలికలంతా ఆయనను ఓ హీరోగా, తమ స్ఫూర్తిప్రదాతగా చూస్తున్నారు. ఇస్రో అప్రమత్తంగా వ్యవహరించబట్టి సరిపోయింది గానీ, లేదంటే ఇన్ని ఘనతలకు కారణమైన యాగ్జియం అంతరిక్ష యాత్ర ఆరంభమైన కాసేపటికే విషాదాంతమయ్యేదే! ఒళ్లు గగుర్పొడిచే ఈ వాస్తవాన్ని స్వయానా ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ బయట పెట్టారు. జూన్ ప్రథమార్ధంలో యాత్ర పలుమార్లు వాయిదా పడటం తెలిసిందే. ఆ క్రమంలో జూన్ 11 నాటి ప్రయోగాన్ని ఒక్క రోజు ముందు ఇస్రో పట్టుబట్టి ఆపించింది. ''ఫాల్కన్‌–9 రాకెట్ తాలూకు బూస్టర్‌లో లీకేజీలను, పలు పగుళ్లను ఇస్రో బృందం జూన్ 10 సాయంత్రం గమనించింది. అప్పటికప్పుడు చర్చించి ప్రయోగాన్ని ఆపాలని నా సారథ్యంలోని ఇస్రో బృందం నిర్ణయం తీసుకుంది. లేదంటే యాగ్జియం–4 ప్రయోగం విషాదాంతం అయ్యేదేమో! అలాకాకుండా చూడటం ద్వారా మన శుభాంశును, యాగ్జి యం మిషన్‌ను కాపాడుకున్నాం''అని తాజా గా ఓ కార్యక్రమంలో ఇస్రో చీఫ్ వివరించారు. ''మేం మరీ అతిగా స్పందిస్తున్నామని స్పేస్ ఎక్స్ బృందం తొలుత నిందించింది. అయినా మేం పట్టుబట్టి ప్రయోగాన్ని నిలిపేయించాం. ఫాల్కన్ రాకెట్లో పగుళ్లను మర్నాడు స్పేస్ ఎక్స్ ఇంజనీర్లు ధ్రువీకరించారు''అని తెలిపారు. నాసా, ఇస్రో సంయుక్త ప్రాజెక్టైన యాగ్జియం–4 జూన్ 26న విజయవంతంగా అంతరిక్షంలోకి దూసుకెళ్లడం తెలిసిందే.

కుటుంబంతో శుభాంశు మాటామంతి

శుభాంశు శుక్రవారం లఖ్‌నవూలోని తన కుటుంబసభ్యులతో మాట్లాడారు. తను ప్రయోగాలన్నీ దిగ్విజయంగా పూర్తి చేసి సురక్షితంగా తిరిగి రావాలని ఆయన తల్లిదండ్రులు ఆశా, శంభూదయాళ్ శుక్లా ఆకాంక్షించారు. ''ఐఎస్‌ఎస్‌లో తను ఎక్కడ పని చేసేదీ, రోజంతా ఎలా గడిపేదీ శుభాంశు మాకు పూసగుచ్చినట్టు చూపించాడు. అంతరిక్షం నుంచి భూమిని చూసేందుకు రెండు కళ్లూ చాలవట! తన విధులను పూర్తిగా ఆస్వాది స్తుండటం మాకెంతో సంతోషాన్నిస్తోంది''అని చెప్పుకొచ్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎన్నికల హైజాక్‌కు బీజేపీ కుట్ర

మహారాష్ట్రలో చేసినట్లే బిహార్‌లో చేయాలనుకుంటున్నారు ● కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజం

భువనేశ్వర్: గత ఏడాది మహారాష్ట్రలో చేసినట్లుగానే ఈసారి బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలను హైజాక్ చేయడానికి బీజేపీ కుట్రలు సాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం ఎన్నికల విధులు పక్కనపెట్టి కేవలం బీజేపీ ప్రయోజనాల కోసం పని చేస్తోందని మండిపడ్డారు. శుక్రవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంవిధాన్ బచావో సమావేశ్'లో రాహుల్ గాంధీ ప్రసంగించారు. బిహార్ శాసనసభ ఎన్నికలను కబ్జా చేయకుండా బీజేపీని అడ్డుకోవాలని విపక్ష 'ఇండియా' కూటమి నిర్ణయించినట్లు చెప్పారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడి అధికారంలోకి వచ్చిందని, బిహార్‌లో ఆ పార్టీ ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. మహారాష్ట్రలో ఎన్నికల ముందు కొత్తగా కోటి మంది ఓటర్లను ఎందుకు చేర్పించారో చెప్పాలని డిమాండ్ చేస్తే ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు.

బడా బాబుల సేవలో మోదీ సర్కారు

భారత రాజ్యాంగంపై బీజేపీ దాడి చేస్తోందని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. కేవలం ఐదారుగురు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తోందని, పేదలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. ఈ దేశం కేవలం అదానీ, అంబానీ లేదా బిలియనీర్లకే చెందుతుందని రాజ్యాంగంలో ఎక్కడా రాసిపెట్టి లేదని స్పష్టంచేశారు. పేదలను కొట్టి పెద్దలకు పెట్టడమే మోదీ సర్కారు విధానంగా మారిపోయిందని దుయ్యబట్టారు. ఒడిశాలోని పూరీలో అదానీ కుటుంబం కోసం జగన్నాథ రథయాత్ర మధ్యలో నిలిపేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒడిశాలో వనరులను బడా కంపెనీలకు ఇష్టానుసారంగా కట్టబెడుతున్నారని చెప్పారు. జల్, జంగిల్, జమీన్(నీరు, అడవులు, భూమి) గిరిజనులకే చెందాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల సర్వం కోల్పోతున్న బాధితులకు అండగా ఉంటామని, వారి తరఫున పోరాటం సాగిస్తామని హామీ ఇచ్చారు.



లౌకికవాదం, సామ్యవాదం తొలగించే కుట్ర: ఖర్గే

రాజ్యాంగం నుంచి లౌకికవాదం, సామ్యవాదం అనే పదాలు తొలగించేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. 'సంవిధాన్ బచావో సమావేశ్'లో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో గిరిజనులు, దళితులు, మహిళలు, యువతకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు 47 కేంద్రాల్లో రోజ్‌గార్ మేళా

51 వేల మందికి నియామక పత్రాలను అందజేయనున్న ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో భాగంగా కేంద్రం నేడు 16వ రోజ్‌గార్ మేళాను నిర్వహించనుంది. శనివారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 51 వేల మందికి నియామక పత్రాలు అందజేయనున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన 15 రోజ్‌గార్ మేళాల ద్వారా 10 లక్షల మందికి పైగా నియామక పత్రాలను ప్రభుత్వం అందజేసింది. రైల్వే, హోం, తపాలా, ఆరోగ్యం కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు తదితర ముఖ్యమైన శాఖల్లో ఈ నియామకాలను చేపట్టింది. శనివారం నియామక పత్రాల పంపిణీ అనంతరం ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తారు.

గతి తప్పిన వాతావరణం

- గత నెలలో అసాధారణ పరిణామాలు
- హిమాలయాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు
- మధ్య భారతదేశంలో సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు
- కాలుష్యం, వాతావరణ మార్పులతో పెనుముప్పు

న్యూఢిల్లీ: దేశంలో సాధారణం కంటే భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత నెలలో ఈ పరిణామం స్పష్టంగా కనిపించినట్లు వాతావరణ నిపుణులు తెలిపారు. చల్లగా ఉండే హిమాలయ ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, వేడిగా ఉండే మధ్య భారతదేశంలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గత 30 ఏళ్ల సగటు ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకొని, ఈ అంశం నిగ్గుతేల్చారు. 'వాటర్ టవర్ ఆఫ్ ఆసియా'గా భావించే హిమాలయాలు వేగంగా వేడెక్కుతున్నాయి. హిమానీనదాలు కరిగిపోతున్నాయి. మంచు చరియలు విరిగిపడుతున్నాయి. మొత్తంగా వాతావరణమే గతి తప్పుతోంది. ఎడారి రాష్ట్రమైన రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో గత నెలలో 30 ఏళ్ల సగటు ఉష్ణోగ్రత కంటే 2 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత నమోదయ్యింది. అలాగే 78 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం రికార్డయ్యింది. దేశ రాజధాని ఢిల్లీలోనూ సాధారణం కంటే 1.3 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత నమోదు కాగా, 36 మిల్లీమీటర్ల అధిక వర్షం కురిసింది. హిమాలయాల్లో భాగమైన సిమ్లాలో 0.6 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత, 186 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదయ్యాయి. జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఇక్కడ ఏకంగా 2.6 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత, 55 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం రికార్డు కావడం గమనార్హం.

ఎందుకీ పరిస్థితి?

వాతావరణం గతి తప్పడానికి కాలుష్యం, వాతావరణ మార్పులే ప్రధాన కారణం అని చెప్పొచ్చు. హిమాలయాలు వేగంగా కరిగిపోతే దిగువ ప్రాంతాలకు పెనుముప్పు తప్పదు. వరదలు ముంచెత్తుతాయి. ఆస్తి నష్టం, ప్రాణనష్టం సంభవిస్తుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ ఈ ముప్పు కూడా అదే స్థాయిలో పెరిగిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హిమాలయాలు, టిబెట్ పీఠభూమిలో అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. 2015 నుంచి 2024 దాకా హిమాలయాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలే రికార్డయ్యాయి. 2016 నుంచి ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. 2024లో 19.99 డిగ్రీల వార్షిక సగటు ఉష్ణోగ్రత నమోదు కాగా, ఇది సాధారణం కంటే 0.77 డిగ్రీలు అధికం. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం చూస్తే.. 1901 నుంచి 2020 దాకా ఇండియాలో సగటు ఉష్ణోగ్రత 0.62 డిగ్రీలు పెరిగింది. గరిష్ట ఉష్ణోగ్రత 0.99 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 0.24 డిగ్రీలు పెరిగాయి. అడవులను నరికివేయడం, పట్టణీకరణ, శిలాజ ఇంధనాల వాడకం ఇలాగే పెరిగిపోతే రానున్న రోజుల్లో పరిస్థితి మరింత భయానకంగా మారుతుందనడంలో సందేహం లేదు.



గ్రామీణప్రాంతాల్లో కుల కట్టుబాట్ల పేరుతో జరుగుతున్న దారుణాలకు తాజా ఉదాహరణ. ఓ యువతి, తన మేనత్త కుమారుడిని ఇష్టపడి పెళ్లి చేసుకుంది. గ్రామంలోని కట్టుబాట్లకు ఇది విరుద్ధమట. దీనిపై పంచాయితీ చేసిన కుల పెద్దలు నవదంపతులకు అమానవీయమైన శిక్ష విధించారు. వారిద్దరినీ నాగలికి కట్టారు. ఊరంతా చూస్తుండగానే పశువులకు మాదిరిగా దున్నించారు. అవమాన భారానికి తోడు, నాగలి లాగలేక వారెంతో క్షోభకు గురయ్యారు. లాగలేమంటూ నవవరుడు కింద కూలబడినా వదల్లేదు. జనం చూస్తుండిపోయారే గానీ ఇదేం అనాగరికమని ఒక్కరూ అభ్యంతరం చెప్పలేదు. అనంతరం, నిషిద్ధ పెళ్లిపై ఆ దంపతులతో శుద్ధి పూజలు చేయించారు. ఒడిశాలోని రాయగఢ జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న ఈ ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దీనిపై మానవహక్కుల సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. తాలిబన్ తరహా శిక్షలేంటంటూ పలువురు నెటిజన్లు విమర్శించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలుండాల్సిందేనన్నారు. దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

–నేషనల్ డెస్క్, సాక్షి

సాక్షి
హైదరాబాద్
శనివారం । 12 । జూలై । 2025



కొనసాగింపు సరే..
బైక్ ట్యాక్సీలను కొసాగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మోటారు వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు-2025ను విడుదల చేసింది. -8లో



జనం జతగా.. జానపదం..
కొంత కాలంగా తెలుగు ఫోక్ సాంగ్స్ సరికొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. తెలుగు జానపదాలు సోషల్ మీడియాలో టాప్ ట్రెండింగ్‌లో ఉన్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.0/24.0
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

రోడ్డు సేఫ్టీ డ్రైవ్

వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు



సాక్షి, సిటీబ్యూరో: ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఇందులో భాగంగా బీటీ, సీసీ రోడ్లపై గుంతల పూడ్చివేత, క్యాచ్‌పిట్స్ మరమ్మతులు, క్యాచ్‌పిట్స్ మూతల మార్పిడి, సెంట్రల్ మీడియన్లలో స్వల్ప మరమ్మతులు వంటి పనులు చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ (మెయింటనెన్స్) సహదేవ్ రత్నాకర్ తెలిపారు. ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసులు, ఇతర విభాగాల అధికారులతో కలిసి జీహెచ్‌ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని ప్రాంతాలను తనిఖీలు చేస్తున్నారని పేర్కొన్నారు. తనిఖీల వివరాలను సంబంధిత సూపరింటెండింగ్ ఇంజినీర్లు, జోనల్ కమిషనర్లకు తెలియజేస్తున్నారన్నారు. ఇటీవలి వర్షాలకు దాదాపు 7,500 పాట్‌హోల్స్ పడ్డట్టు గుర్తించి వాటన్నింటినీ పూడ్చే పనులు చేస్తున్నామన్నారు. ఎర్రంమంజిల్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న పనుల్ని పరిశీలించినట్లు రత్నాకర్ తెలిపారు. వారం రోజుల్లో పనులన్నీ పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

‘ధర్మవంత్’ సజావుగా సాగేలా చూడండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ధర్మవంత్ హిందీ విద్యా సంస్థ పాఠశాల గేటు తెరిచి, కార్యకలాపాలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తమ సంస్థను కూల్చివేసేందుకు జాఫర్‌బిన్ అబ్దుల్లా, ఫైసల్ బల్లాల్ ప్రయత్నిస్తున్నారని, వెంటనే వీరిని అడ్డుకునేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ధర్మవంత్ హిందీ పాఠశాల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. పిటిషనర్, అనధికారిక ప్రతివాదులకు లీజు డీడ్ వివాదం ఉందన్నారు. ఇది సివిల్ వివాదమైనందున సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలని ఆదేశించారు. ఈ తీర్పును పాఠశాల అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం విచారణ చేపట్టింది. 2024, మే 24 అనధికారిక ప్రతివాదులు జాఫర్ బిన్ అబ్దుల్లా, ఫైసల్ బల్లాల్ ప్రాంగణంలోకి చొరబడి పాఠశాలకు తీవ్ర నష్టం కలిగించారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ప్రధాన ద్వారానికి చట్టవిరుద్ధంగా తాళం వేసి పాఠశాల కార్యకలాపాలు నిలిపివేశారన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలోని విద్యా సంస్థలు నిరంతరాయంగా పని చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించడం, తాళం వేయడం అవాస్తవమని అనధికారిక ప్రతివాదుల తరఫు న్యాయవాది వాదించారు. విచారణను ఆగస్టు 12కు ధర్మాసనం వాయిదా వేసింది.



శిఖర పూజ చేస్తున్న సీవీ ఆనంద్, ఆర్‌వీ కర్ణన్ తదితరులు



ధ్వజారోహణ

లాల్‌దర్వాజా బోనాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ 117వ బోనాల ఉత్సవాలు శుక్రవారం వేద పండితుల మంత్రోచ్చారణలు, డప్పు వాయిద్యాల నడుమ లాంఛనంగా ప్రారంభమయ్యాయి. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ముఖ్య అతిథులుగా హాజరై శిఖర పూజ, ధ్వజారోహణం గావించి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఉదయం గణపతి హోమం, సప్తశతి పారాయణం, ప్రవచనాలు, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎ.మాణిక్ ప్రభు గౌడ్ కుటుంబ సభ్యులు తొలిబోనం సమర్పించారు. సాయంత్రం కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్ కలశస్థాపన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, డీసీపీ (ఎస్.బి) అపూర్వ రావు, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, దక్షిణ మండలం అదనపు డీసీపీ మహ్మద్ మజీద్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు, ఛత్రినాక ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ వర్మ, కమిటీ కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు పోసాని సతీష్ ముదిరాజ్, బత్తుల అమర్‌నాథ్ యాదవ్, మాజీ చైర్మన్లు కె.వెంకటేష్, జె.లక్ష్మీనారాయణ గౌడ్, సి.రాజ్‌కుమార్ యాదవ్, కె.విష్ణుగౌడ్, శీర రాజ్‌కుమార్, ప్రతినిధులు ఎ.చంద్రకుమార్, జి.హరీష్ గౌడ్, సుంకరి శేషు నారాయణ, అత్తిలి యశ్వంత్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. కాగా.. లాల్ దర్వాజా బోనాల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోనాల ఉత్సవాలకు అన్ని సదుపాయాలు కల్పించినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు.



అమ్మవారి ఆలయంలో పూజలు

నాడు వద్దని.. నేడు ముద్దని..

ఎఫ్‌ఓబీలున్నది ఎందుకోసం..

- ప్రజల కోసమా.. ప్రకటనల కోసమా ?
- ఆదాయం కోసం ప్రైవేటుకు నిర్వహణ
- రంగం సిద్ధం చేసిన జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో

వాహనాల రద్దీ ప్రాంతంలో పాదచారులు రోడ్లు దాటేందుకు పడుతున్న అవస్థలు, ప్రమాదాలు తగ్గించేందుకు జీహెచ్‌ఎంసీ ఎన్నో ఫుట్ ఓవ ర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ)లను ఏర్పాటు చేసింది. కానీ.. నిర్వహణ లేక చాలావాటిని ప్రజలు వినియోగించుకోవడం లేదు. ప్రజలు వినియోగించుకునేలా వా టిని నిర్వహించాల్సిందిపోయి.. నిర్వహణ పేరు చెప్పి ప్రకటనల ద్వారా ఆదాయం పొందేందుకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు బల్దియా సిద్ధమైంది.

ప్రైవేట్‌కు లాభాలు కట్టబెట్టేందుకేనా..

- ఎఫ్‌ఓబీలపై ప్రచార ప్రకటనలున్నందున వాహనదారుల చూపు అటు మళ్లి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిసి ఎఫ్‌ఓబీలపై ప్రకటనలే వద్దని గత ప్రభుత్వం నిర్ణయించింది. అందుకే జీహెచ్‌ఎంసీ నిధులతోనే కొత్త ఎఫ్‌ఓబీల నిర్మాణాలు చేశారు. అంతకుముందు.. పీపీపీ పద్ధతిలో ప్రకటనల ద్వారా ఆదాయం పొందాలనుకునే ప్రైవేటు ఏజెన్సీలే వాటిని నిర్మించేవి. ప్రకటనల ఆదాయం కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యమని తలంచి ఎఫ్‌ఓబీలపై ప్రకటనలే లేకుండా చేశారు. జీహెచ్‌ఎంసీ బడ్జెట్, ఆదాయం, ఖర్చుల వంటివి లెక్కలోకి తీసుకుంటే జీహెచ్‌ఎంసీయే వాటిని నిర్వహించవచ్చు.
- అలా కాకుండా మెయింటైన్, ఆపరేట్, అడ్వర్టైజ్, ట్రాన్స్‌ఫర్ (మోట్) పేరిట ప్రైవేటు ఏజెన్సీలకు నిర్వహణ అప్పగించి, వ్యాపార ప్రకటనల ద్వారా అవి ఆదాయం పొందేందుకు వేసిన ప్రణాళికకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఏరియాను బట్టి,రద్దీని బట్టి ఒక్కో ఫ్లై ఓవర్ నిర్వహణ కోసం ఏడాదికి కనీస ధరను నిర్ణయించింది. తద్వారా 23 ఎఫ్‌ఓబీల నుంచి కనీసం రూ.13.59 కోట్లు రానున్నట్లు పేర్కొంది. ప్రజలకు సదుపాయం కల్పించేందుకు జీహెచ్‌ఎంసీ చేస్తున్న వ్యయంలో ఇది లెక్కలోదే కాదు. అయినా ప్రైవేటుకు లాభాలు కట్టబెట్టేందుకే ఇందుకు సిద్ధమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజా భద్రత గాలికి..

- గత ప్రభుత్వం ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని రద్దుచేసిన ప్రకటనలను ప్రజాభద్రతను సైతం గాలికొదిలి ప్రైవేటుకు కట్టబెట్టాలనుకోవడం ఎవరి ప్రయోజనాల కోసమనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిర్వహణ నిబంధనల కింద స్టెయిర్‌కేసులు, లైటింగ్, ఎలివేటర్లు, ఎస్కలేటర్లు తదితరమైనవి ఉండాలని, సేఫ్టీ సెక్యూరిటీ కల్పించాలని, పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. కాగితాల్లో తప్ప ఈ నిబంధనలు పట్టించుకోరని.. ప్రకటనల కోసమే ఉన్న బస్‌షెల్టర్లను చూస్తే తెలుస్తుంది. షరతులు ఉల్లంఘిస్తే పెనాల్టీలని పేర్కొన్నా.. ఎన్ని బస్‌షెల్టర్ల ఉల్లంఘనలకు ఇప్పటి వరకు ఎంత మొత్తం వసూలు చేశారో అధికారులకే తెలియాలి.
- ప్రకటనలకిచ్చే స్థలం సైజు కూడా ఎంతో స్పష్టం చేయలేదు. గ్రౌండ్ లెవెల్ నుంచి 15 అడుగుల ఎత్తులో అని తప్ప ఎంత సైజులో ప్రకటనలకివ్వవచ్చో పేర్కొనలేదు. అంటే ఎఫ్‌ఓబీ పొడవునా భారీ ప్రకటనలకిచ్చుకోవచ్చన్న మాట. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఎఫ్‌ఓబీలను జీహెచ్‌ఎంసీ ఎందుకు నిర్వహించదో అధికారులే స్పష్టం చేయాలి. జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తే కొందరికి ఉపాధి కూడా లభిస్తుంది. వద్దనుకున్న ప్రకటనలు కావాలనుకుంటున్నందున.. వాటి ద్వారా వచ్చే ఆదాయమేదో జీహెచ్‌ఎంసీకి వస్తుంది. అలా కాకుండా ‘మోట్’ ఆలోచన ఎవరి కోసమో?!

మోట్ ద్వారా ప్రకటనలకు ఇవ్వాలనుకుంటున్న ఎఫ్‌ఓబీలు ..

లిఫ్టులు, ఎస్కలేటర్లు ఉన్నవి

- దీప్తిశ్రీనగర్, షాపూర్‌నగర్, పంజగుట్ట సిగ్నల్, ఈఎస్ఐ హాస్పిటల్, మల్కం చెరువు, సంగీత్ జంక్షన్, జేపీ సినిమాస్ (చందానగర్), బంజారాహిల్స్ రోడ్ నెంబర్-1.



లిఫ్టులున్నవి

- ఐడీపీఎల్ కాలనీ, మూసాపేట, ఎన్‌ఎండీసీ, ఎంఏయూడీ భవనం పక్కన, సెయింట్ ఆన్స్ (తార్నాక), నేరేడ్‌మెట్ క్రాస్‌రోడ్స్, ఏజీ కాలేజ్ గేట్, కాటేదాన్, బాబానగర్, నేషనల్ పోలీస్ అకాడమీ, ఏఎస్‌రావు నగర్, రంగారెడ్డి కోర్టు, రామంతాపూర్, ఎన్టీఆర్ గార్డెన్స్, చందనా బ్రదర్స్ (దిల్‌సుఖ్‌నగర్).

రాజాసింగ్‌కు బీజేపీ రాంరాం

హైకమాండ్‌తో కీచులాట

- నేరుగా విమర్శనాస్త్రాలు
- రాజీనామాను ఆమోదించిన అధిష్టానం
- సిటీలో ఒకే ఒక బీజేపీ ఎమ్మెల్యే



సాక్షి, సిటీబ్యూరో/అబిడ్స్: బీజేపీలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ శకం ముగిసింది. ఆయన రాజీనామాను ఆ పార్టీ అధిష్టానం ఆమోదించింది. అధిష్టానంపై తనదైన శైలిలో విమర్శనాస్త్రాలను సంధించడంతో కొంత కాలంగా కంటిలో నలుసులా తయారయ్యారని సొంత పార్టీ నేతలు భావించారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని వ్యతిరేకిస్తూ వచ్చిన ఎమ్మెల్యే తాజాగా నూతన అధ్యక్షుడి ఎన్నికనూ విడిచిపెట్టలేదు. రాంచందర్‌రావుపైనా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా పార్టీ సభ్యత్వానికి గత నెల 30న రాజీనామా చేశారు. పార్టీ అధిష్టానం దిగి వస్తుంది, బుజ్జగిస్తుందని భావించిన రాజాసింగ్‌కు నేతలు షాకిచ్చారు. ఆయన రాజీనామాను అధిష్టానం ఆమోదించారు. దీంతో జీహెచ్‌ఎంసీలో బీజేపీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ దూరమవడంతో ఆ పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా పోయింది.

హిందుత్వంతో దూకుడు..

రాజాసింగ్ హిందుత్వ వాదిగా గుర్తింపు తెచ్చుకున్నారు. వివాదాస్పద వ్యాఖ్యలకు ఆయన పెట్టింది పేరు. దూకుడుగా ప్రవర్తించి కొన్ని సందర్భాల్లో వివాదాల్లో చిక్కుకోవడం అలవాటుగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని రాజాసింగ్‌ను ఏడాదికిపైగా బీజేపీ అధిష్టానం సస్పెండ్ చేసింది. ఎన్నికల ముందు పార్టీలోకి తీసుకుని, టికెట్ ఇచ్చింది. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని వ్యతిరేకించిన రాజాసింగ్.. పార్టీ కార్యకలాపాల్లోనూ పెద్దగా కనిపించింది లేదు. రాష్ట్ర నాయకత్వంపై విమర్శలు చేసినా కొంత వరకు ఓపికపడుతూ వచ్చారు. ఆ మధ్య ఎంపీ బండి సంజయ్ వచ్చి సముదాయించిన తర్వాత కాస్త తగ్గిన రాజాసింగ్.. తాజాగా రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావును ప్రకటించడంతో మరోసారి నోటికి పని చెప్పారు. ఈ సమయంలో పార్టీ అగ్రనాయకులను సైతం విడిచిపెట్టలేదు. దీంతో రాజాసింగ్ వ్యవహారాన్ని పార్టీ సీనియర్‌గా తీసుకుంది. ఆయన రాజీనామా చేసినా గోషామహల్ నియోజకవర్గ పరిధిలో ఐదుగురు బీజేపీ కార్పొరేటర్లలో ఏ ఒక్కరూ ఆయన వెంటరాలేదు.

భవిష్యత్ ప్రయాణం ఎటు?

పార్టీ సభ్యత్వానికి చేసిన రాజీనామాను అధిష్టానం ఆమోదించడంతో తదుపరి రాజాసింగ్ దారి ఎటు అని చర్చ సాగుతోంది. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీ కార్పొరేటర్‌గా ఉన్న రాజాసింగ్ వరుసగా మూడుసార్లు బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు బీజేపీకి దూరం కావడంతో ఆయన మద్దతుదారులు, కొంతమంది అనుచరులు మాత్రం ఆయన శివసేన పార్టీలో చేరుతారని చెబుతున్నారు. మరోవైపు హిందూ ఎజెండాపై కొత్త పార్టీ పెడతారనే వాదనలు వినిపిస్తున్నాయి.

రోజ్‌గార్‌మేళా కింద ఎంపికైన ఉద్యోగులకు నేడు నియామక పత్రాలు

సాక్షి, సిటీబ్యూరో: రోజ్‌గార్ మేళా కింద ఎంపికైన కేంద్ర ప్రభుత్వ నూతన ఉద్యోగులకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శనివారం నియామక పత్రాలను అందజేయనున్నారు. సికింద్రాబాద్ బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో నిర్వహించనున్న రోజ్‌గార్‌మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా వివిధ ప్రభుత్వ విభాగాలు, సంస్థల్లో కొత్తగా ఎంపికైన యువతకు నియామక లేఖలను అందజేస్తారు.

ఫోర్జరీ సంతకాలు.. నకిలీ సర్టిఫికెట్లు



ప్రభుత్వ డెంటల్ కళాశాల సిబ్బంది దందా

- బదిలీ చేసి చేతులు దులుపుకొన్న అధికారులు
- తదుపరి చర్యలపై మీనమేషాలు
- కళాశాలలో మాయమైన రికార్డులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ప్రభుత్వ డెంటల్ కళాశాలలో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ సర్టిఫికెట్ల దందా నడుస్తోంది. వ్యక్తులు కళాశాలకు రాకున్నా వచ్చినట్లు హాజరు పట్టికను ట్యాంపర్ చేసి.. ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది సంతకాలను ఫోర్జరీ చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. వీటన్నింటికీ కలిపి గంపగుత్తగా కొంత పెద్దమొత్తంలో డబ్బులు మాట్లాడుకుని ఈ తతంగం నడిపిస్తున్నారు. ఫలితంగా ఎలాంటి విద్యార్హత లేకుండానే అనర్హులైన వ్యక్తులు పట్టాలు పొందుతున్నారు. విద్యా సంవత్సరంలో ఉన్న సీట్లు కంటే ఎక్కువ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వెలుగులోకి వచ్చిందిలా..

విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. ఓ ప్రైవేటు డెంటల్ కళాశాలకు చెందిన విద్యార్థి కోర్సు పూర్తయిన తర్వాత అఫ్జల్‌గంజ్‌లోని ప్రభుత్వ డెంటల్ కళాశాలలో 9 నెలల ఇంటర్న్‌షిప్ కోసం వచ్చాడు. సదరు వ్యక్తి తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా, అడ్డదారులు తొక్కాడు. కళాశాలకు రాకుండానే హాజరు, సర్టిఫికెట్ల జారీ తదితర విషయాలను మేనేజ్ చేయడానికి దారులు వెతికాడు. ఈ క్రమంలో నకిలీల ముఠాతో స్నేహం ఏర్పడింది. అంతా అనుకున్నట్లు పథకం ప్రకారం కళాశాలకు రాకున్నా హాజరు వేసి.. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. నిర్ణీత కాలంలో అన్నీ సాఫీగా సాగిపోయాయి. అయితే రెండు కళాశాలల మధ్య ఉన్న అనుబంధం, ఉన్నతాధికారుల నిజాయితీని ఇక్కడ గుర్తించాలి. ప్రైవేటు కళాశాల అధికారులు నకిలీ సర్టిఫికెట్‌ను గుర్తించారు. అనుమానంతో ప్రభుత్వ దంత వైద్య కళాశాల అధికారులను సంప్రదించారు. దీంతో ఆ సర్టిఫికెట్లు తాము జారీ చేసినవి కావని, ఆ సంతకాలు తమవి కావని చెప్పడంతో నకిలీ వ్యవహారం బయటపడింది. దీంతో డెంటల్ కళాశాలలో ఇద్దరు, ఎంజేఎస్ కేన్సర్ ఆసుపత్రిలో ఒక ఉద్యోగిని డీఎంఈకి బదిలీ చేశారు.



సీట్లు 20.. సర్టిఫికెట్లు 50

డెంటల్ హైజెనిక్ అండ్ టెక్నికల్ వ్యక్తులకు విదేశాల్లో గిరాకీ ఉంది. మంచి వేతనాలు వస్తున్నాయి. దీంతో నకిలీల ముఠా కన్ను ఈ సర్టిఫికెట్లపై పడింది. ప్రభుత్వ డెంటల్ కళాశాలలో హైజెనిక్ అండ్ టెక్నికల్ కోర్సు కొన్నేళ్ల క్రితం నిలిపివేశారు. అయినా.. దీనికి సంబంధించిన సర్టిఫికెట్లు మాత్రం కళాశాల నుంచి బయటకు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.90 వేల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. ఏడాదికి కేవలం 20 సీట్లు మాత్రమే ఉన్న కళాశాలలో 50 నుంచి 70 సర్టిఫికెట్లు ఇస్తున్నారని ప్రచారం సాగుతోంది. విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల రిజిస్టరు, ఎంత మంది పాస్ అయ్యారు. ఎన్ని సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామన్న కనీస సమాచారం కళాశాలలో లేదని సిబ్బందే చెప్పడం గమనార్హం.

కాసుల కక్కుర్తి.. చర్యలకు వెనుకాడి

సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తి అడ్డంగా దొరికిపోయాడు. నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు అధికారికంగా రుజువైంది. అయినా సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు వెనుకాడుతున్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్) కొంత మంది ఉన్నతాధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని, అక్కడ పెద్ద మొత్తంలో ముడుపులు సమర్పించుకోవడంతో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోకుండా బదిలీ చేసి చేతులు (డీహెచ్ ఆఫీస్‌కి అటాచ్) దులిపేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అటు రెండు డెంటల్ కళాశాలల యాజమాన్యాలు, ఇటు సంతకం ఫోర్జరీ అయిన వ్యక్తి సైతం పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం ఇక్కడ గమనార్హం.

రూకల్లోతు కష్టాల్లో మెట్రో!

ఈ ఏడాది నష్టాలు రూ.625.88 కోట్లు

- మొత్తం నష్టాలు రూ.6,605.51 కోట్లు
- 4.5 లక్షలకు తగ్గిన ప్రయాణికులు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రోరైల్ రూకల్లోతు కష్టాల్లో కూరుకుపోతోంది. ఆదినుంచీ నష్టాల బాటలోనే పరుగులు తీస్తోంది. ఇప్పటివరకు మొత్తం రూ.6,605.51 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.625.88 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఎల్ అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ వార్షిక నివేదికలో వెల్లడించింది. తాజా గణాంకాల ప్రకారం ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ మొత్తం ఆదాయం రూ.1,108.54 కోట్లు కాగా, మొత్తం నిర్వహణ ఖర్చు రూ.1,734.45 కోట్ల వరకు నమోదైంది. పన్ను చెల్లింపుల అనంతరం వార్షిక నష్టం రూ.625.88 కోట్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. నగరంలో నాగోల్-రాయదుర్గం, ఎల్‌బీనగర్-మియాపూర్, ఎంజీబీఎస్-జేబీఎస్‌ల మధ్య ప్రస్తుతం 57 రైళ్లు నడుస్తున్నాయి. రోజుకు వెయ్యి ట్రిప్పులకు పైగా తిరుగుతున్నాయి. గతేడాది వరకు సుమారు 4.85 లక్షల మందికి పైగా ప్రయాణం చేశారు. ఈ ఏడాది మెట్రో ప్రయాణికుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం రోజుకు 4.5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నాగోల్- రాయదుర్గం, ఎల్‌బీ నగర్- మియాపూర్ రూట్లలోనే ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉన్నాయి.

న్యూడ్‌కాల్స్ స్క్రీన్ షాట్‌లు పంపి..

- కేసు వెనక్కి తీసుకోవాలంటూ మాజీ భార్యకు బెదిరింపులు
- బాధితురాలి ఫిర్యాదు, మాజీ భర్తపై కేసు నమోదు

సనత్‌నగర్: న్యూడ్ కాల్స్‌కు సంబంధించిన స్క్రీన్ షాట్లను చూపి మాజీ భార్యను వేధిస్తున్న వ్యక్తితో పాటు మరో మహిళపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట రసూల్‌పురాకు చెందిన మహిళ (39)కు సయ్యద్ జావేద్ (44)తో 2005లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. జావేద్ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండటంతో బాధితురాలు అతనితో విడాకులు తీసుకుని వేరుగా నివాసం ఉంటుంది. అతడిపై ఆమె పెట్టిన కేసు విచారణలో ఉంది. ఇదిలా ఉండగా గత నెల 26న సయ్యద్ జావేద్ బాధితురాలికి ఫోన్ చేసి ఆమెతో కలిసి ఉంటానని చెప్పాడు. తరచూ ఆమెతో మాట్లాడేవాడు. బాధితురాలు కూడా జావేద్‌ను నమ్మి అతనితో మాట్లాడుతుండేది. ఈ క్రమంలో ఆమెతో బలవంతంగా న్యూడ్‌కాల్స్ మాట్లాడించిన అతను కాల్స్‌కు సంబంధించి స్క్రీన్‌షాట్లను సేవ్ చేసి బాధితురాలి ఇంటి సమీపంలో ఉంటున్న ఓ యువకుడికి పంపాడు. అతను ఈ విషయం బాధితురాలి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె భర్త ఉంటున్న ఇంటికి వెళ్లి అక్కడ ఉన్న షాబానా అనే మహిళను నిలదీసింది. దీంతో జావేద్‌పై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో స్క్రీన్‌షాట్లను అందరికీ పంపతామని బెదిరించారు. దీంతో బాధితురాలు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సయ్యద్ జావేద్‌తో పాటు షబానాపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భర్త వేధింపులు తాళలేక..

- ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య...


సమీనా బేగం (ఫైల్)

మోతీనగర్: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సామల వెంకటరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లాపూర్‌లో నివాసం ఉంటున్న సాదిక్ ఆలి, సమీనా బేగం దంపతులకు ముగ్గురు సంతానం. గత కొన్నేళ్లుగా సాదిక్ ఆలి భార్య సమీనాను వేధిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను ప్రతి రోజూ తాగి వచ్చి భార్యను మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. గురువారం రాత్రి కూడా అతను భార్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపానికి లోనైన సమీనా బేగం శుక్రవారం ఉదయం సీలింగ్ రాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అల్లాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య

చాంద్రాయణగుట్ట: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాబానగర్‌కు చెందిన అజీజ్ అక్తర్(26) ఆటోడ్రైవర్‌గా పని చేసేవాడు. అతనిపై పలు దొంగతనం కేసులు ఉండడంతో కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్‌ను గతంలో ఓపెన్ చేశారు. శుక్రవారం ఉదయం బాలాపూర్ రోడ్డులోని నాలా పక్కన అతడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. చాంద్రాయణగుట్ట ఏసీపీ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ గోపీ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతని మెడ, కడుపు, వీపుపై పదునైన ఆయుధంతో దాడి చేసినట్లుగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగింపు సరే... పర్యవేక్షణ ఎలా..?

బైక్ ట్యాక్సీలను కొనసాగిస్తూ కేంద్రం నిర్ణయం

- ఇప్పటికే అనేక ఉల్లంఘనలకు కేరాఫ్ అడ్రస్‌గా
- అవసరమైన స్థాయిలో లేని కంపెనీల పర్యవేక్షణ
- తీరు మారకుంటే ప్రయాణికుల భద్రత గాల్లో దీపమే



సాక్షి, సిటీబ్యూరో: క్యాబ్‌ల నియంత్రణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం బైక్ ట్యాక్సీలను కొసాగించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మోటారు వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు–2025ని విడుదల చేసింది. బైక్ ట్యాక్సీలు వైట్ నెంబర్ ప్లేట్‌పై పని చేసేందుకు అనుమతి ఇచ్చింది. అయితే ఈ సేవలకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి అనుమతుల విధానం, నియంత్రణ లేదు. కేవలం ఆయా సంస్థల యాప్‌ల ఆధారంగా ఇవి పని చేస్తున్నాయి. బైక్ ట్యాక్సీలను అవసరమైన స్థాయిలో నిర్వాహకులు పర్యవేక్షించలేకపోతున్నారు. ఈ విధానంలో లోపాలను సరిదిద్దకపోతే భవిష్యత్తులో ప్రయాణికుల భద్రతకు పెను సవాల్ ఎదురుకానుందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఎలాంటి 'ప్రత్యేకతలు' అవసరం లేదు...

రాజధానిలో ఆటోలు , ట్యాక్సీలు నడపాలంటే ఆ డ్రైవర్లకు ప్రత్యేక అనుమతులు తప్పనిసరి. కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు బ్యాడ్జ్ తప్పనిసరి. సదరు వాహనాలకు సైతం కచ్చితంగా ఎల్లో నెంబర్ ప్లేట్ రిజిస్ట్రేషన్ ఉండాలి. బైక్ ట్యాక్సీల విషయంలో ఇలాంటి నిబంధనలు ఏవీ ప్రస్తుతం అమలులో లేవు. వైట్ నెంబర్ ప్లేట్లతోనే, సాధారణ డ్రైవింగ్ లైసెన్సులు కలిగిన వారే ఆయా సంస్థల వద్ద యాప్స్ ద్వారా రిజిస్టర్ చేసుకుని బైక్ ట్యాక్సీలు నడిపేస్తున్నారు. రహదారిపై ఉన్న ట్రాఫిక్ పోలీసులకు సైతం క్యాబ్‌ల మాదిరిగా... ఏది బైక్ ట్యాక్సీనో, ఏది సొంత బైకో గుర్తించడం సాధ్యం కాదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సైతం వైట్ ప్లేట్‌కు ఓకే చెప్పేయడం గమనార్హం.

ప్రయాణికుడి భద్రత ఎవరి బాధ్యత?

బైక్‌పై వెనుక కూర్చున్న వ్యక్తి (పిలియన్ రైడర్) సైతం కచ్చితంగా హెల్మెట్ ధరించాల్సిందే. మోటారు వాహనాల చట్టం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో దీనిని కచ్చితంగా అమలు చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం సైబరాబాద్‌లోనూ తప్పనిసరి చేశారు. వాణిజ్య సేవలు అందించేటప్పుడు పిలియన్ రైడర్ బాధ్యత బైక్ రైడర్‌దే అవుతుంది. దీని ప్రకారం చూస్తే బైక్ ట్యాక్సీ డ్రైవర్ వద్ద కచ్చితంగా రెండు హెల్మెట్లు ఉండాలి. ఒకటి తాను ధరించి రెండోది రైడ్ బుక్ చేసుకున్న ప్రయాణికుడికి అందించాలి. అయితే ప్రస్తుతం నగరంలో సంచరిస్తున్న బైక్ ట్యాక్సీ డ్రైవర్లలో ఒక హెల్మెట్ మాత్రమే కనిపిస్తుంటుంది. రెండు హెల్మెట్లు కలిగి ఉండాలంటూ ఈ డ్రైవర్లకు రిజిస్ట్రేషన్ చేసే సంస్థలు చెబుతున్నా అమలు కావడం లేదు. కొన్ని సంస్థలు అందించినవి సైతం డ్రైవర్లు తమ వెంట తీసుకురావట్లేదు.

పత్తాలేని పని గంటల విధానం...

కిరాయికి ప్రయాణికుల్ని చేరవేస్తూ సంచరించే బైక్ ట్యాక్సీలు సైతం కమర్షియల్ వాహనాల కిందికే వస్తాయి. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఈ వాహనాల డ్రైవర్లకు కచ్చితంగా పని గంటలు అమలు కావాల్సిందే. వీటి డ్రైవర్లు రోజుకు గరిష్టంగా పది గంటల (విశ్రాంతితో కలిపి) చొప్పున వారానికి గరిష్టంగా 48 గంటలు మాత్రమే పని చేయాల్సి ఉంటుంది. డ్రైవర్ విధులు నిర్వర్తించే కనీస కాలం ఎనిమిది గంటల్లో కచ్చితంగా రెండు గంటలు విశ్రాంతి తీసుకోవాలి. అయితే బైక్ ట్యాక్సీ నిర్వాహక సంస్థలు పక్కాగా ఇన్ని ట్రిప్పులు వేయాలంటూ డ్రైవర్లకు పరోక్షంగా టార్గెట్లు విధిస్తున్నాయి. దీన్ని పూర్తి చేసిన వారికే ఇన్సెంటివ్స్ ఇస్తున్నాయి. దీంతో ఒక్కో డ్రైవర్ కనిష్టంగా 15 గంటల నుంచి గరిష్టంగా 18 గంటల వరకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఈ టార్గెట్లను తట్టుకోలేక కొందరు డ్రైవర్లు ఈ పని మానుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి.

అక్కడో నెంబరు... ఇక్కడో నెంబరు...

బైక్ ట్యాక్సీల నిర్వహణ సంస్థలు భద్రత ప్రమాణాల్లో భాగంగా తమ డ్రైవర్ల రిజిస్ట్రేషన్‌ను (ఎటాచ్‌మెంట్) పక్కా చేశాయి. ఇలా చేసుకున్న వారి వివరాలన్నీ ఆ సంస్థ వద్ద ఉంటాయి. యాప్స్‌ను వినియోగించి బైక్ ట్యాక్సీని బుక్ చేసుకున్నప్పుడు ప్రయాణికుడికి తాను ఎక్కబోతున్న వాహనం డ్రైవర్ పేరు, నెంబర్‌తో పాటు అతడి రేటింగ్ సైతం కనిపిస్తుంది. ఏ సమయంలో ఎక్కడకు ప్రయాణం చేసినా భద్రంగా గమ్యం చేర్చడానికి ఈ ఏర్పాటు ఉంది. అయితే ఇటీవల కాలంలో నగరంలో బైక్ ట్యాక్సీలుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఒకరు ఉంటే... వాటిని డ్రైవింగ్ చేస్తూ వస్తున్న వారు మరొకరు ఉంటున్నారు. దీన్ని కనిపెట్టడానికి అనువైన క్రాస్ చెకింగ్ మెకానిజం నిర్వాహకుల వద్ద ఉండట్లేదు. ఇటు ట్రాఫిక్ పోలీసులు, అటు ఆర్టీఏ అధికారులు... వీరిలో ఎవరికీ ఈ విషయాలు పట్టట్లేదు.

నగరంలో నేడు

- ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- కొండాపూర్‌లోని మాయా లగ్జరీ కన్వెన్షన్‌లో రాఖీ అండ్ తీజ్ స్పెషల్ పేరిట సూత్రా ఎగ్జిబిషన్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

యూ టర్న్ విషయంలో ఘర్షణ

సోమాలియా విద్యార్థిపై కత్తితో దాడి

గచ్చిబౌలి: బైక్‌పై వెళుతున్న యువకులు యూటర్న్ విషయమై గొడవపడి సోమాలియా విద్యార్థిపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమాలియాకు చెందిన అహ్మద్ హిమాయత్‌నగర్‌లోని ఓ కాలేజీలో బీసీఏ చదువుతున్నాడు. ఈ నెల 8న రాత్రి అతను మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో నివాసం ఉంటున్న తన స్నేహితుడు యూనిస్ అబ్దికరీం హసన్‌తో కలిసి బైక్‌పై ఐటీ కారిడార్‌కు వచ్చారు. నాలెడ్జ్ సిటీలోని ఇషా హోటల్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా వెనకనుంచి రెండు బైక్‌లపై నలుగురు యువకులు వచ్చారు. యూటర్న్ తీసుకునే విషయంలో గొడవ జరగడంతో వారు సోమాలియా విద్యార్థులపై దాడి చేశారు. అంతటితో ఆగకుండా ఓ యువకుడు అహ్మద్ కడుపులో కత్తితో పొడిచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడికి మాదాపూర్‌లోని మెడికోవర్ శస్త్ర చికిత్స చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హ్యుందాయ్ డిజిటల్ ఫ్లోట్ వ్యాన్‌లు ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: భారతదేశంలో మొదటి స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్, అతిపెద్ద ఎగుమతిదారు హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ఇటీవల గ్రామీణ అవుట్‌లెట్‌లలో డిజిటల్ ఫ్లోట్ కార్యకలాపాలను ప్రారంభించింది. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో లోతైన, గణనీయమైన వ్యాప్తి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని డిజిటల్ ఫ్లోట్ కాన్సెప్ట్‌ను ప్రవేశపెట్టారు. హ్యుందాయ్ హ్యాచ్‌బ్యాక్ ఎస్‌యూవీ ఎక్స్టర్, వెన్యూ, గ్రాండ్ ఐ10 నియోస్ వినియోగదారుల ఇంటి వద్దకు నేరుగా రవాణా చేస్తారు. కార్యక్రమాన్ని హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ఆర్ఎస్‌హెచ్ రామ్‌కుమార్ జి, ఆర్‌పిఎస్‌హెచ్ మనోజ్ బాథం తదితరులు హైదరాబాద్ నుంచి డిజిటల్ ఫ్లోట్ వ్యాన్‌లను జెండా ఊపి ప్రారంభించారు. ఇవి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ప్రయాణించనున్నాయని వారు తెలిపారు.

ఆగస్టు 15 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

సాక్షి, సిటీబ్యూరో: భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య(క్రెడాయ్) హైదరాబాద్ ప్రాపర్టీ షో మరోసారి నగరవాసుల ముందుకు రానుంది. నగరవాసుల సొంతింటి కలను సాకారం చేసేందుకు నగరంలో నలువైపులా ఉన్న అన్ని రకాల ప్రాపర్టీలను ప్రదర్శనలో ఉంచనుంది. ఈ ఏడాది 'ఎంచుకోవాల్సింది మీరే' థీమ్ ఆధారంగా ఆగస్టు 15 నుంచి 17 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ ప్రదర్శన ప్రారంభమవుతుంది. ఈ గృహ ప్రదర్శనలో కేవలం రెరా ఆమోదం పొందిన ప్రాజెక్టులనే ప్రదర్శిస్తారు. నగరవ్యాప్తంగా విస్తరించిన అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ప్లాట్లు, వాణిజ్య సముదాయాలు అన్ని రకాల ప్రాపర్టీల వివరాలను ఒకే వేదికగా సందర్శకులకు అందించడమే ఈ స్థిరాస్తి ప్రదర్శన ప్రధాన లక్ష్యమని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్.జైదీప్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో 9 శాతం మందిలో కిడ్నీ సమస్యలు

- నెఫ్రో ప్లస్ సీఈఓ రోహిత్ సింగ్
- మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో సీకేడీపై సర్వే



సాక్షి, సిటీబ్యూరో: మధుమేహం, తరచూ పెయిన్ కిల్లర్స్ వినియోగం, అధిక రక్తపోటు, జీవన శైలి అంశాలు దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (సీకేడీ)లో కీలక పాత్ర పోషిస్తున్నాయని నెఫ్రోప్లస్ సీఈఓ రోహిత్ సింగ్ అన్నారు. మాదాపూర్‌లోని తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి బాధితులు చివరి 3, నాలుగు దశల్లో గుర్తిస్తున్నారని తెలిపారు. వ్యాధిని ముందస్తుగా ఒకటి, రెండు దశల్లో గుర్తిస్తే జీవన నాణ్యతను మెరుగుపరిచే అవకాశం ఉందన్నారు. గత మార్చి 6 నుంచి 11వ తేదీ మధ్య 10,501 మంది సీకేడీ నివారణ చర్యల కోసం సైన్‌అప్ చేశారని, 5 వేల మందికిపైగా సీరం క్రియేటిన్ పరీక్షలు చేయించుకున్నట్లు వివరించారు. తెలంగాణలోని హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో నమూనాలు సేకరించి పరీక్షించగా 9 శాతం మంది కిడ్నీ బాధితులు ఉన్నట్లు తేలిందన్నారు. వీరిలో 27 శాతం మంది నిత్యం పెయిన్ కిల్లర్స్ వినియోగిస్తున్నారని, 23 శాతం మందిలో బీపీ, 22 శాతం మందిలో మధుమేహం, 21 శాతం మంది పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు తెలిపారు.కిడ్నీల పట్ల అశ్రద్ధ చేస్తే డయాలసిస్, అవయువం మార్పిడికి కష్ట, నష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో నెప్రో ప్లస్ సహ వ్యవస్థాపకుడు కమల్ డి షా, చీఫ్ ఆఫ్‌స్టాఫ్ రిషబ్‌లు ఉన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు

స్కూల్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చైతన్య


బస్సు చక్రాల మధ్య ఇరుక్కుపోయిన సైకిల్

కుషాయిగూడ: సైకిల్‌పై స్కూల్‌కు వెళ్తున్న బాలుడిని స్కూల్ బస్సు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం కుషాయిగూడలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. వివరాలిలా ఉన్నాయి. సుభాష్‌చంద్రనగర్ కాలనీకి చెందిన చైతన్య శ్రీ సూర్య గోపిశెట్టి (11) అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. రోజూ అతను సైకిల్‌పై స్కూల్‌కు వెళ్తాడు. శుక్రవారం ఉదయం సైకిల్‌పై స్కూల్‌కు వెళుతున్న చైతన్యను వెనుక నుంచి వేగంగా వచ్చిన అదే స్కూల్‌కు చెందిన బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో సైకిల్ బస్సు ముందు చక్రాల మధ్య చిక్కుకోగా శ్రీచైతన్య పక్కకు పడిపోయాడు. అతడి కుడిచేయి, చాతి మీదుగా బస్సు వెనుక చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటికి తేరుకోని బస్సు డ్రైవర్ సుమారు 150 మీటర్ల వరకు సైకిల్‌ను లాక్కెళ్లాడు. స్థానికుల కేకలతో తేరుకున్న డ్రైవర్ బస్సును వదిలి పారిపోయాడు. గాయపడిన చైతన్య శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయం తెలిసిన స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు స్కూల్ వద్దకు చేరుకుని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. స్కూల్ ఎదుట బైఠాయించి విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ నర్సింహను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

గంజాయి తరలిస్తున్న వడ్డీవ్యాపారి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో సొంత భవనాలు, రూ.లక్షల్లో వడ్డీల వ్యాపారం, అయినా ఇంకా సంపాదించాలనే దురాశతో గంజాయి వ్యాపారం మొదలెట్టిన వడ్డీవ్యాపారి సికింద్రాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ సిబ్బందికి గంజాయితో సహా నారాయణగూడ వైఎంసీఏ వద్ద పట్టుబడ్డాడు. ఒరిస్సా నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా బైక్‌పై తీసుకువెళ్లి సరఫరా చేస్తున్న చెన్న రమేష్ గౌడ్ డీటీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. మల్లాపూర్ నుంచి కోఠి వైపు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై గంజాయిని తీసుకెళ్తుండగా సీఐ సావిత్రి సౌజన్య, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, ఖలీం, కానిస్టేబుళ్లు రాజు, రవి, శిల్ప, సునీత, రమేష్, తదితరులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి గంజాయితోపాటు రూ. 20వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

హైటెన్షన్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్


టవర్ మధ్యలో కూర్చున్న యువకుడు

గచ్చిబౌలి: మతిస్థిమితం లేని ఓ యువకుడు హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన సంఘటన శుక్రవారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగ్నంగా తిరుగుతున్న ఓ యువకుడు శుక్రవారం ఉదయం రాఘవేంద్ర కాలనీలో రోడ్డులో హైటెన్షన్ టవర్ ఎక్కాడు. దీనిని గుర్తించిన వాహనదారులు, స్థానికులు అతడిని కిందికు దిగాలని కేకలు వేసినా వినకుండా టవర్ చివరి వరకు ఎక్కాడు. దీంతో వారు డయల్ 100కు సమాచారం అందించడంతో గచ్చిబౌలి పెట్రోల్ మొబైల్ సిబ్బంది అక్కడికి చేరుకుని కిందకు దిగాలని అతడికి నచ్చజెప్పారు. దాదాపు గంట సేపటి తర్వాత అతను కిందకు దిగి రావడంతో దుస్తులు వేయించి పీఎస్‌కు తీసుకెళ్లారు. అతడిని రాజరాజేశ్వరీనగర్‌లో నివాసం ఉంటున్న ఆకాష్ ఆర్కంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- ఒడిశానుంచి పూణేకు అక్రమ రవాణా
- ఓ మహిళతో సహా అరుగురి అరెస్ట్
- 108 కేజీల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్


స్వాధీనం చేసుకున్న గంజాయి

రాజేంద్రనగర్: ప్రజలు ఇచ్చిన సమాచారంతో అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ప్రజలు ఇచ్చిన సమాచారంతో గురువారం సాయంత్రం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు ఐదుగురు యువకులు, ఒక మహిళను అదుపులోకి తీసుకుని వారి నుంచి 108 కేజీల గంజాయి, రెండు కార్లు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఒడిశాకు చెందిన పవన్ దీప్ స్థానికంగా గంజాయి వ్యాపారం చేసేవాడన్నారు. పూణేకు చెందిన ప్రశాంత్ అతడిని కలిసి గంజాయి కావాలని కోరడంతో పవన్ దీప్ అందుకు అంగీకరించారు. దీంతో ప్రశాంత్‌తో పాటు లతా గణేష్ జాదవ్, సచిన్, రోషన్, రసూల్ బాబురావు, గౌరవ్ రెండు కార్లలో ఒడిశా వెళ్లారు. అక్కడ పవన్ దీప్ నుంచి 108 కేజీల గంజాయిని కొనుగోలు చేసి రెండు కిలోల చొప్పున ప్యాక్ చేసుకుని కారు సీట్లు, కారు వెనుక భాగంతో పాటు డోర్లలో దాచి పూణేకు బయలుదేరారు. గురువారం సాయంత్రం వీరు ప్రయాణిస్తున్న కార్లు రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో అక్కడికి వచ్చి స్విఫ్ట్, ఇగ్నీష్ కార్లను సోదా చేయగా గంజాయిని గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 108 కేజీల గంజాయి, రూ.9,700 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు ప్రశాంత్ 2022లో గంజాయి రవాణా చేస్తూ కోదాడ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడన్నారు. నిందితులందరూ పూణేకు చెందిన వారని, వారిలో బాబురావు, గౌరవ్, ప్రశాంత్‌లపై పలు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. గంజాయి విక్రయించిన ఒడిశాకు చెందిన పవన్ దీప్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రాజేంద్రనగర్ ఎస్ఓటీ, పోలీసులు, అదనపు డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

తెలంగాణకు జాతీయ అవార్డు రావడం ఇదే తొలిసారి

టీఎస్‌హెచ్‌డీ రీజినల్ హెడ్ డా. అరుణ్‌కుమార్



శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలెప్‌మెంట్(టీఎస్‌హెచ్‌డీ) రీజినల్ హెడ్ ఆఫీసర్ డా. ఎస్.అరుణ్‌కుమార్ చేనేతకారులకు చేసిన సేవలు మరువలేనివని చేనేత కళాకారులు, చేనేత ఎగ్జిబిషన్ నిర్వాహకులు అన్నారు. రాష్ట్ర చేనేత సేవా కేంద్రంతో పాటు ప్రొడక్ట్ అండ్ డిజైన్ డెవలెప్‌మెంట్ విభాగంలో అధికారిని జాతీయ పురస్కారానికి కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ ఎంపిక చేసిందన్నారు. ఆగస్టు 7న ఢిల్లీలో నిర్వహించే 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయి అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకోనున్నారు. ఈ సందర్భంగా చేనేత కళాకారులు, ఎగ్జిబిషన్ నిర్వాహకులు శుక్రవారం డాక్టర్ ఎస్.అరుణ్‌కుమార్‌ను కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ విభాగంలో తెలంగాణకు జాతీయ అవార్డు రావడం ఇదే తొలిసారని డా. అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. తమ కేంద్రాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

'ఉపఎన్నికలో నా అభ్యర్థిత్వాన్ని పరిశీలించండి'

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కార్పొరేటర్‌గా పనితనం, ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనుభవం, నిత్యం ప్రజల్లో ఉండే బీసీ నేతగా తనకు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని మంత్రి వివేక్‌ను జూబ్లీహిల్స్ కాంగ్రెస్ సీనియర్ నేత మురళీగౌడ్ కోరారు. ఈ మేరకు తన అభ్యర్థిత్వ పరిశీలనకు శుక్రవారం తన బయో డేటా అందజేశారు. నియోజవర్గంలో 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నానని, కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం తనకుందని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో రాజకీయాలు, సమస్యలు బాగా తెలిసినవాడినని అన్నారు. అందరికీ సుపరిచితుడని, బీసీ నేతగా తనను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



హామీలు మరవడానికి 'ఇది బీఆర్‌ఎస్ కాదు కాంగ్రెస్'

వెంగళరావునగర్: ప్రజలకు ఇచ్చిన మాటలను మరవడానికి ఇది బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర మంత్రులు అన్నారు. వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిల్లో రూ.కోటి పైగా నిధులతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో జరిగిన సమావేశాల్లో మంత్రులు మాట్లాడారు. గతంలో చిన్నపాటి పని జరిగినా కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉండేదన్నారు. దీంతో పనులు సగంలో నిలిచిపోయేవని తెలిపారు. అయితే కాంగ్రెస్ అలా కాదన్నారు. కష్టపడి పని చేసిన ప్రతి కాంట్రాక్టర్‌కు చివరి రూపాయి వరకు అందిస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా శ్రీకృష్ణానగర్ వానాకాలం వచ్చిందంటే కృష్ణానదిలా పొంగి పొర్లుతుందని దానికి త్వరలో అడ్డుకట్ట వేస్తామని హామీ ఇచ్చారు.

◆ త్వరలోనే సదరన్ క్యాంపు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొన్నేళ్లుగా కొత్త రేషన్‌కార్డులను ప్రజలకు ఇవ్వలేదని, ఫ్యామిలీ కార్డులు అన్ని స్కీమ్‌లకు ఉపయోగపడతాయని వాటిని అందజేస్తామన్నారు. పేదలకు గతంలో తాము ఇళ్ల నిర్మాణం కోసం రూ.లక్ష ఇచ్చామని నేడు రూ.5 లక్షలను ఇస్తున్నామని తెలిపారు. కమీషన్ల కోసం బీఆర్‌ఎస్ కొన్నిచోట్ల డబుల్ బెడ్‌రూంలను నిర్మించిందని ఆరోపించారు. అయితే కనీసం పదిశాతం కూడా అర్హులకు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్, శ్రీలతారెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు అజారుద్దీన్, కార్పొరేటర్ దేదీప్య విజయ్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షులు స్వామి, నవీన్‌యాదవ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్, పక్కన మంత్రులు పొన్నం, తుమ్మల, కలెక్టర్ తదితరులు



శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, కలెక్టర్, మేయర్, కార్పొరేటర్ తదితరులు

బీసీ రిజర్వేషన్లపై రాజకీయాలు చేయొద్దు



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

పంజగుట్ట: బీసీ రిజర్వేషన్లను పెంచుతూ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అఖిల పక్ష పార్టీలు బీసీ రిజర్వేషన్లపై రాజకీయం చేయొద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అగ్రకులాల వారు ఎవరైనా బీసీ రిజర్వేషన్లకు సహకరించకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు కోసం మరో మండల్ ఉద్యమం తీసుకొస్తామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం లేక తనకు ఉన్న సర్వ అధికారాలు ఉపయోగించి గత ప్రభుత్వం చేసిన పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించి బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ ఒక ఆర్డినెన్స్ తీసుకొచ్చిందన్నారు. దీనిని గవర్నర్‌తో ఆమోదింపజేసుకుని బీసీ రిజర్వేషన్లు ఖచ్చితంగా 42 శాతం అమలు చేస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. ఇప్పుడు బీసీ రిజర్వేషన్లపై అఖిల పక్ష పార్టీలు రాజకీయం చేయకుండా సహకరించాలని కోరారు. మరో రెండు రోజుల్లో అఖిలపక్షం, అన్ని బీసీ సంఘాలు, న్యాయవాదులు, మేధావులతో ఒక మేధోమథన సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, మహాత్మాజ్యోతిబా పూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్ గౌడ్, ప్రొఫెసర్ భాగయ్య, కనకాల శ్యాం కురుమ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: ప్రతిష్టాత్మక హైలైఫ్ ఎగ్జిబిషన్ సంస్థ హైలైఫ్ బ్రైడ్స్ పేరుతో ఈ నెల 18వ తేదీ నుంచి హెచ్‌ఐసీసీ నోవాటెల్‌లో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో శుక్రవారం జరిగిన సన్నాహక కార్యక్రమంలో సినీ నటి చాందిని భగ్వనానితో పాటు నిరుపమ, ఊర్మిలా చౌహాన్ తదితర మోడల్స్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోయే దుస్తులను, ఆభరణాలను ధరించి హొయలు పోయారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలతో పాటు దుస్తులు, యాక్ససరీస్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు అండగా ఉంటా

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పంజగుట్ట: సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి, తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆగస్టు 13న చలో హైదరాబాద్ వికలాంగుల మహాగర్జనపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. తన జీవితంలో తాను ఎక్కువ సమయం కేటాయించింది ఒకటి ఎస్సీ వర్గీకరణ కోసమైతే.. మరొకటి వికలాంగుల హక్కుల కోసమని అన్నారు. కండరాల క్షీణత (తీవ్ర వైకల్యంతో) బాధపడుతున్న వారికి అండగా ఉండి వారి తరపున పోరాడతానని అన్నారు. వారికి ప్రతినెల ప్రభుత్వం రూ.15వేల పెన్షన్, ఇతర సదుపాయాలు ఇచ్చేలా ముఖ్యమంత్రితో యుద్ధం చేసైనా సాధిద్దామని పిలుపునిచ్చారు. ఈ వ్యాధితో బాధపడుతున్న వారు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3వేల మంది ఉంటారన్నారు. వారికి పింఛన్ ఇస్తే ప్రభుత్వానికి రూ.50కోట్ల ఖర్చు కూడా కాదని అన్నారు. ఇటు హామీ ఇచ్చిన అధికారపక్షం మిన్నకుందని, అటు ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం కూడా బాధ్యతారాహిత్యంగా ఉందన్నారు. అందుకే ఆగస్టు 13వ తేదీన లక్షలాది మంది వికలాంగులు, కండరాల క్షీణత కలిగిన వారితో కలిసి 'చలో హైదరాబాద్'ని ర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలూరి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి శివకుమార్, కత్తుల బాలు, అందె రాంబాబు, జనార్దన్, సతీష్ చంద్ర, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం అంటే ప్రాణాన్ని రక్షించడమే..



రక్తదాన శిబిరంలో ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ

వెంగళరావునగర్: సకాలంలో మనం అందజేసే రక్తం తోటివారి ప్రాణాలను కాపాడగలుగుతుందని యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్ ప్రాంగణంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కమాండెంట్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కమాండెంట్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్తాన్ని దానం చేయాలని సూచించారు. కాగా బెటాలియన్‌కు చెందిన పలువురు సిబ్బంది రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ రాంబాబు, భాస్కర్, కేవీపీ ప్రసాద్, నర్సింహతో పాటుగా ఆర్‌ఐలు, ఏఆర్ ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాలలకు జరిగే అన్యాయంపై ప్రశ్నిస్తా

మంత్రి వివేక్ వెంకటస్వామి



మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్

ఖైరతాబాద్: మాలలు ఐక్యంగా ఉన్నప్పుడే వారికి దక్కాల్సిన హక్కులు దక్కుతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని వాసవీ సేవా కేంద్రంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మాలలకు జరిగే అన్యాయంపై ప్రశ్నిస్తానన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా రోస్టర్ విధానంలో గ్రూప్-3లో మాలలకు జరిగే నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రిజర్వేషన్లు 18శాతం పెంచేలా తనవంతు కృషి చేస్తానన్నారు. మాలల రాజ్యాంగ బద్ధ హక్కుల కోసం మాట్లాడతానని పేర్కొన్నారు.

◆ ఈ సందర్భంగా జి.చెన్నయ్య మాట్లాడుతూ... రోస్టర విధానం అంతా లోపభూయిష్టంగా, కుట్ర పూరితంగా ఉందన్నారు. దీని వల్ల మాల నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని... ఉద్యోగులకు ప్రమోషన్లలో నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రూప్-3లో 26 కులాలకు కేటాయించిన 5శాతం రిజర్వేషన్ కూడా అందకుండా రోస్టర్ విధానాన్ని పెట్టడం దారుణమని అన్నారు. మాలలకు ఒక్క ఉద్యోగం కూడా రాకుండా కుట్ర చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన శాతవాహన యూనివర్సిటీ మరియు అసిస్టెంట్ డెంటల్ ప్రొఫెసర్ పోస్టులే ఇందుకు నిదర్శనమన్నారు.

◆ భవిష్యత్తులో జూలై 28న అన్ని జిల్లాల కలెక్టర్లకు రోస్టర్ విధానాల్లో జరిగే అన్యాయాలపై వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 11న మాల అమరవీరుల సంస్మరణ సభను అన్ని జిల్లా మండల కేంద్రాల్లో నిర్వహించాలని సూచించారు. ఆగస్టు 23న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డా. మంచా నాగమల్లేశ్వరి, రాజు వస్తాద్, బైండ్ల శ్రీనివాస్, విజయభాస్కర్, కర్ణం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంసీల బదిలీ

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ల బదిలీలు పెద్ద ఎత్తున జరిగాయి. ఖైరతాబాద్ సర్కిల్-17 డీసీగా ఉన్న రజినీకాంత్‌రెడ్డిని యూసుఫ్‌గూడ సర్కిల్-19కి డీసీగా బదిలీ చేశారు. మలక్‌పేట డీసీగా ఉన్న జయంత్‌ను ఖైరతాబాద్ సర్కిల్-17కు డీసీగా నియమించారు. సోమవారం సర్కిల్-17 డీసీగా జయంత్, సర్కిల్-19 డీసీగా రజినీకాంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.

జీఓ నం.282ని రద్దు చేయాలి

నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నిరసన

లక్డీకాపూల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 10 గంటల పని దినాన్ని నిరసిస్తూ నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగింది. శుక్రవారం నిమ్స్ మెయిన్ గేట్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిమ్స్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీఓ నం.282ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో జీవో ప్రతులను దహనం చేశారు. సర్కార్ జీవో కార్మికులపై మరింత పనిభారాన్ని మోపే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే జీఓ నం.282ని రద్దు చేయని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేయాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఊర్మిళ, లక్ష్మి ఎలిజిబెతి రాణి, వెంకటేష్ పాల్గొన్నారు.



తుమ్మలబస్తీ, ఆనంద్‌నగర్‌లో హైడ్రా కూల్చివేతలు



పంజగుట్ట: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని తుమ్మలబస్తీ, ఆనంద్‌నగర్ కాలనీల్లో నాలా ఆక్రమణలను శుక్రవారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. గతంలోనే పలుమార్లు పర్యవేక్షించిన అధికారులు శుక్రమారం కొన్ని చోట్ల కూల్చివేతలు చేశారు. బుల్కాపూర్ నాలాలో కొద్దిగా లోనికి జరిగి ప్రహరీ నిర్మాణం చేపట్టిన ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌కు చెందిన గోడను హైడ్రా అధికారులు జేసీబీ సాయంతో కూల్చివేశారు. తుమ్మలబస్తీ, చింతల్‌బస్తీ, ఆనంద్‌నగర్‌లో ఈ నాలా 8 మీటర్లు ఉండాల్సి ఉండగా అది కేవలం 5 మీటర్లకే పరిమితమయ్యిందని హైడ్రా అధికారులు వెల్లడించారు. దీంతో భారీ వర్షాలు పడితే తుమ్మలబస్తీ, ఆనంద్‌నగర్ కాలనీల్లో నిరు నిలుస్తుందని ముఖ్యంగా చింతల్‌బస్తీ వద్ద నాలా మరీ కుంచించుకుపోయిందని స్థానికులు అంటున్నారు. అక్కడి నివాసితులకు కొన్ని రోజులు సమయం ఇచ్చి నాలా ఆక్రమణలు తొలగించుకోవాలని సూచించామన్నారు. లేనిపక్షంలో తామే కూల్చివేస్తామని స్పష్టం చేశామని అధికారులు తెలిపారు. నాలాల్లో ఉన్న చెత్తాచెదారం తొలగించారు. ఓ అపార్ట్‌మెంట్‌కు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నాలాకు ఆనుకుని ఉందన్నారు. దానిని త్వరలో తొలగించి మరో చోట ఏర్పాటు చేసుకోవాలని కొంత సమయం ఇచ్చారు.

విద్యుదాఘాతంతో నెమలి మృతి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్ట్‌కాలనీ చౌరస్తాలో శుక్రవారం ఉదయం కేబీఆర్ పార్కు నుంచి వచ్చిన ఓ నెమలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. అదే సమయంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ ఈ విషయాన్ని గమనించి అటవీ శాఖ సిబ్బంది వచ్చి మృతి చెందిన నెమల్లిని స్వాధీనం చేసుకున్నారు. ఎగురుకుంటూ వచ్చిన నెమలి ప్రమాదవశాత్తూ కరెంటు వైర్లపై పడడంతో షాక్‌కు గురై మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

మేకప్ స్టూడియోలో ఘర్షణ.. మహిళపై దాడి

బంజారాహిల్స్: బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు మేకప్ స్టూడియో యజమానురాలిని వేధింపులకు గురిచేస్తున్న సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హర్జిత్‌కౌర్ గరపాటి (43) అనే మహిళ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లో హెచ్‌కే హర్జిత్‌కౌర్ హెయిర్ అండ్ మేకప్ పేరుతో స్టూడియో నిర్వహిస్తున్నారు. ఆమెకు ఏడాది నుంచి విజయ్ వాచర్, సోన్‌వాచర్, హసన్‌షాన్, అనూర్ వాచర్ అనే ఇద్దరు వ్యక్తులు పరిచయమయ్యారు. కాగా కొన్నాళ్ల క్రితం సోన్ స్టైలిస్ట్‌గా స్టూడియోలో చేరారు. తాను డెర్మా క్లినిక్ నిర్వహించుకుంటా అని చెప్పడంతో తన స్టూడియో సోన్ కోసం హర్జిత్‌కౌర్ స్థలం ఇచ్చారు. కాగా హర్జిత్‌కౌర్ తన పాస్‌పోర్ట్‌ను స్టూడియోలో ఉంచగా దానిని విజయ్, సోన్ తీసుకున్నారు. కాగా తన పాస్‌పోర్ట్ తిరిగి ఇవ్వాలని అడిగితే, వారు తిరస్కరించడంతో పాటు దుర్భాషలాడుతూ బెదిరించారు. ఈ వ్యవహారంలో గొడవ చోటు చేసుకోవడంతో హసన్, సోన్ ఆమెపై దాడి చేశారు. పాస్‌పోర్ట్ తిరిగి ఇవ్వాలంటే డబ్బు డిమాండ్ చేయగా రూ.11,000 విజయ్‌కు ట్రాన్స్‌ఫర్ చేసింది. దాంతో పాస్‌పోర్ట్ తిరిగి ఇచ్చారు. కాగా కొన్నాళ్ల తర్వాత మరిన్ని డబ్బులు ఇవ్వాలని, లేకుంటే మీ మీద తప్పుడు కేసుల పెట్టిస్తామని బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించార. తనతో పాటు తన భర్తకు ఫోన్లు చేయడం, తన నెంబర్లను గేమింగ్ సైట్స్‌లో పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు బాధితురాలు హర్జిత్‌కౌర్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డా. బి. పట్టాభీరామ్ సేవలు మరువలేనివి

మంత్రి శ్రీధర్‌బాబు నివాళి

శ్రీనగర్‌కాలనీ: డాక్టర్ బి. పట్టాభీరామ్ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని.. ఆయన జీవితం ఓ ఉత్సవమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో డాక్టర్ బి.పట్టాభీరామ్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి ఆధునిక యుగంలో మానవ సంబంధాలు కరిగిపోతున్న తరుణంలో కౌన్సెలింగ్స్ ద్వారా సరిచేయవచ్చునని నిర్ధారించి.. సమాజానికి నిరూపించిన వ్యక్తి డాక్టర్ పట్టాభీరామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు రాజేంద్రప్రసాద్, మాజీ డీజీపీ అరవిందరావు, ఐపీఎస్ అధికారి సౌమ్యా మిశ్రా, కేవీపీ రామచంద్రరావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు జనార్దన్‌రెడ్డి, ఐవైఆర్ కృష్ణారావు, సీనియర్ పాత్రికేయుడు రామచంద్రమూర్తి, ఆర్గనైజర్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ నేత పద్మరాజు, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి డా.కరీం, పాల్గొన్నారు.



వడ్డీ ఆశజూపి డిపాజిట్ కూడా ఇవ్వలేదు

కోర్టు ఆదేశాల మేరకు బ్యాంకు అధికారులపై కేసు నమోదు

పంజగుట్ట: కాకతీయనగర్, నానల్‌నగర్‌కు చెందిన నందిపాటి ఆనంద్‌రెడ్డి గతంలో ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా దేశాలకు ఐక్యరాజ్య సమితి ఇన్ఫర్మేషన్ మేనేజిమెంట్ అధికారిగా విధులు నిర్వర్తించే వారు. 2023లో కేన్సర్ బారినపడటంతో ఉద్యోగం మానేసి నగరంలోనే నివాసం ఉంటున్నారు. ఇతను సోమాజిగూడ యస్ బ్యాంక్‌లో అక్కడి అధికారులను సంప్రదించి తన ఆరోగ్య పరిస్థితిని పరిగణలోకి తీసుకుని తాను పెట్టే పెట్టుబడికి తన వైద్య అవసరాలకు ఉపయోగపడేలా ఏదైనా స్కీమ్ ఉంటే చెప్పమని అడిగారు. వారు మీ వైద్య అవసరాలకు ఉపయోగపడేలా ప్రతినెల మీరు పెట్టిన పెట్టుబడికి 5శాతం వడ్డీ వస్తుందని నమ్మబలికారు. దీంతో ఆనంద్ ఆగస్టు 2023 నుంచి డిసెంబ్ 2023 వరకు మొత్తం 32 లక్షల 50వేలు పెట్టుబడి పెట్టారు. దీనికి వారు వడ్డీ ఇవ్వకపోగా, డిపాజిట్ కూడా ఇవ్వకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. పలు మార్లు బ్యాంకు అధికారులను కలిసినా వారు పొంతనలేని సమాధానం చెప్పడంతో మోసపోయానని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశం మేరకు పంజగుట్ట పోలీసులు బ్యాంకు అధికారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తాను పెట్టిన పెట్టుబడికి వారు ఇస్తానన్న వడ్డీ కలిపితే ఇప్పుడు తనకు మొత్తం రూ.55 లక్షల 90 వేలు రావాలని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వడ్డీ వ్యాపారి అరెస్ట్

4.5 కేజీల గంజాయి స్వాధీనం

హిమాయత్‌నగర్ : విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డ ఓ వ్యాపారి గంజాయి వ్యాపారం మొదలుపెట్టాడు. లక్షల్లో వడ్డీల వ్యాపారం చేస్తున్నా అతనికి సంపాదన మీద మక్కువ తీరలేదు. ఒరిస్సా నుంచి తక్కువ ధరకు గంజాయిని తెప్పిస్తూ గుట్టు చప్పుడు కాకుండా నగరంలో అవసరమున్న వ్యక్తులకు తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అధిక ధరకు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్న మల్లాపూర్‌కు చెందిన చెన్న రమేష్ గౌడ్(27)ను డీటీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నారాయణగూడ వైఎంసిఎ కూడలి వద్ద సికింద్రాబాద్ డిటిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది గంజాయి తరలిస్తున్న ఆ వ్యక్తిని పట్టుకున్నారు. మల్లాపూర్ నుంచి కోఠి వైపు గంజాయిని రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై తీసుకెళ్తుంతుండగా సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సావిత్రి బృందంతో వాహనాన్ని, గంజాయిని పట్టుకున్నారు. 4.5 కేజీల గంజాయితో పాటు రూ.20వేల నగుదును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ ఎక్సైజ్ స్టేషన్‌లో అతన్ని అప్పగించారు. రమేష్ గౌడ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నారాయణగూడ ఎక్సైజ్ సిఐ కల్పన తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్‌, శనివారం, 12, జూలై, 2025



రేపల్లె మళ్లీ మురళి విన్నది.. ఆ పల్లె కళే పలుకుతున్నది.. ఆ జానపదం ఘల్లుమన్నది.. ఆ జాణ జత్తై అల్లుకున్నది.. అని రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి అన్నట్లు.. గత కొంత కాలంగా తెలుగు ఫోక్ సాంగ్స్ సరికొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. తెలుగు జానపదాలు సోషల్ మీడియాలో టాప్ ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఒకప్పుడు సినిమా పాటలు వైరల్‌గా మారేవి.. కానీ ప్రస్తుతం మన జానపద పాటలు వైరల్‌గా మారి సోషల్ మీడియాను ఓ ఊపు ఊపేస్తున్నాయి. అంతేకాకుండా.. స్థానికంగానే కాకుండా దేశంలోని ఇతర నగరాల్లో సైతం ప్రముఖ కార్యక్రమాల్లో తెలుగు ఫోక్ సాంగ్స్ హైలైట్‌గా నిలుస్తున్నాయి. క్రికెట్ మ్యాచ్‌లు మొదలు మిస్ వరల్డ్ పోటీలను సైతం తెలుగు ఫోక్‌సాంగ్స్ అలరించాయి. సోషల్ మీడియాలో సైతం వైరల్‌గా మారడంతో ఈ పాటలకు మానిటైజేషన్ ఎక్కువగా జరిగి ప్రైవేట్ ఆల్బమ్స్‌కు సైతం లక్షల్లో రెమ్యూనరేషన్ వస్తుండటం విశేషం. - సాక్షి, సిటీబ్యూరో

అనాదిగా తెలుగు జానపద పాటలకున్న విశిష్టత, ప్రశస్తి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సంప్రదాయ ప్రైవేట్ ఆల్బమ్‌లతో యువత గుండెల్లో ఒక నిర్దిష్ట స్థానం ఏర్పరుచుకున్నాయి. అయితే ఈ మధ్య ఓ మెట్టు ఎగబాకి సినిమా పాటలను సైతం దాటి వైరల్‌గా మారుతుండడం విశేషం. ఎంతలా అంటే ఒక పాటకు 40, 50 లక్షల ఆదాయం సంపాదించేంతలా..!! ఈ పాటలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం, ఎక్కువ వ్యూయర్‌షిప్‌తో రెమ్యూనరేషన్ లభించడం ఈ తరం యువతకు కలిసొచ్చింది. ఇందులో భాగంగానే సినిమా పాటల మాదిరిగానే సెట్‌లు వేసి మరీ ప్రైవేటు ఆల్బమ్స్ షూట్ చేస్తున్నారు. ఊర్లో పెళ్లి బరాత్‌లు, పండుగలు, పబ్బాల్లో అలరించే ఈ పాటలు కొత్త రంగులు అద్దుకున్నాయి. యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో ఈ పాటలు, పాటల రీల్స్ సందడి చేస్తూ ఆదాయ మార్గాలుగా మారుతున్నాయి.



జనం జతగా.. జానపదం..

సిటీ లైఫ్ స్టైల్ ఈవెంట్స్‌లో మన ఫోక్ బీట్స్

- పలు మెట్రో నగరాల్లోనూ పెరుగుతున్న ఫ్యాన్స్
- సరికొత్త ట్రెండ్‌గా తెలుగు జానపద గేయాలు
- టాప్ ట్రెండింగ్‌లో కొన్ని తెలుగు ఆణిముత్యాలు
- సోషల్ మీడియాలో అత్యధిక మానిటైజేషన్
- సోషల్ సెలబ్రిటీలుగా మారుతున్న ఫోక్ ఆర్టిస్టులు



సోషల్ సెలబ్రిటీలుగా..

వైరల్‌గా మారిన ఈ ఫోక్ సాంగ్స్‌లో నటించిన నటీనటులు, సింగర్లు, మ్యూజిక్ డైరెక్టర్లు ప్రస్తుతం సోషల్ సెలబ్రిటీలుగా మారుతున్నారు. గతంలో ఇదే దారిలో వచ్చి సినిమా అవకాశాలు పొందిన మంగ్లీ, రామ్ మిర్యాల గురించి విధితమే. కానీ ఈ తరం ఫోక్ ఆర్టిస్టులు సినిమాలతో పాటు ప్రైవేటు ఆల్బమ్స్‌తోనే మంచి ఆదాయాలను పొందటం విశేషం. ఒకప్రైవేటు ఆల్బమ్‌తో కోటి రూపాయలకు పైగా వ్యూయర్‌షిప్ రెమ్యునరేషన్ పొందిన తెలుగు పాటలున్నాయి. ఇది ఈ తరం ఔత్సాహికులకు కళతో పాటు ఆదాయమార్గాలను చేరువ చేస్తున్నాయి.

ఇటీవలి కాలంలో వైరల్ అయినవి..

- కాపోల్లింటికాడ..: 2023లో విడుదలైన ఈ పాట రీల్స్‌లో, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో సూపర్ హిట్ అనే చెప్పాలి. ఈ పాట ఇన్‌స్టా కవర్స్, డ్యాన్స్ ఛాలెంజ్‌లకు కారణమైంది. సిటీలో ఈ ట్రెండింగ్ కల్చర్‌కు కారణమైనవాటిలో ఈ సాంగ్ కూడా ఒకటి.
- ఓ పిలగ వెంకటి..: 2024లో విడుదలైన ఈ పాట యూట్యూబ్, ఇన్‌స్టా రీల్స్‌లో హాట్ ట్రెండ్ అయ్యింది. ఈ పాటలోని బీట్, లిరిక్స్ యువతతో పాటు అన్ని వర్గాల వారినీ ఆకర్షించింది. ఈ పాటతో వేల సంఖ్యలో రీల్స్ సోషల్ మీడియాను నింపేశాయి.
- కమలాపూరం రోడ్డాట..: మార్చి 2025లో విడుదలైన ఈ ఫోక్ జోక్ ట్యూన్ ఈ మధ్య కాలంలో ఇన్‌స్టా రీల్స్, రీమిక్స్ వీడియోల్లో సంచలనంగా మారింది. ఇందులోని గ్రామీణ సన్నివేశాలు, బీట్ మాధ్యంలోని హుక్‌లతో ఈ పాట క్రియేటర్లు, డీజే వర్క్‌షాప్లలో హైలైట్‌గా నిలిచింది.
- రాను బొంబైకి రాను..: అద్దాల మేడలున్నవే అంటూ మొదలయ్యే ఈ పాట.. రాను ముంబైకి రాను అంటూ ఈ ఏడాది ట్రెండింగ్ సాంగ్‌గా మారింది. ఈ పాట దేశంలోనే కాదు ఇతర దేశాల్లోనూ, బాలివుడ్ షోలలోనూ వైరల్‌గా మారింది.

లైఫ్‌స్టైల్.. సోషల్ స్ట్రీమింగ్..

ఈ పాటలు గతంలో టిక్‌టాక్, ప్రస్తుతం యూట్యూబ్, క్యాప్‌కట్, ఇన్‌స్టాల్లో వైరల్‌గా మారుతున్నాయి. కొన్ని పాటలకు బ్రాండెడ్ వీడియో అలాగే లైవ్ ఈవెంట్‌ల ద్వారా ఆదాయం వస్తోంది. ఒక్క పాటతో పార్ట్ టైమ్ సెలబ్రిటీగా మారిన క్రియేటర్లు ఎందరో. ఈ ప్రభావంతో గ్రామీణ ఆవిష్కరణలుగా ప్రైవేట్ ఆల్బమ్స్ నిలుస్తున్నాయి. వీటికి సహకార వేదికలు, స్టేజ్ షోస్, వెబ్‌స్ట్రీమ్స్ ద్వారా ఆర్టిస్టులు దేశ-అంతర్జాతీయ స్థాయిలకు వెళ్లే అవకాశాలు పెరుగుతున్నాయి. హైబ్రిడ్ ఫ్యూజన్‌తో ఫోక్ + ఎలక్ట్రో బ్యాండ్‌లుగా అవతరిస్తున్నాయి. తెలుగు ఫోక్ సాంగ్స్ తాజాగా దేశవ్యాప్తంగా లైఫ్‌స్టైల్ ఈవెంట్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. క్రికెట్ మ్యాచ్‌లు, బాలీవుడ్ షోలు, మిస్ వరల్డ్ వేదికలపై ఫోక్ ఘనంగా ఆవిష్కృతమవుతోంది. ఈ ఆదరణ దృష్ట్యా రవితేజ వంటి సినీ హీరోలు తమ సినిమాల్లో ఫోక్ సాంగ్స్‌ను జతచేస్తున్నారు. మరి కొందరు అన్ని పాటలూ ఫోక్‌సాంగ్స్ పెట్టుకున్న సందర్భాలూ లేకపోలేదు.

నగరంలో లైవ్ ఫోక్ మ్యూజికల్ కాన్సర్ట్..

- ఆగస్టులో 'ద బిగ్ ఫోక్ నైట్ 2025'
- పోస్టర్ ఆవిష్కరణలో పలువురు సంగీత, సాహిత్య ప్రముఖులు
- 60 మంది తెలంగాణ జానపద కళాకారులతో భారీ ప్రదర్శన

మాదాపూర్ : ప్రపంచానికి తెలియని ఎన్నో అత్యద్భుత జానపదాలు మట్టిలో మాణిక్యాలుగా మిగిలిపోకుండా ఈ తరానికి చేరువ చేయాలనే లక్ష్యంతో 'ద బిగ్ ఫోక్ నైట్ 2025' ఆవిష్కృతమవుతుంది. ఆగస్టు 23న నగరంలోని ఎల్‌బీ స్టేడియం వేదికగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ లైవ్ ఫోక్ మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించనున్నారు. ఓ టీవీ ఛానల్ ఆధ్వర్యంలో ఎలిమెంటల్ మీడియా, ఎంట్రీవాలా భాగస్వామ్యంతో నిర్వహించనున్న ఈ కాన్సర్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను నోవోటెల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజ, వందేమాతరం శ్రీనివాస్, వరంగల్ శ్రీనివాస్, నల్గొండ నర్సన్న, బోలే షావలి, మధుప్రియ వంటి ప్రముఖ సంగీత, సాహిత్య ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ.. మైకెల్ జాక్సన్, బుపెన్ హెజారికా, నూరాన్ సిస్టర్స్, రెహ్మాన్, గద్దర్ వంటి ప్రముఖులు ఒకే వేదికపై కనిపించే భాగ్యం ఈ తరం నోచుకోలేదు.. కానీ వాళ్లకు ధీటుగా తెలంగాణ జానపద కళాకారులు అక్షర నక్షత్రాల గాత్రులై మహా వేదికపై ఒకే సారి తమ కళను ప్రదర్శించనున్నారని అన్నారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో తెలంగాణ జానపద గాయకులందరినీ ఒకే వేదికపై చూసే అదృష్టం అరుదుగా వస్తుందని సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్ తెలిపారు. ఈ వేదికపై మధుప్రియ, రాము రాథోడ్, కనకవ్వ తదితరుల జానపద పాటల, నృత్య ప్రదర్శనతో ఉర్రూతలూగించారు.



టాటాట్రస్ట్ ఆధ్వర్యంలో ఖుద్ సే జీత్..



సాక్షి, సిటీబ్యూరో: మహిళల్లో గర్భాశయ క్యాన్సర్లను నివారించడానికి ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో 'ఖుద్ సే జీత్' పేరిట అవగాహన, ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ట్రస్ట్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు సకాలంలో గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని కోరుతూ నిర్వహించే ఈ ప్రచారంతో పాటు దేశవ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్స్ కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే దాదాపు 25వేల పరీక్షలు నిర్వహించామని, ఈ కార్యక్రమంలో టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ తదితర అనుబంధ సంస్థలు, ఆస్పత్రులు, పలు రాష్ట్ర ప్రభుత్వాలు సైతం భాగం పంచుకుంటున్నాయని తెలిపారు.



ఆకృతి ఎగ్జిబిషన్ ప్రారంభం..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని తాజ్ కృష్ణా వేదికగా మూడు రోజుల పాటు కొనసాగనున్న ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌లో అధునాతన ఫ్యాషన్ డిజైనింగ్స్, ట్రెండీ వస్త్రాభరణాలు నగరవాసుల కోసం అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఆకృతి ఎగ్జిబిషన్ డైరెక్టర్ శశినాథ్ ప్రారంభించారు.

దృష్టిలోపం ఉన్నవారితో.. సిక్స్త్ సెన్స్..

సాక్షి, సిటీబ్యూరో: దృష్టిలోపం కలిగిన వారిలో లోపాన్ని కాదని, బలాన్ని చూడాలని వక్తలు కొనియాడారు. నగరంలోని అంధుల సేవా సంస్థలతో కలిసి సువాసన అభివృద్ధి ప్రక్రియలో దృష్టి లోపం ఉన్న వారితో ప్రముఖ అగర్‌బత్తీ బ్రాండ్ ఐటీసీ మంగళ్‌దీప్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'సిక్స్త్ సెన్స్' ప్యానెల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 30 మందిని సన్మానించారు. నగరంలో ఈ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా మాట్లాడుతూ అంధులకు ఉన్న వాసనలు పసిగట్టే శక్తి సామర్థ్యాలను అధ్యయనాలు వెల్లడించాయని వక్తలు తెలిపారు. ఐటీసీ లిమిటెడ్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ గౌరవ్ తయల్, బ్లైండ్ క్రికెట్ ప్రపంచ కప్ మాజీ విజేత, మహనవ్ ఎబిలిటీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మహేందర్ వైష్ణ, రేడియో ఉడాన్ సహ వ్యవస్థాపకురాలు మినల్ సింఘ్వీ తదితరులు పాల్గొన్నారు.





జూలై 15న టీసీఈఐ 'ఎక్సలెన్స్ అవార్డ్స్'

సాక్షి, సిటీబ్యూరో : ఈవెంట్స్ రంగంలోని అసాధారణ ప్రతిభ, వినూత్న అంకితభావాన్ని గుర్తించేందుకు తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) 8వ ఈవెంట్ నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఎక్సలెన్స్ అవార్డ్స్ గ్రాండ్ ఫినాలే జూలై 15న నగరంలోని గండిపేటలోని సవయా కన్వెన్షన్, సెంటర్‌లో నిర్వహించనుంది. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీసీఈఐ అధ్యక్షుడు బలరాం బాబు, అవార్డ్స్ కమిటీ కన్వీనర్ రమేష్ కే ముప్పనలు ఈ విషయాన్ని తెలిపారు. ఈ ఏడాది అవార్డ్స్‌కు 400కిపైగా నామినేషన్లు రాగా, వీటిలో 'పెర్ల్ ఆఫ్ హైదరాబాద్' కేటగిరీలో 80కు పైగా విభాగాలు, 'జెమ్ ఆఫ్ ఇండియా' కేటగిరీలో 15 విభాగాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా అధికారిక పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీసీఈఐ జనరల్ సెక్రటరీ రవి బూరా, ట్రెజరర్ తౌఫిక్ ముహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

జేడీ డిజైన్ అవార్డ్స్ -2025..

- హెచ్ఐసీసీ నోవోటెల్ వేదికగా కార్యక్రమం
- అలరించిన బ్యూటిఫుల్ ఫ్యాషన్ వాక్..
- క్రియేటివ్, అధునాతన డిజైన్లతో ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నగరంలోని హెచ్ఐసీసీ నోవోటెల్ వేదికగా నిర్వహించిన 'జేడీ డిజైన్ అవార్డ్స్ 2025' కార్యక్రమం ఫ్యాషన్ ఔత్సాహికులను విశేషంగా అలరించింది. ఫ్యాషన్ డిజైనర్స్ కోసం నిర్వహించిన ఈ కార్యక్రమం ఫ్యాషన్ డిజైనర్లను, డిజైన్లను, ఆవిష్కరణలను అవార్డ్స్‌తో సత్కరించింది. అంతేకాకుండా ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షో హైలైట్‌గా నిలిచింది. ఈ సందర్భంగా డిజైన్ ల్యాండ్‌స్కేప్ నిపుణులు, పరిశ్రమ దార్శనికులు నీలేష్ దలాల్ మాట్లాడారు. జేడీ డిజైన్ అవార్డ్స్ తమ ఆలోచనలు, ప్రయత్నాన్ని ప్రతిబింబించే వేదికన్నారు. హైదరాబాద్‌లో యువతరం ఈ రంగంలో సంక్లిష్టమైన సవాళ్లను అర్థవంతమైన పరిష్కారాలుగా మార్చుతూ చేసిన అద్భుత ప్రదర్శన చూశామన్నారు. ఇది కేవలం విద్యార్థుల ప్రదర్శనలు మాత్రమే కాదు.. డిజైనింగ్‌లో స్పృహతో, సృజనాత్మకతతో అనుసంధానించబడిన అన్వేషణల సమాహారమని అభినందించారు. కార్యక్రమంలో వెయ్యి మందికి పైగా ఔత్సాహికులు పాల్గొన్నారు.







ఆదరణ అధికం!

సాక్షి, సిటీబ్యూరో: శుభ్రం చేయడమెంతో తేలిక. దీర్ఘకాలపు మన్నిక.. ఎలాంటి మరకలైనా తుడవగానే మాయం. నిర్వహణలో కన్పించని సమస్యలు. పైగా ఇంటికే సరికొత్త అందం. ఇలాంటి అనేకానేక ప్రత్యేకతల కారణంగా వెదురు గచ్చు(బ్యాంబూ ఫ్లోరింగ్)కి రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.

- భూతాపాన్ని తగ్గించడానికి ప్రపంచం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో.. పర్యావరణ ప్రియుల దృష్టి వెదురు గచ్చు మీద పడింది. ఇతర రకాల కలప కంటే దృఢంగా ఉండటం.. చూడ్డానికి చక్కగా కన్పించడం.. తదితర కారణాలతో వెదురు గచ్చుకి గిరాకీ పెరుగుతోంది.

రెండు రకాలు..

వెదురు గచ్చులో ఎలిగెంట్, ఎలైట్ అనే రెండు రకాలు లభిస్తాయి. వీటి తయారీ ప్రక్రియల్లో చాలా తేడా ఉంటుంది. కత్తిరించిన చిన్నచిన్న బ్యాంబూని అతికించేది ఎలిగెంట్ అయితే.. దీనికి భిన్నంగా బ్యాంబూ ఫైబర్‌తో చేసేది ఎలైట్ రకం. ఇదెంతో దృఢంగా ఉంటుంది. మొత్తం మూడు వర్ణాల్లో ఈ కలప లభిస్తుంది. ఆరేళ్ల పాటు చెక్కు చెదరకుండా ఉండటం కోసం గచ్చుకి ఆరు లేయర్ల పాలియురేథెన్ కోటింగ్ వేస్తారు.

ధర ఎంత?

ప్రస్తుతం ఈ తరహా కలపను చైనా నుంచి దిగుమతి చేస్తున్నారు. దీనితో ఇంటిని అలంకరించాలంటే.. చదరపు అడుగుకి రూ.200–350 దాకా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అంటే ఓ వంద చదరపు అడుగుల గదికి సుమారు రూ.20 వేలు అవుతుందన్నమాట. మార్కెట్లో లభించే ఇతర కలపతో తయారైన ఫ్లోరింగ్ కోసం చదరపు అడుగుకి రూ.300 దాకా అవుతుంది. వెదురు కలపను ఇంట్లో వేయడానికి విడిగా చార్జీలుంటాయి. చదరపు అడుగుకి రూ.15 దాకా తీసుకుంటారు. ఆసక్తికర విషయం ఏమిటంటే.. మీ ఇంట్లో ప్రస్తుతం ఎలాంటి గచ్చు ఉన్నా.. దానిపై బ్యాంబూ ఫ్లోరింగ్‌ను సులువుగా వేసుకోవచ్చు. పైగా ఒక్కరోజులో పని పూర్తవుతుంది. వెలుగు గచ్చు ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. దీనిపై గీతలు కన్పించవు. కాలిపోవడమంటూ ఉండదు. కొన్నాళ్ల తర్వాత రంగు వెలిసిపోతుందన్న దిగులక్కర్లేదు. నిర్వహణలో శ్రమపడక్కర్లేదు.

బుడతల గదికి ప్రత్యేకం..

సిరాను పీల్చుకునే గుణం వెదురు గచ్చుకి ఉండటం వల్ల.. చాలామంది తమ బుడతల గదుల్లో వాడుతున్నారు. చిన్నారులు కింద పడినా దెబ్బలు తగలవు. హోమ్ థియేటర్లు, పడక గదుల్లోనూ ఈ తరహా గచ్చును కోరుకునేవారి సంఖ్య పెరుగుతోంది. సంపన్న గృహాల్లోని బయటి ప్రాంతాల్లోనూ ఈ రకం కలపతో అలంకరిస్తున్నారు. ఉద్యానవనాలు, బాల్కనీలు, స్విమ్మింగ్‌పూల్, పోర్టికోల వద్ద విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం చదరపు అడుగుకి రూ.400 వరకూ అవుతుంది. అన్నిరకాల వాతావరణానికి ఎదురొడ్డి నిలబడం వల్ల వెదురు గచ్చు మీద ప్రత్యేక మక్కువ పెరుగుతోంది.



హక్కుల చిక్కులు, ఆర్థిక ఇబ్బందులను నివారించడానికి కొన్ని సూత్రాలివి..

“మనకు నచ్చే ఫ్లాట్ దొరికేంత వరకూ నగరం నలుమూలలా తిరుగుతాం. రుణమెంత వస్తుందో ముందే బ్యాంకర్లతో చర్చించి, ఆర్థిక పరిమితులు దాటకుండా జాగ్రత్తపడతాం. కోరుకున్న ఫ్లాట్ దొరికితే చాలు.. అడ్వాన్స్ అందజేసి బిల్డర్‌తో ఒప్పందం కుదుర్చుకుంటాం. మరి ఈ పత్రంలో ఏముందో.. ఏయే అంశాల్ని పేర్కొన్నారో తెలుసుకోవాలి. లేదంటే సొంతింటి ఆనందనానికి దూరమైనట్లే. స్థిరాస్తుల కొనుగోలులో అతి కీలకమైన విషయం అమ్మకందారుడితో కుదుర్చుకునే ఒప్పందమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా ఇళ్ల విషయంలో బిల్డర్‌తో జాగ్రత్తగా ఉండాలి. జీవిత కాలపు కష్టార్జితానికి తోడు, బ్యాంకు నుంచి అప్పు తీసుకుని మరీ సొమ్ము చెల్లిస్తాం. తీరా కొనుగోలు చేశాక, న్యాయపరమైన చిక్కులున్నాయనో, ఇంటిపై అప్పు ఉందనో తేలితే.. ఎంత నష్టం? ఇలాంటి లొసుగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్ని రకాలుగా పక్కగా ఉందని తేలాకే కొనుగోలుపై ముందడుగు వేయాలి. – సాక్షి, సిటీబ్యూరో”

అగ్రిమెంట్.. ఇంపార్టెంట్



మొత్తం విలువెంత?

ఇంటి విలువ ఎంతన్నది కేవలం భవనానికే పరిమితమైన అంశం కాదు. ఇందులో అనేక ఇతర ఖర్చులు కలుస్తాయి. విద్యుత్, తాగునీరు, పార్కింగ్, వివిధ రకాల పన్నులతో పాటు రిజిస్ట్రేషన్ వంటి ఖర్చులు ఉంటాయి. ఇవన్నీ మొత్తం విలువలో కలిసి ఉండొచ్చు. లేదంటే విడిగా ఉండొచ్చు. కాబట్టి ఈ ఖర్చులన్నీ మొత్తం విలువలో ఉండేలా చూసుకోండి.



ఏం చేయాలి?

ఇతర రుసుములు ఏమైనా ఉన్నాయేమో అనే విషయాన్ని తెలుసుకోవడానికి ఒప్పంద పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఈ విషయంలో రియల్టీ లావాదేవీల్లో అనుభవం ఉన్న న్యాయవాదిని సంప్రదించాలి. అభ్యంతరాలుంటే.. బిల్డర్‌ను సంప్రదించడం ద్వారా ఆ విషయాల్ని సరిదిద్దుకోవచ్చు. వాస్తవ ప్లాన్‌కు భిన్నంగా మార్పులు చేయాల్సి వస్తే.. అదనపు రుసుములు చెల్లించాలా? సంబంధిత ప్రభుత్వ శాఖల అనుమతి అవసరమా.. వంటి విషయాల్ని బిల్డర్‌తో చర్చించి ఒక నిర్ణయానికి రావాలి.

నిర్మాణం జాప్యమైతే?

నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడు..? ఇంటిని అప్పగించేదెప్పుడు అనే విషయాలు ముందే స్పష్టంగా తెలుసుకోవాలి. ఇటీవల కాలంలో మాంద్యం దెబ్బ నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. చాలా ప్రాజెక్టుల్లో నిర్మాణాలు ఆలస్యమయ్యాయి. ఇలా జరగడం వల్ల ఓవైపు ఈఎంఐలు కట్టలేక, మరోవైపు ఇంటి అద్దె చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి నిర్మాణం ఎప్పటిలోగా పూర్తి అవుతుంది, ఎప్పటిలోగా ఫ్లాటను అప్పగించే విషయంపై బిల్డర్‌తో పత్రంలో రాయించుకోండి.

ఏం చేయాలి?

పనులు మొదలయ్యాక నిర్మాణ ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఆలస్యమవుతుంటే బిల్డర్‌ను కలిసి మాట్లాడండి. పనుల పురోగతికిది దోహదం చేయొచ్చు. అదే ప్రాజెక్టులో ఫ్లాట్లను కొనుగోలు చేసినవారితో ఓ సొసైటీని ఏర్పాటు చేయండి. ఫలితంగా బిల్డర్ వైపు నుంచి ఆలస్యం జరిగితే, గట్టిగా అడగడానికి వీలవుతుంది.

సొంతిల్లు సమకూరాలంటే.. రాజీ పడాల్సిందేనా?

సాక్షి, సిటీబ్యూరో: విషయం ఏదైనా సరే.. కోరుకున్నవన్నీ దొరక్కపోవచ్చు. ఏదో ఒక విషయంలో రాజీ పడక తప్పదు. ఇళ్ల కొనుగోలుకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. బడ్జెట్, చిక్కుల్లేని యాజమాన్య హక్కు, ప్రాంతం, వాస్తు, నీరు, విద్యుత్తు సరఫరా అంశాలు ఇంటి కొనుగోలు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. అయితే వీటిలో కొన్ని అంశాలు మనం ఆశించినట్లుగా ఉండకపోవచ్చు. అన్నీ మనకు అనుకూలంగా ఉండాలంటే సొంతింటి స్వప్నం ఓ పెద్ద సవాలే అవుతుంది. అలాగనీ ముఖ్యమైన అంశాల్లోనూ రాజీపడాలని కాదు. ప్రాధాన్యత క్రమంలో ఒకటి, రెండు అనుకూలంగా ఉండకపోవచ్చు. కాబట్టి ఏయే విషయాల్లో రాజీ పడొచ్చు. ఎక్కడ పడకూడదో స్పష్టత ఏర్పర్చుకోవాలి.

ప్రాంతమెక్కడ?

ఇల్లు కొనాలన్న ఆలోచనలో ఉన్నారా? అది కూడా మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో అనుకుంటున్నారా? ఇక్కడ వీలవ్వకపోతే మియాపూర్, మదీనాగూడ, మణికొండ, ఓయూ కాలనీ తదితర ప్రాంతాల్లో.. కొంచెం తక్కువ ధరలో దొరికే ప్రాంతాలపై దృష్టి పెడతారు అవునా? ప్రస్తుత రియల్టీ మార్కెట్లో సంపన్నులకే కాదు మధ్యతరగతి, సామాన్యులు.. ఇలా వివిధ వర్గాల వారికి స్తోమతకు తగ్గ బడ్జెట్‌లో నగరం చుట్టూ గృహసముదాయాలు వస్తున్నాయి. మీరు కొంచెం కసరత్తు చేసి, చుట్టుపక్కల ప్రాంతాల్ని అన్వేషిస్తే చాలు, మీకు అందుబాటు ధరలో ఇళ్లు ఎక్కడ దొరికేది ఇట్టే తెలిసిపోతుంది.

సదుపాయాల సంగతేంటి?

నిర్మాణాల విషయంలో డెవలపర్ల వ్యూహం మారింది. సకల సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇల్లు కొనాలన్న నిర్ణయానికొచ్చాక సదుపాయాల సంగతి కూడా ఆలోచించాలి. క్లబ్ హౌజ్, జిమ్ అవసరమా? వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందించే ఈ సదుపాయాలు అక్కర్లేదా? అన్నది తేల్చుకోవాలి. జీవనశైలి, బడ్జెట్ తదితర అంశాలు మీ నిర్ణయంపై ప్రభావితం చేస్తాయి. కాబట్టి సదుపాయాల విషయంలో స్పష్టత ఉండాలి.

బిల్డర్‌కు మంచి పేరుందా?

స్థిరాస్తి కొనేటప్పుడు బిల్డర్ గురించి కూడా ఆరా తీయాలి. మార్కెట్లో పేరున్న బిల్డర్లు నిర్మించే ఇళ్లకే ప్రాధాన్యమివ్వాలి. గతంలో అతను నిర్మించిన ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యాయా? నిర్మాణమెలా ఉంది? ఒప్పందం మేరకు కొనుగోలుదారులకు సదుపాయాలు కల్పించాడా? కార్పస్ ఫండ్ బదిలీలో ఇబ్బందులేమైనా సృష్టించాడా? అన్న విషయాల్ని తెలుసుకోవాలి. నిర్మాణాల్లో మంచి చరిత్ర లేని బిల్డర్లకు దూరంగా ఉండటమే మేలు. అలాగనీ మార్కెట్లో పేరున్న బిల్డర్ల ప్రాజెక్టులకే పరిమితం కానక్కర్లేదు. నిర్మాణంలో నాణ్యత పాటించి ఒప్పందానికి కట్టుబడి ఉండేవారిని ఎంచుకోవచ్చు.



పరిసరాలెలా ఉన్నాయి?

ఇంటి ముందు పచ్చటి తోటతో ఆహ్లాదభరిత వాతావరణం ఉండాలని కొందరు కోరుకుంటారు. మరికొందరేమో హంగులు లేకున్నా సర్దుకుపోతారు. బాల్కనీని పచ్చగా, అందంగా అలంకరించుకుంటే గార్డెన్‌కు ధీటుగా ఉంటుందని భావిస్తారు. కాబట్టి ఈ విషయంలో మీ దృక్పథం ఏమిటో నిర్ణయించుకోవాలి.



పవర్‌ట్రాక్.. షాక్‌ప్రూఫ్

సాక్షి, సిటీబ్యూరో: పొరపాటున సాకెట్‌లో **వేలు పెడితే ఏమ**వుతుంది? దిమ్మతిరిగి.. **మైండ్ బ్లాక్ అవుతుం**దా లేదా! అదేనండి.. షాక్ **కొడుతుంది కదా! వ**ంటిగదిలోని పవర్ సాకెట్ **అది.. రెండు, మూడు** ప్లగుల్ని పెడితే చిటపట **మెరుపులు.. షార్టుస**ర్క్యూట్లు. ఇలాంటి సమస్య**లన్నింటికీ ఓ చక్కటి** పరిష్కారం పవర్ ట్రాక్. **ఎక్స్‌టెన్షన్ బాక్స్‌కు** సరికొత్త రూపమే ఈ పవర్ **ట్రాక్. దీని సాయంతో** 5 నుంచి 13 విద్యుత్తు **ఉపకరణాల్ని ఒకేచోట** ఏర్పాటు చేయవచ్చు. ఏకకాలంలో ఇన్నింటిని వాడినా షార్టుసర్క్యూట్ అవుతుందనే భయమే అక్కర్లేదు. వంటింట్లో అయినా, ఆఫీసులో అయినా.. కరెంటు తీగల నుంచి కంప్యూటర్ వైర్ల వరకూ పవర్‌ట్రాక్‌లో బిగించొచ్చు. పవర్‌ట్రాక్ అంటే ఇదేదో కొత్త పరికరం అనుకునేరు. రెండు, మూడు ప్లగ్గులు పెట్టాల్సి వస్తే ఎక్స్‌టెన్షన్ బాక్సులు, పవర్‌స్ట్రిప్‌ల వాడకం తెలిసిందే కదా! సరిగ్గా ఇది కూడా అలాంటిదే అన్నమాట. అయితే వాటితో పోలిస్తే రెండు, మూడు రెట్లు ఎక్కువ సంఖ్యలో విద్యుత్తు ఉపకరణాలు ఏర్పాటు చేసుకునే వీలు ఇక్కడుంటుంది. ఇదే ఈ పరికరం ప్రత్యేకత.

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బహుముఖ అవసరాల్ని తీర్చే పవర్‌ట్రాక్ రెండు రకాలు. గృహావసరాలకు ఉపయోగపడే కాంపాక్ట్ ట్రాక్, ఆఫీసుల్లో ఉపయోగించే డాటా ట్రాక్. పవర్‌ట్రాక్‌ను గోడకు బిగించడం వల్ల చూడటానికి చక్కటి లుక్కు వస్తుంది. వైర్ల గజిబిజి ఉండదు. పైగా పూర్తి సురక్షితం. అందుకే వీటికి గిరాకీ అధికం.
- వంటగది, స్టడీరూమ్, లివింగ్‌రూమ్‌లతో పాటు ఆఫీసుల్లోనూ వీటిని విరివిగా వాడొచ్చు.
- సైజును బట్టి ఒక పవర్‌ట్రాక్ ద్వారా ఐదు నుంచి పదమూడు విద్యుత్తు ఉపకరణాల్ని ఏకకాలంలో వాడుకోవచ్చు. 500 మిల్లీమీటర్లు, 600 మిల్లీ మీటర్లు, 1,300 మిల్లీమీటర్ల పొడవుతో దొరుకుతాయి. పైన అల్యూమినియం, లోపల థర్మోప్లాస్టిక్ రబ్బర్ మెటీరియల ఉపయోగించే పవర్‌ట్రాక్‌ల ధర రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు ఉంది.

ఎన్నెన్నో లాభాలు..

- సాకెట్లు.. ఎక్స్‌టెన్షన్ బాక్సుల్లో ఒక్కోసారి ప్లగ్గులు సరిగా దూరవు. ఫలితంగా ప్లగ్ పిన్నును పెట్టగానే సాకెట్ నుంచి చిటచిట మెరుపులు వస్తుంటాయి. ప్లగ్‌ని పైకి ఎత్తిపట్టుకుంటే కానీ మిక్సర్ తిరక్కపోవచ్చు. ఇలాంటి సమస్యలు పవర్‌ట్రాక్‌లో కన్పించవు.
- ఒక్కోసారి చిన్నపిల్లలు తెలీక ప్లగ్గుల్లో చెంచాలు, ఇనుపముక్కలు, వేళ్లు పెట్టి షాక్‌కు గురవుతుంటారు. పవర్‌ట్రాక్‌తో అలాంటి భయమే అక్కర్లేదు. లోపల వేళ్లు పెట్టినా ఇబ్బందే ఉండదు. 100 శాతం షాక్‌ప్రూఫ్ ఇది.
- స్విచ్‌బోర్డు అయితే సాకెట్ అమర్చిన చోటే ప్లగ్ పెట్టాల్సి ఉంటుంది. ఒకవైపు అందకపోవడం, ఉపకరణాల్ని అటూఇటూ జరపడం వంటి ఇబ్బందులుంటాయి. ఇందులో అలాకాదు. ట్రాక్‌లో ఈ చివర నుంచి ఆ చివర వరకు ఎక్కడైనా పెట్టుకోవచ్చు.
- రకం ఏదైనా పవర్‌ట్రాక్‌తో మూడు సాకెట్లు ఉచితంగా వస్తాయి. అదనంగా కావాలంటే, వాటిని ప్రత్యేకంగా కొనుక్కోవాల్సి ఉంటుంది.
- డాటాట్రాక్‌ను గృహావసరాలకు కూడా వాడుకోవచ్చు. కాంపాక్ట్‌ట్రాక్‌ను మాత్రం ఆఫీసుల్లో వాడలేం.

ఆఫీసు స్పేస్ అదిరింది!

ఏడాదిలో 40 శాతం పెరిగిన లీజులు	2025 హెచ్1లో 42 లక్షల చ.అ. లావాదేవీలు
మార్కెట్‌లోకి కొత్తగా 47 లక్షల చ.అ. స్పేస్ సరఫరా	



సాక్షి, సిటీబ్యూరో: దేశంలో కార్యాలయ స్థలాలకు డిమాండ్ పెరుగుతూనే ఉంది. దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఈ ఏడాది తొలి అర్థ సంవత్సరం(హెచ్1)లో 2.68 కోట్ల చ.అ. స్థలం లీజుకు పోయింది. గతేడాది ఇదే కాలంలో జరిగిన 1.90 కోట్ల చ.అ. లావాదేవీలతో పోలిస్తే ఏడాది కాలంలో ఏకంగా 40 శాతం లీజులు పెరిగాయి. అలాగే 2025 హెచ్1లో టాప్–7 నగరాలలో కొత్తగా 2.45 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ సరఫరా అయింది. గతేడాది హెచ్1లో సప్లయి అయిన 1.96 కోట్ల చ.అ.తో పోలిస్తే ఏడాది కాలంలో 25 శాతం సరఫరా పెరిగిందని అనరాక్ తాజా నివేదిక వెల్లడించింది. దేశంలో ఐటీ హబ్‌గా పేరొందిన హైదరాబాద్‌లో 2025 హెచ్1లో 42 లక్షల చ.అ. స్పేస్ లీజుకు పోయింది. గతేడాది హెచ్1లో 31.2 లక్షల చ.అ. లావాదేవీలతో పోలిస్తే 35 శాతం లావాదేవీలు పెరిగాయి. ఇక, ఇదే సమయంలో గ్రేటర్‌లో కొత్తగా 47 లక్షల చ.అ. ఆఫీసు స్థలం సరఫరా అయింది. 2024 హెచ్1లో సప్లయి అయిన 56.8 లక్షల చ.అ. స్పేస్‌తో పోలిస్తే ఏడాది కాలంలో సరఫరా 17 శాతం మేర తగ్గింది.

నగరాల వారీగా ఆఫీసు స్పేస్ సరఫరా: (చ.అ. లక్షల్లో)

నగరం	2024 హెచ్1	2025 హెచ్2	వృద్ధి (శాతంలో)
బెంగళూరు	55	69.1	26
పుణె	9	57	533
హైదరాబాద్	56.8	47	-17
ముంబై	34.7	19	-45
ఎన్‌సీఆర్	27.5	37	35
చెన్నై	13.5	15	11
కోల్‌కతా	0	1	100

నగరాల వారీగా ఆఫీసు స్పేస్ లావాదేవీలు: (చ.అ. లక్షల్లో)

నగరం	2024 హెచ్1	2025 హెచ్2	వృద్ధి (శాతంలో)
బెంగళూరు	40	65.5	64
ఎన్‌సీఆర్(ఢిల్లీ)	46.6	50	7
ముంబై	31.5	45	43
హైదరాబాద్	31.2	42	35
పుణె	13.2	38	188
చెన్నై	19	23	21
కోల్‌కతా	9.25	4.5	-51

సర్దుబాటుతో.. విశాలంగా..


సాక్షి, సిటీబ్యూరో: ఇంట్లో స్థలాన్ని ఎలాగూ పెంచలేం. అలాగనీ అవసరాలకు తగ్గట్లు ఫర్నీచర్‌ను సమకూర్చుకోకుండా ఉండలేం కదా? ఉన్నంతలో స్థలాన్ని సద్వినియోగం చేసుకోవడమే ఇందుకు పరిష్కారం. దాని కోసం కొన్ని చిట్కాలు పాటిస్తే చాలు.

- తలుపు తీయగానే పెద్దపెద్ద వస్తువులు కన్పిస్తే.. మీ ఇల్లు చిన్నదిగా కన్పిస్తుంది. లివింగ్ రూమ్ ప్రవేశ ద్వారం ముందు పెద్ద మొత్తంలో ఫర్నిచర్ ఉండకుండా చూసుకోవాలి.
- లివింగ్ రూమ్‌కు ఉన్న ద్వారాల మధ్య తిరగడానికి ఎలాంటి అవాంతరాలు లేకుండా చూసుకోండి. అంటే.. మధ్యలో కుర్చీలు ఉంటే వాటి చుట్టూ తిరిగి వెళ్లడం లాంటివి అన్నమాట.
- సోఫాలు, కుర్చీలన్నింటినీ ఒకే వరుసలో, గోడకు పక్కన ఏర్పాటు చేయకండి. సీట్లు ఒకదానికోటి ఎదురెదురుగా, కనీసం నాలుగు నుంచి పది అడుగుల దూరంతో ఉంటే బావుంటుంది.
- బరువుగా ఉండే ఫర్నిచర్ మొత్తాన్ని గదిలో ఒకే వైపు పెట్టొద్దు. ఇలా చేస్తే సీటింగ్ ఏర్పాటులో సమతుల్యత దెబ్బతింటుంది.
- **కాఫీ టేబుల్, సెంటర్ టేబుల్ వాడకం** లివింగ్ రూమ్‌లో సాధారణమే. మ్యాగజైన్లు, వార్త పత్రికలు పెట్టుకునేందుకు వీలుగా వీటి కోసం ప్రత్యేకంగా షెల్ఫ్ ఉండే టేబుళ్లను ఎంచుకోండి. లివింగ్‌రూమ్‌లో ఉపయోగించే టేబుళ్లు ఒకదాంట్లో మరోటి అమరిపోయే విధంగా ఉంటే మంచిది.
- గదిని పెద్దదిగా కన్పించేలా చేయడంలో అద్దాన్ని మించిన సాధనం మరోటి లేదు. వెనకవైపు పచ్చని మొక్కలున్న కిటికీకి ఎదురుగా అద్దం అమరిస్తే.. ఇంటి వెలుపల ఉన్న ఆహ్లాదభరిత వాతావరణాన్ని లోపలికి తీసుకువస్తున్న భావన కలుగుతుంది.
- టేబుల్ కింద ఖాళీ స్థలాన్ని అలా వదిలేయకుండా.. షెల్ఫ్ ఏర్పాటు చేసుకుంటే, ఏవైనా పెట్టుకోవడానికి అక్కరకొస్తుంది. అవి బయటకు కన్పించకుండా పైన ఓ టేబుల్ క్లాత్ వేయండి.
- గది చిన్నదిగా ఉంటే పార్టిషన్ జోలికి వెళ్లకండి. ఇలా చేస్తే మరింత చిన్నదిగా కన్పిస్తుంది.
- లివింగ్ రూమ్‌లో మడిచిపెట్టడానికి అనువుగా ఉండే కుర్చీలు, టేబుళ్లు, సోఫాకమ్ బెడ్, బీన్ బ్యాగ్‌లు వంటి ఫర్నిచర్ నప్పుతాయి.



వీధి పోటుతో ఆటుపోట్లు

సాక్షి, సిటీబ్యూరో: కేవలం ఇంట్లోనే కాకుండా ఇంటి బయట కూడా వాస్తు ప్రభావం ఉంటుందని వాస్తు పండితులు చెబుతుంటారు. ముఖ్యంగా ఇంటిపై వీధి పోటు ప్రభావం ఎక్కువగా ఉంటుందంటున్నారు. ఇంటికి ఎదురుగా నిలువుగా ఉండే వీధి ఇంటి వరకు వచ్చి ఆగిపోయినా, లేదా అక్కడ నుంచి ఏదో వైపునకు తిరిగినా దాన్ని వీధి పోటుగా గుర్తించాలి.



- ఈశాన్య భాగంలో వీధిపోటు వల్ల ఆ గృహంలో నివసించే పురుషులకు సర్వాధికారాలు లభిస్తాయి. వీరు మంచి ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉంటారు. ఏ రంగంలో కాలుపెట్టినా పైచేయి సాధిస్తారు.
- ఈశాన్య భాగంగా వీధి ఉంటే ఆ ఇంట్లోని స్త్రీలకు మేలు. ఇంటి యజమానికి ధనాదాయం బాగుంటుంది.
- వాయువ్య భాగంలో వీధి ఉండటం వల్ల ఆ ఇంట్లో స్త్రీలు తీవ్రమైన దుష్ప్రభావానికి లోనవుతారు. అనేక సమస్యలు, చికాకులు కలుగుతాయి.
- వాయువ్యంలో వీధి ఉన్నప్పుడు మంచి ఫలితాలు పొందుతారు. రాజకీయ నాయకులుగా రాణిస్తారు.
- నైరుతి భాగంలో వీధి పోటు వల్ల ఇంట్లోకి వారికి శ్రమ అధికంగా ఉంటుంది. ఎంత కష్టపడినా ప్రయోజనం ఉండదు.
- ఆగ్నేయ భాగంలో వీధి పోటు వల్ల మంచి ఫలితాలొస్తాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది.
- ఆగ్నేయంలో వీధి ఉండటం వల్ల ఎన్ని రకాలుగా కష్టపడి సంపాదించినా అంతకు మించి ఖర్చు ఏదొక రూపేణా వచ్చిపడుతుంది. ఎప్పుడూ మానసిక ఒత్తిడితో శ్రమపడాల్సి వస్తుంది.

గిడ్డంగుల్లో రోబోల సందడి!



సాక్షి, స్పెషల్ డెస్క్

- పనులను చక్కబెడుతున్న పారిశ్రామిక రోబోలు
- ఆన్‌లైన్‌కామర్స్ జోరుతో పెరిగిన వినియోగం
- అమెజాన్ వద్ద పనిచేస్తున్న 10 లక్షల రోబోలు
- రోబోల కొనుగోళ్ల వృద్ధిలో 2023లో భారత్ టాప్

మనదేశంలోనూ... గిడ్డంగుల ఆటోమేషన్‌రంగంలో ప్రముఖ కంపెనీలు

- టీవీఎల్ మ్యానుఫాక్చరింగ్ సొల్యూషన్స్
- ఏబీబీ ఇండియా
- ఫానుక్ ఇండియా
- యాడ్‌వర్బ్ టెక్నాలజీస్
- గోద్రెజ్ కర్బర్
- హైటెక్ రోబోటిక్ సిస్టమ్స్
- మహీంద్రా లాజిస్టిక్స్
- ఆమ్స్‌మేనీ
- రోబోటిక్స్ ఇండియా
- ఫాల్కన్‌ఆటోటెక్

సాధారణంగా గిడ్డంగి అనగానే వందలాది కార్మికులు, కార్యకలాపాలను పర్యవేక్షించే మేనేజర్ల హడావుడి ఉంటుంది. ఇదంతా గతం.. దిగ్గజ ఈ–కామర్స్ సంస్థలు, థర్డ్–పార్టీ సరుకు రవాణా సేవల సంస్థలు, తయారీ కంపెనీల అధునాతన ఆటోమేషన్‌పుణ్యమా అని ఇప్పుడు గిడ్డంగుల్లో రోబోలు సందడి చేస్తున్నాయి. గిడ్డంగిలోకి వచ్చిన సరుకులను వాహనం నుంచి దింపడం మొదలు.. లోపల ఉన్న అరల్లో సర్దడం వరకు రోబోలే చకచకా పనులన్నీ చేసిపెడుతున్నాయి. అంతేనా.. ఆన్‌లైన్‌లో ఆర్డర్ వచ్చిందే తడవుగా అర దగ్గరకు వెళ్లి కావాల్సిన వస్తువును తీసుకొచ్చి ప్యాకింగ్ ప్రదేశంలో అప్పగించడమూ వాటికి తెలుసు. ఆర్డర్ ఇచ్చిన గంటల్లో లేదా అదే రోజు వస్తువులు కస్టమర్లకు చేరుతున్నాయంటే ఈ వేగం వెనుక ఆటోమేషన్‌ఉంది.

ఈ–కామర్స్, క్విక్ కామర్స్‌కు పెరుగుతున్న డిమాండ్, సరుకు రవాణాలో స్థిరత్వంపై పెరిగిన శ్రద్ధ, పరిశ్రమల్లో ఆటోమేషన్, డిజిటలైజేషన్ కోసం ప్రభుత్వ ప్రోత్సాహకాలు.. వెరసి గిడ్డంగుల్లో అధునాతన ఆటోమేషన్‌కొలువుదీరుతోంది. నిల్వలు, ఆర్డర్లు, సరుకు నిర్వహణ వంటి సంప్రదాయకంగా మనుషులు చేసే పనులను రోబోలు, యంత్రాలు చక్కబెడుతున్నాయి. దీంతో సామర్థ్యం, భద్రత, స్థల వినియోగం మెరుగుపడడం, వేగంగా డెలివరీలు చేసే అవకాశం, కచ్చితత్వంతోపాటు కార్మిక వ్యయాలు తగ్గడం ఈ రంగ కంపెనీలకు కలిసి వచ్చే అంశం. సాంకేతికత వినియోగంలో సుస్థిర స్థానం దిశగా భారత్ పయనిస్తోంది.

డెలివరీల వేగం

భారత్‌లో గిడ్డంగుల ఆటోమేషన్‌మార్కెట్ విలువ 2024లో 713 మిలియన్‌డాలర్లు ఉంది. ఏటా 15.36 వార్షిక వృద్ధితో ఈ పరిశ్రమ 2033 నాటికి 2,579 మిలియన్‌డాలర్లకు చేరుకుంటుందన్న అంచనాలు ఉన్నాయి. ఈ–కామర్స్ రంగం వేగంగా వృద్ధి చెందడం, కార్మిక వ్యయాలు పెరగడం, అలాగే క్విక్ కామర్స్ రాకతో తీవ్ర పోటీ ఏర్పడి ఆర్డర్లను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఏర్పడటం ఆటోమేషన్‌కు ఆజ్యం పోస్తోంది. రోబోటిక్స్‌తోపాటు ఆటోమేషన్‌లో భాగంగా కన్వేయర్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌ను అన్ని కంపెనీలూ అందిపుచ్చుకుంటున్నాయి.

వరుసలో దిగ్గజాలు

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫాక్స్‌కాన్, వాల్‌మార్ట్, టెస్లా తదితర దిగ్గజ కంపెనీలు తయారీ కేంద్రాలు, గిడ్డంగుల్లో ఆటోమేషన్‌కు పెద్దపీట వేస్తున్నాయి. ఇవి ఆటోమేటెడ్ రోబోలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నాయి. యాపిల్, ఇతర టెక్ దిగ్గజాలకు ప్రధాన తయారీ భాగస్వామి అయిన ఫాక్స్‌కాన్‌తన కర్మాగారాలలో 60 వేల మంది కార్మికులను రోబోలతో భర్తీ చేసింది. రోబోలను తయారు చేసే కంపెనీల్లో ఏబీబీ, ఫానుక్, కుక, యస్కావా, బోస్టన్‌డైనమిక్స్ వంటివి ముందున్నాయి.

రోబోల కంపెనీనే కొనేసింది

అమెజాన్‌2012లో 775 మిలియన్‌డాలర్ల వ్యయంతో ఏకంగా రోబోల తయారీలో ఉన్న 'కివా సిస్టమ్స్'అనే కంపెనీనే కొనుగోలు చేసిందంటే వీటికి ఉన్న ప్రత్యేకత, క్రేజ్ అర్థం చేసుకోవచ్చు. అమెజాన్‌వద్ద ప్రస్తుతం 10 లక్షలకు పైగా రోబోలు పని చేస్తున్నాయని సమాచారం. ఈ సంఖ్య అమెజాన్‌లో ఉన్న మొత్తం ఉద్యోగులకు దాదాపుగా సమానం. ఈ ఆన్‌లైన్‌దిగ్గజ కంపెనీ వద్ద ఉన్న 'వల్కన్'రోబోకు.. మనుషులు నిచ్చెన వేసుకుంటేనే కానీ అందని అరల నుంచి కూడా ఎంపిక చేసిన వస్తువులను తీయడంలో నైపుణ్యం ఉంది. సాటి రోబోలతో, మానవ కార్మికులతో కలిసి పని చేసే నేర్పు కూడా వల్కన్‌కు ఉంది. స్పర్శ ఆధారంగా సున్నితమైన వస్తువులతో సున్నితంగా వ్యవహరించడం దీని మరో ప్రత్యేకత.



గిడ్డంగుల్లో అధునాతన సాంకేతికత

అటానమస్ మొబైల్ రోబో: ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా సరుకులను అరల నుంచి ప్యాకింగ్ ప్రదేశానికి తీసుకురావడం, అరల్లో సర్దడం, రవాణాకు సిద్ధం చేయడం, వాహనాల్లో నింపడం వంటి పనులను అలవోకగా చక్కబెడుతున్నాయి.

ఆటోమేటెడ్ గైడెడ్ వెహికల్స్: సరుకులను తరలించడానికి ముందే నిర్దేశించిన మార్గాలను అనుసరించే వాహనాలు.

ఆటోమేటెడ్ స్టోరేజ్, రిట్రీవల్ సిస్టమ్స్: రోబోలు, ఇతర ఆటోమేటెడ్ యంత్రాలను ఉపయోగించి వస్తువులను నిర్దేశిత ప్రాంతంలో నిల్వ చేయడం, అలాగే అరల్లో నుంచి తీయడానికి ఉపయోగిస్తున్నారు.

భారత్‌లో 6 రెట్ల వృద్ధి

- → 2023లో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక రోబోల ఇన్‌స్టాలేషన్స్ 10% పెరిగాయి. భారత్ ప్రపంచంలో అత్యధికంగా 6 రెట్ల వృద్ధి (59%) సాధించింది. వృద్ధి పరంగా తరువాతి స్థానాల్లో యూకే, కెనడా, స్పెయిన్‌నిలిచాయి.
- → 2023లో చైనా అత్యధికంగా 2.76 లక్షల పారిశ్రామిక రోబోలను కొనుగోలు చేసింది. చైనా తర్వాతి జపాన్, యూఎస్, దక్షిణ కొరియా, జర్మనీ, ఇటలీ, భారత్ ఉన్నాయి. భారత్ ఖాతాలో ఆ ఏడాది 8,510 యూనిట్లు వచ్చి చేరాయి.
- → 2023లో ప్రపంచవ్యాప్తంగా కొత్తగా 5,40,000కుపైగా పారిశ్రామిక రోబోలు రంగ ప్రవేశం చేశాయి. 2021 నుంచి ఏటా 5,00,000 యూనిట్లకుపైగా రోబోలు తయారీ కేంద్రాలు, గిడ్డంగుల్లో అడుగుపెడుతుండడం విశేషం.
- → ప్రపంచవ్యాప్తంగా కర్మాగారాల్లో పారిశ్రామిక రోబోల సంఖ్య 2023 నాటికి 42.8 లక్షల యూనిట్లు దాటింది.
- → రోబోల వినియోగంలో వాహన తయారీ రంగం ముందంజలో ఉంది. ఆ తరువాత ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెటల్, మెషినరీ, ప్లాస్టిక్స్, రసాయనాలు, ఆహారోత్పత్తుల తయారీ రంగాలు ఉన్నాయి.

హెచ్‌సీఏ కేసులో రంగంలోకి ఈడీ..

- కేసు వివరాలు ఇవ్వాలని సీఐడీకి లేఖ
- ఆర్థిక అక్రమాలపై ఈడీ దర్యాప్తు చేసే అవకాశం... సీఐడీ నుంచి వివరాలు రాగానే కేసు నమోదు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి పెట్టింది. తెలంగాణ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్ట్ సహా ఇప్పటికే సీజ్ చేసిన హెచ్‌సీఏ రికార్డులను అందించాలని శుక్రవారం సీఐడీకి లేఖ రాసింది. సీఐడీ అందించే కేసు రికార్డులు, హెచ్‌సీఏ నిధులు, నిందితుల ఆర్థిక లావాదేవీల ఆధారంగా దర్యాప్తు చేయనుంది. సీఐడీ నుంచి ప్రాథమిక ఆధారాలు అందిన తర్వాత ఈడీ అధికారులు మనీలాండరింగ్ కోణంలో ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేయనున్నారు. సీఐడీ అధికారులు సేకరించిన ప్రాథమిక ఆధారాల ప్రకారం పలు టెండర్లలో కోట్ల రూపాయలు దారి మళ్లించినట్టు తేలింది. ఈడీ అధికారులు ప్రధానంగా నిధుల మళ్లింపుపైనే ఫోకస్ పెట్టనున్నారు. జగన్మోహన్‌రావుతోపాటు శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజేందర్‌యాదవ్, ఆయన భార్య కవితలతో కలిసి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి హెచ్‌సీఏలోకి వచ్చినట్టు ప్రధాన ఆరోపణ. ఇందుకు సంబంధించి సైతం సీఐడీ పక్కా ఆధారాలు సేకరించింది. ఈ కేసులో సీఐడీ ఇప్పటికే జగన్మోహన్‌రావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈవో సునీల్ కాంటె మరో ఇద్దరిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

అంతులేని దోపిడీ

నిందితుల బ్యాంక్ అకౌంట్స్‌ను విశ్లేషించేందుకు సంబంధిత బ్యాంకుల నుంచి ఈడీ అధికారులు సమాచారం కోరనున్నారు. ప్రధానంగా నిందితుల ఆర్థిక లావాదేవీలపైనే ఈడీ ఫోకస్ పెట్టనుంది. హెచ్‌సీఏ నిర్వాహకులు అంతులేని అవినీతికి పాల్పడినట్లు సీఐడీ అధికారులు చెబుతున్నారు. 1,340 క్రికెట్ బాల్స్ కొనుగోలు చేసేందుకు రూ.కోటి వెచ్చించినట్లు సీఐడీ దర్యాప్తులో గుర్తించింది. ఐపీఎల్ మ్యాచ్‌కు ముందు ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో పాడైన కుర్చీలను మార్చి ఎస్ఆర్‌హెచ్ (సన్‌రైజర్స్ హైదరాబాద్) యాజమాన్యం కొత్త కుర్చీలను ఏర్పాటు చేసింది. వాటిని తామే పెట్టించినట్టు హెచ్‌సీఏ పెద్దలు లెక్కలు చూపి పెద్దమొత్తంలో నిధులు పక్కదారి పట్టించినట్టు ఆరోపణలు ఉన్నాయి. వీటిపైనా ఈడీ అధికారులు దర్యాప్తు చేయనున్నారు. హెచ్‌సీఏలోకి చేరకముందు సంతకాల ఫోర్జరీ వ్యవహారంలో కూడా నిందితుల మధ్య ఏమైనా ఆర్థిక లావాదేవీలు జరిగాయా? హెచ్‌సీఏలోకి వచ్చిన తర్వాత వీరంతా నిధుల మళ్లింపునకు ఎంచుకున్న మార్గాలు ఏంటి అన్న అంశాలపైనా ఈడీ అధికారులు లోతుగా ఆరా తీసే అవకాశం ఉంది.

తెలంగాణ, అమెరికా స్ఫూర్తిలో సారూప్యత

- అమెరికాకు స్వాతంత్య్రం తర్వాత ప్రపంచం మారిపోయింది
- తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఎదిగేందుకు మీ సహకారం కావాలి
- అమెరికా స్వాతంత్య్ర దిన వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, హైదరాబాద్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్

సాక్షి, హైదరాబాద్: అమెరికా సంయుక్త రాష్ట్రాలకు స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రపంచం పూర్తిగా మారిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచం ముందు అమెరికా అనేక సానుకూల అంశాలను ఆవిష్కరించిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా, నిరంతర ఆవిష్కరణలను అందించే దేశంగా అమెరికా ప్రపంచ దృక్కోణాన్ని పూర్తిగా మార్చివేసిందని అన్నారు. అమెరికా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 'ఓటమిని ఎప్పుడూ అంగీకరించని స్ఫూర్తి అమెరికాది. బలమైన దేశంగా ఉంటూనే సానుకూల మార్గంలో పరిష్కారాలను చూపగలగడం ఆ దేశ ప్రత్యేకత. అమెరికా స్ఫూర్తికి, తెలంగాణ స్ఫూర్తికి సారూప్యత ఉంది. స్నేహాన్ని కోరుకోవడం, బంధాలను పటిష్టం చేసుకోవడం తెలంగాణ ప్రత్యేకత. 2008లో ముఖ్యమంత్రిగా డాక్టర్. వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడే హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ ఏర్పాటైంది. భారత్‌తో దౌత్య సంబంధాలను మెరుగుపర్చుకోవడంలో అమెరికా ఎంతో నిబద్ధతతో పనిచేసింది. అమెరికాకు, తెలుగు ప్రజల మధ్య ఉన్న స్నేహం చాలా బలమైంది. అమెరికాలో తెలుగు భాష వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఐటీ, ఫార్మా, డిఫెన్స్, మాన్యుఫాక్చరింగ్, ఏరోస్పేస్ వంటి రంగాలకు చెందిన 200 అమెరికా కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. ఎంతో మంది విద్యార్థులు తమ కలలను నెరవేర్చుకోవడానికి అమెరికా వెళుతున్నారు. అమెరికా, తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపరచడానికి మేం ప్రయత్నిస్తున్నాం. తెలంగాణను 2035 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి కట్టుబడి మా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందుకు అమెరికన్ల మద్దతు కావాలి'అని కోరారు. అమెరికాలోని అత్యుత్తమ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. రెండు దేశాల సంస్కృతుల మధ్య, ప్రజల మధ్య వాణిజ్య, స్నేహపూర్వక సంబంధాలను మెరుగుపర్చడంలో హైదరాబాద్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ బలమైన వారధిగా నిలుస్తున్నారని రేవంత్ ప్రశంసించారు. అనంతరం జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ.. భారత్–అమెరికా మధ్య బలమైన సంబంధం ఉందని తెలిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు ఇరు దేశాల సహకారం తప్పకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజాసింగ్ రాజీనామాకు బీజేపీ ఆమోదం

ఎమ్మెల్యే పదవికి రాజీనామా లేఖను స్పీకర్‌కు ఇవ్వాలని సూచన



సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను పార్టీ అధిష్టానం ఆమోదించింది. ఆయన గత నెల 30న బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాజాగా శుక్రవారం..గోషామహల్ ఎమ్మెల్యే రాజీనామాను అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదించినట్టు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి అరుణ్‌సింగ్ ప్రకటించారు. 'రాజాసింగ్ రాజీనామా లేఖలో పేర్కొన్న విషయాలు అసంబద్ధమైనవిగా ఉన్నాయి. పార్టీ కార్యకలాపాలు, సిద్ధాంతాలు, సూత్రాలకు సరిపోవడం లేదు. పార్టీ పని తీరు, భావజాలం, సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయి..'అని పార్టీ అధ్యక్షుడు భావించినట్లు అరుణ్‌సింగ్ తెలిపారు. దీంతో రాజాసింగ్ రాజీనామాపై దాదాపు పన్నెండు రోజుల సందిగ్ధతకు తెరపడినట్టైంది. బీజేపీలో ఆయన 11 ఏళ్ల ప్రస్థానం ముగిసినట్టైంది. కాగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా లేఖను స్పీకర్‌కు ఇవ్వాలని బీజేపీ స్పష్టం చేసింది. రాజాసింగ్ కరుడుగట్టిన హిందుత్వ వాదిగా ముద్రపడ్డారు. 2009లో తొలిసారిగా టీడీపీ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందిన ఆయన రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. 2014, 2018, 2023 శాసనసభ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించారు. అయితే గత కొంత కాలంగా ఆయన బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీపై విమర్శలు గుప్పించారు. ఇదే క్రమంలో ఆయన చేసిన రాజీనామాను అధిష్టానం ఆమోదించడంతో..ఆయన భవిష్యత్ కార్యాచరణ, మరేదైనా పార్టీలో చేరతారా? అనే రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యింది.

వివాదాలు.. విమర్శలు

రాజాసింగ్ జూన్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. 'మీడియాలో ఒక వార్త నడుస్తోంది. రాజాసింగ్‌కు నోటీసు ఇవ్వడానికి రాష్ట్ర పార్టీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అది నిజమే అయితే... నోటీసు కాదు, ఏకంగా సస్పెండ్ చేయండి. కొజ్జాగాళ్లతో కలిసి పార్టీని బలోపేతం చేయలేము. కార్యక్రమాలు చేపట్టలేము. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేము. ఒకవేళ సస్పెండ్ చేస్తే ఎవరి వల్ల పార్టీకి నష్టం జరిగిందనే నిజాలను బయటపెడతా. అందరి జాతకాలను ప్రజల ముందు ఉంచుతా'అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై స్పందిస్తూ 'బీజేపీలోని వాళ్లకు ప్యాకేజీలు భారీగా వస్తే.. వీళ్లే విలీనం చేస్తారు'అంటూ కామెంట్ చేశారు. దాంతో కరీంనగర్ కార్యకర్తల నుంచి నిరసన వ్యక్తం కావడంతో.. 'దొంగలు దొంగలు కలిసిపోయారు..'అంటూ వివాదాస్పద కామెంట్లు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆయన వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అధిష్టానం అప్పుడు కొంతకాలం సస్పెండ్ చేసింది. తిరిగి ఎన్నికలకు ముందు పార్టీ టికెట్ ఇవ్వడం, ఆయన గెలవడంతో వివాదం సద్దుమణిగింది. అయితే ఆ తర్వాత కొంతకాలం నుంచి పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు.

గోషామహల్ ఇన్‌చార్జి ఎవరు..?

రాజాసింగ్ రాజీనామాతో గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికి ఇస్తారనే చర్చ బీజేపీలో జోరుగా సాగుతోంది. దీనిపై పార్టీ మాత్రం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. పార్టీ కేడర్‌తో పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాతే దీనిపై స్పష్టత వస్తుందని పార్టీ సీనియర్లు చెబుతున్నారు.

బీజేపీ రామచంద్రా.. నోరు తెరవరేం?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఏపీలో భద్రాచలం ఆలయ భూములను కాపాడండి



సాక్షి, హైదరాబాద్: భద్రాచలం రామచంద్రస్వామి దేవస్థానం భూములు ఆక్రమణలకు గురవుతున్నా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 'బీజేపీ రామచంద్రా.. నోరు తెరవరేం. రాములోరి భూములను కొందరు ఆక్రమించుకుంటుంటే, మాటైనా మాట్లాడరేం. మీ భాగస్వామి ప్రభుత్వ చెరలో ఉన్నాయని వదిలేస్తున్నారా? లేక ఈసారి మొత్తం భద్రాద్రినే గంపగుత్తగా వారి చేతిలో పెడదామనుకుంటున్నారా? ఓట్ల కోసమే చేసే మీ రామజపాలను, సీట్ల కోసమే వేసే మీ దొంగ నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. మోదీతో మాట్లాడతారో, మీ దోస్తు దగ్గర మోకరిల్లుతారో.. మీ ఇష్టం. భద్రాద్రిని కాపాడండి. ఆక్రమణల చెర నుంచి విడిపించండి'అని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ డిమాండ్ చేశారు. పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచల రామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన 889 ఎకరాల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. అయితే ఈ అంశంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఏపీలోని రాజకీయ పొత్తులు పక్కన పెట్టి, భద్రాచల దేవస్థానం భూములను కాపాడేందుకు ముందుకు రావాలన్నారు. దేవస్థానం భూముల వ్యవహారంలో హైకోర్టు ఉత్తర్వులను అమలుచేసేలా చూడాలని కేటీఆర్ సూచించారు. కాగా, తెలంగాణ నీటిపారుదల రంగానికి విశేషమైన సేవలందించిన ఇంజనీర్ నవాబ్ అలీ నవాబ్ జంగ్ బహదూర్ జయంతి సందర్భంగా కేటీఆర్ ఆయనకు నివాళి అర్పించారు. అలాగే ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

తిరుమల లడ్డూపై నిష్పాక్షికంగా దర్యాప్తు చేయండి

- ఆ దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించండి
- సీబీఐ డైరెక్టర్‌కు ఏపీ హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వివాదంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు చేస్తుండడంతో దాని డైరెక్టర్‌కు హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తును స్వతంత్రంగా, నిష్పాక్షికంగా కొనసాగించాలని సుప్రీం ఏర్పాటు చేసిన సిట్‌ను ఆదేశించింది. ఈ దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించాలని సీబీఐ డైరెక్టర్‌ను ఆదేశించింది. కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తు అధికారిగా అదనపు ఎస్పీ జె.వెంకటరావును నియమించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. 'కల్తీ నెయ్యి వ్యవహారంలో సుప్రీంకోర్టు సీబీఐ సిట్ కంటే ముందు రాష్ట్ర ప్రభుత్వం ఓ సిట్ ఏర్పాటు చేసింది. ఇందులో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, విశాఖపట్నం డీఐజీ జెట్టి గోపీనాథ్, తిరుపతి ఏఎస్పీ వెంకటరావుతో సహా 9 మంది ఉన్నారు. సుప్రీంకోర్టు ఆ తర్వాత దీని స్థానంలో సీబీఐ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో సీబీఐ అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఇద్దరు అధికారులకు స్థానం కల్పించాలని ఆదేశాలిచ్చింది. ఆ మేరకు ఏర్పాటైన సిట్‌లో వెంకటరావు పేరు లేదు. కానీ, ఆయనను చేర్చడం వల్ల సుప్రీంకోర్టు సిట్‌లోని సభ్యుల సంఖ్యను దాటింది. ఇది సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే. దర్యాప్తు అధికారిగా వెంకటరావును నామినేట్ చేసే అధికారం సీబీఐ డైరెక్టర్‌కు ఉందని సీబీఐ న్యాయవాది చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించిన తీర్పులేవీ ప్రస్తుత కేసుకు వర్తించవు. ఈ కేసు కోట్ల మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉంది. అమూల్యమైన లడ్డూ ప్రసాదం పవిత్రతపై తలెత్తిన వివాదం మీద జరుగుతున్న దర్యాప్తు ఇది. అందువల్ల దర్యాప్తు సుప్రీంకోర్టు ఆదేశాలకు కట్టుబడి జరగాల్సిందే' అని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ శుక్రవారం తీర్పు వెలువరించారు.

రాజకీయాల కోసమే హిందీ వ్యతిరేక ఉద్యమాలు

- హిందీని సమర్థిస్తే మన మాతృభాషను వ్యతిరేకించినట్టు కాదు
- రాజ్యభాష స్వర్ణోత్సవాల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



రాజ్యభాష స్వర్ణోత్సవాల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశాన్ని ఏకం చేయడంలో, మన సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేయడంలో భాషలు కీలక భూమిక పోషిస్తాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భారతీయ సంస్కృతిని, సంపన్న సంప్రదాయాలను, ప్రాచీన వారసత్వాన్ని బలపరిచేందుకు విదేశీ భాషలకు బదులుగా మన భారతీయ భాషల వాడకం ఎంతో అవసరమన్నారు. అయితే కొందరు తమ రాజకీయ లబ్ధి కోసం అధికారిక భాష హిందీకి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులో చోటుచేసుకున్న పరిణామాలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'హిందీ భాషకు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనలు భాషా వ్యతిరేక ఆందోళనలు కావు.. అవి పూర్తిగా రాజకీయ ఆందోళనలు మాత్రమే. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఇలాంటి అంశాలవైపు ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, హిందీ వ్యతిరేక ఉద్యమాలు చేయాలనుకునే వారికి స్పష్టం చేస్తున్నా.. మన అధికారిక భాష హిందీ అన్నది మరవద్దు'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్యభాష విభాగం స్వర్ణోత్సవాలకు కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో రాజభాషా విభాగం భారతీయ భాషలు, ఇతర మాతృభాషలతోపాటుగా హిందీ ప్రాచుర్యాన్ని పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దేశంలోని ప్రతీ భాష మన సంస్కృతికి ఆభరణం వంటిదని ఆయన పేర్కొన్నారు. దేశంలోని అనేక ప్రాంతీయ భాషలు పూలవంటివి అయితే, వాటన్నింటినీ అందమైన మాలగా మార్చే దారం హిందీ భాష అని అన్నారు. హిందీ భాషను సమర్థించినంత మాత్రాన మన మాతృభాషను వ్యతిరేకించినట్టు కాదని స్పష్టం చేశారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ, హిందీ భాష విస్తరణలో ఏపీ, తెలంగాణకు చెందిన ఎంతో మంది కవులు, రచయితలు కృషి చేశారన్నారు. భాష అనేది ప్రజలను కలిపి ఉంచుతుందన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, హిందీని వద్దు అనుకోవడం అంటే రాబోయే తరాల భవిష్యత్తును అడ్డుకోవడమే అవుతుందన్నారు. దక్షిణాది రాష్ట్రాల సినిమాల ఆదాయంలో 31 శాతం హిందీ భాషలో డబ్ చేయడం ద్వారానే వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు మాణిక్ అంబాజీ, అనంత్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర ఉత్తర్వులివ్వలేం

▶ మొదటి పేజీ తరువాయి

2024, డిసెంబర్‌లోనే ఇంజనీరింగ్ కళాశాలలు ప్రతిపాదనలు సమర్పించాయన్నారు. మార్చిలో కమిటీ ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందన్నారు. దీనికి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలే సాక్ష్యమని చెప్పారు. ఇప్పటివరకు ఏ నిర్ణయం తీసుకోకుండా కమిటీ కాలయాపన చేయడం వల్ల కాలేజీలు నష్టపోతున్నాయన్నారు. టీఏఎఫ్ఆర్‌సీ తరఫు సీనియర్ న్యాయవాది శ్రీ రఘురాం వాదనలు వినిపిస్తూ.. కాలేజీలు లాభాపేక్షతో పనిచేయొద్దని సుప్రీంకోర్టు గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ, కాలేజీల ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోవడానికి సమయం పట్టే అవకాశం ఉన్నందున బ్లాక్ పీరియడ్ (2022–23 నుంచి 2024–25)లోని ఫీజులనే 2025–26 సంవత్సరానికి సిఫార్సు చేసిందన్నారు. మధ్యంతర ఉత్తర్వుల్లో పెంపునకు అనుమతిస్తే తీర్పు విరుద్ధంగా వచ్చినా తిరిగి విద్యార్థులకు చెల్లించరని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. టీఏఎఫ్ఆర్‌సీ, టీజీ ఎప్‌సెట్‌కు పలు సూచనలు చేశారు.

ఏడాదిన్నరలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా 60 వేల మందికి ఉపాధి
- 2024– 25లో రూ.66 వేల కోట్ల ఉత్పత్తులు ఎగుమతి



గచ్చిబౌలిలో జరిగిన సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న ఏసీసీఈఐ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్/రాయదుర్గం: తెలంగాణను 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్'గా మార్చేందుకు కృషిచేస్తున్నామని, ఈ క్రమంలో కేవలం లైఫ్‌సైన్సెస్‌లోనే ఏడాదిన్నరలో రూ.50 వేల కోట్లకుపైగా పెట్టుబడులను ఆకర్షించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అదే సమయంలో కొత్తగా 60 వేల మందికి ఉపాధి లభించిందన్నారు. శుక్రవారం హైటెక్ సిటీ ట్రైడెంట్ హోటల్‌లో 'ఈటీ, ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్'రెండో ఎడిషన్‌ను మంత్రి శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, '2024–25లో రూ.66 వేల కోట్ల విలువైన లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులను తెలంగాణ ఎగుమతి చేసింది. ప్రపంచానికి కావాల్సిన మూడింట ఒక వంతు వ్యాక్సిన్లను అందిస్తూ హైదరాబాద్ 'వ్యాక్సిన్ రాజధాని'గా ప్రసిద్ధి చెందింది. దేశంలో అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్క్ నుంచి 'మేడ్ ఇన్ తెలంగాణ'స్టెంట్లు, కేథెటర్లు యూఎస్, జపాన్ సహా 89 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. లైఫ్ సైన్సెస్ రంగంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొత్తగా ఐదు లక్షల మందికి ఉపాధి అవకాశాలను కల్పించాలని నిర్ణయించాం. దీని కోసం రూ.లక్ష కోట్లతో దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అమలు చేయబోతున్నాం. అందరి అభిప్రాయాలను సేకరించి వికారాబాద్, నల్లగొండ, మెదక్ లో ఫార్మా విలేజెస్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం'అని వెల్లడించారు. కాగా, లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలోనే 'లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. ఈ యూనివర్సిటీలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను జీవశాస్త్ర దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో అందిస్తామని వివరించారు.

ఆధునిక సాంకేతికతతో నిర్మాణాలు అవసరం

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో నిర్మాణాలు చేయాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా హైదరాబాద్ సెంటర్ (ఏసీసీఈఐ) ఆధ్వర్యంలో 'తదుపరి తరం హైరైజ్ భవనాలు–మిశ్రమ, స్టీల్ నిర్మాణాలలో పురోగతి'అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైరైజ్ భవనాల ఆవశ్యకత భవిష్యత్తుకు ఎంతో అవసరమని, జనాభా పెరుగుదలతోపాటు భూమి ఆశించిన మేరకు అందుబాటులో లేకపోవడంతో ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వీటి నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం మంత్రి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. తర్వాత స్టాళ్లను ప్రారంభించి తిలకించారు. కార్యక్రమంలో ఏసీసీఈ(ఐ) ఉపాధ్యక్షుడు, ప్రెసిడెంట్–సౌత్ రాజ్ కుమార్ కాచర్ల, పాలక మండలి సభ్యుడు కాశీరామ్ ఆడెపు, హైదరాబాద్ సెంటర్ వైస్‌చైర్మన్ భీమ్‌రావు జాలిగామ తదితరులు పాల్గొన్నారు.



వసతి ఇలా... వానొస్తే ఎలా?

మావల మండల కేంద్రంలోని ఈ భవనంలో జైనథ్ మండలానికి చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. పదేళ్లుగా ఇది అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ పాఠశాలలో 600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. భవనం శిథిలమై అసౌకర్యంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భవనానికి కిటికీలు కూడా లేకపోవడంతో.. ఇటీవలి వర్షాలకు నీరు లోపలకు రాకుండా గోనె సంచులు, చద్దర్లు, అట్టముక్కలు కడుతున్నారు. వర్షాకాలం కావడంతో పురుగు, పుట్రతో భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బీసీల రిజర్వేషన్లకు సహకరించండి

- రాష్ట్రంలోని రాజకీయ పార్టీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ వినతి
- రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదంతో గాంధీభవన్‌లో సంబురాలు
- టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకున్న కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. 'బీసీల నోటికాడి ముద్దను లాక్కోకండి. మా పార్టీ సీనియర్ నేత కేశవరావుతో సహా అందరం రెండు చేతులు జోడించి దండం పెడుతున్నాం. అందరూ మద్దతివ్వండి'అని ఆయన విజ్ఞప్తి చేశారు. బీసీ వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో టీపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీభవన్‌లో సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, టపాసులు కాల్చి.. స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన పొన్నం ప్రభాకర్.. మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు తదితరులతో కలసి విలేకరులతో మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అంశం చరిత్రాత్మకమైనదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తరహాలో ఇప్పుడు కూడా ఉక్కు కవచంలా ఏర్పడి కాంగ్రెస్ పార్టీలోని బీసీ నేతలు, కుల సంఘాల నేతలు ముందుకు పోవాలని కోరారు. తమకు రాహుల్‌గాంధీ మార్గదర్శి అని, తెలంగాణలో సామాజిక న్యాయం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లు ముందుకు వచ్చారని పొన్నం ప్రభాకర్ చెప్పారు. కానీ బీజేపీ బీసీలకు వ్యతిరేకంగా పనిచేస్తోందని, అనవసరంగా ఈ విషయంలో జోక్యం చేసుకుని బీసీ వర్గాల ప్రజల్లో వ్యతిరేకత తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని బీజేపీ నేతలు ఢిల్లీ వెళ్లి రిజర్వేషన్ల చట్టానికి రాష్ట్రపతి ఆమోదం లభించేలా కృషిచేయాలని కోరారు. బీఆర్ఎస్ కూడా బీసీ రిజర్వేషన్లకు మద్దతివ్వాలని పొన్నం విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పంచాయతీరాజ్ ఎన్నికలు 18 నెలలు ఆలస్యమయ్యాయని, ఇప్పుడైనా ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని అన్ని రాజకీయ పార్టీలను ఆయన కోరారు.



మంత్రి పొన్నంకు స్వీటు తినిపిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

కల నెరవేరింది: కేశవరావు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కల నెరవేరిందని అన్నారు. ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రుల బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అంబరాన్నంటిన సంబురాలు

బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రివర్గం ఆర్డినెన్స్ చేసిన నేపథ్యంలో టీపీసీసీ పిలుపు మేరకు గాంధీభవన్‌లో పెద్ద ఎత్తున సంబురాలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టపాసులు పేల్చిన కాంగ్రెస్ నేతలు, స్వీట్లు పంచుకుని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం కోసం కృషి చేసిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు నూతి శ్రీకాంత్, మెట్టు సాయికుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వరరావు, ఇతర నేతలు అల్లం భాస్కర్, గజ్జి భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

కవిత లేదు.. భవిత లేదు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఏం సంబంధమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. 'బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోంది. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి రుజువైంది. మేం చేసిన దానికి కవిత రంగులు పూసుకోవడం ఏంటి? చోటామోటా ధర్నాలు చేసి తన వల్లే ఇదంతా అయిందని అనడమేంటి? కవిత లేదు.. భవిత లేదు. ఆమెను చూసి జనం నవ్వుకుంటున్నారు'అని శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పదేళ్లు బీసీలకు ఏం వెలగబెట్టారని ఇప్పుడు కవిత బీసీ పాట పాడుతోందని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు రాహుల్‌గాంధీ ఎజెండా, రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. చారిత్రక నిర్ణయం తీసుకుని రాహుల్ ఆశయాన్ని నెరవేర్చిన అగ్రవర్ణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచిపోతారని మహేశ్‌గౌడ్ కొనియాడారు.

బీసీలంటే కేసీఆర్‌కు చులకన

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



సాక్షి, హైదరాబాద్: బీసీలంటే కేసీఆర్‌కు చులకనని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. బీసీలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. షబ్బీర్ అలీ శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ అన్ని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి ఆకాంక్షించే నేతలని, అందుకే కామారెడ్డిలో ఇచ్చిన మాట ప్రకారం మాట నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. బీసీ డిక్లరేషన్ తన ఇంట్లో, తన నియోజకవర్గంలో జరగడం సంతోషంగా ఉందన్నారు. ఈ రోజు తెలంగాణ అంతా పండుగ వాతావరణం ఉందని, బీసీలు సంతోషంగా సంబురాలు చేసుకుంటున్నారన్నారు. కేసీఆర్ కంటే తానే సీనియర్‌నని, దమ్ముంటే చర్చకు తనతో రావాలని సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ టికెట్ ఎవరికిచ్చినా కచ్చితంగా పార్టీ కోసం ప్రచారం చేస్తానని షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

కోటాకు కాపు కాద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

కేసులు వేసినా వాటి ప్రభావంతో నష్టం జరగకుండా ఇటు హైకోర్టులోనూ, అటు సుప్రీంకోర్టులోనూ కేవియట్ పిటిషన్లు వేయాలని సీఎంను ఆర్.కృష్ణయ్య కోరినట్లు తెలిసింది.

కోర్టుకెళ్లినా గెలిచేది బీసీలే: ఆర్.కృష్ణయ్య

సీఎం రేవంత్‌ను కలిసిన అనంతరం ఆర్.కృష్ణయ్య 'సాక్షి'తో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యయుతంగా, రాజ్యాంగబద్ధమైన వాటా 75 ఏళ్ల తర్వాత బీసీలకు అందుతోందని.. దీనికి ఎవరూ అడ్డుపడొద్దని విజ్ఞప్తి చేశారు. 'బీసీల జనాభా లెక్కలు అందుబాటులో ఉన్నాయి. అసెంబ్లీలో బిల్లు పాసైనందున చట్టబద్ధత వచ్చింది. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్‌ను సుప్రీంకోర్టు ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో ఎవరైనా కోర్టుల్లో కేసులు వేసినా గెలిచేది బీసీలే. కానీ ఎవరినీ కేసులు వేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. ఒకవేళ ఎవరైనా కేసులు వేసినా కోర్టుల్లో పోరాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంచి న్యాయవాదులను పెట్టాలి. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కేసులు వేసేందుకు పార్టీల పరంగా ఎవరైనా ప్రోత్సహించినట్టు తెలిస్తే వారిని బయటకు లాగుతాం. బీసీ ప్రజల కోర్టులో నిలబెట్టి ఆ పార్టీల భరతం పడతాం'అని హెచ్చరించారు. సీఎం రేవంత్‌ను కలిసిన వారిలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులున్నారు. అంతకుముందు బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. మంత్రివర్గ నిర్ణయం బీసీల పోరాట విజయమని పేర్కొన్నారు.

కేవియట్ వేసిన తర్వాత ఆర్డినెన్స్ ఇవ్వాలి: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా హైకోర్టులో కేవియట్ దాఖలు చేసిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసే ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదముద్ర వేసేలా రాష్ట్ర బీజేపీ నేతలు చొరవ తీసుకోవాలన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం ఈనెల 17న తాము చేపట్టనున్న రైల్ రోకోను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కవిత ప్రకటించారు. ఆర్డినెన్స్ జారీలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి తెలంగాణ జాగృతి నిరంతర పోరాటం వల్లే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేస్తామని ప్రకటించింది. గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ భేటీలో కేవలం రాజకీయ రిజర్వేషన్ల అంశాన్ని మాత్రమే చర్చించారు. బీసీ బిల్లును రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చేలా కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలి'అని డిమాండ్ చేశారు. సమావేశానంతరం కవిత మింట్ కాంపౌండ్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు, లిబర్టీ సర్కిల్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీల ఓట్లు కొల్లగొట్టేందుకే ఆర్డినెన్స్ డ్రామా

- కేబినెట్ నిర్ణయం వెనుక ద్రోహం, కుట్రలు దాగి ఉన్నాయి
- శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: బీసీల ఓట్లు కొల్లగొట్టేందుకు రాష్ట్రప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామనే హామీని తెరమీదకు తెచ్చిందని శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి ఆరోపించారు. గురువారం సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయం వెనుక ద్రోహంతో కూడిన కుట్రలు కనిపిస్తున్నాయన్నారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులతో కలసి మధుసూదనాచారి శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి చేయకుండా బీసీలకు ద్రోహం చేయాలని చూస్తోందని తలసాని అన్నారు. గతంలో మహారాష్ట్ర, తమిళనాడు, బిహార్‌లో ప్రభుత్వాలు ఇచ్చిన జీఓలు కోర్టులో నిలబడలేదని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చకుంటే రాష్ట్రంలో 70 శాతం రిజర్వేషన్ల అమలు ఎలా సాధ్యమో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేంత వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని గంగుల కమలాకర్ హెచ్చరించారు. చట్టప్రకారం కమిషన్లు వేయకుండా ఏకసభ్య కమిషన్ తొమ్మిది రోజుల వ్యవధిలో ఇచ్చిన నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడంలో అనేక లొసుగులున్నాయని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్ ఉన్న సమయంలో ఆర్డినెన్స్ జారీ చేయడం రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తుందని దాసోజు శ్రవణ్ అన్నారు.

క్రిప్టోలో వలపు వల!

- మీటింగ్ పేరిట విదేశాలకు ఇన్వెస్టర్ల తరలింపు
- క్రిప్టో ర్యాంకుల ఆధారంగా అమ్మాయిలతో మర్యాదలు
- కరీంనగర్, జగిత్యాల జిల్లాలో భారీగా విదేశీ ప్రయాణాలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ కేంద్రంగా వెలుగుచూసిన క్రిప్టో కరెన్సీ వ్యవహారం మరో మలుపు తిరిగింది. విదేశీ ప్రయాణాల ఆశజూపి పెట్టుబడులు పెట్టించేందుకు నిర్వాహకులు వీరికి వలపు వల విసిరారు. మీటింగ్‌ల పేరిట థాయ్‌లాండ్, సింగపూర్, మలేసియా తదితర దేశాలకు తీసుకెళ్లి అక్కడ అమ్మాయిలతో మర్యాదలు చేయించారు. వాస్తవానికి క్రిప్టో కరెన్సీలో భారీగా పెట్టుబడులు పెట్టిన వారికి వన్ టు సెవన్ వరకు వివిధ స్టార్స్ ఇచ్చారు. ఈ స్టార్స్ ఆధారంగా విదేశాల్లో వారికి అన్ని సౌకర్యాలు కల్పించారు.



విదేశాలకు వెళ్లే జాబితాపై ఆరా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పదే పదే విదేశాలకు వెళ్తున్న వారిపై కొంతకాలంగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ నిఘా పెరిగింది. జగిత్యాల జిల్లాకు చెందిన రవివర్మ, భాస్కర్ అత్యధిక సార్లు సింగపూర్, మలేసియా, థాయ్‌లాండ్ వెళ్లినట్టు గుర్తించారు. గతేడాది వీరిద్దరూ కలిసి మలేసియాకు ఏకే–68 విమానంలో నిజామాబాద్, కోరుట్ల, మెట్‌పల్లి, కరీంనగర్, సుల్తానాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన దాదాపు 200 మందిని తీసుకెళ్లినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇలా వెళ్లిన వారిలో పోలీసులు, రెవెన్యూ ఉద్యోగులు ఉండటం గమనార్హం. వాస్తవానికి విదేశీ ప్రయాణానికి వీరంతా ముందస్తుగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి. అవేమీ జరగలేదు. వీరి పాస్‌పోర్ట్ స్టాంపింగ్‌లు చూస్తే ఎన్నిసార్లు విదేశాలకు వెళ్లారు? అన్న విషయంపై స్పష్టత వస్తుందని 'సాక్షి'తో పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ అధికారి వెల్లడించారు.


దాదాపు రూ.2,000 కోట్లకుపైగానే..

ఇటీవల జీబీఆర్, తాజాగా మెటా.. ఇలా రకరకాల పేర్లతో అనేక యాప్‌లు పుట్టుకొస్తున్నాయి. వీరంతా కేవలం డబ్బు సంపాదనలో భాగంగా తమ పరిచయాలను పునాదులుగా చేసి లక్షలాది రూపాయలను పెట్టుబడుల రూపంలో పెట్టిస్తున్నారు. జీబీఆర్ క్రిప్టో దాదాపు రూ.95 కోట్లు, మెటా పేరుతో మరో రూ.100 కోట్లకుపైగా వసూళ్లు చేశారు. ఇవి కాకుండా మరో డజను వరకు క్రిప్టో పేరుతో దాదాపు రూ.2000 కోట్ల వరకు డబ్బులు దేశం దాటి పోయిందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ డబ్బు అంతా ఎక్కడకు వెళ్లింది ? దీని వెనక ఎవరు ఉన్నారు? అనే కోణంలో దర్యాప్తు చేయాలని పలువురు కోరుతున్నారు.

వానాకాలంలో
38.76 లక్షల ఎకరాలకు నీళ్లు

మొత్తం 339.11 టీఎంసీల సరఫరా • స్కివమ్ కమిటీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం (ఖరీఫ్)లో కృష్ణా, గోదావరి బేసిన్ల పరిధిలోని భారీ, మధ్య తరహా ప్రాజెక్టులతో పాటు చెరువులు, చిన్న ఎత్తిపోతల పథకాల కింద మొత్తం 38,76,849 ఎకరాల ఆయకట్టుకు గాను 339.11 టీఎంసీల నీటిని సరఫరా చేయాలని రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ (స్కివమ్) కమిటీ నిర్ణయించింది. ఇందులో 26,71,941 ఎకరాల తడి, 12,04,908 ఎకరాల ఆరుతడి పంటలు ఉన్నాయి. నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) మహ్మద్ అంజాద్ హుస్సేన్ అధ్యక్షతన శుక్రవారం జలసౌధలో సమావేశమైన స్కివమ్ కమిటీ ప్రస్తుతం జలాశయాల్లో ఉన్న నీటి లభ్యత, వస్తున్న ప్రవాహాలను సమీక్షించి ఈ మేరకు ప్రభుత్వానికి సిఫారసులు చేసింది. కృష్ణా పరీవాహకంలోని ప్రాజెక్టుల కింద 17,68,240 ఎకరాల ఆయకట్టుకు మొత్తం 196.41 టీఎంసీల సాగునీటిని సరఫరా చేయాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇందులో 10,30,082 ఎకరాల తడి, 73,81,58 ఎకరాల ఆరుతడి పంటలు ఉన్నాయి. కృష్ణా బేసిన్‌లోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో పుష్కలంగా నీటిలభ్యత ఉన్న నేపథ్యంలో సాధ్యమైనంత ఎక్కువ ఆయకట్టుకు నీటి సరఫరా చేయాలని నిర్ణయించింది.



'గోదావరి'పై మరోసారి భేటీ

గోదావరి పరీవాహకంలోని ప్రాజెక్టుల కింద ప్రస్తుతానికి 6,37,794 ఎకరాల ఆయకట్టుకు 62.52 టీఎంసీలను సరఫరా చేయాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ఎగువ గోదావరి మీద ఉన్న శ్రీరాంసాగర్, నిజాంసాగర్, కడెం, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులకు వరదలు ఆశించిన స్థాయిలో రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నిల్వల ఆధారంగా చూస్తే తక్కువ ఆయకట్టుకు మాత్రమే నీళ్లు ఇవ్వగలమని తేల్చింది. మరికొన్ని రోజుల్లో ఎగువ గోదావరికి వరదలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారం రోజుల తర్వాత మళ్లీ సమావేశమై నీటి సరఫరాపై నిర్ణయం తీసుకోవాలని తీర్మానించింది. గోదావరి, కృష్ణా బేసిన్ల పరిధిలోని చెరువులు, చిన్న లిఫ్టుల కింద 14,70,825 ఎకరాల ఆయకట్టుకు 80.171 టీఎంసీలు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇందులో 11,53,200 ఎకరాల తడి, 3,17,615 ఎకరాల ఆరుతడి పంటలున్నాయి. చెరువుల కింద మొత్తం 12,32,713 ఎకరాలకు 65 టీఎంసీలు సరఫరా చేయనున్నారు. చిన్న ఎత్తిపోతల పథకాల కింద 2,38,102 ఎకరాలకు 15.01 టీఎంసీలు అందించనున్నారు. ఇక కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టు కింద 44,570 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని కమిటీ సిఫారసు చేసింది.

ఏ ప్రాజెక్టు కింద ఎంత ఆయకట్టు..

ప్రాజెక్టు పేరు	ఆరుతడి పంటలు	తడిపంట	మొత్తం
నాగార్జునసాగర్	1,63,310	4,55,701	6,19,011
కడెం	11,932	49,068	61,000
నిజాంసాగర్	1,222	1,23,032	1,24,254
జూరాల	49,000	81,911	1,09,296
ఆర్డీఎస్	49,000	6,000	55,000
మూసీ	----	30,000	30,000
సింగూరు	----	20,000	20,000
దేవాదుల	59,801	1,47,410	2,07,211
కోయిల్‌సాగర్	5,600	30,000	35,600
రాజీవ్ భీమా	93,243	57,766	1,51,009
నెట్టెంపాడు	1,06,200	19,800	1,26,000
కల్వకుర్తి	1,55,516	1,45,168	3,00,685
ఎస్ఎల్‌బీసీ	1,05,242	1,71,219	2,76,461
కొమురంభీం	6,000	20,000	26,000

వర్షం లోటు.. సాగు తడబాటు!

▶ మొదటి పేజీ తరువాయి

స్థితిలో ఉన్నారు. పెట్టుబడి సైతం దక్కే పరిస్థితి లేదంటూ వాపోతున్నారు.

లోటు వర్షపాతంతో కష్టకాలం

గత సీజన్‌లో ఈ సమయానికి రాష్ట్ర సగటు వర్షపాతం 191.90 సెం.మీ.లు ఉండాల్సి ఉండగా..అంతకు మించి 224.90 సె.మీ.లు నమోదు అయ్యింది. అయితే ఈ సీజన్‌లో మాత్రం అతి తక్కువగా కేవలం 165.5 సెం.మీ.లే నమోదు కావడం గమనార్హం. గత సీజన్‌లో కరీంనగర్, ములుగు, ఖమ్మం, బి.కొత్తగూడెం, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 20 నుంచి 59 శాతం అధిక వర్షపాతం నమోదైంది. నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాలలో 60 శాతానికి పైగా (లార్జ్ ఎక్సెస్) వర్షం పడగా, 21 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. అయితే ఈసారి మంచిర్యాల, పెద్దపల్లి, సంగారెడ్డి, జేఎస్ భూపాలపల్లి, జనగామ, మేడ్చల్ మల్కాజిగిరి, నల్లగొండ, సూర్యాపేట, యాదగిరి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లో 20 నుంచి 59 శాతం లోటు వర్షపాతం ఉంది. తక్కిన 23 జిల్లాల్లో 19 శాతం వరకు లోటు వర్షం ఉంది. ఈ నేపథ్యంలోనే సాగు నెమ్మదించిందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

ఒక్క ఆదిలాబాద్‌లోనే 95% మించి సాగు

ఈ వానాకాలంలో ఆదిలాబాద్ జిల్లాలో సాగు అంచనా 5,77,255 ఎకరాలు అయితే 5,51,573 (95.55 శాతం) ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. అంటే ఆదిలాబాద్‌లో దాదాపు అంచనాలకు తగినట్టుగా సాగు జరిగిందన్న మాట. ఆ తర్వాతి స్థానాల్లో కేబీ ఆసిఫాబాద్ (76.33 శాతం), సంగారెడ్డి (66.81 శాతం), నిజామాబాద్ (65.36 శాతం), బి.కొత్తగూడెం (61.85 శాతం) జిల్లాలు ఉన్నాయి. ఇక అతి తక్కువ విస్తీర్ణంలో సాగైన జిల్లాల్లో వనపర్తి 2,46,582 ఎకరాలకు గాను 17,879 (7.25 శాతం) ఎకరాల్లో సాగుతో మొదటి స్థానంలో ఉంది. ఇక సూర్యాపేటలో 5,81,915 ఎకరాలకు 44,195 (7.59 శాతం) ఎకరాలలో, మెదక్‌లో 3,37,641 ఎకరాలకు 32,789 (9.71 శాతం) ఎకరాలలో, ఎం.మల్కాజిగిరిలో 23,430 ఎకరాలకు గాను 2,583 (11.02 శాతం) ఎకరాల్లో, ములుగులో 1,26,973 ఎకరాలకు 19,877 (15.65 శాతం) ఎకరాల్లో పంటలు వేశారు. కాగా ప్రతికూల పరిస్థితుల్లోనూ రైతులు పత్తి పంటపైనే ఆసక్తి చూపారు. పత్తి సాగు అంచనా 48,93,016 ఎకరాలకు గాను 36,30,988 (74.21 శాతం) ఎకరాలలో సాగయ్యింది. వరిసాగు అంచనా 62,47,868 ఎకరాలకు గాను కేవలం 5,01,129 (8.02 శాతం) ఎకరాల్లోనే సాగయ్యింది. వర్షాలు లేకపోవడం వరి సాగుపై తీవ్రంగా ప్రభావం చూపించింది.

బోరు నీటితో ధైర్యం చేస్తున్నా..



ఈ ఫొటోలోని రైతు పేరు మాలోతు స్వామి. జనగామ జిల్లా వడ్లకొండకు చెందిన ఈ రైతుకు ఆరెకరాల పొలం ఉంది. సకాలంలో వర్షాలు పడితే తొందరగా వరి నాట్లేసుకుందామనే ఉద్దేశంతో సగం వరకు పొలం పాతం చేసుకుని పెట్టుకున్నాడు. కానీ చిన్నపాటి జల్లులు తప్ప వర్షాల జాడే లేదు. కాల్వలో నీళ్లు రావడం లేదు. బావులు, బోర్లలో నీళ్లు అంతగా లేవు. 'రెండెకరాలు ఇడిసిపెట్టి.. నాలుగు ఎకరాల్లో బోర్ల ద్వారా నీళ్లు పెట్టుకుందామని ధైర్యం చేస్తున్నా.. చూద్దాం ఎట్టయితే గట్లయితది.. మరి ఏం చేయాలె..'అని స్వామి అన్నాడు.

నారు పోసినప్పటి నుంచి వానలు లేవు..



మే నెలలో వానలు పడితే ఈసారి కాలం మంచిగనే అయితది అనుకున్నం. ఆ వానలు తప్ప మల్ల చినుకు పడలేదు. ఆలస్యంగనైన వరి ఏద్దమని ఆగినం. పది రోజుల కింద మబ్బులు చేసి తుంపురు తుంపురు వానలు పడ్డయి. కాలం మంచిగైతే నాట్లు వేసుకోవచ్చని నమ్మి నారు పోసినం. ఇగ వర్షాలు పడుతలేవు. చెరువులు, కుంటలల్ల కూడా నీళ్లు లేవు. ఎటూ తోస్తలేదు.

– యెడబోయిన పద్మ, మహిళా రైతు, గ్రామం బేతోల్, మహబూబాబాద్ జిల్లా

ప్రత్యామ్నాయంగా తృణ ధాన్యాలు,ఆహారేతర పంటలు...

వర్షాభావం, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర రైతాంగం ఈసారి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపింది. ముఖ్యంగా ప్రధాన తృణ ధాన్యాలు (మిల్లెట్స్), ఆహారేతర పంటలపై దృష్టి పెట్టినట్లు సాగు విస్తీర్ణాన్ని బట్టి అవగతమవుతోంది. మేజర్ మిల్లెట్స్ (జొన్న, మొక్కజొన్న, రాగులు) 5,73,643 ఎకరాల్లో సాగవచ్చని అంచనా వేయగా అంచనాలకు తగినట్టుగా 5,61,240 (97.84 శాతం) ఎకరాల్లో ఈ పంటలు వేశారు. మొక్కజొన్న 5,21,206 ఎకరాలకు గాను 5,34,318 (102.52 శాతం) ఎకరాలలో సాగైంది. ఆహారేతర పంటలు 1,02,576 ఎకరాలు అంచనా వేయగా రెట్టింపునకు మించి 2,35,614 (229.70 శాతం) ఎకరాల్లో రైతులు దైంచా, పిల్లిపెసర, సన్ హెంప్, పారాగ్రాస్, మేత జోవార్‌లు సాగు చేశారు.

వానాకాలం 2025 సాగు ప్రణాళిక.. సాగైన విస్తీర్ణం (ఎకరాలలో)

ఈ వానాకాలం సాగు అంచనా	:	1,32,44,305
ఇప్పటివరకైన సాగు విస్తీర్ణం	:	56,26,243
పత్తి సాగు అంచనా	:	48,93,016
సాగైన పత్తి విస్తీర్ణం	:	36,30,988
వరిసాగు అంచనా	:	62,47,868
సాగైన వరి విస్తీర్ణం	:	5,01,129
మొక్కజొన్న సాగు అంచనా	:	5,21,206
సాగైన మొక్కజొన్న విస్తీర్ణం	:	5,34,318

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
690	205
82,500	25,150

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,624	▽	7
డోజోన్స్	44,353	▽	298
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,941	▽	35
డాక్స్	24,255	▽	201
షాంఘై	3,384	△	1
నికాయ్	39,570	▽	77

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.97	87.65
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.39	118.34
€	యూరో	ఎస్‌బీఐ	98.09	102.57
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.04	58.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.71	69.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.00	23.49
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.47	24.25
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.10	12.92

ఏఐ ఆధారిత వైద్య సేవలు

- అంతర్జాతీయ ప్రమాణాలతో అందుబాటు ధరలకే
- ప్రకటించిన అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ



ముంబై: అంతర్జాతీయ ప్రమాణాలతో, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటు ధరలకే అందించే ప్రణాళికలను అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ ప్రకటించారు. భారత్‌లో ఆరోగ్యం సంరక్షణ రంగాన్ని మార్చేసే స్వప్నాన్ని ఆయన ఆవిష్కరించారు. సొసైటీ ఫర్ మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ – ఆసియా పసిఫిక్ (ఎస్‌ఎంఐఎస్‌ఎస్‌–ఏపీ) 5వ వార్షిక సమావేశం శుక్రవారం ముంబైలో జరిగింది. ఇందులో పాల్గొన్న సందర్భంగా గౌతమ్ అదానీ మాట్లాడారు. భవిష్యత్ ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చేందుకు వీలుగా ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ కంటే.. వ్యవస్థ వ్యాప్తంగా పునర్‌నిర్మాణం అవసరమన్నారు. మూడేళ్ల క్రితం తన 60వ పుట్టిన రోజు సందర్భంగా హెల్త్‌కేర్, విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం రూ.60,000 కోట్లను ఖర్చు చేయనున్నట్టు ప్రకటించడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ''హెల్త్‌కేర్ రంగంలో తగినంత వేగం లేకపోవడం వల్ల మేము ఇందులోకి ప్రవేశించలేదు. ఇప్పుడు ఆ వేగం సరిపడా లేకపోవడంతో అడుగు పెట్టాం'' అని అదానీ తెలిపారు. 1,000 పడకల ఇంటిగ్రేటెడ్ మెడికల్ క్యాంపస్‌లను తొలుత అహ్మదాబాద్, ముంబైలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్నట్టు గతంలో చేసిన ప్రకటనను గుర్తు చేస్తూ.. కరోనా మాదిరి మహమ్మారి, విపత్తు సమయాల్లో వేగంగా సదుపాయాలను విస్తరించేలా ఇవి ఉంటాయన్నారు. వైద్య చికిత్సలు, పరిశోధన, శిక్షణకు అత్యుత్తమ కేంద్రాలుగా పనిచేస్తాయంటూ.. మయో క్లినిక్ అంతర్జాతీయ అనుభవం ఈ దిశగా తమకు సాయపడుతుందని అదానీ చెప్పారు. నేడు గుండె జబ్బులు, మధుమేహం కంటే కూడా వెన్నునొప్పి ఎక్కువ మందిని వేధిస్తుందన్న విషయాన్ని ప్రస్తావించారు.

నచ్చిన చిత్రం మున్నాభాయ్ ఎంబీబీఎస్

'నాకు బాగా నచ్చిన చిత్రం మున్నాభాయ్ ఎంబీబీఎస్. నవ్వుకోవడానికే కాదు, సందేశం ఇవ్వడానికి కూడా. మున్నాభాయ్ మందులతో కాకుండా, మానవత్వంతో రోగుల బాధలను నయం చేశాడు. నిజమైన వైద్యం సర్జరీలకు అతీతమైనదని ఇది మనందరికీ గుర్తు చేసింది' అని గౌతమ్ అదానీ పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
క్విక్ కామర్స్‌లో పోటాపోటీ | హైదరాబాద్‌లో తగ్గిన లగ్జరీ ఇళ్ల విక్రయాలు

టెస్లా కారు వచ్చేస్తోంది..

15న ముంబైలో మొదటి స్టోర్ ప్రారంభం



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా వచ్చే వారం భారత మార్కెట్లో లాంఛనంగా అడుగుపెట్టనుంది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో జూలై 15న దేశీయంగా తొలి స్టోర్ ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఎంపిక చేసిన ప్రముఖులకు టెస్లా పంపించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే తొలి కార్ల సెట్‌ను తమ చైనా ప్లాంటు నుంచి కంపెనీ ఎగుమతి చేసినట్లు వివరించాయి. ఇవి మోడల్ వై రియర్-వీల్ డ్రైవ్ ఎస్‌యూవీలై ఉంటాయని తెలిపాయి. టెస్లా ఇండియా గత నెలలో ముంబైలోని లోధా లాజిస్టిక్స్ పార్క్‌లో 24,565 చ.అ. వేర్‌హౌస్ స్థలాన్ని అయిదేళ్లకు లీజుకు తీసుకుంది. యూరప్, చైనా మార్కెట్లలో తమ కార్ల విక్రయాలు నెమ్మదిస్తున్న తరుణంలో భారత మార్కెట్లోకి టెస్లా ఎంట్రీ ఇస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇక దేశీయంగా రేర్ మాగ్నెట్స్ ఉత్పత్తి

- రెండు సంస్థలకు రూ. 1,345 కోట్ల ప్రోత్సాహక స్కీము
- ప్రభుత్వ శాఖల మధ్య సంప్రదింపులు
- భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి వెల్లడి





న్యూఢిల్లీ: దేశీయంగా రేర్ ఎర్త్ మాగ్నెట్స్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక పథకంపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం రూ. 1,345 కోట్ల స్కీముపై వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయి. మాగ్నెట్స్ తయారీ కోసం ఎంపికయ్యే రెండు సంస్థలకు దీన్ని వర్తింపచేసే అవకాశం ఉంది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ విషయాలు వెల్లడించారు. చర్చలు పూర్తయ్యాక ప్రతిపాదనను తుది ఆమోదం కోసం కేంద్ర క్యాబినెట్‌కు పంపే అవకాశం ఉంది. రేర్ ఎర్త్ ఆక్సైడ్‌లను మాగ్నెట్ల కింద మార్చే ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఈ సబ్సిడీలు ఉపయోగపడతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మాగ్నెట్స్ ఎగుమతులపై ప్రధాన సరఫరాదారు అయిన చైనా ఆంక్షలు విధించిన నేపథ్యంలో ప్రపంచ దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న సంగతి తెలిసిందే. టెలికం, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ తదితర రంగాల్లో ఉత్పత్తికి ఇవి కీలకంగా ఉంటాయి.

ఎలక్ట్రిక్ ట్రక్కులకు స్కీము..

పీఎం ఈ-డ్రైవ్ కార్యక్రమం కింద ఎలక్ట్రిక్ ట్రక్కులు కొనుగోలు చేసే వారికి రూ. 9.6 లక్షల వరకు ఇన్సెంటివ్స్ ఇచ్చే పథకాన్ని కుమారస్వామి ఆవిష్కరించారు. సుమారు 5,600 ట్రక్కులకు వర్తించే ఈ పథకంతో పోర్టులు, లాజిస్టిక్స్, సిమెంట్, స్టీల్ తదితర పరిశ్రమలు లబ్ధి పొందనున్నాయి. మొత్తం వాహనాల్లో డీజిల్ ట్రక్కుల వాటా 3 శాతమే అయినప్పటికీ రవాణా సంబంధిత గ్రీన్‌హౌస్ గ్యాస్ ఉద్గారాల్లో 42 శాతం వాటా వాటిదే ఉంటోందని కుమారస్వామి తెలిపారు. ఈ నేపథ్యంలో ఉద్గారాలను తగ్గించే, పర్యావరణహితమైన సరకు రవాణా విధానాలను అమలు చేసేందుకు ఈ స్కీము దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన పీఎం ఈ-డ్రైవ్ పరిమాణం రూ. 10,900 కోట్లు కాగా, ఇందులో ఎలక్ట్రిక్ ట్రక్కుల కోసం రూ. 500 కోట్లు కేటాయించారు.

ఐటీ, ఆటో పడగొట్టాయ్..

మూడో రోజూ అమ్మకాల ఒత్తిడి

- సెన్సెక్స్ 690 పాయింట్ల పతనం
- నిఫ్టీ 205 పాయింట్లు డౌన్



ముంబై: స్టాక్ సూచీలు వరుసగా మూడోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ 690 పాయింట్లు నష్టపోయి 82,500 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 205 పాయింట్లు కోల్పోయి 25,150 వద్ద నిలిచింది. దేశీయ కార్పొరేట్ ఆర్థిక ఫలితాల సీజన్ స్తబ్దుగా ప్రారంభం కావడం, వాణిజ్య సుంకాల అనిశ్చితులు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయమే నష్టాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే భారీగా విక్రయాలు వెల్లువెత్తాయి. రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 748 పాయింట్లు క్షీణించి 82,442 వద్ద, నిఫ్టీ 226 పాయింట్లు కోల్పోయి 25,129 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి.

నష్టాలు ఎందుకంటే: ఐటీ దిగ్గజం టీసీఎస్ క్యూ1 ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను నిరాశపరిచాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కెనడాపై 35%, ఇతర వాణిజ్య భాగస్వామ్య దేశాలపై 15–20% టారిఫ్‌ను వసూలు చేస్తామని ప్రకటించారు. ట్రంప్ నిర్ణయంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనపడ్డాయి. భారీ స్థాయిలో 'పంప్ అండ్ డంప్' వ్యవహారానికి పాల్పడుతున్న 200కి పైగా ప్రైవేటు లిస్టెడ్ కంపెనీలపై సెబీ కఠిన చర్యలకు తీసుకుందన్న వార్తలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేశాయి.

■ ఎఫ్‌ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లు నష్టాలు చవిచూశాయి. బీఎస్‌ఈలో ఐటీ, ఆటో సూచీలు 2% పతనయ్యాయి. టీసీఎస్ షేరు 3.50% నష్టపోయి రూ.3,265 వద్ద స్థిరపడింది.

డీమార్ట్ లాభం యథాతథం

క్యూ1లో రూ. 773 కోట్లు



న్యూఢిల్లీ: డీమార్ట్ బ్రాండ్ రిటైల్ స్టోర్ల దిగ్గజం ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో అంతంతమాత్ర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర లాభం దాదాపు యథాతథంగా రూ. 773 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 774 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 17 శాతం ఎగసి రూ. 16,360 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 14,069 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు రూ. 15,322 కోట్లకు పెరిగాయి.

డీమార్ట్ షేరు బీఎస్‌ఈలో 2.5% నష్టంతో రూ. 4,064 వద్ద ముగిసింది.

ఐపీవోకు ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ

సెబీకి తాజాగా ప్రాస్పెక్టస్ దాఖలు • రూ. 6,000 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు అభివృద్ధి చేసే ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి గోప్యతా మార్గంలో ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. తద్వారా రూ. 6,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో దేశీ రెన్యూవబుల్స్, క్లీన్ ఎనర్జీ రంగంలో అతిపెద్ద ఐపీవోగా కంపెనీ రికార్డ్ నెలకొల్పే వీలుంది. ఐపీవోలో భాగంగా కంపెనీ 10% వాటా విక్రయానికి ఉంచనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కంపెనీ మార్కెట్ విలువను రూ. 50,000 కోట్లుగా అంచనా వేశాయి.

సాక్షి స్పోర్ట్స్



సినియకోవా-వెర్‌బీక్ జోడీకి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాటరీనా సినియకోవా (చెక్ రిపబ్లిక్)-సెమ్ వెర్‌బీక్ (నెదర్లాండ్స్) జోడీ విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో సినియకోవా-వెర్‌బీక్ ద్వయం 7-6 (7/3), 7-6 (7/3)తో లూసియా స్టెఫానీ (బ్రెజిల్)-జో సాలిస్‌బరీ (బ్రిటన్) జోడీపై విజయం సాధించింది. సినియకోవా-వెర్‌బీక్ జంటకు 6,80,000 పౌండ్లు (రూ. 7 కోట్ల 88 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. సినియకోవా కెరీర్‌లో ఇది 11వ గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్ కాగా... 'మిక్స్‌డ్‌'లో మాత్రం తొలి టైటిల్. మహిళల డబుల్స్‌లో సినియకోవా మూడుసార్లు చొప్పున ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీలలో... ఒకసారి యూఎస్ ఓపెన్‌లో టైటిల్స్ సాధించింది. అంతేకాకుండా టోక్యో ఒలింపిక్స్‌లో మహిళల డబుల్స్‌లో... పారిస్ ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకాలు సొంతం చేసుకుంది. మరోవైపు వెర్‌బీక్ తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గాడు.

టి20 ప్రపంచకప్ టోర్నీకి ఇటలీ అర్హత



ద హేగ్ (నెదర్లాండ్స్): మీరు చదువుతున్నది నిజమే... క్రికెట్ క్రీడలో ఇటలీ జట్టు ప్రపంచకప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 పురుషుల వరల్డ్ కప్ టోర్నీకి యూరోప్ జోన్ నుంచి ఇటలీతోపాటు నెదర్లాండ్స్ జట్లు అర్హత పొందాయి. ఫుట్‌బాల్‌లో ఇటలీకి ఘనమైన రికార్డు ఉంది. మూడుసార్లు ప్రపంచకప్‌ను సాధించడంతోపాటు రెండుసార్లు రన్నరప్‌గా నిలిచింది. ఏ స్థాయి క్రికెట్‌లో అయినా ఇటలీ జట్టు వరల్డ్‌కప్ బెర్తు దక్కించుకోవడం ఇదే తొలిసారి. కాగా ఓవరాల్‌గా ఈ మెగా టోర్నీ బరిలోకి దిగనున్న 25వ జట్టుగా ఇటలీ నిలిచింది. టి20 ప్రపంచకప్ యూరప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో ఇటలీ 9 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. అయినప్పటికీ... గ్రూప్‌లో 4 మ్యాచ్‌లాడిన ఇటలీ 2 విజయాలు, 1 పరాజయం, ఒక ఫలితం తేలని మ్యాచ్‌తో 5 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో రెండో స్థానంలో నిలవడం ద్వారా ముందంజ వేసింది. గతంలో ఆస్ట్రేలియా జట్టు తరఫున 23 టెస్టులు, 6 వన్డేలు ఆడిన జో బర్న్స్ ఇటలీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇక చివరి లీగ్ మ్యాచ్‌లో ఇటలీపై గెలిచిన నెదర్లాండ్స్ 6 పాయింట్లతో దర్జాగా వరల్డ్‌కప్‌కు అర్హత సాధించింది. తద్వారా గత నాలుగు టి20 ప్రపంచకప్‌లలో బరిలోకి దిగిన స్కాట్లాండ్ జట్టు ఈసారి మెగా టోర్నీ ఆడే అవకాశం కోల్పోయింది. చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు జెర్సీ జట్టు చేతిలో ఒక వికెట్ తేడాతో ఓడింది. దీంతో పట్టికలో నాలుగో స్థానానికి పరిమితమై వరల్డ్‌కప్‌నకు దూరమైంది.

సెమీస్‌లో జొకోవిచ్‌కు షాక్

వింబుల్డన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినెర్, అల్‌కరాజ్



జొకోవిచ్

లండన్: కెరీర్‌లో రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా వింబుల్డన్ టోర్నీలో బరిలోకి దిగిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ప్రస్థానం ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్, ఆరుసార్లు చాంపియన్ జొకోవిచ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) అద్భుతంగా ఆడి 6–3, 6–3, 6–4తో వరుస సెట్‌లలో జొకోవిచ్‌ను ఓడించి తొలిసారి వింబుల్డన్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2017 తర్వాత వింబుల్డన్ టోర్నీలో జొకోవిచ్ ఫైనల్ చేరుకోకపోవడం ఇదే తొలిసారి. గత రెండేళ్లు ఫైనల్లో అల్‌కరాజ్ చేతిలో ఓడిన జొకోవిచ్ 2018, 2019, 2021, 2022లలో విజేతగా నిలిచాడు. కరోనా కారణంగా 2020లో వింబుల్డన్ టోర్నీని నిర్వహించలేదు. జొకోవిచ్‌తో 1 గంట 55 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో సినెర్ 12 ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదు సార్లు బ్రేక్ చేశాడు. జొకోవిచ్ 12 ఏస్‌లు సంధించడంతోపాటు 28 అనవసర తప్పిదాలు చేశాడు.

'హ్యాట్రిక్' టైటిల్‌పై అల్‌కరాజ్ గురి

తొలి సెమీఫైనల్లో 2023, 2024 చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) 2 గంటల 49 నిమిషాల్లో 6–4, 5–7, 6–3, 7–6 (8/6)తో ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలిచాడు. వరుసగా మూడో ఏడాది ఈ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆదివారం జరిగే ఫైనల్లో సినెర్‌తో అల్‌కరాజ్ తలపడతాడు. అల్‌కరాజ్ గెలిస్తే... జాన్ బోర్గ్, సంప్రాస్, ఫెడరర్, జొకోవిచ్ తర్వాత వింబుల్డన్‌లో 'హ్యాట్రిక్' టైటిల్స్ నెగ్గిన ఐదో ప్లేయర్‌గా నిలుస్తాడు.

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్
స్వియాటెక్ (పోలాండ్) X అనిసిమోవా (అమెరికా)
రాత్రి గం. 8:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

బుమ్రా కూల్చాడు... ఇక బ్యాటర్లే నిలబెట్టాలి

- భారత్ 145/3 • రాణించిన రాహుల్
- ఇంగ్లండ్ 387 ఆలౌట్ • రూట్ శతకం
- నిప్పులు చెరిగిన బుమ్రా
- స్మిత్, కార్స్ అర్ధసెంచరీలు

మూడో టెస్టు రెండో రోజు రసవత్తర ఆటకు తెరలేచింది. తొలిరోజంతా కష్టపడినా బుమ్రా ఒక వికెట్ మాత్రమే తీస్తే... రెండో రోజు తొలి సెషన్‌లోనూ వైవిధ్యమైన బంతులతో ఇంగ్లండ్ ప్రధాన బ్యాటింగ్ బలగాన్ని కూల్చేశాడు. అయితే భారత బ్యాటింగ్ మాత్రం తడబడింది. ఆరంభంలోనే విలువైన వికెట్లను కోల్పోయింది. మొదటి రోజు 4 వికెట్లు పడితే... రెండో రోజు ఆటలో 9 వికెట్లు కూలాయి. ఇరుజట్లు బ్యాటింగ్ కంటే కూడా బౌలింగ్‌తోనే సత్తా చాటుకున్నాయి.



బుమ్రాకు సహచరుల అభినందన

లండన్: భారత ప్రీమియర్ బౌలర్ బుమ్రా తానెంత విలువైన ఆటగాడో మరోసారి చాటుకున్నాడు. తొలిరోజు శ్రమించినా దక్కని సాఫల్యం రెండో రోజు ఆరంభంలోనే సాధ్యమైంది. క్రీజులో పాతుకుపోయిన బ్యాటర్లను తొలి సెషన్ మొదలైన కొద్దిసేపటికే అవుట్ చేశాడు. భారత్ పట్టుబిగించేలా చేశాడు. నింపాదిగానే పరుగులు చేద్దామనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లపై నిప్పులు చెరిగాడు. ఇంగ్లండ్ భారీ స్కోరుకు బాట వేసినా... బుమ్రా బాధ్యతగా అడ్డుకట్ట వేశాడు. అయితే టీమిండియా ఇన్నింగ్స్ సానుకూల దృక్పథంతో మొదలవలేదు. ఆతిథ్య బౌలర్లు కీలక వికెట్లను తీసి మ్యాచ్‌ను రసపట్టుగా మార్చేశారు. ముందుగా ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 112.3 ఓవర్లలో 387 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ జో రూట్ (199 బంతుల్లో 104; 10 ఫోర్లు) 'శత'క్కొట్టగా... వికెట్ కీపర్ జేమీ స్మిత్ (56 బంతుల్లో 51; 6 ఫోర్లు), బౌలర్ బ్రైడన్ కార్స్ (83 బంతుల్లో 56; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత స్పీడ్‌స్టర్ బుమ్రా 5 వికెట్లు తీశాడు. సిరాజ్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 43 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (113 బంతుల్లో 53 బ్యాటింగ్; 5 ఫోర్లు), కరుణ్ నాయర్ (62 బంతుల్లో 40; 4 ఫోర్లు) రాణించారు. ఆర్చర్, వోక్స్, స్టోక్స్ తలా ఒక వికెట్ తీశారు. చేతిలో 7 వికెట్లున్న టీమిండియా ఇంగ్లండ్ స్కోరుకు ఇంకా 242 పరుగుల దూరంలో ఉంది.

బుమ్రా పేస్... స్టోక్స్, రూట్ క్లీన్‌బౌల్డ్

రెండో రోజు ఆరంభాన్ని భారత పేస్ స్టార్ బుమ్రా దెబ్బతీశాడు. ఓవర్‌నైట్ స్కోరు 251/4తో శుక్రవారం ఆట కొనసాగించిన ఇంగ్లండ్ కాసేపటికే కెప్టెన్ స్టోక్స్ (44) వికెట్‌ను కోల్పోయింది. సెంచరీ ముఱిపెం పూర్తవగానే రూట్ వికెట్ పడింది. ఈ ఇద్దరూ క్లీన్ బౌల్డయ్యారు. రూట్ అవుటైన మరుసటి బంతికే క్రిస్ వోక్స్ (0) డకౌట్ అయ్యాడు! ముగ్గుర్నీ బుమ్రానే అవుట్ చేశాడు. బుమ్రా పేస్‌కు విలవిలలాడిన ఇంగ్లండ్‌కు స్మిత్ క్యాచ్ నేలపాలవడం వరమైంది. సిరాజ్ బౌలింగ్‌లో రాహుల్ క్యాచ్ చేజార్చినపుడు అతని స్కోరు 5 మాత్రమే. ఈ లైఫ్‌లైన్‌తో కార్స్‌తో కలిసి ఇంగ్లండ్ పోటీ స్కోరుకు స్మిత్ బాట వేశాడు. ముందుగా ఇద్దరు జట్టు స్కోరును 300 దాటించారు. తర్వాత క్రీజులో పాతుకుపోయి ఎనిమిదో వికెట్‌కు 84 పరుగులు జోడించారు. ఫిఫ్టీ పూర్తయ్యాక మళ్లీ సిరాజ్‌కే అతని వికెట్ దక్కింది. బుమ్రా... ఆర్చర్ (4)ను ఎక్కువసేపు నిలువనీయలేదు. అయితే కార్స్ అడపాదడపా బౌండరీలు, ఓ భారీ సిక్సర్‌తో అర్ధసెంచరీ చేసుకున్నాడు. 387 వద్ద సిరాజ్ అతన్ని అవుట్ చేయడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది.



రూట్

యశస్వి, గిల్ విఫలం

ఆరంభం నుంచే దూకుడుగా ఆడుదామనుకున్న యశస్వి జైస్వాల్ (13; 3 ఫోర్లు) జోరుకు ఆర్చర్ ఆదిలోనే అడ్డుకట్ట వేశాడు. తద్వారా నాలుగేళ్ల తర్వాత మళ్లీ భారత్‌తోనే అంతర్జాతీయ టెస్టుల్లో పునరాగమనం చేసిన ఆర్చర్ ఇన్నింగ్స్ ఆరంభంలోనే వికెట్‌తో సత్తా చాటుకున్నాడు. ఈ దశలో రాహుల్‌కు కరుణ్ నాయర్ జతయ్యాడు. ఇద్దరు ఇంగ్లండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్ని నింపాదిగా పరుగులు రాబట్టారు. ఈ జోడీ క్రీజులో పాగా వేస్తున్న సమయంలోనే నాయర్ వికెట్ తీసిన స్టోక్స్ రెండో వికెట్‌కు 61 పరుగులు భాగస్వామ్యానికి తెరదించాడు. తర్వాత ఈ సిరీస్‌లో భీకరమైన ఫామ్‌లో ఉన్న భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (44 బంతుల్లో 16; 2 ఫోర్లు)ను వోక్స్ అవుట్ చేసి ఇంగ్లండ్ శిబిరంలో ఆనందాన్ని నింపాడు. ఇలా 107 పరుగులకే టీమిండియా కీలకమైన 3 వికెట్లు కోల్పోయింది. దీంతో రాహుల్ బాధ్యతగా ఆడి అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా... గాయంతో కీపింగ్ చేయలేకపోయినా రిషభ్ పంత్ (19 బ్యాటింగ్; 3 ఫోర్లు) బ్యాటింగ్‌లో కుదురుగా ఆడాడు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) పంత్ (బి) నితీశ్ 18; డకెట్ (సి) పంత్ (బి) నితీశ్ 23; పోప్ (సి) సబ్-జురేల్ (బి) జడేజా 44; జో రూట్ (బి) బుమ్రా 104; బ్రూక్ (బి) బుమ్రా 11; స్టోక్స్ (బి) బుమ్రా 44; స్మిత్ (సి) సబ్-జురేల్ (బి) సిరాజ్ 51; వోక్స్ (సి) సబ్-జురేల్ (బి) బుమ్రా 0; కార్స్ (బి) సిరాజ్ 56; ఆర్చర్ (బి) బుమ్రా 4; బషీర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 31; **మొత్తం (112.3 ఓవర్లలో ఆలౌట్)** 387. **వికెట్ల పతనం:** 1–43, 2–44, 3–153, 4–172, 5–260, 6–271, 7–271, 8–355, 9–370, 10–387. **బౌలింగ్:** బుమ్రా 27–5–74–5, ఆకాశ్‌దీప్ 23–3–92–0, సిరాజ్ 23.3–6–85–2; నితీశ్ కుమార్ 17–0–62–2, జడేజా 12–1–29–1, సుందర్ 10–1–21–0.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 13; రాహుల్ (బ్యాటింగ్) 53; కరుణ్ (సి) రూట్ (బి) స్టోక్స్ 40; గిల్ (సి) స్మిత్ (బి) వోక్స్ 16; పంత్ (బ్యాటింగ్) 19; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (43 ఓవర్లలో 3 వికెట్లకు)** 145. **వికెట్ల పతనం:** 1–13, 2–74, 3–107. **బౌలింగ్:** వోక్స్ 13–1–56–1, ఆర్చర్ 10–3–22–1, కార్స్ 8–1–27–0, స్టోక్స్ 6–2–16–1, బషీర్ 6–1–22–0.

37 టెస్టుల్లో జో రూట్ సెంచరీల సంఖ్య. టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్ల జాబితాలో రూట్ ఐదో స్థానానికి చేరుకున్నాడు. సచిన్ టెండూల్కర్ (51), జాక్వస్ కలిస్ (45), రికీ పాంటింగ్ (41), కుమార సంగక్కర (38) వరుసగా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నారు.

211 టెస్టుల్లో అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న ఫీల్డర్‌గా జో రూట్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 210 క్యాచ్‌లతో రాహుల్ ద్రవిడ్ (భారత్) పేరిట ఉన్న రికార్డును రూట్ సవరించాడు.

11 భారత్‌పై టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా స్టీవ్ స్మిత్ (11) పేరిట ఉన్న రికార్డును జో రూట్ (11) సమం చేశాడు.

4 లార్డ్స్ మైదానంలో వరుసగా మూడు సెంచరీలు చేసిన నాలుగో క్రికెటర్‌గా రూట్ గుర్తింపు పొందాడు. గతంలో మైకేల్ వాన్, జాక్ హాబ్స్, దిలీప్ వెంగ్‌సర్కార్ ఈ ఘనత సాధించారు.

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



ట్రాక్టర్‌పై సీతక్క ప్రయాణం

వాగు దాటి పాఠశాల ప్రారంభోత్సవం

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా ఎలిశెట్టిపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించింది. కానీ ఎలిశెట్టిపల్లి గ్రామానికి రోడ్డు మార్గం లేదు. దీంతో పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి.. మంత్రి సీతక్క ట్రాక్టర్‌పై కూర్చొని జంపన్నవాగు దాటి వెళ్లారు. ఈ వాగుపై వంతెన నిర్మించాలని అక్కడి ప్రజలు మంత్రిని వేడుకున్నారు. వంతెన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.



నాన్నకు తోడుగా..

ఒక్క మార్కుతోనే కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికవలేదని కుంగిపోలేదా యువతి.. చదువు, ఉద్యోగ ప్రయత్నాలతో పాటు.. తండ్రికి సాయంగా మేకలు కాసేందుకు రోజూ అడవిబాట పడుతోంది. పెద్దపల్లి జిల్లా సబ్బితం గ్రామానికి చెందిన నూనె నర్సయ్యకు కొడుకు, కూతురు ఉన్నారు. చదువుల్లో రాణిస్తూనే కూతురు కల్యాణి తండ్రికి సాయంగా మేకలతో ఊరి పొలిమేరల్లోని గుట్టల్లోకి వెళ్తోంది. ఆర్మీ పరీక్షల కోసం సిద్ధమవుతున్నానని, ఈసారి ఉద్యోగం తనదేనని ధీమాగా చెప్పింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

మీ లైఫ్‌స్టైలే కొంప ముంచుతుంది!



మీ జీతం పెరుగుతున్న కొద్దీ మీ ఖర్చులనూ పెంచుకుంటూ పోతున్నారా? అయితే మీ జేబును నెలనెలా మీరే కొట్టేసుకుంటున్నారు అని అర్థం! జీతం పెరిగితే పొదుపు పెరగాలి. అలా కాకుండా, పెరిగిన జీతంతో సమానంగా.. పెట్టే ఖర్చు పెరుగుతోందంటే మీ జీవన విధానం మీ చేయి దాటి పోయిందనే! ఆదాయం పెరిగినా ఆర్థికంగా మీరు ఇరుకున పడిపోయారనే! మీ బ్యాంక్ బ్యాలెన్స్‌ను ఏ నెల చెక్ చేసినా ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే ఉండిపోయిందనే! దీనినే 'లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లేషన్' అంటున్నారు ఆర్థిక నిపుణులు. అంటే.. 'జీవనశైలి ద్రవ్యోల్బణం'!

- సాక్షి, స్పెషల్ డెస్క్

- జీవనశైలి ద్రవ్యోల్బణంతో సామాన్యుల తిప్పలు
- జీతం పెరిగితే ఖర్చులూ పెంచేసుకుంటున్నారు
- అప్పులతో సతమతమవుతున్న సగటు ఉద్యోగి
- పొదుపు, ఆర్థిక క్రమశిక్షణలే అసలైన మందు..

సాధారణంగా, నిత్యావసర వస్తువుల రేట్లు పెరగటాన్ని 'ద్రవ్యోల్బణం'అంటారు. కానీ, ఈ 'జీవనశైలి ద్రవ్యోల్బణం' వ్యక్తిగతంగా ఎవరికి వారు ఖర్చులు పెంచుకుంటూ పోతే ఏర్పడేది! జీతం పెరిగింది కదా అని, ఆ పెరిగిన మేరకు అలవాట్లను అప్‌గ్రేడ్ చేసుకుంటూ పోతే సంభవించేది! ఇంకాస్త మెరుగైన తిండి. ఖరీదైన బట్టలు. సౌఖ్యమైన కారు. అద్దెకు ఇంకాస్త పెద్ద ఇల్లు. ఒక్కమాటలో చెప్పాలంటే – కోరికలు అవసరాలుగా, విందులు అలవాట్లుగా, డిజైనర్ బ్రాండ్‌లు వినోదాలుగా మారిపోతే బతుకు లెక్క బ్యాలెన్స్ తప్పటమే జీవనశైలి ద్రవ్యోల్బణం.


'పెరగటం'నిజం కాదు!

మెరుగైన జీవితాన్ని కోరుకోవటం తప్పు కాదు. అయితే భవిష్యత్తులో సంభవించబోయే ఆర్థిక ఆటుపోట్లను అంచనా వేయకుండా జీవితాన్ని మెరుగు పరుచుకోవటం వల్లనే ఆర్థిక స్థిరత్వం కోల్పోతామని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. జీవనశైలి ద్రవ్యోల్బణం కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది. ఇంటి ఖర్చులు పెరుగుతాయి. మెల్లగా అప్పులు మొదలౌతాయి. ద్రవ్యోల్బణం ప్రకారం పెరిగిన జీతాలను మినహాయించి చూస్తే 2019 నుంచి మనదేశంలోని ఉద్యోగుల జీతాలలో నిజమైన పెరుగుదల లేదని 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే'పేర్కొంది. దీన్నిబట్టి సగటు ఉద్యోగి అర్థం చేసుకోవలసింది ఏమిటంటే... ఖర్చులకు సరిపడా జీతం పెరుగుతుంది తప్ప, ఖర్చు పెట్టటానికి జీతం పెరగదని భావించి జాగ్రత్తగా ఉండాలని.



ఏఐ భయం పొంచి ఉంది!

జీవనశైలి ద్రవ్యోల్బణం ఎదుర్కొంటున్న ఉద్యోగులు ప్రస్తుతం అప్రమత్తంగా ఉండవలసిన ప్రధాన అంశం ఏఐ (కృత్రిమ మేధస్సు). ఏఐ వల్ల 2030 నాటికి 80 కోట్ల మంది తమ ఉద్యోగాలు కోల్పోతారని అంచనా. దీన్నిబట్టి ఉద్యోగ భద్రత, కెరీర్ వృద్ధి అనేవి ఒక భ్రమ అని గుర్తించాలి. జీతాలు పెరగటం, కెరీర్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవటం అనే నమ్మకాలు క్రమంగా పాతబడుతున్నాయి. అందుకే అస్థిరతే లక్షణంగా ఉన్న ఒక ప్రపంచంలోకి ఇప్పటికే మనం ప్రవేశించామని ఉద్యోగులు గ్రహించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



పోల్చుకోవటం జీతానికి చేటు..

తోటివారితో పోల్చుకోవటం కూడా ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి వారి జీవనశైలి ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ఎక్కువ మంది సంపాదిస్తున్నారని, మెరుగ్గా జీవిస్తున్నారని, విలాసాలకు 'అప్‌గ్రేడ్'అవుతున్నారని చెప్పి వాళ్లందరినీ అనుసరించటం అంటే.. పెరిగిన జీతానికి చేటు తెచ్చుకోవటమే. నిరంతర అశాంతి, అనారోగ్యాలు, రుణ భారం ఈ జీవనశైలి ద్రవ్యోల్బణం ఇచ్చే 'బోనస్'. చాలామంది.. విదేశాల్లో ఉండి సంపాదిస్తున్న తమ స్నేహితులు, బంధువులతో పోల్చి చూసుకుని వారి 'స్థాయి'కి చేరుకోటానికి పరుగులు పెడుతుంటారు. నెలనెలా చెల్లింపులతో మన ల్ని కట్టిపడేసే 'ఈఎంఐ'లతో ఖరీదైనవన్నీ సమకూర్చుకుంటారు. అంతే, ఇక ప్రతినెలా పరుగు మొదలవుతుంది. అందుకే దుప్పటి ఉన్నంత వరకే కాళ్లు ముడుచుకోవాలని పెద్దలు చెప్పిన మాటనే ఇప్పుడు ఆర్థిక నిపుణులూ ప్రబోధిస్తున్నారు.

ముందస్తు హెచ్చరిక సంకేతాలు..

జీవనశైలి ద్రవ్యోల్బణాన్ని ముందుగా తెలియబరిచే హెచ్చరికలు కొన్ని ఉంటాయి.

మొదటి హెచ్చరిక
మీ జీతం ఎంత పెరిగినా, అందులో కొంతైనా పొదుపు మొత్తంలో చేర్చలేకపోవటం.

రెండో హెచ్చరిక
జీతం పెరిగిన నెల నుంచే మీరు బడ్జెట్ వేసుకోవటం మానేయటం.

మూడో హెచ్చరిక
జీతం పెరిగిందన్న ధీమా మీ క్రెడిట్ కార్డు మినిమం బ్యాలెన్స్‌ను పెంచేయటం.

నాలుగో హెచ్చరిక
'ముందు కొనండి– తర్వాత చెల్లించండి'అనే స్కీములపై ఆధారపడటం.

అయిదో హెచ్చరిక
ఇంటర్నెట్, ఓటీటీల సబ్‌స్క్రిప్షన్‌లు పెరగటం.

చిక్కుకోకుండా ఉండాలి

జీవనశైలి ద్రవ్యోల్బణంలో చిక్కుకున్నాక తిరిగి బయటపడటం చాలా కష్టం. ముఖ్యంగా పిల్లల పాఠశాల ఎంపిక. అప్పటికే లక్షల్లో ఫీజులు కట్టి ఉంటారు. వాటికి అదనంగా ట్యూషన్ ఫీజులు సరేసరి. ఈ పొరపాట్లను సరిదిద్దుకోవటం సాధ్యం కాదు. పిల్లల విద్యకు అంతరాయం కలగకుండా వారిని ఉన్నచోటనే కొనసాగించాలి. అలాగే, అద్దెకు తీసుకున్న పెద్ద ఇంటి నుంచి చిన్న ఇంటికి వెళ్లడానికి ప్రిస్టేజ్ అడ్డుపడుతుంది. ఇక ఈఎంఐలను అవి తీరేవరకు కట్టాల్సిందే. క్రెడిట్ కార్డులైతే మెడకు చుట్టుకుని ఉంటాయి. ఈ పరిస్థితిలో దేని నుంచీ వెనక్కు మరలే అవకాశం ఉండదు. మళ్లీ జీతం పెరిగినప్పుడు జాగ్రత్తగా పొదుపు చేసుకోటానికి ఈ అనుభవం పనికొస్తుంది కానీ, అప్పటికే ఆ పెరగబోయే జీతం మొత్తాన్ని కూడా మింగేసే అనకొండల్లా చెల్లించవలసిన ఖర్చులు ఉంటే జీతం పెరిగీ ప్రయోజనం ఉండదు.



బయట పడే మార్గం ఉంది..

జీవనశైలిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవటం అంటే ఖర్చులు తగ్గించుకునే విషయంలో మరీ కఠినంగా ఉండమని కాదు. సురక్షితమైన ఆర్థిక భవిష్యత్తుగా ఒక మంచి ప్రణాళికను సిద్ధం చేసుకోవటం. సమాజం ఎంత ఎత్తులో ఉందో చూడకండి. మీ బడ్జెట్‌కు లోబడి మీరు ఎంత ఎత్తులో ఉండగలరో అంతలోనే ఉండండి. లగ్జరీ కొనుగోళ్లు, ఇంటర్‌నెట్ స్ట్రీమింగ్ ఖర్చులు తగ్గించుకోండి. మీ కుటుంబ సభ్యులకు మీ ఆదాయం, ఖర్చులు, పొదుపుపై స్పష్టమైన అవగాహన కల్పించండి. ఆర్థికంగా మీరు మీ పరిమితులను గుర్తెరిగి మెసులుకుంటే మీ జీవనశైలి ద్రవ్యోల్బణం కానీ, దేశ ద్రవ్యోల్బణం కానీ మిమ్మల్ని, మీ కుటుంబాన్ని ఏమీ చేయలేవని ఆర్థిక నిపుణుల ఉవాచ.



బే'కారు' కాదు.. కారే..

డౌట్ అక్కర్లేదు. ఇది కారే. కాకపోతే.. ప్రపంచంలోనే అత్యంత సన్నటి (స్లిమ్) కారు. ట్రాఫిక్ జామ్‌ల ఫికర్ లేదు. పార్కింగ్ సమస్య లేనే లేదు. ఈ అల్ట్రా స్లిమ్ ఫియట్ పాండా ఎలక్ట్రిక్ కారును ఇటలీలో ఆవిష్కరించారు. డ్రైవర్ కాకుండా.. ఇంకొకరు వెనుక సీట్లో కూర్చొని ప్రయాణించవచ్చు. 50 సెంటీమీటర్ల వెడల్పు మాత్రమే ఉన్న ఈ కారును ఇటలీకి చెందిన మెకానిక్ ఆండ్రియా పాత ఫియట్ కారు భాగాలను ఉపయోగించి రూపొందించాడు. 145 సెంటీమీటర్ల ఎత్తు, 340 సెంటీమీటర్ల పొడవున్న ఈ కారు బరువు 264 కిలోలు. దీన్ని చూసినోళ్లంతా గట్టిగా గాలి వస్తే పడిపోతుందేమో అని అనుమానం చేయగా.. అటూ ఇటూ ఊగుతుంది గానీ.. పడిపోదు అని దీన్ని తయారుచేసిన ఆండ్రియా చెప్పాడు. దాన్ని నిరూపించడానికి అక్కడ నడిపి చూపాడు. ఇది స్లిమ్ కారు.. దానికి తగ్గట్లు ఇందులో సన్నగా ఉన్నవాళ్లే పడతారు. ప్రపంచంలోనే అత్యంత సన్నటి కారుగా దీని పేరును త్వరలో గిన్నిస్ బుక్‌లోకి ఎక్కించనున్నట్లు ఆండ్రియా తెలిపాడు.





పావలా వడ్డీ నిధులు విడుదల

ఈనెల 18 వరకు ఎస్‌హెచ్‌జీల ఖాతాల్లో రూ.344 కోట్లు జమ

సాక్షి, హైదరాబాద్: మహిళా సంఘాలకు పావలా వడ్డీ కింద నిధులు జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ఆర్థిక శాఖ సెర్ప్‌కు రూ.344 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు రూ.300 కోట్లు, పట్టణ మహిళా సంఘాలకు రూ.44 కోట్లు జమ చేయనున్నారు. ఈనెల 18కల్లా అర్హత సాధించిన మహిళా సంఘాలకు నిధులు జమ చేస్తారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జి మంత్రులు, శాసనసభ్యుల ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ప్రమాద బీమా, రుణ బీమా చెక్కులను కూడా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

క్లుప్తంగా...

విద్యార్థుల 'స్థానికత'ను కొనసాగించాలి

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యాశాఖ పరిధిలోని ప్రవేశ పరీక్షలకు స్థానికతను మార్పు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 20ను తాత్కాలికంగా నిలిపివేసి స్థానికతను కొనసాగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో విద్య, ఉపాధికి సమాన అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 371(డి) ప్రకారం మూడు రీజియన్‌ల వ్యవస్థ ఉండేదన్నారు. 2014 రాష్ట్ర విభజన తర్వాత మరో పదేళ్ల ఇదే స్థితిని కొనసాగిస్తూ రాష్ట్రపతి ప్రత్యేక ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. దీని కాలపరిమితి గతేడాదితో ముగియడంతో తెలంగాణ ఆంధ్ర విద్యార్థులను స్థానికేతరులుగా పరిగణిస్తూ జీవో ఇచ్చి అమలు చేస్తోందన్నారు. మన ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా ఈ ఏడాది మే 21న జీవో ఇచ్చిందన్నారు. ఏపీలో స్థానికత నిరూపించుకోవాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు పదేళ్ల రాష్ట్రంలో నివాసం ఉన్నట్టు రెసిడెన్స్ సర్టిఫికెట్ ఉండాలని, ఆ తల్లితండ్రులు ఏపీలో పదేళ్లపాటు చదివినట్టు స్టడీసర్టిఫికెట్స్ ఉండాలనే నిబంధనలు సమస్యను మరింత జటిలం చేశాయన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వాయిదా వేయాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు.

స్థానికతకు ఈ ఏడాది మినహాయింపునివ్వాలి

ఎస్ఎఫ్ఐ వినతి

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యా ప్రవేశాల్లో స్థానికత అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పీ రామ్మోహనరావు, కె ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. విభజన చట్టం గడువు ముగియడంతో రాష్ట్రంలోని ఎస్వీ, ఏయూ రీజియన్ పరిధిలుగా ప్రభుత్వం నిర్ణయించడం వలన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని విద్యాశాఖామంత్రి లోకేశ్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ వంటి కోర్సుల్లో ప్రవేశానికి ముందు నాలుగేళ్లలో ఏ ఒక్క ఏడాది బయట రాష్ట్రంలో చదివినా, వాళ్లందరూ స్థానికేతరులుగా పరిగణించాలనే నిబంధన విధించడం దారుణమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది వరకు గత పద్ధతినే అమలు చేయాలని, నూతన స్థానికత అంశాన్ని అమలు చేసే క్రమంలో తొలుత ఆయా అంశాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

మంత్రి క్యాంపు కార్యాలయ నిర్వహణకు రూ.49.50 లక్షలు

సాక్షి, అమరావతి: జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్యాంపు కార్యాలయం నిర్వహణ, హౌస్ కీపింగ్, భద్రతకు ప్రభుత్వం రూ.49.50 లక్షలు మంజూరు చేసింది. విజయవాడలోని బృందావన్ కాలనీ నందమూరి స్ట్రీట్‌లో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయ నిర్వహణకు 2024–25లో 50.80 లక్షలు మంజూరు చేయాలని గతేడాది డిసెంబర్ 20, ఈ ఏడాది ఏప్రిల్ 26న జలవనరుల శాఖ ఈఎన్‌సీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ప్రతిపాదనలు పంపారు. పరిశీలించిన జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంత్రి నిమ్మల క్యాంపు కార్యాలయ నిర్వహణకు 2024–25కు రూ.49.50 లక్షలు మంజూరు చేశారు.

కొనుక్కున్నాడు.. పోస్ట్ ఇచ్చేయ్

ఉన్నత విద్యామండలిలో అడ్డగోలు నియామకాలు

నోటిఫికేషన్ లేదు.. ఇంటర్వ్యూలతో పనిలేదు

- ప్రభుత్వ పెద్దలు, సీఎంవో అధికారుల సిఫారసులతో కన్సల్టెంట్ల నియామకం
- ఈనాడు మాజీ రిపోర్టర్‌కు రూ.60 వేల జీతంతో ఉద్యోగం
- ముఖ్యనేత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు 'రాజకీయ' కొలువులు



సీఎం చంద్రబాబుతో ఈనాడు మాజీ రిపోర్టర్ ఉదయ్‌కుమార్

ఉన్నత విద్యామండలి రాజకీయ పునరావాసానికి నిలయంగా మారుతోంది. విద్యా సంస్కరణలు, విజ్ఞాన విశ్లేషణలకు పెద్దపీట వేయాల్సిన చోట పరిపాలన యంత్రాంగం గాడి తప్పుతోంది. రాజకీయ పెద్దల సిఫారసులు, సీఎం కార్యాలయ అధికారుల ఆదేశాలతో అడ్డగోలు నియామకాలు చేసేస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో ఐదుగుర్ని కన్సల్టెంట్లుగా నియమించారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతోంది. కనీసం నియామక సమయంలో పాటించాల్సిన ప్రాథమిక సూత్రాలను కూడా విస్మరించి ప్రభుత్వ పెద్దల ఆదేశాలే పరమావధిగా పోస్టులను నింపేస్తున్నారు. పైగా కన్సల్టెంట్లలో ముఖ్యనేత సామాజిక వర్గానికి చెందిన వారే ఎక్కువగా ఉండటం గమనార్హం.

–సాక్షి, అమరావతి

ఉన్నత విద్యామండలిలో కన్సల్టెంట్లుగా చేరిన వారిలో నలుగురికి అలవెన్సులతో కలిపి నెలకు ఏకంగా రూ.80 వేల చొప్పున జీతం చెల్లిస్తున్నారు. ఏపీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులతోపాటు తెలంగాణకు చెందిన మాజీ ఉద్యోగులను సైతం తీసుకొచ్చి రూ.వేలకు వేలు జీతాలు చెల్లిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ నియామకాలు చేపట్టేందుకు నిర్దిష్ట నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వాకిన్ ఇంటర్వ్యూలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ, పారదర్శకతను పాటించాల్సిన ప్రభుత్వమే వాటిని గాలికొదిలేసింది. ఒకవైపు ఏడాదిగా ఉన్నత విద్యామండలి ఉద్యోగులకు వర్క్ అలాట్‌మెంట్ చేయలేదు. ఎవరు ఏ పని చేస్తున్నారో తెలియని దయనీయ స్థితిలో ఉండగా.. రాజకీయ సిఫారసులతో కన్సల్టెంట్లను తీసుకొచ్చి కూర్చోబెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాధనాన్ని వృథా చేయడం తప్ప ఈ కన్సల్టెంట్లతో ఒరిగేదేమీ లేదని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒక్కొక్కరికీ రూ.80 వేల జీతం

'ఈనాడు' ఉద్యోగులకు అందలం

టీడీపీ గెజిట్ పత్రిక ఈనాడులో పనిచేసిన వారిని కూటమి ప్రభుత్వం అందలం ఎక్కిస్తోంది. ఈనాడు రిపోర్టర్‌గా 2014 నుంచి 2023 వరకు పనిచేసిన ఉదయ్‌కుమార్‌ను తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వర్సిటీ, వేదిక్ యూనివర్సిటీ, సంస్కృత విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యామండలిలో కన్సల్టెంట్‌గా నియమించింది. ఆయనకు ఎటువంటి వర్క్ అలాట్‌మెంట్ చేయకపోయినా తనను తాను ఉన్నత విద్యామండలి పీఆర్వోగా ప్రచారం చేసుకోవడం గమనార్హం. ఆయన గతంలోనూ రిపోర్టర్‌గా పనిచేస్తూనే.. 2014లో ఎస్వీయూలో సంస్కృత విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా చేరారు. అప్పట్లోనే రాజకీయ పైరవీలతో వివాదాస్పద వ్యక్తిగా గుర్తింపు పొందారు. 2019లో ప్రభుత్వం మారటంతో ఉద్యోగాన్ని వదిలేశాడు. ఆ తర్వాత మళ్లీ ఎస్వీ వేదిక్ యూనివర్సిటీలో తాత్కాలిక అధ్యాపకుడిగా చేరారు. ఉదయ్‌కుమార్ ప్రవర్తన తీరుపై విమర్శలు రావడంతో టీటీడీ యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించింది. అనంతరం లోకేశ్ యువగళంలో ఉదయ్‌కుమార్ ఆయన వెంట నడిచారు. తర్వాత ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై ప్రభుత్వంపై బురదజల్లుతూ వంచన పేరుతో పుస్తకం రాసి అసత్య ప్రచారానికి తెరతీశారు. ఇటీవల ముఖ్యనేత కార్యాలయంలో పనిచేస్తున్న ఓ కార్యదర్శి స్థాయి అధికారి సిఫారసుతో ఉన్నత విద్యామండలిలో ఉదయకుమార్ తిరిగి ప్రత్యక్షమయ్యారు.

వర్సిటీల్లో సిబ్బందికి అరకొర జీతాలు

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో దశాబ్దాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది అరకొర జీతాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. దాదాపు 80 శాతం మంది ఉన్నత విద్యాధికులుగా, పీహెచ్‌డీలు చేసి వర్సిటీల్లో నామమాత్రపు జీతాలు తీసుకుంటూ మగ్గిపోతున్నారు. కనీసం రూ.వెయ్యి జీతం పెంచాలంటే కూడా వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం, ఆర్థిక శాఖ ఆమోదం ఉంటే తప్ప అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. తాజాగా కాంట్రాక్టు పునరుద్ధరణకు దశాబ్దాలుగా పనిచేస్తున్న వారిని సైతం పనితీరును నిరూపించుకోవాలని ఇంటర్వ్యూలు చేపడుతోంది. అలాంటిది ఒక్క సిఫారసుతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు, టీడీపీ గెజిట్ పత్రిక ఈనాడు మాజీ రిపోర్టర్‌కు పనిలేకుండానే వేలకు వేలు జీతాలు ఇచ్చి కూర్చోబెడుతుండటంపై వర్సిటీ ఉద్యోగులు సైతం మండిపడుతున్నారు. ఉన్నత విద్యా మండలిలోనే తాత్కాలిక ప్రాతిపదికపైన 10 ఏళ్లకు పైగా చిన్నపాటి జీతాలతో బతుకీడుస్తున్న సిబ్బంది జీతం పెంచమని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదు.

ఈవీకి సాటి రావు ఏవీ!

విద్యుత్ వాహనాలతో వాయు కాలుష్య నియంత్రణ

- ఈవీలకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లోకి హైడ్రోజన్ ఇంధనం
- ధర, నిర్వహణ ఖర్చులు ఎక్కువైనా భవిష్యత్‌లో తగ్గే అవకాశం



సాక్షి, అమరావతి: వేగంగా జరుగుతున్న పట్టణీకరణ కారణంగా 2050 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రతి 10 మందిలో ఏడుగురు నగరాల్లో నివసిస్తారని అంచనా. పట్టణాలు వృద్ధి చెందడం వల్ల ఉద్యోగాలు, ముఖ్యమైన సేవలకు ఎక్కువ ప్రాధాన్యత లభిస్తుంది. కానీ.. దానికి మించి ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యం వంటి సవాళ్లు కూడా పెరిగిపోతాయి. ఇది ప్రజల ఆరోగ్యంపై అత్యంత ప్రభావం చూపుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రస్తుతం విద్యుత్ వాహనాల వినియోగం కనిపిస్తోంది. భవిష్యత్‌లో వాహనాలకు హైడ్రోజన్ ఇంధనం తోడు కానుంది. అది కాలుష్యాన్ని నియంత్రించి, స్వచ్ఛ భారత్ సాధనకు కారకమవుతుందని ఇంధన, వాహనరంగ తాజా అధ్యయనాలు చెబుతున్నాయి.

ఈవీలకు పెరిగిన డిమాండ్

మన దేశంలో 2008 నుంచి 2019 వరకూ గాలిలో ఉండే పీఎం 2.5 కణాలు 10 ప్రధాన నగరాల్లో ఏటా దాదాపు 30 వేల మరణాలకు కారణమయ్యాయి. ఇది మొత్తం మరణాలలో 7.2 శాతం అని లాన్సెట్ అధ్యయనం తాజాగా వెల్లడించింది. ఇందులో ముంబైలో ఏటా 5,100 మరణాలు, కోల్‌కతాలో 4,678 మరణాలు, చెన్నైలో 2,870 మరణాలు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో అహ్మదాబాద్, బెంగళూరు, హైదరాబాద్, పుణె, వారణాసి, సిమ్లా, ఢిల్లీ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలుష్యాన్ని నియంత్రించే ప్రజా రవాణా వ్యవస్థలపై నగరాలు దృష్టి సారించాయి. ఫలితంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) డిమాండ్ పెరిగింది. 2023లో మొత్తం వాహన అమ్మకాలలో ఈవీల వాటా దాదాపు 5 శాతంగా ఉంది. మొత్తం కార్ల అమ్మకాలలో కేవలం 10 శాతం వృద్ధితో పోలిస్తే ఎలక్ట్రిక్ కార్ల రిజిస్ట్రేషన్లు ఏటా 70 శాతం పెరిగి 80 వేల యూనిట్లకు చేరుకున్నాయి. అయితే, అత్యంత వేగవంతమైన వృద్ధి త్రీ వీలర్ విభాగంలో ఉంది. ప్రపంచ ఎలక్ట్రిక్ త్రీ వీలర్ అమ్మకాలలో దాదాపు 60 శాతం వాటా భారత్‌కు ఉంది. వాస్తవానికి 2023లో మనదేశం చైనాను అధిగమించి 5.80 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల అమ్మకాలతో అతిపెద్ద ఈవీ మార్కెట్‌గా నిలిచింది. 8.80 లక్షల వాహనాలను విక్రయించి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల మార్కెట్‌గా మనదేశం అవతరించింది.

దూసుకొస్తున్న హైడ్రోజన్

బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు (బీఈవీ) మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ.. ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వాహనాలు (ఎఫ్‌సీఈవీ) ఈవీలకు ప్రత్యామ్నాయంగా దూసుకొస్తున్నాయి. ఇవి అధిక శక్తి సాంద్రత కారణంగా తక్కువ ఇంధనంతో ఎక్కువ దూరం ప్రయాణించగలుగుతాయి. కేవలం 5 నుంచి 15 నిమిషాల్లో ఇంధనం నింపుకోగలవు. బ్యాటరీతో నడిచే వాహనాల కంటే తేలికగా ఉంటాయి. ముఖ్యంగా సుదూర ప్రయాణం, వర్షం, తీవ్రమైన చలిలోనూ దూసుకుపోగలుగుతాయి. అయితే, ఎఫ్‌సీఈవీలు ప్రస్తుతం చాలా తక్కువ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 93 వేల వాహనాలే ఉన్నాయి. దీనికి కారణం అధిక ధర, నిర్వహణ ఖర్చులుగా చెప్పుకోవచ్చు. ఇంధన సెల్ బస్సులు, ట్రక్కులు వాటి బ్యాటరీ, ఎలక్ట్రిక్ కౌంటర్ పార్ట్‌ల కంటే 20–30 శాతం ఎక్కువ హైడ్రోజన్ వాహనాలకు ఖర్చవుతాయి. అయినప్పటికీ, సాంకేతికత మెరుగుపడటంతో రెండింటి ధరలు 2030 నాటికి సమానమవుతాయని నిపుణులు భావిస్తున్నారు.

దిగిరానున్న ఖర్చులు

డీజిల్ బస్సులకు కిలోమీటర్‌కు నిర్వహణ ఖర్చు దాదాపు రూ.23.06 అవుతుంది. అదే ఎలక్ట్రిక్ బస్సులకు రూ.14.52 మాత్రమే ఖర్చవుతుంది. విద్యుత్ వాహనాల కొనుగోలు ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆ మేరకు నిర్వహణ భారం తగ్గుతుంది. కానీ హైడ్రోజన్ ఇంధన సెల్ బస్సులు నడపడానికి చాలా ఖర్చవుతుంది. సహజ వాయువు నుంచి ఉత్పత్తి చేసిన బ్లూ హైడ్రోజన్ కిలోమీటర్‌కి రూ.71.73 ఖర్చవుతుంది. అదే గ్రీన్ హైడ్రోజన్ పునరుత్పాదక వనరుల నుండి తీసుకుంటే కిలోమీటర్‌కు రూ.77.69 ఖర్చవుతుంది. హైడ్రోజన్ వాహనాల ప్రారంభ ధర రానున్న ఐదేళ్లలో బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల ధరతో సమానంగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, వాటి నిర్వహణ ఖర్చులు 2030 తర్వాత కూడా ఎక్కువగానే ఉంటాయని చెబుతున్నారు.

భారీ లక్ష్యానికి తోడ్పాటు

కాలుష్యం లేని భారత్ కోసం 'నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ ప్లాన్'కి మన దేశం రూపకల్పన చేసింది. నేషనల్ ఎనర్జీ సెక్యూరిటీని, దేశీయ తయారీ సామర్థ్యాలను పెంచటం, వాహన కాలుష్యాన్ని తగ్గించటం వంటి లక్ష్యాలతో ఈ ప్రణాళికను తీసుకొచ్చారు. దేశంలో ఎక్కువ మంది ఫ్యూయెల్ బేస్డ్ వాహనాలే ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రపంచంలో అత్యధిక కాలుష్యం గల దేశాల్లో భారత్ 3వ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో 2030 నాటికి 30 శాతం ఈవీ కార్లు, 80 శాతం ఈవీ టూ వీలర్లు, 70 శాతం ఈవీ కమర్షియల్ వెహికిల్స్ ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. తద్వారా 1 గిగా టన్ కర్బన ఉద్గారాలు తగ్గుతాయని అంచనా వేసింది. భవిష్యత్‌లో మన దేశంలో విద్యుత్ వాహనాలను మాత్రమే నడపాలని కేంద్రం భావిస్తోంది. పొల్యూషన్ ఫ్రీ ఇండియాను, ఆయిల్ దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేని పరిస్థితులను చూడాలన్నదే తన ఉద్దేశమని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. హైడ్రోజన్ వాహనాల వినియోగం ఇందుకు తోడ్పాటు అందించనుంది.

డొక్క లెండుతున్నాయ్!

- కొండెక్కిన కొబ్బరి కాయలు
- తిరోగమనంలో డొక్క ధర
- రైతుల వద్ద టన్నుల కొద్దీ నిల్వలు
- రెండు నెలల కిందట ట్రాక్టర్ సరకు రూ.1,500
- ఇప్పుడు రూ.500 ఎదురు ఇచ్చి ఎగుమతులు



మామిడికుదురు మండలం పాశర్లపూడిలంకలోని కొబ్బరి తోటలో పేరుకుపోయిన డొక్క



కొబ్బరి తోటలో డొక్కను తగలబెడుతున్న రైతులు

సాక్షి, అమలాపురం: కొబ్బరి ధర కొండెక్కింది.. రికార్డు స్థాయిలో పెరిగింది.. దానికి తగ్గట్టు పెరగాల్సిన పీచు ఉత్పత్తుల ధర తిరోగమనంలో కొట్టుమిట్టాడుతుంది.. ఇలా పీచు పరిశ్రమ విలవిల్లాడుతోంది.. టన్నుల కొద్దీ పేరుకుపోతున్న కొబ్బరి డొక్క రైతులకు శిరోభారంగా మారింది. అత్యంత విలువైన డొక్క కొంత రోడ్ల వెంబడి, తోటల్లో చెత్తగా మారిపోతుండగా, మరికొంత అగ్నికి ఆహుతవుతోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పీచు పరిశ్రమ అత్యంత పెద్దది. కొబ్బరి సాగు జరుగుతున్న ప్రాంతాల్లో పీచు, దాని అనుబంధ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు భారీ ఎత్తున ఉన్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా, ఒక్క డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనే 1.10 లక్షల ఎకరాలు ఉంది. ఇక్కడ కొబ్బరి అనుబంధ పరిశ్రమల్లో క్వాయర్ ఉత్పత్తులది అగ్రస్థానం. విలువ ఆధారిత పరిశ్రమల్లో 80 శాతం క్వాయర్ ఆక్రమించింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,200 వరకూ చిన్న, పెద్దా పీచు ఉత్పత్తి కేంద్రాలు ఉంటే, ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 740 వరకూ పీచు, తాళ్ల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పీచు ఉత్పత్తి కేంద్రంలో రోజుకు టన్ను నుంచి ఐదు టన్నుల వరకూ పీచు ఉత్పత్తి అవుతుంది. ఏడాదికి ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి రూ.125 కోట్ల విలువైన పీచు, ఇతర ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని అంచనా. ఎగుమతుల్లో సింహభాగం అంటే 70 శాతం చైనాకు వెళ్తుండగా, మిగిలిన ఎగుమతి మలేషియా, సింగపూర్, జపాన్‌తోపాటు గల్ఫ్, యూరప్ దేశాలకు ఉంటుంది.

అంతకంతకూ పతనం

ప్రస్తుతం కొబ్బరి కాయ ధర రూ.22 పలుకుతోంది. కానీ విచిత్రంగా కొబ్బరి పీచు ధరలు మాత్రం పతనమయ్యాయి. ఎగుమతులూ తగ్గాయి. తడి పీచు కిలో రూ.ఆరు పలుకుతుండగా, పొడి పీచు రూ.8 వరకూ ఉంది. తడి పీచు ఎండబెట్టి బేళ్లుగా మార్చి విక్రయిస్తే కిలో రూ.12 వరకూ వస్తోంది. కానీ పెట్టుబడి వ్యయం పెరగడంతో గిట్టుబాటు కావడం లేదు. తడి పీచు సగటు ధర కిలో రూ.తొమ్మిది వరకూ ఉండగా, ఇప్పుడు రూ.ఆరుకు చేరింది. చివరకు కొబ్బరి తాళ్ల ధరలు సైతం తగ్గాయి. 24 అడుగుల 100 ముక్కల కట్ట హైదరాబాద్ మార్కెట్‌లో రూ.150 మాత్రమే ఉంది. గతంలో ఇది రూ.220 వరకూ పలికేది. ముంబయికి వెళుతున్న తాళ్లకు మాత్రం రూ.180 వరకూ వస్తోంది.

పెరిగిన ఉత్పత్తి వ్యయం

ఇటీవల కాలంలో పీచు, తాళ్లు, కొబ్బరి పొట్టు వంటి ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగింది. పీచు పరిశ్రమ నష్టాలకు ఇది కొంత కారణమవుతోంది. ఒక్క కార్మికుడికి రోజు వేతనం రూ.600 వరకూ ఉంది. ఆధునిక యంత్రాలు వచ్చిన తరువాత కార్మికుల సంఖ్య తగ్గిందని, కానీ వారికి చెల్లించే జీతం పెరిగిందని ఉత్పత్తిదారులు చెబుతున్నారు.



అమ్మకాలు లేక పరిశ్రమ వద్ద పేరుకుపోయిన పీచు

విద్యుత్ బిల్లుల షాక్

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పీచు పరిశ్రమల యజమానులకు విద్యుత్ చార్జీల షాక్ తగులుతోంది. యూనిట్ విద్యుత్ ధర రూ.ఆరు. కానీ అదనపు లోడు వినియోగం, ఇంధన చార్జీలు, అపరాధ రుసుం పేరుతో ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. యూనిట్ ధర రూ.10 నుంచి రూ.12 వరకూ కావడంతో ఉత్పత్తి వ్యయం పెరిగింది. నాలుగు వేల యూనిట్లు వచ్చే మధ్య తరహా పరిశ్రమకు రూ.24 వేల విద్యుత్ బిల్లు రావాల్సి ఉండగా, కొంతమందికి రూ.40 వేల వరకూ వస్తోంది.

ఎక్కడికక్కడే పేరుకుపోయి..

రెండు నెలల కిందట టన్ను కొబ్బరి డొక్కను స్థానిక పీచు ఉత్పత్తిదారులు రూ.1,500కు కొనుగోలు చేశారు. ఇప్పుడు కొనుగోలు నిలిచిపోవడంతో కొబ్బరి తోటల్లో డొక్క టన్నుల కొద్దీ ఉండిపోయింది. ఈ డొక్కను ఉచితంగా తీసుకు వెళ్లాలని రైతులు పరిశ్రమల యజమానులను వేడుకుంటున్నారు. అవసరమైతే ట్రాక్టర్‌కు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకూ ఎదురిచ్చి వదిలించుకునే పనిలో పడ్డారు. ఇదే సమయంలో తమిళనాడులో కొబ్బరి ఉత్పత్తి తగ్గడం వల్ల అక్కడ పీచు పరిశ్రమల యజమానులు రాష్ట్రంలోని చిత్తూరు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి డొక్క కొనుగోలు చేసి తీసుకు వెళ్తుండడం గమనార్హం. ఇక్కడ తోటల్లో పేరుకుపోయిన డొక్కను నిర్జీవ ప్రాంతాలకు తరలించడం, లేకుంటే తగలబెట్టడం చేస్తున్నారు.



భారీ పరిశ్రమలు రావాలి



పీచు పరిశ్రమ నిలదొక్కుకోవాలంటే జిల్లాలో భారీ పరిశ్రమలు రావాలి. ఒక్కో పరిశ్రమ వద్ద పలు రకాల విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు కావాలి. ప్రతి మండలంలో క్వాయర్ క్లస్టర్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ప్రైమినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ)లో ఇప్పుడు రూ.50 లక్షల వరకూ రాయితీతో కూడిన రుణం ఇస్తుంది. ఇది కనీసం రూ.కోటికి పెంచాలి. అప్పుడు పలు రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చు.

– వేగి వెంకటేశ్వరరావు, డైరెక్టర్, కోనసీమ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్

ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో మార్పులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ పోస్టుల భర్తీలో మార్పులు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా మార్గదర్శకాల ప్రకారం, మొత్తం 100 మార్కులకు భర్తీ ప్రక్రియను నిర్వహించనున్నారు. ఇందులో 80 మార్కులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహిస్తారు. 20 మార్కులకు ఏపీ టెట్ వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇది కాకుండా, ఇప్పటికే ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం ఉద్యోగ అనుభవానికి 0.5 పాయింట్లు, గరిష్టంగా 5 పాయింట్ల వరకు అదనపు వెయిటేజీ ఇచ్చే అవకాశం ఉంటుంది. పరీక్షను స్టాఫ్ సెలక్షన్ కమిటీ నిర్వహిస్తుంది.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

సబ్బవరం(అనకాపల్లి జిల్లా): బాలిక అదృశ్యంపై అనకాపల్లి జిల్లా సబ్బవరం పోలీసులు ఓ యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా బుడారిసింగ్ గ్రామానికి చెందిన పసుపులేటి హరిబాబు కుటుంబ సభ్యులతో సబ్బవరం వచ్చి అనకపల్లి ప్రాంతంలో నర్సరీ నడుపుతున్నాడు. అతనికి తేజ(19) అనే కుమారుడు ఉన్నాడు. సబ్బవరంలోని సాయినగర్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉండటంతో యజమాని కుమార్తెతో పరిచయం ఏర్పడింది. మే నెలలో బాలికను అపహరించుకుని పోవడంతో బాలిక తండ్రి సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఒడిశా రాష్ట్రంలో తేజను గురువారం పట్టుకుని బాలిక స్టేట్‌మెంట్ మేరకు అరెస్ట్ చేశారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు.





• జీనియస్

చిన్నారి బ్రూక్... లెక్కల్లో జీనియస్

లెక్కలంటే చాలామంది పిల్లలు భయపడతారు. ఎక్కాలు చెప్పమంటే తల గోక్కుంటారు. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు తెచ్చుకున్నా, లెక్కల్లో మాత్రం ఫెయిలవుతుంటారు. కానీ తొమ్మిదేళ్ల వయసుకే లెక్కల్లో జీనియస్ అనిపించుకుంటోంది ఓ చిన్నారి. టకటకా లెక్కలు చేస్తూ గిన్నిస్ రికార్డు సైతం సాధించింది. తనే యూకేకు చెందిన బ్రూక్ క్రెస్సీ.


బ్రూక్ క్రెస్సీ తండ్రి మార్క్, తల్లి షెల్లీ. చిన్ననాటి నుంచి బ్రూక్‌కు లెక్కలంటే అమితమైన ఇష్టం. ఇతర పిల్లలకంటే భిన్నంగా లెక్కల్లో మునిగితేలే తనను చూసి అంతా ఆశ్చర్యపోయేవారు. చాలా తొందరగా కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు నేర్చుసుకొని అందర్నీ అబ్బురపరిచింది. అనంతరం మ్యాథ్స్ పజిల్స్‌పై దృష్టి పెట్టింది. ఆ సమయంలోనే తనకు టైమ్స్ టేబుల్స్ రాక్ స్టార్స్ (TTRS) పరిచయమైంది. ఇదొక సరదా ఆట. అయితే ఇందులో లెక్కలే ప్రధానం. గణితంలోని ప్రశ్నలకు ఎవరైతే తొందరగా పరిష్కరిస్తారో వారికి స్కోర్ వస్తుంది. ఈ ఆట బ్రూక్‌కు సరదాగా అనిపించింది. 2020 సెప్టెంబర్‌లో దీన్ని సాధన చేయడం మొదలుపెట్టి గణితంలోని ప్రశ్నలను అందరికంటే వేగంగా పరిష్కరించడం మొదలుపెట్టింది. మొదటి ప్రయత్నంలోనే 28 స్కోర్ సాధించింది. అలా రోజూ అరగంటసేపు సాధన చేస్తూ ఆరు నెలల్లో సెకనుకు 3 ప్రశ్నలకు సమాధానం చెప్పే స్థాయికి చేరింది.

8 ఏళ్ల వయసులో టైమ్స్ టేబుల్స్ రాక్ స్టార్స్‌లో పోటీల్లో పాల్గొంది. ఈ పోటీల్లో దాదాపు 4 లక్షల మంది పిల్లలు పాల్గొన్నారు. సుమారు నాలుగు గంటల్లో 41,627 ప్రశ్నలకు సరైన సమాధానం ఇచ్చి, 210 స్కోరు సాధించింది బ్రూక్. తన ప్రతిభ చూసి అందరూ తనను 'హ్యూమన్ కాలిక్యులేటర్', 'రోబో' అని పొగిడారు. అతి చిన్న వయసులో టైమ్స్ టేబుల్స్ రాక్ స్టార్స్‌లో పోటీల్లో 210 స్కోరు సాధించిన వ్యక్తిగా గిన్నిస్ ప్రతినిధులు తనకు రికార్డ్ అందించారు.


'కొంతమంది గణితం అంటే చాలా బోరింగ్ అనుకుంటారని, కానీ దృష్టి పెడితే గణితం చాలా సులభంగా, వినోదాత్మకంగా ఉంటుందని' బ్రూక్ అంటుంది. సైకిల్ తొక్కడం ఇష్టం, ఈత కొట్టడం తనకు చాలా ఇష్టమైన పనులని, పెద్దయ్యాక గణిత శాస్త్రవేత్తని అవుతానని చెప్తోంది.

రంగుల బొమ్మల్లో అలరించే జాతక కథలు

బుద్ధుని పూర్వ జన్మల గురించి రాసిన జానపద కథలే 'జాతక కథలు'. ఇవి ఆనాటి జీవనాన్ని వివరించి, నీతిని బోధిస్తాయి. ఈ కథలన్నీ పాళీ భాషలో రాయగా, ఆ తరువాత అనేక భాషల్లోకి అనువదించారు. రచయిత్రి జె.శ్యామల పిల్లల కోసం సులువైన రీతిలో వీటిని రాశారు. కథలతోపాటు రంగురంగుల బొమ్మలు కూడా ఉండటంతో అవి మిమ్మల్ని తప్పకుండా ఆకట్టుకుంటాయి.



• పుస్తకం



పద్యాలతో నడిచే పసందైన నవల

పద్యాలంటే మీకు ఇష్టమా? అయితే మీలాంటి వారు తప్పకుండా చదవాల్సిన నవల ఇది. తన్హా లై అనే రచయిత్రి పద్యాలతో ఈ పుస్తకం రాశారు.

యుద్ధం కారణంగా వియత్నాం నుంచి అమెరికాకు వచ్చిన కుటుంబంలోని ఓ అమ్మాయి ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొందో ఈ నవలలో చదవొచ్చు. ఈ పుస్తకానికి 2011లో యూఎస్ నేషనల్ బుక్ అవార్డ్ ఫర్ యంగ్ పీపుల్స్ లిటరేచర్ లభించింది.

ఈ పార్క్‌లో గలీవర్ ఉంటాడు తెలుసా?








ప్రసిద్ధ రచయిత జోనాథన్ స్విఫ్ట్ రాసిన 'గలివర్స్ ట్రావెల్స్' నవల చదివారా? అందులోని లిల్లిపుట్ రాజ్యంలో మనుషులంతా వేలెడంత చిన్నగా ఉంటారు. ఆ మనుషులందరికీ గలీవర్ భారీ మనిషిలా కనిపిస్తాడు. వారితో అతను కలిసి చేసిన సందడంతా చదివేందుకు చాలా ఆసక్తిగా ఉంటుంది. అయితే ఆ నవలలోని లిల్లిపుట్ రాజ్యం నిజంగా మన ముందు ఉంటే ఎలా ఉంటుంది? నిజంగానే అలాంటి ఓ ప్రాంతాన్ని స్పెయిన్ దేశంలో సృష్టించారు. వాలెన్సియాలోని తురియా సమీపంలో ఏంజెల్ కస్టోడియో, రీనో వంతెనల మధ్య 'గలీవర్ పార్క్' ఉంది. నవలలోని ప్రధాన పాత్ర పేరునే ఈ పార్క్‌కు పెట్టారు. ఈ పార్క్‌లో అందర్నీ ఆకర్షించే అంశం, దాదాపు డెబ్బై మీటర్ల పొడవు, తొమ్మిది అడుగుల ఎత్తులో పడుకున్నట్లు ఉన్న గలివర్ బొమ్మ. నవలలో లిల్లిపుట్లు గలీవర్ మీదకు ఎక్కినట్లు, మనం కూడా గలీవర్ బొమ్మ మీదకు ఎక్కొచ్చు. అందుకోసం ప్రత్యేకంగా ర్యాంప్‌లు, నిచ్చెనలు ఏర్పాటు చేశారు. అంత పెద్ద బొమ్మ ముందు అందరూ లిల్లిపుట్లలాగే కనిపిస్తారు. దీంతో పిల్లలు ఇక్కడికి రావడానికి సరదా పడుతుంటారు. కేవలం ఆ గలివర్ బొమ్మపైకి ఎక్కడం మాత్రమే కాదు. అక్కడ రకరకాల ఆటలు ఆడుకునేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణంలో అక్కడ గడపడం ఎంతో బాగుంటుంది. అందుకే దేశవిదేశాల నుంచి ఈ గలీవర్ పార్క్ చూడటానికి ఎంతోమంది వస్తుంటారు. ఏడాది పొడవునా ఈ పార్క్‌లోకి అందర్నీ ఉచితంగా అనుమతిస్తారు. డిసెంబర్ 25, జనవరి 1వ తేదీల్లో మాత్రం ఈ పార్క్‌ను మూసేస్తారు. మిగిలిన సమయాల్లో ఇక్కడికి వచ్చి నచ్చినంతసేపు ఎన్ని ఆటలైనా ఆడుకోవచ్చు. బాగుంది కదా?

• మీకు తెలుసా

ఆయన పేరే 'ఎవరెస్టు'కు పెట్టారు



పిల్లలూ.... మనందరికీ ఎవరెస్టు శిఖరం తెలుసు. హిమాలయాల్లో అన్నింటి కంటే ఎత్తయిన శిఖరం, ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరం ఎవరెస్ట్. కాని అది ఒక వ్యక్తి పేరు. ఎత్తయిన శిఖరానికి తన పేరు పెట్టేంత గొప్పవాడైన ఎవరెస్ట్ ప్రముఖ బ్రిటిష్ సర్వేయర్, జియోడెసిస్ట్, జియోగ్రాఫర్, రాయల్ సొసైటీ సభ్యుడు .

ఎవరెస్ట్ 1790 జూలై 4 న గ్వెర్న్ వేల్ లో జన్మించాడు. ఆయన ఇంగ్లాండులోని మిలిటరీ విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించాడు. 16 సంవత్సరాల వయస్సులో భారతదేశానికి చేరుకున్నాడు. ఈస్ట్ ఇండియా కంపెనీలో 1806లో చేరాడు. ఏడు సంవత్సరాలు బెంగాలులో పనిచేశాడు. జావా సర్వే పనిలో 1814 నుండి 1816 వరకు పని చేశాడు. తర్వాత అతను భారత దేశ గ్రేట్ త్రికోణమితి సర్వే Great Trigonometrical Surveyలో విలియం లాంబ్టన్‌కు సహాయకుడిగా నియమించబడ్డాడు. భారతదేశపు అత్యంత చివరి దక్షిణ బిందువు కేప్ కొమరిన్ నుండి నేపాల్ వరకు దాదాపు 2,400 కిలోమీటర్ల (1,500 మైళ్ళు) దూరంలో ఉన్న మెరిడియన్ ఆర్క్ (meridian arc)ను సర్వే చేయడంలో ప్రధాన పాత్ర పోషించాడు ఎవరెస్ట్. ఆయన తన కాలంలోని అత్యంత ఖచ్చితమైన సర్వే పరికరాలను ప్రవేశపెట్టి సర్వే పని ఖచ్చితత్వాన్ని పెంచాడు. 1865లో రాయల్ జియోగ్రాఫికల్ సొసైటీ ఎవరెస్ట్ గౌరవార్థం శిఖరం పేరును ఎవరెస్ట్ గా మార్చింది. ఆ పర్వతానికి చాలా స్థానిక పేర్లు ఉన్నందున కన్ఫ్యూజన్ లేకుండా ఎవరెస్ట్ పేరును ప్రతిపాదించింది. అలా ఎవరెస్ట్ పర్వతానికి ఎవరెస్ట్ పేరు స్థిరపడింది.

రెయిన్‌బో రివర్











పిల్లలూ... మనకు సాధారంగా రెయిన్బో లేదా ఇంద్రధనస్సు ఎక్కడ కనిపిస్తుంది? ఆకాశంలోనే కదా! అది కూడా వర్షం వెలసిన తర్వాత చుట్టం చూపుగా వచ్చి వెళ్తుంది. కానీ సంవత్సరం పొడవునా మనకి కావాల్సినప్పుడు రెయిన్‌బో అందాల్ని అనుభూతి చెందాలంటే మాత్రం మనం కొలంబియాలోని సెరానియా–డి–లా మకరేనా నేషనల్ నేచురల్ పార్క్‌కి వెళ్ళాల్సిందే. అక్కడ పారే నదిలో రెయిన్‌బో అందాల్ని తిలకించవచ్చు.

అది ఎలా సాధ్యం అనుకుంటున్నారా? రెయిన్‌బో రివర్ లేదా కానో క్రిస్టల్స్ అని పిలవబడే ఈ నది–ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం మరియు నలుపు రంగులతో మెరుస్తూ పారుతుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటిగా ఎరుపు రంగు మకరేనియా క్లావిగెరా మొక్కల నుండి వస్తుంది. ఇది నది యొక్క అడుగున ఎరుపు రంగు కార్పెట్‌లా కనిపిస్తుంది. ఇతర రంగులు శైవలాలు, ఖనిజాలు మరియు నీటిలోని సూక్ష్మజీవుల నుండి ఉత్పన్నమవుతాయి. వీటన్నిటి కలయికతో పాటు నదిలో ఎటువంటి కలుషితాలు చేరకపోవడం–వెరసి మనకు ఒక సుందరమైన దృశ్యాన్ని అందిస్తుంది.

ఈ రెయిన్‌బో రివర్‌ను చేరుకోవడం అంత సులభం కాదు. సందర్శకులు సాధారణంగా బొగోటా నుండి లా–మకరేనా అనే చిన్న పట్టణానికి విమానంలో వెళ్లి, అక్కడ నుండి బోట్ లేదా జీప్ ద్వారా నది వరకు ప్రయాణించాలి. ఈ ప్రయాణం సాహసోపేతమైనది, కానీ నది యొక్క అసాధారణ సౌందర్యం ఈ కష్టాన్ని విలువైనదిగా చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఫొటోగ్రాఫర్లు, పర్యావరణ వేత్తలు మరియు ప్రకృతి ప్రేమికులు ఈ అద్భుతమైన దృశ్యాన్ని చూసేందుకు ఆకర్షితులవుతారు.


• కథ

కుందేలు కోరిక

అనగనగా ఓ అడవిలో కుందేలు ఉండేది. తన తోటి వారికన్నా గొప్పదానిగా పేరు తెచ్చుకోవాలని, అందరూ తనను ప్రత్యేకంగా చూడాలని అనుకునేది. దీంతో తన తోటి కుందేళ్లతో కలిసి ఉండేది కాదు. తను అందరిలోనూ ప్రత్యేకంగా ఎలా మారాలా అని ఆలోచిస్తూ కాలం వృథా చేసేది.

ఒకసారి ఆ అడవిలోకి ఓ ముని తపస్సు చేసుకునేందుకు వచ్చాడు. ఆయన చాలా మహిమ కలిగిన వ్యక్తి అని, ఆయన్ను ప్రసన్నం చేసుకునేందుకు రోజూ ఆయన ఉన్న చోట సంచరించేది కుందేలు. ఆయన తపస్సు చేసుకుంటున్న సమయంలో చుట్టూ వేరే జంతువులు రాకుండా చూసేది. మధ్యమధ్యలో ఆయనకు పండ్లు, కందమూలాలు తెచ్చి ఇచ్చేది. కుందేలు చేస్తున్న సేవలు గమనించిన ముని ఏం కావాలో కోరుకొమ్మని అడిగాడు. అందరిలోకీ తను ప్రత్యేకంగా ఉండాలని కుందేలు ఆయన్ని కోరింది.






అందరిలోకీ ప్రత్యేకంగా ఉండాలంటే ఏం కావాలో అడగమని ముని అన్నాడు. కుందేలు కాసేపు ఆలోచించి, 'నా తోటి వారిలో ఎవరికీ భారీ శరీరం లేదు. ఏనుగులాంటి శరీరం, తొండం, దంతాలు ఉంటే నేను ప్రత్యేకంగా కనిపిస్తాను' అని మునితో అంది. వెంటనే ఆయన మంత్రజలాన్ని కుందేలుపై చల్లడంతో కుందేలు ఏనుగులా మారిపోయింది. ఆనందంతో కుందేలు తన తోటి వారి వద్దకు వెళ్లింది. ఎవరూ తనను గుర్తుపట్టలేదు. పైగా భారీ శరీరం, తొండం ఉండటంతో భయపడి దూరం జరిగాయి. వారిని ఆపాలని ఎంత ప్రయత్నించినా ఆగకుండా పారిపోయాయి. కుందేలు ముని దగ్గరకు వెళ్లి, 'ఈ శరీరం నాకు వద్దు. అడవికి రాజు సింహం. నన్ను సింహంగా మార్చండి' అంది. ఈసారి ముని ప్రభావంతో కుందేలు సింహంలా మారింది. మళ్లీ వెళ్లి తన వారిని కలిసింది. ఈసారి వాళ్లు మరింత వేగంగా పరుగులు పెట్టారు. వారందరిలో ప్రత్యేకంగా కనిపించాలని ప్రయత్నిస్తుంటే వాళ్లు దూరంగా పారిపోవడం నిరాశ కలిగించింది.

కుందేలు మళ్లీ ముని దగ్గరికి వెళ్లి, 'ఇది కూడా నాకు సరిపడేలా లేదు. నాకు పక్షిలాంటి శరీరం ఇవ్వండి' అని అడిగింది. ముని మంత్రజలం చల్లడంతో కుందేలు పక్షిలా మారింది. సంతోషంగా రెక్కలాడిస్తూ తన తోటి కుందేళ్ల దగ్గరకు వెళ్లింది. కానీ ఎవరూ తనను దగ్గరకు తీయలేదు. ఏదో వింత జీవి వచ్చిందంటూ దూరంగా తరిమేశాయి. చివరకు కుందేలుకు సత్యం బోధపడింది. తాను తనలా ఉండటమే తనకు మంచిదని, అందరిలోకీ ప్రత్యేకంగా కనిపించాలన్న ఆలోచనతో తన వారందరినీ దూరం చేసుకుంటున్నానని అర్థమైంది. ఈసారి ముని దగ్గరికి వెళ్లి, ఆయన్ని క్షమించమని అడిగి తన పూర్వరూపాన్ని పొందింది. అప్పటి నుంచి తోటివారితో కలిసి ఉండటం మొదలుపెట్టింది.

• మహనీయులు

పదవులకు వన్నె తెచ్చిన నేత... బూర్గుల రామకృష్ణారావు

పిల్లలూ! తెలుగు నేల మీద అనేకమంది గొప్ప నాయకులుగా పేరు పొందారు. దేశానికి ఎన్నో సేవలందించారు. భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారు. వారిలో ఒకరు బూర్గుల రామకృష్ణారావు. ఆయన బహుభాషావేత్త, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు, రచయిత, న్యాయవాది. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి. రామకృష్ణారావు నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి దగ్గరలోని పడకల్ గ్రామంలో 1899 మార్చి 13న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు రంగనాయకమ్మ, నరసింగరావు. ఆయన స్వగ్రామం బూర్గుల. అదే వారి ఇంటిపేరుగా మారింది. 1915లో మెట్రిక్ పూర్తి చేసిన రామకృష్ణారావు పూణెలోని ఫెర్గ్యూసన్ కళాశాలలో బీఏ చదివారు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. రామకృష్ణారావు వద్ద మాజీ



ప్రధాని పి.వి.నరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశారు. బూర్గుల బహుభాషావేత్త, సాహితీవేత్త. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో ఆయనకు ప్రావీణ్యం ఉంది. మొదటి నుంచి స్వతంత్ర భావాలు కలిగిన రామకృష్ణారావు ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమాలలో పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పని చేశారు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన రెండో ఆంధ్రమహాసభకు బూర్గుల అధ్యక్షత వహించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటైంది. 1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగిపుడు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి అయ్యారు. అనంతరం కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు గవర్నరుగా పనిచేశారు. 1967, సెప్టెంబర్ 14న మరణించారు.

• గేయం

మన తెలుగు భాష

– శేఖరమంత్రి ప్రభాకర్



గాలి ఊసుల
సంగీతపు ఆకుపచ్చని
ఊపిరి భాష నా మాతృభాష

భావాల చిరునవ్వడి
గల గలల ప్రవాహ
జీవభాష మన తెలుగు భాష

చిటపట చినుకుల
సవ్వడిలో నర్తించి
మొలకలు పులకలెత్తే
వేరుభాష నా భాష

పుష్పవనాల్లో
పూల బాలల్ని
పరవశింపచేసే
తేనెటీగల కొంటెరాగాల
తేటిభాష

నా మాతృభాషే
నన్ను ఒక మనిషిని చేసే
దారిదీపము

మాతృభాష
అమ్మతనపు
మాట, బాట, శ్వాస

సాక్షి ప్లస్
శనివారం । 12-7-2025

బిజినెస్ రీల్

ఐపీవోకు అగ్‌కాన్ ఎక్విప్‌మెంట్స్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరికరాలను అద్దెకిచ్చే అగ్‌కాన్ ఎక్విప్‌మెంట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 332 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా కంపెనీ ప్రమోటర్లు 94 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 168 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 84 కోట్లు పరికరాల కొనుగోళ్లకు, మరికొన్ని నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2003లో ఏర్పాటైన హర్యానా కంపెనీ ప్రధానంగా మౌలిక రంగ కంపెనీలకు పరిశ్రమ సంబంధిత పరికరాలను అద్దె ప్రాతిపదికన సమకూర్చుతుంది. గతేడాది(2024-25) ఆదాయం 20 శాతం ఎగసి రూ. 164 కోట్లను తాకగా.. నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 31 కోట్లకు చేరింది.

యూటెల్‌శాట్‌కు బ్రిటన్ 16.3 కోట్ల యూరోల పెట్టుబడులు



న్యూఢిల్లీ: శాటిలైట్ కమ్యూనికేషన్స్ విభాగంలో స్టార్‌లింక్‌తో పోటీపడుతున్న యూరోపియన్ శాటిలైట్ ఆపరేటర్ యూటెల్‌శాట్‌లో బ్రిటన్ ప్రభుత్వం 16.33 కోట్ల యూరోలు పెట్టుబడులు పెట్టనుంది. ఇందుకోసం రైట్స్ ఇష్యూకి సబ్‌స్క్రయిబ్ చేయనుంది. భారతి స్పేస్ (15 కోట్ల యూరోలు), ఫ్రాన్స్ ప్రభుత్వ పెట్టుబడులు కూడా కలిపితే మొత్తం ఇన్వెస్ట్‌మెంట్ 150 కోట్ల యూరోలకు చేరినట్లు యూటెల్‌శాట్ తెలిపింది. 2025 ఆఖరు నాటికి రైట్స్ ఇష్యూ పూర్తి కావచ్చని అంచనా. లావాదేవీలు పూర్తయ్యాక యూటెల్‌శాట్‌లో ఫ్రాన్స్ ప్రభుత్వానికి 29.65 శాతం వాటా లభిస్తుంది. భారతి స్పేస్, బ్రిటన్ ప్రభుత్వం, సీఎంఏ సీజీఎం, ఎఫ్ఎస్‌పీ సంస్థల వాటాలు వరుసగా 17.88 శాతం, 10.89 శాతం, 7.46 శాతం, 4.99 శాతాలకు పరిమితమవుతాయి. ప్రస్తుతం భారతి స్పేస్‌కి సుమారు 24% వాటా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-7-2025

విశాఖ	540-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDUNILVR	2,520.00	4.63
SBILIFE	1,835.00	1.37
SUNPHARMA	1,674.30	0.71
INDUSINDBK	858.3	0.64
AXISBANK	1,171.60	0.63

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TCS	3,264.50	-3.47
M&M	3,069.90	-2.92
HEROMOTOCO	4,203.00	-2.74
WIPRO	258.1	-2.62
BAJAJ-AUTO	8,074.50	-2.54

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,232
ఎన్ఎస్ఈ	97,901
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,40,286
ఎఫ్ఐఐ	- 5,104
డీఐఐ	+ 3,559

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.35 (రాత్రి 11.30కు)	$ 66.57 (క్రితం ముగింపు)
బ్రెంట్	70.34 (రాత్రి 11.30కు)	$ 68.64 (క్రితం ముగింపు)

క్విక్ కామర్స్‌లో పోటాపోటీ

- అమెజాన్ కూడా రంగంలోకి
- ఇప్పటికే బ్లింకిట్, జెప్టో హవా

న్యూఢిల్లీ: దేశీ క్విక్ కామర్స్ రంగంలో పోటీ మరింత తీవ్రమవుతోంది. ఇప్పటికే బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ఆధిపత్యం నడుస్తుండగా తాజాగా ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ నౌ కూడా రంగంలోకి దిగింది. అమెజాన్ నౌ పేరిట బెంగళూరు తర్వాత ఢిల్లీలో కూడా నిర్దిష్ట పిన్‌కోడ్‌లలో 10 మినిట్స్ డెలివరీ సర్వీసులు ప్రారంభించింది. ఆయా పిన్-కోడ్‌లలోని యూజర్లకు యాప్‌లో ఇప్పుడు అమెజాన్ నౌ అనే ట్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిత్యావసరాలు, పండ్లు..కూరగాయలు, పర్సనల్ కేర్, సౌందర్య సంరక్షణ ఉత్పత్తులు, వైర్‌లెస్ యాక్సెసరీలు, చిన్న గృహోపకరణాలు మొదలైన వాటిని ఈ సర్వీస్ కింద అమెజాన్ అందిస్తోంది. డెలివరీ ఉచితంగా పొందాలంటే ప్రైమ్ యూజర్లకు కనీస కొనుగోలు విలువ రూ. 99గా, నాన్-ప్రైమ్ యూజర్లకు రూ. 199గా ఉంటుంది.



స్మార్ట్‌ఫోన్ల దన్ను..: డేటా చార్జీలు తక్కువగా ఉండటం, స్మార్ట్‌ఫోన్ల వినియోగం గణనీయంగా పెరగడం, యువ జనాభా ఎక్కువగా ఉండటం వంటి అంశాలు దేశీయంగా క్విక్ కామర్స్‌కి దన్నుగా ఉంటున్నాయి. ఫ్లిప్‌కార్ట్, బెయిన్ అండ్ కంపెనీ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం 2024లో ఈ-గ్రాసరీ ఆర్డర్లలో మూడింట రెండొంతుల వాటా, ఈ-రిటైల్ వ్యయాల్లో పదో వంతు వాటా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫాంలదే ఉంది. దేశీయంగా కొనుగోళ్ల విధానాల్లో క్యూకామ్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్న తీరును ఇది సూచిస్తోందని నివేదిక పేర్కొంది. కొనుగోళ్లకు సంబంధించి ఇది దాదాపు ప్రధాన మాధ్యమంగా మారిపోతుండటంతో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లాంటి సంస్థలు కూడా తప్పనిసరిగా రంగంలోకి దిగుతున్నాయి.

రూ. 64,000 కోట్ల ఆర్డర్లు..

2024-25లో భారతీయులు బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్‌లాంటి క్విక్ కామర్స్ ప్లాట్‌ఫాంల ద్వారా రూ. 64,000 కోట్ల విలువ చేసే ఉత్పత్తులకు ఆర్డరిచ్చినట్లు అంచనా. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 30,000 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపు కావడం గమనార్హం. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి స్థూల ఆర్డర్ల విలువ (జీవోవీ) రూ. 2 లక్షల కోట్ల స్థాయికి చేరుతుందని రేటింగ్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ విభాగం ఒక నివేదికలో అంచనా వేసింది. మరోవైపు 2024లో 6.1 బిలియన్ డాలర్లుగా ఉన్న క్విక్ కామర్స్ మార్కెట్ పరిమాణం 2030 నాటికి ఏకంగా 40 బిలియన్ డాలర్లకు చేరవచ్చని డేటమ్ ఇంటెలిజెన్స్ సంస్థ మరో రిపోర్టులో అంచనా వేసింది.

రూ.700 పెరిగిన బంగారం

- ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.99,370
- రూ.1,500 లాభపడిన వెండి



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలతో బంగారం కొనుగోళ్లకు డిమాండ్ ఏర్పడింది. ఢిల్లీలో శుక్రవారం 10 గ్రాములకు (99.9% స్వచ్ఛత) రూ.700 లాభపడి రూ.99,370 స్థాయికి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.600 పెరిగి రూ.98,800కు చేరుకుంది. వెండి కిలోకి రూ.1,500 ర్యాలీ చేసి రూ.1,05,500 స్థాయిని తాకింది. కెనడా ఉత్పత్తులపై ఆగస్టు 1 నుంచి 35% టారిఫ్‌ను, మిగిలిన అన్ని దేశాలపై 15-20% మధ్య టారిఫ్‌లు అమలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో సురక్షిత సాధనమైన బంగారానికి తిరిగి డిమాండ్ నెలకొంది. ట్రంప్ తాజా టారిఫ్ ప్రకటనలతో రిస్క్ ధోరణి తగ్గిందని, అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధంపై ఆందోళనలు నెలకొన్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

వాణిజ్య బీమాపై జ్యూరిక్ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఫోకస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాణిజ్య బీమా విభాగంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ప్రైవేట్ రంగ జ్యూరిక్ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ అలోక్ అగర్వాల్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే దీన్ని సరికొత్తగా ఆవిష్కరించినట్లు చెప్పారు. ప్రస్తుతం తమ సంస్థకు సంబంధించి మొత్తం బీమా వ్యాపారంలో సుమారు 3 శాతంగా ఉన్న ఈ విభాగం వాటాను వచ్చే 2-3 సంవత్సరాల్లో 15-20 శాతానికి పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆయన చెప్పారు. చిన్న, మధ్య తరహా సంస్థల నుంచి బడా కార్పొరేట్లు, స్పెషలైజ్డ్ పరిశ్రమల వరకు వివిధ రంగాలకు అనువైన పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లో ఇప్పటికే ఓ కార్యాలయం ఉండగా త్వరలో వైజాగ్‌లో కూడా ఒకటి ప్రారంభిస్తున్నట్లు అగర్వాల్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా బీమాను విస్తరించేలా స్వల్ప ప్రీమియం, ఒక మోస్తరు సమ్ ఇన్సూర్డ్ ప్లాన్లను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. వాహన బీమా పాలసీల విక్రయాలు రెండు దశాబ్దాల పాటు సుమారు 13-17 శాతం వరకు వృద్ధి చెందినప్పటికీ, వాహన విక్రయాలు కొంత నెమ్మదించడం వంటి అంశాల కారణంగా గతేడాది ఆరు శాతానికి పరిమితం అయ్యాయని చెప్పారు. ఇవి క్రమంగా మళ్లీ పుంజుకోగలవని చెప్పారు.

జీ ప్రమోటర్లకు వాటాదారుల చెక్

ప్రమోటర్ గ్రూప్ వాటా పెంపునకు నో

న్యూఢిల్లీ: మీడియా రంగ దిగ్గజం జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్(జీల్)లో ప్రమోటర్ల వాటా పెంపు ప్రతిపాదనను తాజాగా వాటాదారులు తిరస్కరించారు. పూర్తిస్థాయిలో మార్పిడి చేసుకునే వారంట్ల జారీ ద్వారా ప్రమోటర్ గ్రూప్ సంస్థలు జీల్‌లో రూ. 2,237 కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేసేందుకు ప్రతిపాదించాయి. దీంతో ప్రిఫరెన్షియల్ పద్ధతిలో కంపెనీలో వాటాను 18.4 శాతానికి పెంచుకునేందుకు ప్రతిపాదించాయి. అయితే ఇందుకు వాటాదారులు అనుమతించనట్లు కంపెనీ తెలియజేసింది. ప్రత్యేక రిజల్యూషన్ ద్వారా చేపట్టిన ప్రతిపాదనకు 59.51 శాతం వాటాదారులు అనుకూలత వ్యక్తం చేసినప్పటికీ 40.48 శాతం వ్యతిరేకించినట్లు వెల్లడించింది. ప్రత్యేక రిజల్యూషన్ చేపడితే కనీసం 75 శాతంమంది వాటాదారుల నుంచి అనుమతి పొందవలసి ఉంటుందని వివరించింది.

గత నెలలో ప్రతిపాదన

గత నెలలో జీల్ ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు వారంట్ల జారీ ద్వారా రూ. 2,237.44 కోట్ల సమీకరణ ప్రణాళికలు ప్రకటించింది. తద్వారా ప్రమోటర్ల వాటా 18.4 శాతానికి బలపడే వీలుంది. ఇందుకు అనుగుణంగా కంపెనీ బోర్డు పూర్తిగా మార్పిడికి వీలయ్యే 16.95 కోట్ల వారంట్ల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రిఫరెన్షియల్ పద్ధతిలో ఆల్టిలిస్ టెక్నాలజీస్, సన్‌బ్రైట్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్స్ తదితర ప్రమోటర్ సంస్థలకు వారంట్లను జారీ చేసేందుకు అంగీకరించిన సంగతి తెలిసిందే.

కాగా.. కంపెనీలో అతిపెద్ద వాటాదారు సంస్థ నార్జెస్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ జీల్ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రాక్సీ అడ్వయిజరీ సంస్థ గ్లాస్ లెవిస్ సైతం సానుకూలంగా ఓటు చేయమని వాటాదారులకు సూచించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ప్రమోటర్ల వాటా పెంపునకు వాటాదారుల తిరస్కరణ వార్తలతో జీల్ షేరు బీఎస్ఈలో 3.2 శాతం క్షీణించి రూ. 137 వద్ద ముగిసింది.

ఎల్ఐసీలో మరింత వాటా అమ్మకం

ఓఎఫ్ఎస్ యోచనలో ప్రభుత్వం



న్యూఢిల్లీ: బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ)లో ప్రభుత్వం మరికొంత వాటా విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు డిజిన్వెస్ట్‌మెంట్ శాఖ కసరత్తు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎల్ఐసీలో ప్రస్తుతం ప్రభుత్వానికి 96.5 శాతం వాటా ఉంది. 2022 మే నెలలో పబ్లిక్ ఇష్యూ ద్వారా ప్రభుత్వం 3.5 శాతం వాటాను విక్రయించిన సంగతి తెలిసిందే. తద్వారా షేరుకీ రూ. 949 ధరలో రూ. 21,000 కోట్లు సమీకరించింది. సెబీ లిస్టింగ్ నిబంధనల ప్రకారం 2027 మే 16కల్లా ఎల్ఐసీలో పబ్లిక్‌కు కనీసం 10 శాతం వాటాను కల్పించవలసి ఉంది. దీంతో ఎల్ఐసీలో ప్రభుత్వం కనీసం 6.5 శాతం వాటాను ఆఫర్ చేయవలసి ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. వెరసి ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) మార్గంలో ప్రభుత్వం వాటా విక్రయానికి తెరతీయవచ్చని పేర్కొన్నాయి. అయితే ఎంత వాటా.. ఎప్పుడు ఎలా విక్రయించాలనే అంశాలపై డిజిన్వెస్ట్‌మెంట్ శాఖ ప్రణాళికలు ప్రాథమిక దశలోనే ఉన్నట్లు తెలియజేశాయి. మార్కెట్ పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకునే వీలున్నట్లు వివరించాయి. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టయిన పీఎస్‌యూ బీమా దిగ్గజం ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. 5.85 లక్షల కోట్లుగా నమోదైంది.

బీఎస్ఈలో ఎల్ఐసీ షేరు 2 శాతం క్షీణించి రూ. 927 వద్ద ముగిసింది.

షిప్‌రాకెట్ నుంచి 'శూన్య.ఏఐ'

న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈ), డీ2సీ వ్యాపార సంస్థల కోసం ఈ-కామర్స్ సేవల సంస్థ షిప్‌రాకెట్ కొత్తగా 'శూన్య.ఏఐ' పేరిట ఏఐ ఇంజిన్‌ను ఆవిష్కరించింది. అల్ట్రాసేఫ్ సంస్థ భాగస్వామ్యంతో దీన్ని రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. తొమ్మిది పైగా భారతీయ భాషల్లో వాయిస్, టెక్స్ట్, ఇమేజ్ ఇంటెలిజెన్స్‌ను ఇది అందిస్తుందని పేర్కొంది. దీన్ని పూర్తిగా భారత్‌లోనే తీర్చిదిద్దినట్లు వివరించింది. తొలి ఏడాదిలో ఇది 1 లక్ష పైచిలుకు ఎంఎస్ఎంఈలను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షిప్‌రాకెట్ పేర్కొంది. కేటలాగింగ్, మార్కెటింగ్, ఫుల్‌ఫిల్‌మెంట్ తదితర విభాగాలవ్యాప్తంగా సమయాన్ని, డబ్బును ఆదా చేసుకునేందుకు శూన్య.ఏఐ ఉపయోగపడుతుందని కంపెనీ ఎండీ సాహిల్ గోయల్ చెప్పారు. షిప్‌రాకెట్, కేపీఎంజీ విడుదల చేసిన నివేదిక ప్రకారం 11,000 పైచిలుకు బ్రాండ్లు ఉన్న దేశీ డీ2సీ మార్కెట్ ఈ ఏడాది (2025) 100 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. అలాగే 22 కోట్ల ఆన్‌లైన్ షాపర్లున్న ఈ-రిటైల్ మార్కెట్ 125 బిలియన్ డాలర్లకు చేరనుంది.

Shunya.ai
Made in India | Hosted in India

స్వల్పంగా తగ్గిన నికర పన్ను వసూళ్లు

- జూలై 10 వరకు రూ.5.63 లక్షల కోట్లు
- స్థూల పన్ను వసూళ్లలో 3 శాతం వృద్ధి
- 38 శాతం పెరిగిపోయిన రిఫండ్‌లు



న్యూఢిల్లీ: నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూలై 10 వరకు 1.34 శాతం తగ్గి రూ.5.63 లక్షల కోట్ల మేర ఉన్నాయి. రిఫండ్‌లు పెరిగిపోవడమే ఇందుకు కారణం. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.2 లక్షల కోట్లు కాగా, నాన్ కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.3.45 లక్షల కోట్లుగా ఉన్నాయి. రూ.17,874 కోట్లు సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను రూపంలో వసూలైంది. ఈ మొత్తం కలిపి రూ.5.63 లక్షల కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5.70 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. నికర రిఫండ్‌లు (పన్ను చెల్లింపుదారులకు చెల్లించింది) 38 శాతం పెరిగి రూ.1.02 లక్షల కోట్లుగా ఉన్నాయి. రిఫండ్‌లు చెల్లించకముందు చూస్తే స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.6.65 లక్షల కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ.6.44 లక్షల కోట్ల కంటే 3.17 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. కేవలం రిఫండ్‌లు పెరిగిపోవడం నికర ఆదాయం తగ్గడానికి దారితీసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.25.20 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో కేంద్రం అంచనాలు ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినప్పుడు 12.7 శాతం అధికం. ముఖ్యంగా రూ.78,000 కోట్లు సెక్యూరిటీస్ లావాదేవీల రూపంలోనే సమకూర్చుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్స్‌తో జాగ్రత్త!

- ఇన్వెస్టర్లకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ హెచ్చరికలు
- వివిధ బాండ్ల కొనుగోలుకి పరిశీలన అవసరం



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్స్ ప్రొవైడర్లపట్ల అప్రమత్తత అవసరమని స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ తాజాగా ఇన్వెస్టర్లను హెచ్చరించాయి. ఇటీవల ఇలాంటి ప్లాట్‌ఫామ్స్ వెలుగులో నిలుస్తున్న నేపథ్యంలో ఎక్స్ఛేంజీల హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వీటి ద్వారా వివిధ రకాల నిర్ధారిత ఆదాయ బాండ్ల (ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్‌స్ట్రుమెంట్స్) కొనుగోలు సులభతరమవుతున్న కారణంగా జాగ్రత్త వహించమని తెలియజేశాయి. వీటి ద్వారా పెట్టుబడులు చేపట్టేముందు పలు కీలక అంశాలను పరిశీలించవలసి ఉన్నదంటూ రెండు ఎక్స్ఛేంజీలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి. బాండ్ల క్రెడిట్ రేటింగ్, తిరిగి చెల్లింపుల్లో బాండ్ల జారీదారుల ట్రాక్ రికార్డ్, బాండ్ల లిక్విడిటీ, సెటిల్‌మెంట్ గడువు, పన్ను ప్రభావం తదితర పలు అంశాలను పరిగణించమంటూ సూచించాయి. ప్రధానంగా బాండ్ ప్లాట్‌ఫామ్.. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద రిజిస్టరైనదీ లేనిదీ తప్పనిసరిగా పరిశీలించవలసి ఉన్నట్లు తెలియజేశాయి. నిజానికి క్రెడిట్ రేటింగ్ ఆధారంగా బాండ్లలో పెట్టుబడులపై రిస్కులు, రిటర్నులు నమోదవుతాయని వివరించాయి.

యాబ్‌వీకి గ్లెన్‌మార్క్ 'క్యాన్సర్' చికిత్స ఔషధ లైసెన్సు

2 బిలియన్ డాలర్ల ఒప్పందం



న్యూఢిల్లీ: క్యాన్సర్, ఆటోఇమ్యూన్ వ్యాధుల చికిత్సలో ఉపయోగపడే ఔషధానికి సంబంధించి అమెరికన్ సంస్థ యాబ్‌వీకి గ్లోబల్ లైసెన్స్ ఇస్తున్నట్లు గ్లెన్‌మార్క్ ఫార్మా తెలిపింది. ఇందుకోసం తమ అనుబంధ సంస్థ ఇష్నోస్ గ్లెన్‌మార్క్ ఇన్నోవేషన్ (ఐజీఐ) ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. ఈ డీల్ విలువ 2 బిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఐఎస్‌బీ 2001 పేరుతో ఈ ఔషధాన్ని ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్నారు. ఒప్పందం ప్రకారం ఉత్తర అమెరికా, యూరప్, జపాన్, గ్రేటర్ చైనా మార్కెట్ల కోసం దీన్ని తయారు చేసి, విక్రయించేందుకు యాబ్‌వీకి లైసెన్సు లభిస్తుంది. ఇతరత్రా లాటిన్ అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా తదితర మార్కెట్లలో గ్లెన్‌మార్క్ ఫార్మా ఈ ఔషధాన్ని విక్రయిస్తుంది. నియంత్రణ సంస్థల నుంచి క్లియరెన్సు వచ్చాక ఐజీఐకి ముందుగా 700 మిలియన్ డాలర్లు లభిస్తాయి. మిగత 1.225 బిలియన్ డాలర్లు దశలవారీగా, నిర్దిష్ట మైలురాళ్లను అధిగమించడాన్ని బట్టి అందుతాయి.

హైదరాబాద్‌లో తగ్గిన లగ్జరీ ఇళ్ల విక్రయాలు

- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో మూడింతలైన అమ్మకాలు
- సీబీఆర్ఈ, అసోచామ్ సంయుక్త నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో విలాసవంతమైన ఇళ్ల అమ్మకాలు ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో డీలాపడ్డాయి. మొత్తం రూ.1,025 యూనిట్ల విక్రయాలు (రూ.5 కోట్లు అంతకు మించిన ధర) నమోదయ్యాయి. క్రితం ఏడాది తొలి ఆరు నెలల్లో అమ్మకాలు 1,140 యూనిట్లుగా ఉండడం గమనార్హం. ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో మాత్రం విలాసవంతమైన గృహ విక్రయాలు (రూ.6 కోట్లు, అంతకు మించి) మూడింతలు పెరిగి 3,960 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో లగ్జరీ ఇళ్ల అమ్మకాలు 1,280 యూనిట్లుగా ఉండడం గమనార్హం. సీబీఆర్ఈ, అసోచామ్ సంయుక్త నివేదిక ఈ వివరాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా టాప్-7 నగరాల్లో లగ్జరీ ఇళ్ల అమ్మకాలు జనవరి-జూన్ మధ్య కాలంలో అంతకుముందు ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 85 శాతం పెరిగి 6,950 యూనిట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది తొలి ఆరు నెలల్లో లగ్జరీ ఇళ్ల అమ్మకాలు 3,750 యూనిట్లుగా ఉన్నాయి.

- బెంగళూరులో లగ్జరీ ఇళ్ల విక్రయాలు 200 యూనిట్లకు చేరాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 80 యూనిట్లుగానే ఉన్నాయి.
- చెన్నైలోనూ మూడు రెట్లు పెరిగి 220 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 65 యూనిట్లుగా ఉన్నాయి.
- పుణెలో అమ్మకాలు 120 యూనిట్లకు తగ్గాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో లగ్జరీ ఇళ్ల విక్రయాలు 160 యూనిట్లుగా ఉన్నాయి.
- కోల్‌కతాలో అమ్మకాలు రెట్టింపై 190 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 70 యూనిట్లుగానే ఉండడం గమనార్హం.
- ముంబైలో 1,240 యూనిట్ల లగ్జరీ ఇళ్ల అమ్మకాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 950 యూనిట్లుగా ఉన్నాయి.



- పుణె, చెన్నై, కోల్‌కతా నగరాల్లో రూ.4కోట్లు అంతకుమించిన విలువైన ఇళ్లను లగ్జరీ ఇళ్ల కింద పరిగణనలోకి తీసుకున్నారు. బెంగళూరులో రూ.5 కోట్లు అంతకుమించిన ధరల శ్రేణిని లగ్జరీ ఇళ్ల కింద ఈ నివేదిక పరిగణించింది.

స్థిరమైన డిమాండ్.

''దేశ ఇళ్ల మార్కెట్ వ్యూహాత్మక స్థిరమైన దశలోకి ప్రవేశించింది. స్థూల ఆర్థిక అంశాలు బలంగా ఉన్నాయి. లగ్జరీ, ప్రీమియం ఇళ్ల మార్కెట్‌లో స్థిరమైన వృద్ధి అన్నది వినియోగదారుల విశ్వాసం పెరుగుదలను జీవనశైలి ఆకాంక్షలను సూచిస్తోంది''అని సీబీఆర్ఈ ఇండియా ఎండీ (భూమి) గౌరవ్ కుమార్ తెలపారు. డెవలపర్లు నాణ్యత, పారదర్శకత, ఈ రంగం తదుపరి దశకు ఇవి కీలకంగా పనిచేస్తాయన్నారు. హౌసింగ్ బూమ్‌కు అనుగుణంగా సులభతర అనుమతులు, పట్టణాల్లో అందుబాటు ధరల ఇళ్లను ప్రోత్సహించేలా విధానపరమైన సంస్కరణలు అవసరమని అసోచామ్ సెక్రటరీ జనరల్ మనీష్ సింఘాల్ ఈ నివేదిక విడుదల సందర్భంగా సూచించారు.

స్వింగ్ స్టార్క్ సెంచరీ

అతడు లయలో ఉన్నాడంటే ప్రత్యర్థులు బెంబేలెత్తాల్సిందే! అతడు కొత్త బంతి అందుకున్నాడంటే జట్టుకు శుభారంభం దక్కాల్సిందే! యార్కర్‌ను ఇంత కచ్చితంగా కూడా వేయొచ్చా... అని క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచిన నైపుణ్యం అతడిది. ఇన్‌స్వింగర్ ఇంత అందంగా కూడా విసరొచ్చా అనే పనితనం అతడి సొంతం. 30 అడుగుల రనప్ నుంచి బంతి వేసేందుకు అతడు సిద్ధమవుతున్నాడంటేనే... క్రీజులో ఉన్న బ్యాటర్ మదిలో ఎన్నో సవాళ్లు! ఒకే బంతిని వేర్వేరుగా ఎలా వేయొచ్చో ఆధునిక క్రికెట్‌లో అతడికంటే బాగా మరెవరికీ తెలిసి ఉండకపోవచ్చు. ఇన్‌స్వింగర్, అవుట్ స్వింగర్, యార్కర్ ఇలా అతడి అమ్ములపొదిలోని అస్త్రాలకు కొదవేలేదు. మనం ఇంత సేపు చెప్పుకున్నది ఆస్ట్రేలియా పేస్ స్టార్ మిచెల్ ఆరోన్ స్టార్క్ గురించే! ఆటను కేవలం ఇష్టపడితే సరిపోదు... దాన్ని గౌరవించాలి అని బలంగా నమ్మే ఈ ఆస్ట్రేలియా పేసర్ 100వ టెస్టు మ్యాచ్‌కు సిద్ధమవుతున్నాడు. నేడు కింగ్‌స్టన్‌లో వెస్టిండీస్‌తో మొదలయ్యే మూడో టెస్టు (డే-నైట్) స్టార్క్ కెరీర్‌లో 100వ టెస్టు కానుంది. ఈ నేపథ్యంలో స్వింగ్ స్టార్ స్టార్క్ గురించి తెలుసుకుందామా!

- సాక్షి క్రీడా విభాగం

- 100వ టెస్టు ఆడనున్న మిచెల్ స్టార్క్
- ఈ ఘనత సాధించనున్న రెండో ఆస్ట్రేలియా పేసర్‌గా గుర్తింపు
- ఓవరాల్‌గా 11వ పేస్ బౌలర్‌గా ఘనత


భార్య అలీసా హీలీతో...

2015 వన్డే ప్రపంచకప్ ఫైనల్... తొలి ఓవర్ వేసిన స్టార్క్ ఐదో బంతికి న్యూజిలాండ్ కెప్టెన్ మెకల్లమ్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. కివీస్ సారథి రెప్పవేసేలోపు... లోపలికి దూసుకొచ్చిన రిప్పర్ అతడి వికెట్లను చెల్లాచెదురు చేసింది. 'ఆదిలోనే హంసపాదు' అన్నట్లు ఆరంభంలోనే దెబ్బతిన్న న్యూజిలాండ్ ఇక ఏ దశలోనూ కోలుకోలేకపోయి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆ టోర్నీ ఆసాంతం యార్కర్ల పండగ చేసుకున్న స్టార్క్ వరల్డ్‌కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఇలాంటి ఎన్నో అద్భుతాలు ఖాతాలో వేసుకున్న ఈ ఆసీస్ పేసర్... 2024 ఐపీఎల్ ఫైనల్లోనూ దాదాపు ఇదే తరహా బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిధ్యం వహించిన స్టార్క్... ఫైనల్ తొలి ఓవర్ ఐదో బంతికి సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆఫ్‌వికెట్‌ను గిరాటేశాడు. ఇక ఆ తర్వాత ఏమాత్రం ఆకట్టుకోలేకపోయిన రైజర్స్ రన్నరప్‌గానే సీజన్‌ను ముగించింది. ఈ రెండు సందర్భాల్లోనూ ఆయువుపట్టు మీద దెబ్బకొట్టిన ఘనత స్టార్క్‌దే. అయితే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఇలాంటి ఎన్ని అద్భుతాలు చేసినా... టెస్టు క్రికెట్‌లో నిలకడగా రాణిస్తూ ఒక పేస్ బౌలర్ 100వ టెస్టు మ్యాచ్ ఆడటం అంటే ఆషామాషీ కాదు. ఆస్ట్రేలియా తరఫున మెక్‌గ్రాత్ తర్వాత 100వ టెస్టు ఆడుతున్న రెండో పేస్ బౌలర్‌గా స్టార్క్ నిలువనున్నాడు.

మెక్‌గ్రాత్ బాటలో...

ఆస్ట్రేలియా పేస్ దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్ ఆటకు వీడ్కోలు పలికిన నాలుగేళ్ల తర్వాత 2011లో స్టార్క్ టెస్టు అరంగేట్రం చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో మెకల్లమ్‌ను అవుట్ చేసి తొలి వికెట్ ఖాతాలో వేసుకున్న స్టార్క్... రోజు రోజుకూ మరింత మెరుగవుతూ ముందుకు సాగాడు. క్రమశిక్షణకు కష్టపడేతత్వం తోడైతే ఫలితాలు సాధించొచ్చు అని నిరూపించిన స్టార్క్ అనతి కాలంలోనే ఆస్ట్రేలియా ప్రధాన పేసర్‌గా గుర్తింపు పొందాడు. 14 ఏళ్ల వయసు వరకు వికెట్ కీపర్‌గా కొనసాగి... ఆ తర్వాతే బౌలర్‌గా మారిన స్టార్క్ బరిలోకి దిగిన ప్రతీసారి ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా సాగుతున్నాడు. ఆరున్నర అడుగుల ఎత్తు... అందులోనూ ఎడంచేతి వాటం... ఇంకేముంది వాయువేగంతో అతడు విసిరే బంతికి బదులు చెప్పాలంటే ప్రత్యర్థి బ్యాటర్ ఎంతగానో శ్రమించాల్సిందే. ముఖ్యంగా స్టార్క్ గురిచూసి వేసే యార్కర్‌కు ప్రత్యేక 'ఫ్యాన్ బేస్' ఉందనడంలో అతిశయోక్తి లేదు. కళ్లు మూసి తెరిచేలోపు లోపలికి దూసుకొచ్చే బంతి వికెట్లను ఎగరేసే విధానం చూసి తీరాల్సిందే. స్టార్క్ మనసు పెట్టి ఇన్‌స్వింగర్ సంధిస్తే అది వికెట్లను గిరాటేయాల్సిందే. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యంత ప్రమాదకర బౌలర్‌గా ఎదిగిన స్టార్క్... కెరీర్‌లో పలుమార్లు గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్‌లో ప్రభావం చూపలేదని పక్కన పెట్టడం... భారత్‌తో 'బోర్డర్-గావస్కర్' ట్రోఫీ సిరీస్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడం ఇలా ఎన్ని ఆటంకాలు ఎదురైనా వాటికి ఎదురొడ్డి నిలిచిన స్టార్క్... తన బౌలింగ్‌తోనే విమర్శకులకు సమాధానాలు ఇచ్చాడు. స్టార్క్ భార్య అలీసా హీలీ కూడా మేటి క్రికెటర్ కావడంతో క్లిష్ట సమయాల్లో అతనికి కుటుంబం నుంచి కూడా అండదండలు లభిస్తున్నాయి.



ఐపీఎల్‌ను కాదని...

ప్రపంచ వ్యాప్తంగా ఆటగాళ్లంతా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో పాల్గొనాలని పోటీపడుతుంటే... స్టార్క్ మాత్రం జాతీయ జట్టు తరఫున మెరుగైన ప్రదర్శన చేసేందుకు కొన్ని సీజన్‌ల పాటు ఐపీఎల్‌కు దూరంగా ఉండటం అతడి నిబద్ధతను చాటుతోంది. 'అతడు చాలా ప్రత్యేకం. ఆస్ట్రేలియా వంటి పేస్ పిచ్‌లపై ఎక్కువ బాధ్యతలు మోస్తూ 100 మ్యాచ్‌లు ఆడటం చాలా గొప్ప. అతడి సన్నద్ధత, వ్యూహాలు చాలా భిన్నంగా ఉంటాయి. పనిభారం దృష్ట్యా పలు సీజన్ల పాటు ఐపీఎల్‌కు సైతం అతడు దూరమయ్యాడు. అలాంటి 'మ్యాచ్ విన్నర్' జట్టులో ఉండటం ఆస్ట్రేలియా అదృష్టం. సుదీర్ఘ కాలంగా అతడు చూపిన పట్టుదలకు 100వ టెస్టు రూపంలో ఫలితం దక్కుతోంది' అని ఆస్ట్రేలియా హెడ్ కోచ్ మెక్‌డొనాల్డ్ అన్నాడు. 2021 నుంచి గణాంకాలను పరిశీలిస్తే... అత్యధిక (1066) ఓవర్లు వేసిన పేసర్‌గా రికార్డుల్లోకి ఎక్కిన స్టార్క్... వికెట్ల వేటలోనూ ముందు వరుసలో ఉన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇప్పటి వరకు 395 వికెట్లు పడగొట్టిన స్టార్క్... 100వ మ్యాచ్‌లోనే 400 వికెట్ల మైలురాయిని దాటాలని భావిస్తున్నాడు. ఫిట్‌నెస్‌లో తనకు తానే సాటి అని నిరూపించుకున్న ఈ కంగారూ పేసర్... గాయాలతో సతమతమవుతున్న సమయంలోనూ బాధ్యతలను పక్కన పెట్టలేదు. 2022లో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో విరిగిన వేలుతోనే బౌలింగ్ చేసిన స్టార్క్... 2023 యాషెస్ సిరీస్ సందర్భంగా గజ్జల్లో గాయం ఇబ్బంది పెడుతున్న జాతీయ విధులను విస్మరించలేదు. 35 ఏళ్ల వయసులో ఓ పేస్ బౌలర్ తన అత్యుత్తమ ప్రదర్శన సాగించడం విస్మయానికి గురిచేస్తోందని సహచర పేసర్, ఆస్ట్రేలియా కెప్టెన్ కమిన్స్ కితాబిచ్చాడు. '145 కిలోమీటర్లకు పైగా వేగంతో ఒక పేసర్ 100 మ్యాచ్‌ల్లో బౌలింగ్ చేయడం మామూలు విషయం కాదు. అతడో యోధుడు. ఎప్పటికప్పుడు మెరుగవుతూ ఉండటం అతడికే సాధ్యం' అని కమిన్స్ అన్నాడు. మరెంత కాలం కెరీర్ కొనసాగిస్తాడో ఇప్పుడే చెప్పలేకపోయినా... ప్రస్తుతానికి మాత్రం అతడే ఆస్ట్రేలియా ప్రధాన అస్త్రం.

బ్యాటింగ్‌లోనూ భళా...

ప్రపంచ క్రికెట్‌కు ఆస్ట్రేలియా అందించిన మరో ఆణిముత్యమైన స్టార్క్... కేవలం బౌలింగ్‌లోనే కాకుండా ఉపయుక్తకర బ్యాటింగ్‌తోనూ ఆకట్టుకున్న సందర్భాలు కోకొల్లలు. మామూలుగా సుదీర్ఘంగా బౌలింగ్ చేసే పేసర్లు నెట్స్‌లోనూ పెద్దగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయరు. కానీ స్టార్క్ తీరు అందుకు భిన్నం. కిందివరస బ్యాటర్లు జతచేసే పరుగులు జట్టుకు ఎంతో విలువ చేకూరుస్తాయి అని నమ్మే స్టార్క్... అవసరమైనప్పుడల్లా తన బ్యాటింగ్ ప్రతిభను ప్రపంచానికి చాటాడు. అంతెందుకు ఇటీవల ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లోనూ స్టార్క్ తన బ్యాటింగ్ నైపుణ్యం చూపెట్టాడు. స్టార్ ఆట గాళ్లంతా ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్‌కు చేరుతున్న సమయంలో దక్షిణాఫ్రికా పేసర్ల ధాటికి ఎదురునిలిచి అతడు చేసిన అర్ధశతకమే మ్యాచ్‌లో ఆసీస్‌ను పోరాడే స్థితికి చేర్చింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో స్టార్క్ బ్యాట్‌తో 2311 పరుగులు చేశాడు. ఓ ప్రధాన పేసర్ ఇన్ని పరుగులు చేయడం అంత తేలికైన విషయం కాదు. ఇక 'డే అండ్ నైట్' టెస్టుల్లో అయితే స్టార్క్‌కు తిరుగులేదనేది జగమెరిగిన సత్యం. గులాబీ బంతితో అత్యంత ప్రమాదకారి అయిన స్టార్క్... ఫ్లడ్ లైట్ల వెలుతురులో కరీబియన్ బ్యాటర్లతో ఓ ఆటాడుకోవడం ఖాయమే.

స్టార్క్ టెస్టు కెరీర్	
టెస్టులు	99
ఇన్నింగ్స్‌లు	190
వికెట్లు	395
అత్యుత్తమ గణాంకాలు	6/48
సగటు	27.39
ఎకానమీ	3.42
ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల ప్రదర్శన	15
మ్యాచ్‌లో 10 వికెట్ల ప్రదర్శన	2



16 టెస్టు ఫార్మాట్‌లో 100 టెస్టులు పూర్తి చేసుకోనున్న 16వ ఆస్ట్రేలియా క్రికెటర్‌గా స్టార్క్‌గుర్తింపు పొందనున్నాడు. పాంటింగ్ (168), స్టీవ్ వా (168), అలెన్ బోర్డర్ (156), షేన్ వార్న్ (145), లయన్ (139), మార్క్ వా (128), మెక్‌గ్రాత్ (124), ఇయాన్ హీలీ (119), స్టీవ్ స్మిత్ (118), మైకేల్ క్లార్క్ (115), డేవిడ్ వార్నర్ (112), బూన్ (107), లాంగర్ (105), మార్క్ టేలర్ (104), మాథ్యూ హేడెన్ (103) ఈ జాబితాలో ఉన్నారు.

83 టెస్టు క్రికెట్ చరిత్రలో 100 టెస్టులు పూర్తి చేసుకోనున్న 83వ క్రికెటర్‌గా స్టార్క్ ఘనత సాధించనున్నాడు.

11 ఇప్పటి వరకు 82 మంది క్రికెటర్లు 100 టెస్టుల మైలురాయి దాటారు. ఇందులో 10 మంది మాత్రమే స్పెషలిస్ట్ పేస్ బౌలర్లు (అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ కొట్నీ వాల్ష్, మెక్‌గ్రాత్, చమిందా వాస్, షాన్ పొలాక్, టిమ్ సౌతీ, ఇషాంత్ శర్మ, వసీం అక్రమ్, మఖాయ ఎన్తిని) ఉన్నారు. స్టార్క్ 11వ పేస్ బౌలర్‌గా గుర్తింపు పొందుతాడు.

'రికార్డులు ఉన్నది తిరగరాయడానికే'

ముల్డర్‌కు లారా హితోక్తి


ముల్డర్


లారా

జొహన్నెస్‌బర్గ్: క్రీడల్లో ఏ రికార్డూ శాశ్వతం కాదని వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా అన్నాడు. ఇటీవల జింబాబ్వేతో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ అజేయంగా 367 పరుగులు చేశాడు. మ్యాచ్ పరిస్థితులను బట్టి చూస్తే సఫారీ జట్టుకు చాలా సమయం ఉండగా... సారథ్య బాధ్యతలు కూడా అతడి వద్దే ఉండటంతో ముల్డర్ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన లారా (400) రికార్డును బద్దలు కొడతాడని అందరూ భావించారు. అయితే అందుకు భిన్నంగా ముల్డర్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి ఆశ్చర్యపరిచాడు. అనంతరం అతడు మాట్లాడుతూ... విండీస్ దిగ్గజం లారాపై గౌరవంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ఈ అంశంపై లారా తనతో ముచ్చటించినట్లు ముల్డర్ పేర్కొన్నాడు. 'లారాతో ఇటీవలే దీని గురించి మాట్లాడా. రికార్డులు ఉన్నవి బద్దలు కొట్టేందుకే అని చెప్పాడు. అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు కోసం ప్రయత్నించి ఉండాల్సిందన్నాడు. నీకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కేదని ప్రోత్సహించాడు. మరోసారి అలాంటి అవకాశం వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దని సూచించాడు. అది అతడి గొప్పతనం. నా వరకైతే నేను చేసింది సరైందే. ఆ రికార్డు అతడి లాంటి లెజెండ్ పేరిట ఉండటమే సబబు' అని ముల్డర్ అన్నాడు. ఈ క్రమంలో టెస్టు క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన బ్యాటర్ల జాబితాలో ముల్డర్ ఐదో స్థానానికి చేరాడు.

మూడో రౌండ్‌లో వంతిక

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ చెస్ నాకౌట్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణి వంతిక అగర్వాల్ మూడో రౌండ్‌లోకి ప్రవేశించగా... పద్మిని రౌత్, ప్రియాంక రెండో రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రపంచ మాజీ చాంపియన్ అన్నా ఉషెనినా (ఉక్రెయిన్)తో జరిగిన రెండో రౌండ్‌లో వంతిక 4.5-3.5తో విజయం సాధించింది. గురువారం రెండో రౌండ్‌లో రెండు గేమ్‌లు ముగిశాక ఇద్దరూ 1-1తో సమంగా ఉండటంతో శుక్రవారం టైబ్రేక్ నిర్వహించారు. టైబ్రేక్‌లో వంతిక 3.5-2.5తో గెలిచింది. ప్రపంచ మాజీ చాంపియన్ అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)తో జరిగిన పోరులో పద్మిని 3.5-4.5తో ఓడిపోయింది. గురువారం రెండు గేమ్‌లు ముగిశాక ఇద్దరూ 1-1తో సమంగా నిలిచారు. దాంతో శుక్రవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించగా... కొస్టెనిక్ 3.5-2.5తో పద్మినిని ఓడించింది. కులోన్ క్లాడియా (పోలాండ్)తో జరిగిన పోటీలో ప్రియాంక 1-3తో ఓటమి పాలైంది. నేడు జరిగే మూడో రౌండ్ తొలి గేమ్‌లలో కులోన్ క్లాడియాతో కోనేరు హంపి; టియోడొరా ఇంజాక్ (సెర్బియా)తో దివ్య దేశ్‌ముఖ్; కాటరీనా లాగ్నోతో వంతిక; స్టావ్‌రూలాతో ద్రోణవల్లి హారిక; కరిస్సా యిప్‌తో వైశాలి తలపడతారు.



జోరు సాగనీ...

నేడు భారత్, ఇంగ్లండ్ మహిళల ఐదో టి20

- ఇప్పటికే సిరీస్ సొంతం చేసుకున్న టీమిండియా
- రాత్రి గం. 11:05 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌పై తొలి టి20 సిరీస్ గెలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు... నామమాత్రమైన చివరి మ్యాచ్‌లోనూ అదే జోరు కనబర్చాలని ఆశిస్తోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే 3-1తో దక్కించుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా... శనివారం ఆతిథ్య జట్టుతో ఆఖరి మ్యాచ్ ఆడుతుంది. గతంలో ఇంగ్లండ్‌పై టెస్టు, వన్డే సిరీస్‌లు గెలిచిన భారత జట్టు... తాజాగా తొలి టి20 సిరీస్ ఖాతాలో వేసుకుంది. టాపార్డర్ చక్కటి ఫామ్‌లో ఉండగా... స్పిన్నర్లు సత్తా చాటుతుండటంతో టీమిండియా ఈ సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన చేయగలిగింది. ముఖ్యంగా గతంతో పోల్చుకుంటే... మనవాళ్ల ఫీల్డింగ్ ఎంతో మెరుగైంది. నాలుగో టి20ని పరిశీలిస్తే... బౌండరీకి సమీపంలో హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి చూడచక్కని క్యాచ్‌లు అందుకోగా... 30 గజాల సర్కిల్‌లో రాధా యాదవ్ తన ఫీల్డింగ్ విన్యాసాలతో కట్టిపడేసింది. ఫలితంగానే ఇంగ్లండ్ జట్టు 126 పరుగులకు పరిమితమైంది. అనంతరం టాపార్డర్ రాణించడంతో ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. అదే జోరు చివరి మ్యాచ్‌లోనూ కొనసాగించి ఇంగ్లండ్‌పై సంపూర్ణ ఆధిపత్యం కనబర్చాలని హర్మన్‌ప్రీత్ బృందం భావిస్తోంది. ఈ సిరీస్ అనంతరం ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఇటీవల భారత పురుషుల జట్టు రెండో టెస్టులో ఇంగ్లండ్‌పై గెలిచిన మైదానంలోనే ఈ మ్యాచ్ జరగనుంది. బ్యాటింగ్‌లో వైస్‌కెప్టెన్ స్మృతి మంధాన, షఫాలీ వర్మ జట్టుకు మెరుగైన ఆరంభాలు అందిస్తుండగా... జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జ్యోత్ కౌర్ నిలకడ కనబరుస్తున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఫర్వాలేదనిపిస్తున్నా... ఆమె స్థాయికి అది తక్కువే. వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు హర్మన్ నుంచి టీమ్ మేనేజ్‌మెంట్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. ఈ సిరీస్‌లో భారత జట్టు జైత్రయాత్ర వెనక స్పిన్నర్ల కృషి ఎంతో ఉంది. నాలుగు మ్యాచ్‌ల్లో కలిపి స్పిన్నర్లే 22 వికెట్లు తీశారు. ఈ సిరీస్ ద్వారా అంతర్జాతీయ టి20 అరంగేట్రం చేసిన ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ శ్రీ చరణి ప్రత్యర్థిని తన మాయాజాలంతో ముప్పుతిప్పలు పెడుతోంది. రాధా యాదవ్, దీప్తి శర్మ కూడా మంచి లయలో ఉన్నారు. మరోవైపు సొంతగడ్డపై గాయాలతో సతమతమవుతున్న ఇంగ్లండ్ ఈ మ్యాచ్‌లో నెగ్గి వన్డే సిరీస్‌కు ముందు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని భావిస్తోంది.


శ్రీచరణి


స్మృతి మంధాన

మానవ్-మనుష్ జోడీ పరాజయం



లాస్‌వేగస్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టూర్‌లో భాగంగా యునైటెడ్ స్టేట్స్ (యూఎస్) 'స్మాష్ లెవెల్' టీటీ టోర్నీలో భారత క్రీడాకారుల కథ ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మానవ్ ఠక్కర్-మనుష్ షా (భారత్) జోడీకి పరాజయం ఎదురైంది. క్వార్టర్ ఫైనల్లో మానవ్-మనుష్ ద్వయం 8-11, 13-11, 5-11, 9-11తో ఆన్ జెహున్-లిమ్ జోంగ్ హూన్ (దక్షిణ కొరియా) జంట చేతిలో ఓటమి చవిచూసింది. 29 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో మానవ్-మనుష్ తమ సర్వీస్‌లో 20 పాయింట్లు... ప్రత్యర్థుల సర్వీస్‌లో 15 పాయింట్లు స్కోరు చేశారు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన ఓడిన మానవ్-మనుష్ జంటకు 2,650 డాలర్ల (రూ. 2 లక్షల 27 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

కాంస్య పతకం బరిలో జ్యోతి సురేఖ-రిషభ్ జోడీ



మాడ్రిడ్: ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-4 టోర్నమెంట్‌లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీ వెన్నం జ్యోతి సురేఖ (ఆంధ్రప్రదేశ్)-రిషభ్ యాదవ్ (హరియాణా) కాంస్య పతకం కోసం పోటీ పడనుంది. శుక్రవారం జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ మ్యాచ్‌ల్లో జ్యోతి సురేఖ-రిషభ్ యాదవ్ ద్వయం సెమీఫైనల్లో 152-155తో స్యానీ డెలాట్-మైక్ ష్కోలెసర్ (నెదర్లాండ్స్) జంట చేతిలో ఓడిపోయింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ-రిషభ్ ద్వయం 155-151తో ఆండ్రియా నికోల్ మోకియా-లొరెంజో గుబిని (ఇటలీ) జంటపై... క్వార్టర్ ఫైనల్లో 155-153తో లియా గిరాల్ట్-నికోలస్ గిరాడ్ (ఫ్రాన్స్) జోడీపై విజయం సాధించింది. నేడు జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో పాలో కొరాడో-డగ్లస్ నొలాస్కో (ఎల్ సాల్వడోర్) జోడీతో సురేఖ-రిషభ్ ద్వయం తలపడుతుంది. మహిళల కాంపౌండ్ టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, ప్రీతికలతో కూడిన భారత మహిళల జట్టు చైనీస్ తైపీ జట్టుతో ఆడుతుంది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో సురేఖ, పర్ణీత్ కౌర్ సెమీఫైనల్ మ్యాచ్‌లు కూడా నేడు ఆడనున్నారు.

ధీరజ్ తొలి రౌండ్‌లోనే...

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్లకు నిరాశ ఎదురైంది. పారిస్ ఒలింపియన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, రాహుల్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా... నీరజ్ చౌహాన్ రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. ధీరజ్ 4-6తో డాన్ ఒలారు (మాల్డోవా) చేతిలో, తరుణ్‌దీప్ 4-6తో మార్కస్ అల్మెడా (బ్రెజిల్) చేతిలో, రాహుల్ 4-6తో వాలాడోంట్ (ఫ్రాన్స్) చేతిలో, నీరజ్ 3-7తో నకనిషి (జపాన్) చేతిలో ఓడిపోయారు.



నోట్ల కట్టల బ్యాగుతో శివసేన ఎమ్మెల్యే

ఆన్‌లైన్‌లో వీడియో పోస్ట్ చేసిన ఎంపీ రౌత్

ముంబై: మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలోని శివసేన(షిండే) నేత, రాష్ట్ర మంత్రి సంజయ్ షిర్సత్ డబ్బు నిండిన బ్యాగుతో కనిపిస్తున్న వీడియో సంచలనం రేపుతోంది. ఈ వీడియోను ప్రతిపక్ష శివసేన(యూబీటీ)కి చెందిన ఎంపీ సంజయ్ రౌత్ శుక్రవారం పోస్ట్ చేశారు. సంజయ్ షిర్సత్ తన బెడ్‌రూంలో కూర్చుని సిగరెట్ తాగుతూండగా, పక్కనే నిండా నోట్ల కట్టలున్న బ్యాగు తెరిచి ఉంది. మరో సూట్ కేస్, ఆయన పెంపుడు కుక్క కూడా ఆ వీడియోలో కనిపిస్తోంది. 'ఆసక్తికరమైన ఈ వీడియోను గౌరవ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, సీఎం ఫడ్నవీస్ చూడాలి. దేశంలో ఏం జరుగుతోందో తెలుసుకోవాలి. మహారాష్ట్ర మంత్రి గురించి చాలా విషయాలు ఈ వీడియోతో తెలుస్తాయి'అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. సంజయ్ రౌత్ చేసిన ఆరోపణలను సామాజిక న్యాయ శాఖ మంత్రి షిర్సత్ ఖండించారు. ఆ బ్యాగులో కనిపించేవి కరెన్సీ నోట్లు కావు..తన దుస్తులని చెప్పారు. ఇదంతా కావాలని చేసిన కుట్రగా పేర్కొన్నారు. ఆదాయ పన్ను శాఖ నోటీసు పంపిన మరునాడే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. 2019లో ఆయన వెల్లడించిన ఆస్తుల విలువ రూ.3.3 కోట్లు కాగా, 2024 నాటికి రూ.35 కోట్లకు పెరిగాయంటూ షిర్సాత్ చూపడంపై ఐటీ వివరణ కోరింది. ఐటీ నోటీసుకు తగు విధంగా సమాధానమిస్తానని చెప్పారు. తనపై ఎలాంటి ఒత్తిళ్లూ లేవన్నారు.

జార్ఖండ్ కాంగ్రెస్‌లో విభేదాలు

- రంగంలోకి పార్టీ హైకమాండ్
- నేతలతో కొప్పుల రాజు భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్ రాష్ట్ర కాంగ్రెస్‌లో నేతల మధ్య విభేదాలు, అంతర్గత కుమ్ములాటలు, పరస్పర ఆరోపణల పర్వం మరోసారి తెరపైకి వచ్చాయి.కాంగ్రెస్ నేతల విభేదాలు ఢిల్లీ దాకా చేరడంతో, అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. వ్యవహారాన్ని చక్కదిద్దే బాధ్యతను ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కొప్పుల రాజుకు అప్పగించింది. రాష్ట్ర నేతలందరినీ ఆయన ఢిల్లీకి పిలిపించి సుదీర్ఘ మంతనాలు జరిపారు. కాంకే ఎమ్మెల్యే సురేష్ బైతా, కార్యనిర్వాహక అధ్యక్షుడు బంధు తిర్కీ, ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ, ఆర్థిక మంత్రి రాధాకృష్ణ కిషోర్‌లతో ఆయన భేటీ అయ్యారు. జాగ్రత్తగా మసలుకోవాలని, విభేదాలపై రచ్చకెక్కరాదని, సమన్వయంతో కూటమి బలోపేతానికి కృషి చేయాలని వారికి గట్టిగా చెప్పారు.

మూల కారణమిదే..!

రాంచీలోని రిమ్స్ (రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) డైరెక్టర్ తొలగింపు అంశం వివాదానికి తెరతీసింది. రిమ్స్ డైరెక్టర్ తొలగింపునకు సంబంధించిన లేఖపై తాను సంతకం చేయనని కాంకే ఎమ్మెల్యే సురేష్ బైతా బహిరంగంగా ప్రకటించారు. ఈ అంశం పార్టీలో ఉద్రిక్తతను సృష్టించింది. పార్టీని, కూటమి ప్రతిష్టను దెబ్బతీసేలా బహిరంగ వేదికపై అలాంటివి వెల్లడించరాదని ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ ఆయనకు సూచించారు. అయితే, బైతా వెనక్కి తగ్గలేదు. మరోవైపు, రిమ్స్-2 ప్రతిపాదనపై జార్ఖండ్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బంధు తిర్కీ అభ్యంతరం వ్యక్తం చేశారు. రిమ్స్-2 కోసం తన ప్రాంతంలోని రైతుల భూమిని సేకరించడాన్ని ఆయన వ్యతిరేకించారు. ప్రస్తుతమున్న రిమ్స్‌పై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడానికే రిమ్స్-2ను తెరపైకి తెచ్చినట్లు సీఎం హేమంత్ సోరెన్ అంటున్నారు. ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ కూడా ఈ ప్రతిపాదనపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో సంకీర్ణంలో ఉద్రిక్తతలకు దారితీసింది.



శుక్రవారం అమర్‌నాథ్ యాత్రలో ఊపిరాడక ఇబ్బందిపడిన యాత్రికురాలికి ఆక్సిజన్ అందజేస్తున్న సహాయ సిబ్బంది



అండమాన్ దీవుల్లో సముద్ర జలాల్లో నిలిచిపోయిన అమెరికా పడవను తరలిస్తున్న కోస్ట్ గార్డ్ సిబ్బంది

మనపై చైనా వాటర్ బాంబ్

అరుణాచల్ సీఎం ఖండూ | రాష్ట్ర అస్తిత్వానికే ముప్పని ఆందోళన

బ్రహ్మపుత్రా నది పై చైనా తలపెట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద ఆనకట్ట 'మెడోగ్' భారత్ పాలిట 'నీటి బాంబు'గా మారనుందని అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఆందోళన వెలిబుచ్చారు. ఈశాన్యంలోని సరిహద్దు రాష్ట్ర ప్రజలకు, వారి జీవనోపాధికి ఈ ప్రాజెక్టు పెను ముప్పు అవుతుందన్నారు. "ఏ అంతర్జాతీయ జల ఒప్పందాలపైనా సంతకం చేయని చైనా ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు. ఆ ద్యామును మనపైకి నీటి బాంబులా కూడా ఉపయోగించొచ్చు"అని హెచ్చరించారు. దాంతో మెడోగ్ డ్యామ్ మరోసారి చర్చల్లో నిలిచింది.

గోప్యతపై అనుమానాలు...

టిబెట్‌లోని యార్లుంగ్ సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై ప్రపంచంలోనే అతి పెద్ద ఆనకట్టను చైనా నిర్మిస్తోంది. ఈ నది అరుణాచల్‌లో సియాంగ్‌గా, అస్సాంలో బ్రహ్మపుత్రగా మారి, బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తుంది. అక్కడి నుంచి సముద్రంలో కలుస్తుంది. మెడోగ్ డ్యామ్ ద్వారా ఏకంగా 60 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తిని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారత సరిహద్దుకు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. అందుకే దీన్ని 'టికింగ్ అంటున్న వాటర్ బాంబ్'గా ఖండు అభివర్ణించారు. మెడోగ్ కేవలం నదీప్రవాహ ప్రాజెక్టు అని చైనా అంటున్నా ఆ ముసుగులో అతి భారీ జలాశయాన్ని నిర్మిస్తోందని చెబుతున్నారు. ఇది భారీగా నీటిని నిల్వ చేస్తుందని, దిగువ ప్రవాహాన్ని ప్రభావితం చేస్తుందని అంటున్నారు. ఆనకట్ట నిర్మాణానికి ఆమోదం లభించినట్లు 2024లో వార్తలొచ్చాయి. ఈ ప్రాజెక్టుపై చైనా అద్భుతం గోప్యత పాటిస్తుండటం, అంతర్జాతీయ జల ఒప్పందాలపై సంతకం చేయడానికి నిరాకరించడం పర్యావరణం, భౌగోళికం, రాజకీయపరంగా భారత్‌కు పెను ఆందోళన కలిగిస్తోంది. అంతేగాక ప్రాంతీయ ఉద్రిక్తతలను కూడా రాజేస్తోంది. ఈ ఆనకట్టను అరుణాచల్ అస్తిత్వానికే ముప్పుగా నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు.

'గ్రేట్ బెండ్' వద్దే నిర్మాణం

అరుణాచల్‌కు సమీపంలో సాంగ్పో నది ఉన్నట్టుండి వలయాకారంగా వంపు తిరుగుతుంది. సరిగ్గా ఈ 'గ్రేట్ బెండ్' వద్దే చైనా ఆనకట్ట కడుతోంది. అక్కడి నుంచి నేరుగా అరుణాచల్‌కు చేరుతుంది. ఈ నేపథ్యంలో నది ప్రవాహంలో ఎలాంటి అసాధారణ మార్పులు జరిగినా భారీ వరదలు తప్పవు. అదే జరిగితే సియాంగ్ బెల్ట్ మొత్తం నాశనమవుతుంది. అక్కడి ఆదిమ తెగలు, ఇతర వర్గాలతో పాటు విస్తారమైన అటవీ ప్రాంత అస్తిత్వం కూడా ముప్పులో పడుతుంది. ఎగువ దేశంగా నదీ ప్రవాహంపై చైనాకు అతి కీలకమైన వ్యూహాత్మక నియంత్రణ ఉండటమే ఇందుకు కారణం. నీటిని అది ఏకపక్షంగా మళ్లిస్తే భారత్‌తో పాటు బంగ్లాదేశ్‌కు కూడా తీవ్ర నష్టం తప్పదు. నీటి ప్రవాహాన్ని తగ్గితే ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాలో సాగు, మత్స్యకార కార్యకలాపాలు, జీవనోపాధికి నష్టం వాటిల్లుతుంది. అందుకే ఈ డ్యామ్ నిర్మాణంపై భారత గట్టిగా అభ్యంతరాలు వ్యక్తం చేయాలని చైనాలో భారత మాజీ రాయబారి అశోక్ కాంత సూచించారు. 'మెడోగ్ కేవలం ప్రాజెక్టు కాదు. దాని క్లిష్టమైన ప్రాంతంలో వ్యూహాత్మకంగా నిర్మిస్తున్న అతి భారీ జలాశయం. అది చాలా ప్రమాదకర పరిణామం. అత్యంత బాధ్యతారాహిత్యమైన ప్రాజెక్టు" అని హెచ్చరించారు. మరికొందరు నిపుణులు మాత్రం భయాందోళనలు అవసరం లేదంటున్నారు. ఈ ఆనకట్ట ద్వారా బ్రహ్మపుత్రా జలాలను మనపైకి ఆయుధంగా వాడటం చైనా ఉద్దేశం కాబోదని చెబుతున్నారు. నదిలోని భారీ ప్రవాహాన్ని చైనా ఆపజాలదని చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కన్నడ తప్పనిసరి బోధనపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీస్

బెంగళూరు: స్కూళ్లలో కన్నడ బోధనను తప్పనిసరి చేస్తూ విడుదలైన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై మూడు వారాల్లోగా సమాధానమివ్వాలని కర్ణాటక హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కర్ణాటక వ్యాప్తంగా సీబీఎస్ఈ, సీఐఎస్‌సీఈ సిలబస్ స్కూళ్లలో చదివే విద్యార్థులు 2023లో ఈ పిల్‌ను వేశారు. స్పందించడాలని రెండేళ్ల క్రితం ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి. కామేశ్వర్ రావు, జస్టిస్ సీఎం జోషిల ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. 'యంత్రాంగాన్ని వేగవంతం చేసింది, లేకుంటే దరఖాస్తుదారులకు మధ్యంతర ఉపశమనం కల్పించేలా ఆదేశాలిస్తాం'అని స్పష్టం చేసింది. కన్నడ భాషా బోధన చట్టం–2015, కన్నడ భాషా బోధన నిబంధనలు–2017, కర్ణాటక విద్యా సంస్థల నిబంధనలు–2022లోని పలు సెక్షన్లను పిటిషనర్లు సవాల్ చేశారు.

విదేశాంగ శాఖలో 1,300 మందికి ఉద్వాసన

ట్రంప్ యంత్రాంగం చర్యలు షురూ

వాషింగ్టన్: విదేశాంగ శాఖలోని 1,300 మంది ఉద్యోగులపై వేటు వేసేందుకు అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సిద్ధమైంది. వీరిలో 1,107 మంది సాధారణ ఉద్యోగులు కాగా, 246 మంది విదేశాంగ శాఖ అధికారులు. దేశంలోనే ఉంటూ బాధ్యతలు నిర్వహించే వారికి ఇప్పటికే తొలగింపు ఉత్తర్వులు జారీ చేయడం మొదలైంది. అయితే, అధికారులను ఒకేసారిగా విధుల నుంచి తొలగించకుండా 120 రోజుల లీవుపై పంపుతోంది. ఆటు తర్వాత వీరు ఉద్యోగాలు కోల్పోనున్నారు. అత్యధికులైన సాధారణ ఉద్యోగులకు మాత్రం 60 రోజుల లీవు ఇచ్చింది. ఉద్యోగులను గుర్తిస్తే వారి బాధ్యతలను ఇతరులకు అప్పగించడంకు ఇప్పటికే ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని సమాచారం. ట్రంప్ సర్కారు ఇప్పటికే యూఎస్ ఎయిడ్, విద్యాశాఖలను పూర్తిగా ఎత్తివేయడం తెల్సిందే.

ఛంగూర్ బాబా నివాసంలో సోదాలు

బలరాంపూర్: యూపీలో మతమార్పిడి దందాకు పాల్పడినట్లు ఆరోపణలున్న జలాలుద్దీన్ అలియాస్ ఛంగూర్ బాబా నివాసంలో ఉగ్రవాద వ్యతిరేక బృందం (ఏటీఎస్)పోలీసులు శుక్రవారం సోదాలు చేపట్టారు. బలరాంపూర్ జిల్లా మధ్‌పూర్‌లో ఉన్న బాబా ఇంటి నుంచి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. గంటపాటు ప్రశ్నించిన అనంతరం అతడిని తిరిగి లక్నోకు తరలించారు. ఏటీఎస్ ఇతడితోపాటు నీతూ అలియాస్ నస్రీన్‌ను గత వారం అరెస్ట్ చేసింది. వీరిని ఎస్పీ కోర్టు ఈ నెల 16వ తేదీ వరకు కస్టడీకి పంపించింది. దీంతో, ఈ కేసులో ఇప్పటి వరకు నలుగురిని అరెస్ట్ చేసినట్లయింది. హిందువులతోపాటు ఇతరులను ఇస్లాంలోకి బలవంతంగా మార్చుతున్నట్లు వీరు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

క్రాస్‌రోడ్స్‌లో భారత జనాభా

న్యూఢిల్లీ: భారత్‌లో జనాభా సంక్షోభంలో లేదని, కేవలం ఒక కీలక కూడలిలో మాత్రమే ఉందని పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అభిప్రాయపడింది. అధిక జనాభా, సంతానోత్పత్తి తగ్గుదల వంటి చర్చలు మాని, మహిళలు, యువత, వృద్ధుల గౌరవం, హక్కులు, అవకాశాలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చింది. జనాభా సవాళ్లు, సంఖ్యా కంటే.. ప్రజలందరికీ న్యాయం, సమానత్వం, మానవ వనరుల పెంపుదలలో పెట్టుబడుల గురించి ఆలోచించాలని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా సూచించారు. జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. "కుటుంబ నియంత్రణను కేవలం స్త్రీల బాధ్యతగా చూస్తున్నారు. నిజానికది కుటుంబ ఉమ్మడి బాధ్యత. ఇంట్లో, ఆఫీసుల్లో మహిళల భద్రత పురుషుల బాధ్యతే" అని పేర్కొన్నారు. "దేశంలో 25 కోట్లకు పైగా యువ జనాభా ఉంది. కౌమార దశలోని బాలికలకు విద్య, నైపుణ్యాభివృద్ధి, పునరుత్పత్తి ఆరోగ్యం, మానసిక శ్రేయస్సుపై నిధులు వెచ్చించడం ద్వారా సమగ్రాభివృద్ధి సాధించే అవకాశం భారత్‌కు మాత్రమే ఉంది" అన్నారు.

ముగ్గురు పిల్లల్ని చంపిన తల్లికి మరణశిక్ష

బైరియా: ప్రియుడితో కలిసి ముగ్గురు పిల్లల్ని పొట్టనబెట్టుకున్న ఓ తల్లికి యూపీలోని కోర్టు మరణ శిక్ష విధించింది. ఆమె ప్రియుడికి జీవిత కాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. బైరియా జిల్లాకు చెందిన ప్రియాంకకు నలుగురు కుమారులున్నారు. భర్త చనిపోయిన తర్వాత ఆశిష్ అలియాస్ దానిత్ సన్నిహితంగా ఉంటోంది. పిల్లల్ని అడ్డుతొలగించుకోవాలని ఇద్దరూ 2024 జూన్ 27వ తేదీన దేవరీఘాట్ సమీపంలోని సెంగార్ నది వద్దకు తీసుకెళ్లారు. నలుగురికీ మత్తు మందు కలిపిన ఆహారం తినిపించి, నదిలోకి తోసేశారు. స్థానికులు వెంటనే నదిలోకి దూకి ఒక బాలుణ్ని రక్షించగలిగారు. మత్తు నుంచి కోలుకున్నాక అతను తల్లి నిర్వాకాన్ని పోలీసులకు చెప్పాడు. దీ అత్యంత అరుదైన కేసుగా జడ్జి గురువారం పేర్కొన్నారు.

సావర్కర్‌పై వ్యాఖ్యలు.. పరువు నష్టం కేసు తానేం నేరం చేయలేదన్న రాహుల్ గాంధీ

పుణే: హిందుత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్‌పై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసు విచారణ శుక్రవారం జరిగింది. పుణెలోని ప్రత్యేక ఫస్ట్ క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ జడ్జి (ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు) అమోల్ శ్రీరాం షిండే కాంగ్రెస్ నేత రాహుల్ తరఫున ఆయన లాయర్ మిళింద్ పవార్ ఇచ్చిన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. తాను నేరం చేయలేదని ఆయన తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో పిటిషనర్, సావర్కర్ మనవడు సాత్యకి సావర్కర్ వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. తదుపరి విచారణ జూలై 29వ తేదీకి వాయిదా పడింది. 2023లో లండన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ.. వీడీ సావర్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాగా, ఈ కేసు విచారణలో రాహుల్‌కు కోర్టు మినహాయింపు ఇచ్చింది.

1.6 లక్షల మంది నిరాశ్రయులు

ఈ ఏడాది తొలి 6 నెలల్లో బీభత్సం సృష్టించిన ప్రకృతి విపత్తులు

- 2024లో 1.18 లక్షల మంది బాధితులు
- ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్ మానిటరింగ్ సెంటర్ వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో ప్రకృతి విపత్తులు పంజా విసురుతూనే ఉన్నాయి. భారీ వర్షాలు, భీకరమైన వరదల కారణంగా పెద్ద సంఖ్యలో జనం నష్టపోతున్నారు. శాశ్వత లేదా తాత్కాలిక ఇళ్లు, ఆవాసాలు కోల్పోయి నిరాశ్రయులుగా మారుతున్నారు. 2024లో దేశంలో 400కుపైగా ప్రకృతి విపత్తులు చోటుచేసుకున్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో చూస్తే ఇదే అత్యధిక కావడం గమనార్హం. గత ఏడాది విపత్తుల వల్ల 1.18 లక్షల మందికిపైగా జనం నిరాశ్రయులయ్యారని ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్ మానిటరింగ్ సెంటర్ వెల్లడించింది. 2023 కంటే 2024లో నిరాశ్రయుల సంఖ్య 30 శాతం అధికం అని తెలియజేసింది. 2021లో 22,000 మంది, 2022లో 32,000 మంది ఇళ్లు కోల్పోయి రోడ్డున పడ్డారని పేర్కొంది. ప్రకృతి విపత్తుల ప్రతిఏటా పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. 2019 నుంచి 2023 మధ్య 281 విపత్తుల ఘటనలు చోటుచేసుకున్నాయి. 2024లో మాత్రం ఏకంగా 400కు పైగా విపత్తులు సంభవించాయి. గత ఆరేళ్లలో జనం నిరాశ్రయులు కావడానికి వరదలు 55 శాతం, తుఫాన్లు 44 శాతం కారణమని తేలింది. కొండ చరియలు విరిగిపడటం, భూకంపాలు, కరువుల వల్ల కూడా జనం ఆశ్రయం కోల్పోతున్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లోనే అధికం

2024లో 1.18 లక్షల మంది నిరాశ్రయులు కాగా, 2025లో మొదటి ఆరు నెలల్లోనే ఏకంగా 1.6 లక్షల మంది బాధితులుగా మారిపోయినట్లు ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్ మానిటరింగ్ సెంటర్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది పరిస్థితి మరింత దారుణంగా ఉన్నట్లు తేటతెల్లమవుతోంది. పశ్చిమ బెంగాల్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాల ప్రజలే అధికంగా ప్రకృతి విపత్తుల బారినపడుతున్నారు. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 80,000 మంది నిరాశ్రయులయ్యారు.

2025లో మొదటి 6 నెలల్లో ఏ రాష్ట్రంలో ఎంతమంది నిరాశ్రయులు

రాష్ట్రం	నిరాశ్రయులు
జమ్మూకశ్మీర్	457
హిమాచల్‌ప్రదేశ్	358
అస్సాం	42,770
అరుణాచల్‌ప్రదేశ్	2,523
మణిపూర్	3,996
మిజోరాం	1,226
త్రిపుర	21,559
పశ్చిమ బెంగాల్	80,000
ఒడిశా	8,330
కేరళ	2,862
గుజరాత్	2,922



ట్యాక్సీపై ఠండా ఠండా.. కూల్ కూల్

ఎముకలు కొరికే చలితో పాటు ప్రచండమైన ఎండలకు అఫ్గానిస్తాన్ పెట్టింది పేరు. వాటిబారి నుంచి ప్రయాణికులకు ఊరట కల్పించేందుకు కాందహార్‌లో ట్యాక్సీ డ్రైవర్లు ఇలా వినూత్న మార్గం కనిపెట్టారు. ఎయిర్ కూలర్లను ఏకంగా ట్యాక్సీలపైనే బిగించేశారు. వెనక సీటు విండోకు రంధ్రం చేసి ఏసీ పైప్ గుండా చల్లదనాన్ని ఎంచక్కా లోనికి పంపిస్తున్నారు. "వినూత్నమైన ఎండల దెబ్బకు కార్ల ఏసీలు పని చేయక చాలా ఇబ్బందులు పడుతున్నాం. పైగా ఏసీల మరమ్మతులకు భారీ ఖర్చవుతోంది. అధికారికంగా చాలా మంది డ్రైవర్లకు కార్లో ఏసీ పెట్టించే స్తోమత లేదు. దాంతో బాగా ఆలోచించి, తెలిసిన మెకానిక్ సాయంతో ఈ మార్గం కనిపెట్టాం" అని గుల్ మహ్మద్ అనే 32 ఏళ్ల ట్యాక్సీ డ్రైవర్ వివరించాడు. "ఇందుకోసం అయిన ఖర్చెంతో తెలుసా? కేవలం 43 డాలర్లు! కూలర్లున్న ట్యాక్సీ బ్యాటరీకి కనెక్ట్ చేశాం. కూలర్లో తరచూ నీళ్లు పోస్తాం. అంతే. లోపలంతా చల్లదనమే. దీని ముందు ఇన్ బిల్ట్ ఏసీ కూడా దిగదుడుపే! ఆ ఏసీ కేవలం కారు ముందువైపు మాత్రమే వస్తుంది. మా కూలర్ ఏసీతో అలా కాదు. కారంతటా ఠండా ఠండా కూల్ కూల్!" అంటూ చెప్పుకొచ్చాడు! తాలిబన్ల పాలనలోని అఫ్గానిస్తాన్ ప్రపంచంలోని అత్యంత నిరుపేద దేశాల్లో ఒకటన్నది తెలిసిందే. అక్కడి ట్యాక్సీల్లోన్ని కూడా చెల్లిన డొక్కు వాహనాలే. పొరుగు దేశం నుంచి కొనుక్కుని ఇలా నడిపిస్తున్న రోజులు తిప్పుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

స్వాతంత్య్రం వచ్చిన 78 ఏళ్లకు ఆ తండాలకు కరెంటు

కోటా: ఆ తండాకు స్వాతంత్య్రం వచ్చిన 78 ఏళ్ల తరువాత కరెంటు వచ్చింది! రాజస్థాన్‌లో బరాన్ జిల్లాలో మారుమూల కొండ ప్రాంతానికి తొలిసారి విద్యుత్ కనెక్షన్లు లభించాయి. జిల్లాలోని సనాదా గ్రామానికి నుండి 3 కి.మీ. దూరంలో 40 ఇళ్లలో సహారియా తెగకు చెందినవారు కరెంటు లేకుండానే కాలం వెళ్లదీస్తున్నారు. వాళ్ల నిరీక్షణ జూన్ 30తో తెరపడింది. మే 28న 'రాత్రి చౌపల్ (రాత్రి సమావేశం)' సందర్భంగా ప్రజల నుంచి కరెంటుపై ఫిర్యాదులు వచ్చాయి. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ బదుతుకున్నామని జిల్లా కలెక్టర్ మొరపెట్టుకున్నారు. ఆయన మర్నాడే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. 1 రోజుల్లోగా విద్యుదీకరణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 25 రోజుల్లోనే పని పూర్తయిందని ఆయన చెప్పారు. రాత్రుల్లో కూడా ఇళ్లు వెలిగిపోతున్నందుకు ప్రజలు సంతోషంగా, ఉత్సాహంగా ఉన్నారు. దశాబ్దాల తర్వాత గ్రామానికి విద్యుత్ సరఫరా దివారికి చేరుకుంది. దాంతో బరాన్ జిల్లాలో 100 శాతం విద్యుదీకరణ పూర్తయిందని కలెక్టర్ వెల్లడించారు.

టైమ్ టాప్–100 డిజిటల్ క్రియేటర్ల జాబితాలో ప్రజక్తా కోలికి చోటు

మరో నలుగురు భారతీయ అమెరికన్లకు స్థానం

లండన్: ప్రతిష్టాత్మక టైమ్ 100 క్రియేటర్స్ జాబితాలో ఒక భారతీయురాలితోపాటు భారత సంతతికి చెందిన నలుగురు కంటెంట్ రైటర్లు చోటు దక్కించుకున్నారు. యూట్యూబర్, నటి ఆయిన ప్రజక్తా కోలి(32)కి భారత్ నుంచి చోటు దక్కడం విశేషం. భారతీయ అమెరికన్లు దర్ మాన్, మిచెల్ ఖరే, సమీర్ చౌదరి, జే షెట్టి కూడా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంస్కృతి, చర్చలు, సంభాషణలను ప్రభావితం చేసే అత్యంత ప్రభావశీలురైన డిజిటల్ సృష్టికర్తలను టైమ్ ఎంపిక చేసింది. మొట్టమొదటి సారిగా రూపొందించిన ఈ జాబితాలో టైటాన్స్, ఎంటర్‌టెయినర్స్, లీడర్స్, ఫినామ్స్, ట్రైల్‌బ్లేజర్స్ అనే ఐదు కేటగిరీల్లో 15 దేశాలకు చెందిన వారున్నారు. టైటాన్స్ విభాగంలో భారత సంతతికి చెందిన దర్ మాన్(41) సామాజిక, మానవీయ విలువలను కవర్ చేస్తున్న ప్రముఖ యూట్యూబ్ షార్ట్ వీడియోలను రూపొందించడంలో పేరు తెచ్చుకున్నారు. ఆయన చానెల్‌కు 2.50కోట్ల మంది సబ్‌స్క్రైబర్లున్నారు. నికెలోడియన్ కిడ్స్ చాయిస్ అవార్డులకు రెండుసార్లు నామినేట్ అయ్యారు. టైమ్ మేగజైన్ తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా నుంచి ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీలు సంపాదించారు. లీడర్స్ కేటగిరీలో భారతీయ అమెరికన్ యూట్యూబర్ మిచెల్ ఖరే చోటు సంపాదించుకున్నారు. తన యూట్యూబ్ చానెల్‌లో 'చాలెంజ్ యాక్సెప్టెడ్ సిరీస్‌'తో బాగా పేరు తెచ్చుకున్నారు. ఆ చానెల్‌కు 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్లున్నారు. 1992లో లాస్‌ఏంజెలెస్‌లో జన్మించిన ఆమె.. డార్ట్‌మౌత్ కాలేజ్ నుంచి డిజిటల్ ఆర్ట్స్ అండ్ మీడియా టెక్నాలజీలో డిగ్రీ చేశారు. టైమ్ మేగజైన్ జాబితాలో లీడర్స్ కేటగిరీలో ఎంపికైన జే షెట్టి(37) బ్రిటన్‌కు చెందిన భారత సంతతి రచయిత, పాడ్‌కాస్టర్. కొంతకాలం హిందూ సన్యాసిగా గడిపారు. ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్నారు. టిక్‌టాక్, ఇన్‌స్టాలో 2.2 కోట్ల ఫాలోయర్లు, యూట్యూబ్ చానెల్‌కు 80 లక్షల మంది సబ్‌స్క్రైబర్లున్నారు. ఇతడి తల్లిదండ్రులు భారత్ నుంచి వెళ్లి లండన్‌లో స్థిరపడ్డారు. టాప్ 100 జాబితాలో మరో భారతీయ అమెరికన్ సమీర్ చౌదరి పేరు ఉంది. ఇతని యూట్యూబ్ చానెల్ 'కొలిన్ అండ్ సమీర్'కు 16 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ చానెల్ సహనిర్వాహకుడు కొలిన్ రొబిన్ బ్లమ్‌తో ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. కాలిఫోర్నియాలోని శాంటామోనికాలో 1989లో జన్మించిన సమీర్ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఫిల్మ్ అండ్ డిజిటల్ మీడియాలో విద్యనభ్యసించారు.

ప్రజక్తా కోలి ఎవరంటే..?

మహారాష్ట్రకు చెందిన ప్రజక్తా కోలి నటి, యూట్యూబర్, మోస్ట్‌లీసేన్ అనే యూట్యూబ్ చానెల్ నిర్వహిస్తున్నారు. రోజువారీ జీవితంపై హాస్యం పుట్టించేలా ఉండే ఈమె చానెల్‌కు 70 లక్షల మంది, ఇన్‌స్టాలో 80 లక్షల మంది ఫాలోయర్లు ఉన్నారు. నెట్‌ఫ్లిక్స్‌లో మిస్‌మ్యాచ్డ్ అనే సిరీస్‌తోపాటు, జుగ్‌జుగ్ జీయో అనే సినిమాలోనూ నటించారు. పలు పుస్తకాలు రాశారు.

ప్రధానిపై మాన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం: కేంద్రం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ చేసిన వ్యాఖ్యలను విదేశాంగ శాఖ ఖండించింది. ప్రధాని పర్యటనలను అపహాస్యం చేయడం బాధ్యతారాహిత్యమని తెలిపింది. మోదీ విదేశీ పర్యటనపై మన్ విమర్శలు గుప్పించారు. "ప్రధాని ఎక్కడికో వెళ్లిపోయారు. ఈ రోజు తిరిగొస్తున్న ఆయనకు స్వాగతం. ఆ దేశాలను ఎందుకు సందర్శిస్తున్నారో దేవుడికే తెలుసు. మెగ్నీషియా, గల్వేషియా, టార్వేసియా' అంటూ కల్పిత పేర్లను ఉపయోగించారు. "ఆయన 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో ఉండటం లేదు. అంతమంది ప్రజల సమస్యలను పట్టించుకునే సమయం లేదు. విదేశీ పర్యటనలకు మాత్రం సమయం దొరుకుతోంది. కేవలం 10 వేల జనాభా ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి పెద్ద గౌరవ పురస్కారాలు అందుకుంటున్నారు. మన దగ్గరైతే కేవలం ఒక జేసీబీ చూడటానికి కనీసం 10 వేల మంది గుమిగూడతారు" అంటూ ఎద్దేవాచేశారు. 11 ఏళ్లలో ఏనాడూ ఒక్క ప్రెస్ కాన్ఫరెన్స్ కూడా నిర్వహించని ప్రధాని ఒక్కరేనని విమర్శించారు.

'షీల్డ్-ఎక్స్'తో వస్తువులు క్రిమిరహితం

- స్టెరిలైజేషన్ కోసం ప్రత్యేక పరికరం అభివృద్ధి
- తమిళనాడు కవల సోదరుల ఘనత

చెన్నై: కరోనా వైరస్ ఉధృతంగా వ్యాప్తి చెందుతున్న సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యత ఏమిటో జనానికి తెలిసొచ్చింది. ప్రమాదకరమైన వైరస్‌ల బారినపడకుండా ఉండాలంటే చేతులను, నిత్యం ఉపయోగించే వస్తువులను శుభ్రంగా ఉంచుకోవాలన్న తపన పెరిగింది. స్టెరిలైజేషన్ కోసం తమిళనాడులోని సేలం పట్టణానికి చెందిన కవల సోదరులు రామ్‌నాథ్, లక్ష్మీకాంత్ 'షీల్డ్–ఎక్స్' పేరుతో ప్రత్యేక పరికరం అభివృద్ధి చేశారు. దీనికి పేటెంట్ సైతం సంపాదించారు. వస్తువులపై తిష్టవేసే హానికరమైన వైరస్‌లు, క్రిములను నిర్మూలించడంలో ఇది సమర్థంగా పని చేస్తుందని చెబుతున్నారు. కోవిడ్–19 మహమ్మారి విస్తరణ సమయంలో తమకు ఎదురైన అనుభవాలే ఈ పరికరాన్ని తయారు చేయడానికి ప్రేరణ కల్పించాయని రామ్‌నాథ్, లక్ష్మీకాంత్ చెప్పారు. మహమ్మారి వల్ల కుటుంబ సభ్యులను కోల్పోయామని, యుద్ధాలు, ప్రకృతి విపత్తుల కంటే వైరస్ వల్ల మనుషులు మృతిచెందడం తమను కలచివేసిందని అన్నారు. అందుకే నాలుగు రకాలుగా శుభ్రపర్చి, క్రిమిరహితంగా మార్చే షీల్డ్–ఎక్స్ ఛాంబర్ అభివృద్ధి చేశామని తెలిపారు. రోజువారీగా ఉపయోగించుకొనే వస్తువులు, సామగ్రిని ఈ ఛాంబర్‌లో స్టెరిలైజేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. యూవీ–స్టెరిలైజేషన్, థర్మల్ డిసెన్ఫెక్షన్, ఫాగింగ్ ట్రీట్‌మెంట్, ఫ్యూమ్ ఎక్స్‌ట్రాక్షన్ విధానాలను ఇందులో ఉపయోగించినట్లు వివరించారు. వాడుకొనే వస్తువులను బట్టి స్టెరిలైజేషన్ విధానం ఎంపిక చేసుకోవచ్చని సూచించారు. ఉదాహరణకు సెల్‌ఫోన్‌ను క్రిమిరహితం చేయాలంటే 30 సెకండ్ల పాటు అల్ట్రావయోలెట్(యూవీ) ట్రీట్‌మెంట్ సరిపోతుందని వివరించారు. అలాగే 'షీల్డ్–ఎక్స్' ఛాంబర్‌లో హెల్మెట్‌ను 4 నిమిషాల్లో శుభ్రపర్చవచ్చని రామ్‌నాథ్, లక్ష్మీకాంత్ తెలియజేశారు. ఆయా వస్తువులను నిర్దిష్ట సమయంపాటు ఈ ఛాంబర్‌లో ఉంచితే సరిపోతుందని చెప్పారు. ఇది చాలా సులభమైన, సురక్షితమైన పద్ధతి అని వెల్లడించారు. అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో ఈ ఛాంబర్ సమర్థంగా పనిచేస్తుందని అన్నారు. విద్యాసంస్థలు, కార్పొరేట్ కార్యాలయాలు, ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాల్లో ఈ యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని స్పష్టంచేశారు.

లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశం ఏమిటి?

భారత న్యాయ వ్యవస్థ

దిగువ కోర్టులు (Subordinate Courts)

భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ప్రకరణలు 233 నుంచి 237 వరకు సబార్డినేట్ కోర్టులు (అధీన న్యాయస్థానాలు) గురించి ప్రస్తావించారు. హైకోర్టు తర్వాత వచ్చే దిగువ కోర్టులను 'సబార్డినేట్ కోర్టులు' అంటారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటీ సివిల్ కోర్టులు, మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులు ఉంటాయి.

సిటీ సివిల్ కోర్టులు, జిల్లా అదనపు న్యాయమూర్తి, సంయుక్త న్యాయమూర్తి, అదనపు న్యాయమూర్తి, సెషన్స్ జడ్జీలకు 'జిల్లా జడ్జీ' హోదా ఉంటుంది. ప్రకరణ 50 ప్రకారం అధీన న్యాయస్థానాలను కార్యనిర్వాహక శాఖ నుంచి వేరు చేశారు. కింది న్యాయస్థానాలపై అప్పీళ్లు, పర్యవేక్షణాధికార పరిధితోపాటు న్యాయమూర్తులపై పరిపాలనా నియంత్రణను హైకోర్టు కలిగి ఉంటుంది.

- ప్రకరణ 233 ప్రకారం జిల్లా న్యాయమూర్తుల నియామకం, పదోన్నతి విషయాల్లో గవర్నర్ హైకోర్టును సంప్రదిస్తారు.
- ప్రకరణ 243 ప్రకారం న్యాయమూర్తులతో పాటు న్యాయశాఖ సర్వీసుకు చెందిన ఇతర ఉద్యోగుల నియామకం విషయంలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తోపాటు హైకోర్టును కూడా గవర్నర్ సంప్రదించాలి.
- జిల్లా కోర్టులు, వాటి కింది కోర్టుల్లో పనిచేసే నిమ్న స్థాయి ఉద్యోగాల నియామకం, పదోన్నతి, సెలవు మంజూరు లాంటి వ్యవహారాలపై నియంత్రణను హైకోర్టుకు ఇచ్చారు.

జాతీయ న్యాయ మండలి (National Judicial Council)

లోక్‌సభ 2008 అక్టోబరు 8న న్యాయమూర్తుల విచారణ బిల్లు-2006ను ఉపసంహరించి, దానిస్థానంలో న్యాయమూర్తుల విచారణ సవరణ బిల్లు-2008ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదిత బిల్లు జాతీయ న్యాయమండలి (ఎన్.జె.సి.) ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. ఇందులోని ముఖ్యాంశాలు..

- ఉన్నత స్థానాల్లో ఉన్న న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదుల దర్యాప్తు, నిర్ణీత ప్రక్రియను అవలంబించడం ద్వారా ఫిర్యాదులు వచ్చిన వారిపై తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేసే అధికారం ఈ మండలికి ఉంటుంది.
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, అత్యధిక సీనియారిటీ ఉన్న ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు (వీరిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు) ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు.
- సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులపై ఎన్.జె.సి.కి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుపై ప్రాథమిక పరిశీలన చేసి, విచారణ జరిపే అధికారం ఎన్.జె.సి.కి ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న న్యాయమూర్తి దోషిగా నిరూపణ అయితే, ఆ న్యాయమూర్తిని పార్లమెంట్‌లో అభిశంసించడం ద్వారా పదవి నుంచి తొలగించాలని ఎన్.జె.సి. సూచించవచ్చు. దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు నిరూపణ అయితే.. ఆ ప్రవర్తన పదవి నుంచి తొలగించాల్సినంత తీవ్రమైంది కాకపోతే హెచ్చరించడం, మందలించడం, అభిశంసించడం లేదా నిర్ణీత కాలంపాటు ఏవిధమైన న్యాయపరమైన బాధ్యతలు అప్పగించకపోవడం, పదవీ విరమణ కోరడం లాంటి చర్యలు తీసుకోవచ్చు.
- న్యాయమూర్తిని తొలగించాలని కోరుతూ చేసిన తీర్మానం ప్రాతిపదికగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ స్పీకర్ నివేదిస్తే.. న్యాయ మండలి స్వల్ప చర్యను సిఫారసు చేయడం, తీసుకోవడం గానీ చేయలేదు.

ఈ ప్రతిపాదిత బిల్లు న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత తీసుకువస్తుంది. దాని ప్రతిష్ఠను కూడా ఇనుమడింపజేస్తుంది.

గ్రామ న్యాయాలయాలు

గ్రామ న్యాయాలయాల బిల్లు-2008 పార్లమెంటు ఉభయ సభలు డిసెంబర్ 3న ఆమోదించాయి. గ్రామ న్యాయాలయాల చట్టాన్ని 2009 అక్టోబరు 2 (గాంధీ జయంతి సందర్భంగా) నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా బ్లాక్ స్థాయిలో 5,067 కోర్టులను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. దేశంలోని గ్రామీణ ప్రజలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం పొందడానికి వీలవుతుంది. గ్రామ న్యాయాలయాలు చట్టం ప్రకారం దేశంలోని వివిధ గ్రామాల్లో సంచార న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తారు. ఈ న్యాయస్థానాల్లో విచారణను న్యాయాధికారి (ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్) నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులను సంప్రదించి ఈ న్యాయాధికారులను నియమిస్తాయి.

గ్రామ న్యాయాలయాలు విచారించే కేసులు:

క్రిమినల్, సివిల్ కేసులు, మరణశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, రెండు సంవత్సరాలకు పైగా శిక్ష విధింపునకు సంబంధించిన కేసులు మినహా మిగిలిన అన్ని రకాల వివాదాలపై గ్రామ న్యాయాలయాలు విచారణ నిర్వహిస్తాయి. దొంగతనం, దొంగిలించిన వస్తువులను తీసుకోవడం లేదా తన వద్ద ఉంచుకోవడం, దొంగిలించిన వస్తువులు లేదా ఆస్తిని దాచడానికి సహకరించడం (వాటి విలువ రూ. 20,000లకు పైగా లేని సందర్భాల్లో), ఆస్తి కొనుగోలు, భూమిని సాగు చేసుకోవడం, బోరు బావి లేదా సాధారణ బావి నుంచి నీటిని వినియోగించుకోవడం లాంటి కేసులను న్యాయాలయాలు విచారిస్తాయి.

సెషన్స్ కోర్టుకు అప్పీల్ చేసే అవకాశం:

గ్రామ న్యాయాలయాలు ఇచ్చే తీర్పులను సవాలు చేస్తూ సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. అప్పీలు దాఖలు చేసిన ఆరు నెలల్లోగా సెషన్స్ కోర్టులు విచారణ జరిపి, తీర్పు ప్రకటించాలి.

లోక్ అదాలత్ (ప్రజా న్యాయస్థానం)

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

న్యాయస్థానాల్లో కొన్ని కారణాల వల్ల కేసులు పరిష్కరించడంలో ఎక్కువ జాప్యం జరుగుతుంది. వాది, ప్రతివాదులు కూడా కొన్ని సందర్భాల్లో పరిష్కారాలకు సుముఖంగా ఉండక కాలయాపన చేస్తుంటారు. కేసులను త్వరితగతిన పరిష్కరించడం కోసం ప్రత్యామ్నాయ వివాద విచారణ (Alternative Dispute Resolution) పద్ధతిలో లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తారు.

- లోక్ అదాలత్ పద్ధతిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.ఎన్. భగవతి ప్రచారంలోకి తీసుకు వచ్చారు.
- 1982లో గుజరాత్‌లో మొదటిసారిగా లోక్ అదాలత్‌లను ప్రారంభించారు.
- 1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం ద్వారా లోక్ అదాలత్‌లకు చట్టబద్ధత కల్పించారు. నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39ఎ ప్రకారం ప్రజలకు ఉచిత న్యాయ సలహా అందించాలని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే వీటిని ఏర్పాటు చేశారు.

సులభంగా పరిష్కరించగలిగే కొన్ని రకాల కేసులను పెద్ద మనుషుల మధ్యవర్తిత్వంలో పరిష్కరించడానికి చట్టబద్ధమైన ప్రతిపత్తి కలిగిస్తూ 'లోక్ అదాలత్' పేరుతో ప్రజా న్యాయస్థానాలనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ పేదలకు ఉచితంగా న్యాయం అందిస్తుంది. సాధారణ న్యాయస్థానాల్లో పనిచేస్తున్న న్యాయమూర్తి లోక్ అదాలత్ న్యాయాధిపతిగా కూడా వ్యవహరిస్తారు. ఈ



విధానం వల్ల కేసులను పరిష్కరించడంలో ఆలస్యాన్ని నివారించవచ్చు.

లోక్ అదాలత్ నిర్మాణం:

సుప్రీంకోర్టు, హైకోర్టు, లీగల్ సర్వీసెస్ కమిటీ, రాష్ట్ర, జిల్లా స్థాయి లీగల్ సర్వీస్ కమిటీలు లోక్ అదాలత్‌లను నిర్వహించవచ్చు. ఇందులో జిల్లా ప్రస్తుత న్యాయమూర్తి లేదా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి, అదేవిధంగా వివిధ రంగాల్లో ప్రముఖులు.. ముఖ్యంగా న్యాయశాస్త్రం, సామాజిక సేవ, నిమ్న వర్గాల వికాసానికి కృషి చేస్తున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు అంతిమం. వీటిని సాధారణంగా అప్పీల్ చేసుకోవడానికి వీలు లేదు. పార్లమెంట్ 2002లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం-1987కు సవరణ చేసి శాశ్వత పద్ధతిలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసింది. దీని ప్రకారం శాశ్వత లోక్ అదాలత్‌కు జిల్లా న్యాయమూర్తి లేదా అదనపు న్యాయమూర్తి చైర్మన్‌గా ఉంటారు. పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లో ఇద్దరు నిష్ణాతులను ప్రభుత్వాలు నామినేట్ చేస్తాయి.

లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే అంశాలు:

మోటారు వాహనాలు, ఇన్సూరెన్సు క్లెయిమ్‌లు, కాంట్రాక్టులకు సంబంధించిన వివాదాలు, వివాహ సంబంధ కేసులు, భూ సేకరణ, బ్యాంకు లోన్‌లకు సంబంధించిన కేసులు ఉభయ వర్గాల అంగీకారంతో లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా, సంతృప్తికరంగా పరిష్కారమవుతున్నాయి. ఇవి ప్రత్యేక తరహాలో రూపొందించిన న్యాయస్థానాలు. ప్రజలకు సత్వరమే న్యాయాన్ని అందించడం ఈ లోక్ అదాలత్‌ల ముఖ్య ఉద్దేశం.

వినియోగదారుల ఫోరాలు (Consumer Forums)

వినియోగదారులు, అమ్మకందారులకు మధ్య తలెత్తే వివాదాలు వినియోగదారుల ఫోరాల్లో పరిష్కారమవుతున్నాయి. ఇటీవల ఆధునిక రాజ్యాల్లో వినియోగదారుల హక్కులపై చైతన్యం పెరగడం వల్ల ఈ హక్కులకు భంగం కలిగితే వీటి ద్వారా పరిష్కారాలు ఇస్తున్నారు. ఇలా ఈ నూతన న్యాయస్థానాలు ప్రజా న్యాయస్థానాలుగా ఆదరణ పొందుతున్నాయి. 1986లో వినియోదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని చేశారు. ఇవి మూడు స్థాయిల్లో పనిచేస్తాయి. జిల్లా స్థాయిలో పనిచేసే ఫోరాలు రూ.20 లక్షల లోపు విలువ ఉన్న కేసులను, రాష్ట్ర స్థాయిలోని ఫోరాలు రూ. 20 లక్షల నుంచి ఒక కోటి వరకు విలువ ఉన్న కేసులను, జాతీయ స్థాయిలోని ఫోరం కోటి రూపాయలకు పైగా విలువ ఉన్న కేసులను పరిశీలిస్తాయి. వినియోగదారుడు 100 రూపాయల రుసుం చెల్లించి ఫిర్యాదు చేయవచ్చు. సాధారణ న్యాయస్థానాల్లా న్యాయప్రకియలు ఉండవు. వినియోగదారుడు తన వాదనను స్వయంగా వినిపించవచ్చు..

మాదిరి ప్రశ్నలు

1. హైకోర్టు, సుప్రీంకోర్టుల న్యాయమూర్తులకు సంబంధించి ఏ విషయంలో పోలికలు ఉన్నాయి?
   ఎ) తొలగింపు   బి) రాజీనామా
   సి) స్వతంత్ర ప్రతిపత్తి   డి) పైవన్నీ
2. సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష అధికారం నుంచి మినహాయించిన అంశం?
   ఎ) పార్లమెంటరీ ప్రక్రియలు
   బి) మంత్రి మండలి సలహా
   సి) సభాధ్యక్షుల నిర్ణయాలు
   డి) పైవన్నీ
3. కిందివాటిలో కొలీజియం వ్యవస్థలోని లోపం ఏది?
   ఎ) వృత్తిపరమైన ప్రీతి
   బి) పారదర్శకత లేకపోవడం
   సి) అనూహ్యమైన జాప్యం
   డి) పైవన్నీ
4. జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌కు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) ఇది రాజ్యాంగపరమైన సంస్థ
   బి) న్యాయ నియామకాలు, ఖాళీలను గుర్తిస్తుంది.
   సి) దీనికి అధిపతిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటారు
   డి) పైవన్నీ సరైనవే
5. సుప్రీం కోర్టు తీర్పులను ...
   ఎ) రాష్ట్రపతి మార్చవచ్చు
   బి) పార్లమెంటు మార్చవచ్చు
   సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మార్చవచ్చు
   డి) ఏదీకాదు
6. కింది ఏ అంశాలను సుప్రీంకోర్టు ఆవిష్కరించింది?
   ఎ) ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం
   బి) మౌలిక నిర్మాణ సూత్రం
   సి) కొలీజియం భావన
   డి) పైవన్నీ
7. అమెరికా సుప్రీంకోర్టుకు భారత సుప్రీంకోర్టుకు మధ్య తేడా?
   ఎ) న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు
   బి) అపరిమిత న్యాయ సమీక్ష అధికారం
   సి) ఎ, బి
   డి) ఏదీకాదు
8. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దేనికి ఆపాదించవచ్చు?
   ఎ) న్యాయ సమీక్ష
   బి) న్యాయశాఖ క్రియాశీలత
   సి) న్యాయశాఖ పవిత్రత
   డి) న్యాయశాఖ ఆధిక్యత
9. సుప్రీంకోర్టును రాజ్యాంగ పరిరక్షణకర్తగా పేర్కొంటారు. దీనికి ప్రాతిపదిక?
   ఎ) జీతభత్యాలు
   బి) స్వతంత్ర సర్వీసులు
   సి) న్యాయ సమీక్ష
   డి) న్యాయశాఖ ఆధిక్యం
10. ప్రజా ప్రయోజానాల వ్యాజ్యం సుప్రీంకోర్టులో ప్రారంభమైనప్పుడు నాటి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
   ఎ) ఎం. హిదయతుల్లా
   బి) వి.ఆర్. క్రిష్ణ అయ్యర్
   సి) పి.ఎన్. భగవతి డి) ఎ.ఎస్.ఆనంద్
11. కింది ఏ కోర్టు లేదా కోర్టులను 'కోర్ట్ ఆఫ్ రికార్డ్స్'గా పరిగణిస్తారు?
   ఎ) సుప్రీంకోర్టు
   బి) హైకోర్టు
   సి) జిల్లా కోర్టు   డి) ఎ, బి
12. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను తర్వాత కాలంలో మార్చవచ్చు. దీన్ని ఏమంటారు?
   ఎ) క్యూరేటివ్ పిటిషన్
   బి) రివిజన్ పిటిషన్
   సి) ప్రాస్పెక్టివ్ ఓవర్ రూలింగ్
   డి) స్టేర్ డెసిసిస్

సమాధానాలు

1) డి; 2) డి; 3) డి; 4) డి; 5) డి; 6) డి; 7) సి; 8) బి; 9) సి; 10) సి; 11) డి; 12) సి.

చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి ఎవరి బిరుదు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

డీసెట్‌లో తెలుగు సబ్జెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. కాబట్టి అభ్యర్థులు అశ్రద్ధ చేయకుండా తెలుగుపై పట్టు సాధించాలి. ఇందులో ఎక్కువగా కవులు, రచయితలు, వారి కాలాలు, బిరుదులు, రచనలు, కావ్య ప్రక్రియలు, ప్రసిద్ధ కొటేషన్లు, సాహిత్య అంశాలు, సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, అర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, ప్రకృతి- వికృతులు, జాతీయాలు- సామెతలు, ప్రత్యక్ష కథనం- పరోక్ష కథనం, నామ్నీకరణం, వాక్య భేదాలు తదితర వ్యాకరణ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. 8, 9, 10 తరగతుల కొత్త పాఠ్య పుస్తకాలను సేకరించి సొంత నోట్సు ప్రిపేర్ చేసుకోవాలి.

8వ తరగతి - తెలుగు

కవులు - పరిచయం

1. **గంగాపురం హనుమచ్ఛర్మ (1925-96):**
   గొప్ప కవి పండితులు, రాజకీయవేత్త, సమాజ సేవకులు
   పాఠ్యభాగం: దుందుభి
   ప్రక్రియ : గేయం
   ఇతివృత్తం: పర్యావరణం
   రచనా విశేషాలు: రుగ్వేద విజ్ఞానం, దుందుభి (నదీకావ్యం), మల్కిభరామ, గోపన
2. **డా. బిరుదురాజు రామరాజు (1925-2010):**
   జానపద సాహితీ వేత్త
   పాఠ్యభాగం: మన సంస్కృతి
   ప్రక్రియ: వ్యాసం
   ఇతివృత్తం: సంస్కృతి
   రచనా విశేషాలు: తెలుగు జానపద గేయ సాహిత్యం, చరిత్రకెక్కిన చరితార్థులు, ఆంధ్ర యోగులు, మరుగుపడిన మాణిక్యాలు, ఉర్దూ, తెలుగు నిఘంటువులు, శ్రీ సత్యసాయి విన్నపాలు, తెలుగు వీరుడు, వీరగాథలు, అల్లూరి సీతారామరాజు, తెలుగు జానపద రామాయణం, తెలుగు సాహిత్యోద్యమకారులు, తెలంగాణ పల్లెపాటలు, తెలంగాణ పిల్లల పాటలు .
3. **నన్నయ (11వ శతాబ్దం):**
   బిరుదు: ఆదికవి, వాగానుశాసనుడు.
   పాఠ్యభాగం: అమ్మ కోసం
   ప్రక్రియ: పద్యం
   ఇతివృత్తం: మాతృభక్తి
   రచనా విశేషాలు: మహాభారతం, ఆంధ్రశబ్ద చింతామణి, చాముండికా విలాసం, ఇంద్ర విజయం.
4. **కొండూరు వీరరాఘవాచార్యులు (20వ శతాబ్దం):**
   పాఠ్యభాగం: నీతి పరిమళాలు
   ప్రక్రియ: శతకం
   ఇతివృత్తం: నైతిక విలువలు
   రచనా విశేషాలు: మిత్ర సాహస్రి
5. **శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) (1910-83):**
   బిరుదు: మహాకవి, అభ్యుదయ కవిత్వ మూలవిరాట్టు.
   పాఠ్యభాగం: ప్రతిజ్ఞ   ప్రక్రియ: గీతం
   ఇతివృత్తం: సామాజిక చైతన్యం
   రచనా విశేషాలు: ప్రభవ (భావ కవితా సంపుటి), మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మూడు యాభైలు, చరమరాత్రి, మరో ప్రస్థానం, సిప్రాలి, కార్టూన్ కవితలు, 1999 రేడియో నాటికలు, అనంతం (ఆత్మకథ).
6. **నార్ల వెంకటేశ్వరరావు (1908):**
   పత్రికా సంపాదకులు, కవి, విమర్శకులు, నాటక కర్త.
   పాఠ్యభాగం: అజంతా చిత్రాలు
   ప్రక్రియ: యాత్రా రచన
   రచనా విశేషాలు: రష్యన్ కథలు(అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం), నార్లవారి మాట (శతకం), కొత్తగడ్డ (నాటికల సంపుటి), సీత జోస్యం.
7. **గౌరన (15వ శతాబ్దం):**
   బిరుదు: చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి, ప్రతివాద గజ పంచాననుడు.
   పాఠ్యభాగం: హరిశ్చంద్రుడు
   ప్రక్రియ : ద్విపద కావ్యం
   రచనా విశేషాలు: నవనాథ చరిత్ర (ద్విపద కావ్యం), హరిశ్చంద్రోపాఖ్యానం (ద్విపద కావ్యం), లక్షణ దీపిక (సంస్కృత గ్రంథం).
8. **వట్టికోట ఆళ్వారుస్వామి (1915-61):**
   గొప్ప నవలాకారుడు
   పాఠ్యభాగం: చిన్నప్పుడే
   ప్రక్రియ : కథానిక
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: ప్రజల మనిషి (ప్రసిద్ధ నవల), గంగు (ప్రసిద్ధ నవల), జైలు లోపల (కథల సంపుటి).
9. **డా. సి. నారాయణ రెడ్డి (సినారె) (1931):**
   బిరుదు: పద్మభూషణ్
   పాఠ్యభాగం: జీవన భాష్యం
   ప్రక్రియ: గజల్
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం,



విశ్వంభర, ప్రపంచ పదులు, మట్టిమనిషి ఆకాశం, సినారె గజళ్లు, మంటలూ - మానవుడు, అక్షరాల గవాక్షాలు, రుతుచక్రం.

10. **డా. ఇరివెంటి కృష్ణమూర్తి (1930-89):**
   రచనా విశేషాలు: తెలుగు ఉత్తర భారత సాహిత్యాలు, చాటువులు, వాగ్భూషణమ్, వేగు చుక్కలు, వెలుగు బాటలు, అడుగు జాడలు, కవి సమయాలు (సిద్ధాంత గ్రంథం).
11. **అయ్యలరాజు రామభద్రుడు (16వ శతాబ్దం):**
   పాఠ్యభాగం: సముద్ర లంఘనం
   ప్రక్రియ: ప్రబంధం
   రచనా విశేషాలు: రామాభ్యుదయం (ప్రబంధం), సకలకథాసారా సంగ్రహం
12. **నందూరి రామమోహన్‌రావు (1927-2011):** పత్రికా సంపాదకులు.
   పాఠ్యభాగం: సంస్కరణ
   ప్రక్రియ: వార్తావ్యాఖ్య
   రచనా విశేషాలు: విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం, పల్లవి - అనుపల్లవి, చిరంజీవులు, నందూరి రామమోహనరావు వ్యాఖ్యావళి, చిలక చెప్పిన రహస్యం, మయూర కన్య, హరివిల్లు (పిల్లల గేయాలు).
13. **ఎస్.టి. జ్ఞానానందకవి (1922-2011):**
   బిరుదు: పద్మశ్రీ
   పాఠ్యభాగం: సందేశం
   ఇతివృత్తం: జాతీయ సమైక్యత
   రచనా విశేషాలు: దీనబంధు శతకం, ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తు శతకం, నా జీవిత గాథ, కూలి నుంచి కళాప్రపూర్ణ వరకు.

వివిధ శతక కవులు - రచనా విశేషాలు:

- భర్తృహరి (7వ శతాబ్దం) - సుభాషిత త్రిశతి
- ధూర్జటి (16వ శతాబ్దం) - శ్రీకాళహస్తీశ్వర శతకం
- తాళ్లపాక పెద్ద తిరుమలయ్య (16వ శతాబ్దం) - వేంకటేశ్వర శతకం
- మారద వెంకయ్య (17వ శతాబ్దం) - భాస్కర శతకం
- కంచర్ల గోపన్న (17వ శతాబ్దం) - దాశరథీ శతకం
- నీలకంఠ దీక్షితులు (17వ శతాబ్దం) - సభారంజన శతకం (మూల కర్త)
- ఏనుగు లక్ష్మణ కవి (18వ శతాబ్దం) - సుభాషిత రత్నావళి
- ఏలూరిపాటి అనంతరామయ్య (20వ శతాబ్దం) - సభారంజన శతకం (అనువాద కర్త).

మాదిరి ప్రశ్నలు

1. గంగాపురం హనుమచ్ఛర్మ రాసిన దుందుభి ఒక ?
   1) ప్రేమ కావ్యం 2) నదీ కావ్యం
   3) వచన కావ్యం 4) అనువాద కావ్యం
2. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలో ఏ నదిని 'దేవసేన' అని పిలుస్తారు?
   1) తుంగభద్ర   2) కృష్ణా
   3) మంజీర   4) దుందుభి
3. తెలుగు జానపద గేయ సాహిత్యం ఎవరి పరిశోధన గ్రంథం?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఎస్.టి. జ్ఞానానంద కవి
   3) నాయని కృష్ణకుమారి
   4) ఇరివెంటి కృష్ణమూర్తి
4. బిరుదురాజు రామరాజు స్వస్థలం?
   1) కల్వకుర్తి (మహబూబ్ నగర్)
   2) దేవనూరు (వరంగల్)
   3) కవుతవరం (కృష్ణా)
   4) నకిరేకల్ (నల్గొండ)
5. కింది వాటిలో బిరుదురాజు రామరాజు రచన కానిది?
   1) తెలుగు వీరుడు
   2) తెలుగు జానపద రామాయణం
   3) తెలుగు జానపద గేయగాథలు
   4) తెలంగాణ పల్లె పాటలు
6. అనువాద పద్ధతి, శైలిలో తర్వాత తరం కవులకు మార్గదర్శకుడు?
   1) నన్నయ   2) తిక్కన
   3) ఎర్రన   4) శ్రీనాథుడు
7. నన్నయ రాసిన 'అమ్మ కోసం' పాఠ్య భాగం ఏ ప్రక్రియ?
   1) పురాణం   2) ఇతిహాసం
   3) ప్రబంధం   4) పురాణేతిహాసం
8. కిందివాటిలో నన్నయ కవిత్వంలో ప్రధాన లక్షణం కానిది?
   1) అక్షర రమ్యత
   2) ప్రసన్న కథా కలితార్థయుక్తి
   3) సూక్తి వైచిత్రి
   4) నానారుచిరార్థసూక్తి నిధిత్వం
9. సభారంజన శతకం- మూలకర్త?
   1) భర్తృహరి
   2) కొండూరు వీరరాఘవాచార్యులు
   3) ఏలూరిపాటి అనంతరామయ్య
   4) నీలకంఠ దీక్షితులు
10. కొండూరు వీరరాఘవాచార్యులు రాసిన శతకం?
   1) మిత్రసాహస్రి 2) సభారంజన శతకం
   3) మిత్రార్థ శతకం 4) వేంకటేశ శతకం
11. నీతి, భక్తి, వైరాగ్యాలను ప్రధానంగా బోధించే రచనలు?
   1) పురాణాలు   2) ఇతిహాసాలు
   3) శతకాలు   4) ఖండకావ్యాలు
12. శ్రీశ్రీ 18వ ఏట వెలువరించిన 'ప్రభవ' ఒక?
   1) అభ్యుదయ కవితా సంపుటి
   2) వచన కవితా సంపుటి
   3) విప్లవ కవితా సంపుటి
   4) భావ కవితా సంపుటి
13. చరమరాత్రి కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు రచనలలో ప్రవేశ పెట్టిన వారు?
   1) సి. నారాయణ రెడ్డి(సినారె)
   2) శ్రీశ్రీ   3) నార్ల వేంకటేశ్వరరావు
   4) త్రిపురనేని గోపీచంద్
14. కృష్ణాజిల్లా కవుతవరంలో జన్మించిన నార్ల వేంకటేశ్వరరావు ఒక గొప్ప?
   1) పత్రికా సంపాదకుడు
   2) కవి, విమర్శకుడు
   3) నాటక కర్త   4) పైవన్నీ
15. రష్యన్ కథలను తెలుగువారికి అందించిన రచయిత?
   1) సి. నారాయణ రెడ్డి(సినారె)
   2) సామల సదాశివ
   3) నార్ల వేంకటేశ్వర రావు
   4) నందూరి రామమోహనరావు
16. 'చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి' అని ఎవరికి బిరుదు?
   1) గౌరన
   2) అయ్యలరాజు రామభద్రుడు
   3) కొరవి గోపరాజు
   4) శ్రీకృష్ణదేవరాయలు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 1; 4) 2; 5) 3; 6) 1; 7) 2; 8) 3; 9) 4; 10) 1; 11) 3; 12) 4; 13) 2; 14) 4; 15) 3; 16) 1.

నాబార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసిన కమిటీ?

గ్రామీణ వ్యవసాయ పరపతి

గ్రామీణాభివృద్ధి, భారత ఆర్థికాభివృద్ధికి చుక్కాని వంటిది. గ్రామాలు సుసంపన్నంగా ఉన్నప్పుడే భారత్ అన్ని రంగాల్లో వెలుగొందుతుంది. కానీ నేటి గ్రామీణ భారతం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. అందుకు ప్రధాన కారణం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉండడం. డబ్బుతో ముడిపడి ఉన్న ఆధునిక వ్యవసాయా నికి సరిపడ పెట్టుబడి పెట్టే ఆర్థిక స్తోమత లేక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. వ్యవసాయం ద్వారా సంపాదించిన ఆదాయం అధిక వడ్డీతో తీసుకున్న రుణాల చెల్లింపునకే సరిపోనప్పుడు రైతన్నకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతుంది.

'రాయల్ కమిషన్' చెప్పినట్లుగా మనదేశంలో రైతు అప్పులతో పుడుతున్నాడు. అప్పులతో నివసిస్తూ చివరకు అప్పులతో మరణిస్తున్నాడు.

గ్రామీణ రుణగ్రస్థత

భారత గ్రామీణాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య వ్యవసాయ రుణగ్రస్థత. ఇది దేశ వ్యవసాయాభివృద్ధిని కుంటుపరుస్తుంది. గ్రామీణుల్లో చాలామంది తమ ఆర్థిక అవసరాల కోసం ఎక్కువగా అప్పులు చేస్తుంటారు. వీటిలో కొంతభాగం కుటుంబ అవసరాలకు, మిగిలిన దాన్ని వ్యవసాయ పెట్టుబడికి వినియోగిస్తున్నారు. అనేక కారణాల వల్ల గ్రామీణులు ఆ అప్పులను పూర్తిగా తీర్చలేక రుణగ్రస్థులవుతున్నారు. ఈ పరిస్థితిని 'గ్రామీణ రుణగ్రస్థత' (Rural Indebtedness) అంటారు.

కారణాలు

పేదరికం, వారసత్వంగా వచ్చిన అప్పులు, పెరిగిన వ్యవసాయ ఖర్చులు, వ్యవసాయ రంగం వెనుకబాటుతనం, అల్ప ఉత్పాదకత, భూమి కౌలు రుసుం అధికంగా ఉండడం, సాంఘిక, మతపరమైన కట్టుబాట్లు, ఆచారాల కోసం చేసే వ్యయం, వడ్డీ వ్యాపారుల మీద అధికంగా ఆధారపడటం, ప్రభుత్వ పరపతి సదుపాయాలు తగినంతగా లేకపోవడం, అనారోగ్యం, దురలవాట్లు మొదలైనవి.

పరిణామాలు

అధిక రుణభారం వల్ల వ్యవసాయదారుడి పెట్టుబడి శక్తి క్షీణిస్తుంది. తద్వారా దిగుబడి తగ్గి, ఉత్పత్తి తక్కువై ఆహార కొరత ఏర్పడుతుంది. ఆహార సరఫరా తక్కువ అవడం వల్ల డిమాండ్ అధికమై ప్రజల ఆహార ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. ప్రజల మిగులు ఆదాయం తగ్గడం వల్ల పారిశ్రామిక, సేవారంగాల ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతుంది. అపుడు ఆర్థిక వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అది ప్రజల విద్యా, వైద్య, ఆరోగ్య స్థితిగతులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాల కోసం, రైతుల రుణాలు మాఫీ చేయాలని ఉద్యమాలు పుడతాయి. వీటికి ప్రభుత్వ స్పందన సానుకూలంగా లేకపోతే అవి హింసాత్మకంగా మారి సమాజ భద్రతకు సవాలుగా మారుతాయి.



నివారణ చర్యలు

వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా ప్రభుత్వ సంస్థాగత పరపతి సౌకర్యాలను గ్రామీణ రైతులకు అధికంగా అందించాలి. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ప్రభుత్వం నియంత్రించి అధిక వడ్డీ వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలి. కరువు పరిస్థితుల్లో రైతు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసి సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఎప్పటి కప్పుడు అందజేయాలి.

గ్రామీణ పరపతిపై ప్రభుత్వ చర్యలు

- గ్రామీణ రుణగ్రస్థతను నిర్మూలించడానికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) 'గోర్వాలా' అధ్యక్షతన 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం'(1954)ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రధానంగా సహకార పరపతి సంఘాలను ఎక్కువ సంఖ్యలో స్థాపించాలని, సహకార మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలని సూచించింది.
- గోర్వాలా నివేదిక ప్రకారం ప్రభుత్వం 1955లో 'ఇంపీరియల్ బ్యాంక్'ను జాతీయం చేసి 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)'గా మార్చింది.
- ఈ కమిటీ సూచనల మేరకు 1956లో ఆర్‌బీఐ గ్రామీణ రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించడానికి 'జాతీయ వ్యవసాయ పరపతి - దీర్ఘకాలిక కార్యకలాపాల నిధి'ని ఏర్పాటుచేసింది. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులను ఆదుకోవడానికీ 'జాతీయ వ్యవసాయ పరపతి స్థిరీకరణ నిధి'ని ప్రారంభించింది.
- ప్రభుత్వం వ్యవసాయ పరపతిని అధికం చేసే క్రమంలో 1969లో 14 వాణిజ్య బ్యాం కులు, 1980లో 6 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసింది.
- 1963లో 'వ్యవసాయ పునర్విత్త సంస్థ'ను స్థాపించారు.
- ప్రొఫెసర్ ఎమ్. నరసింహం కమిటీ సిఫారసు ఆధారంగా ప్రభుత్వం 1975 అక్టోబర్ 2న 'ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్' (RRB)లను స్థాపించింది.
- వ్యవసాయ గ్రామీణాభివృద్ధికి సంస్థా గతమైన ఏర్పాట్ల సమీక్షించడం కోసం క్రాఫికార్డ్ (CRAFICARD) కమిటీ (1979)ను ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సూచనల ప్రకారం 1982 జూలై 12న 'జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్'(NABARD)ను ఏర్పా టు చేసింది. ఇది ఆర్ఆర్‌బీల విధానాలను పర్యవేక్షించే అత్యున్నత బ్యాంక్ (Apex Bank). దీన్ని ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా స్థాపించాయి. ఆర్ఆర్‌బీలకు, ఆర్‌బీఐకి మధ్య నాబార్డ్ సంధానకర్తగా వ్యవహరిస్తుంది. రాష్ట్ర సహకార బ్యాంక్ (SCB)లకు, ఆర్ఆర్‌బీలకు ఇది ప్రత్యక్షంగా రుణ సహాయం అందిస్తుంది. రైతులకు నేరుగా రుణాలను అందించదు.
- గ్రామీణ పరపతిపై సూచనలిచ్చే ఉద్దేశం తో ఆర్.వి.గుప్తా నేతృత్వంలో 1997లో ఆర్‌బీఐ ఒక పరిశీలన సంఘాన్ని నియమించింది. ఈ కమిటీ గ్రామ పరపతిని ప్రోత్సహించే మార్గదర్శక సూత్రాలను సూచించింది. రైతు క్లబ్‌లను స్థాపించి, వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు అందించేలా వాణిజ్య బ్యాంకులు కృషిచేయాలని సిఫారసు చేసింది.
- రైతులకు అవసరమైన పరపతిని సకాలం లో అందించడానికి మనదేశంలో 1904 లోనే 'సహకార సంస్థలు' ఆవిర్భవించాయి. వీటిని మొదట 1961లో, ఆ తర్వాత 1976లోనూ పునర్వ్యవస్థీకరించారు. ఆ తర్వాత అమల్లోకి వచ్చిన 'ఏకగవాక్ష విధానం' (Single window system) సహకార పరపతి విధానంలో నూతన చైతన్యం కలిగించింది. ఇది రైతులకు పరపతి సౌకర్యాలను సులభతరం చేసింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఎకానమీ

వ్యవసాయ పరపతి- వర్గీకరణ

వ్యవసాయ ఉత్పాదకాల కొనుగోలుకు, వ్యవసాయ పనులు చేపట్టడానికి అవసరమైన పరపతిని వ్యవసాయ పరపతి అంటారు. రైతులు తమ పరపతి అవసరాలను వివిధ మార్గాల ద్వారా తీర్చుకుంటున్నారు. అవి రెండు రకాలు.

1. **సంస్థాగతమైన పరపతి మార్గాలు:** ప్రభుత్వం, సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు అందించే పరపతి సౌకర్యాలు.
2. **సంస్థాగతం కాని పరపతి మార్గాలు:** ప్రభుత్వ నియంత్రణ లేని సంస్థలు, ఎలాంటి చట్ట పరమైన విధి విధానాలు లేని వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, స్నేహితులు, బంధువులు, భూస్వాముల నుంచి తీసుకునే అప్పులు. నేడు రైతులకు ఈ మార్గాల నుంచే అధికంగా పరపతి లభిస్తుంది. దీనికి వడ్డీ అధికంగా ఉండటం వల్ల రైతులు ఆర్థిక దోపిడికి గురవుతున్నారు. కాబట్టి ప్రభుత్వం సంస్థాగతం కాని పరపతి సంస్థలను నియం త్రించడానికి ప్రయత్నిస్తోంది. 'అఖిల భారత గ్రామీణ పరపతి పరిశీలన సంఘం' కాలవ్యవధి ఆధారంగా సంస్థాగతమైన పరపతి మార్గాలను 3 రకాలుగా వర్గీకరించింది.

1. **స్వల్పకాలిక పరపతి:**
12 నుంచి 15 నెలల వ్యవధిలో తిరిగి చెల్లించాల్సిన వ్యవసాయ రుణాలను 'స్వల్పకాలిక పరపతి' అంటారు. సాధారణంగా పంట చేతికి రాగానే రైతులు ఈ రుణాలను తీర్చేస్తారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పశువుల మేత కొనుగోలు, కూలీల వేతనాలు, పంట ను మార్కెట్‌కు తరలించడానికి అయ్యే రవాణా వ్యయానికి ఈ స్వల్పకాలిక రుణాలను రైతులు ఉపయోగించుకుంటారు.
2. **మధ్యకాలిక పరపతి:**
15 నెలల నుంచి 5 ఏళ్ల వ్యవధిలో ఈ రుణాలను తిరిగి చెల్లించాలి. పశువులు, వ్యవసాయ పనిముట్లు కొనుగోలు, బావుల తవ్వకం, భూమిని మెరుగుపర్చడం కోసం ఈ రుణాలను తీసుకుంటారు.
3. **దీర్ఘకాలిక పరపతి:**
5 నుంచి 20 ఏళ్ల కాలవ్యవధిలో తిరిగి చెల్లించే రుణాలు.ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటార్ల కొనుగోలు, శాశ్వతంగా భూమిని అభివృద్ధి చేయడం, అదనంగా భూమి కొనుగోలు చేయడా నికి... అధిక మొత్తంలో డబ్బు అవసరం అవుతుంది. దీన్ని తక్కువ కాలంలో తీర్చడం వీలుకాదు. ఎక్కువ వాయిదాల్లో రైతులు ఆ రుణాలను తీర్చడానికి అనువుగా ఈ పరపతి సౌకర్యం సహాయపడుతుంది.

- టి.డబ్ల్యూ. షుల్ట్ అభిప్రాయం ప్రకారం 'ఇండియాలో పరపతి కొరత మూలంగా వ్యవసాయాభివృద్ధి కుంటుపడడమే కాకుండా, వ్యవసాయాన్ని ఆధునీకరించే ప్రక్రియలో వేగం తగ్గింది'. దీన్ని బట్టి వ్యవసాయంలో ప్రగతిని స్థిరీకరించడానికీ పరపతి కీలకపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు.

తక్కావి రుణాలు

సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లు, వాణిజ్య బ్యాంక్‌లు, రైతులకు పరపతి సౌకర్యాలను అందించక ముందు ప్రభుత్వమే నేరుగా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను ఇచ్చేది. ముఖ్యంగా కరువు కాట కాలు, వరదలు మొదలైన ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులను ఆదుకోవడానికి ఇచ్చే రుణాలను 'తక్కావి' రుణాలంటారు. రైతులు ఈ రుణాలను తక్కువ వడ్డీతో, ఎక్కువ వాయిదాల్లో తీర్చేటట్లుగా వెసులుబాటు ఉండేది. అయితే కఠినమైన నియమాలు ఉండటం, మంజూరు చేయడంతో జాప్యం వల్ల ఇవి ఆదరణ కోల్పోయాయి..

మాదిరి ప్రశ్నలు

1. ఇందిరాగాంధీ ఏ బ్యాంక్‌లను జాతీయం చేశారు?
ఎ) గ్రామీణ బ్యాంక్‌లు
బి) వాణిజ్య బ్యాంక్‌లు
సి) భారతీయ స్టేట్ బ్యాంక్‌లు
డి) పైవన్నీ
2. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1975 బి) 1978 సి) 1980 డి) 1982
3. గ్రామీణ రుణగ్రస్థతకు ప్రధాన కారణం
ఎ) రైతులు వ్యాపారస్తుల నుంచి తీసుకున్న రుణాలకు అధికంగా వడ్డీ చెల్లించడం
బి) వ్యవసాయ కమతాలు చిన్నవిగా ఉండీ దిగుబడి తక్కువై రైతుల ఆదాయం తగ్గటం
సి) పెళ్లిళ్ల, పుట్టుక, పండుగలు, చావులు కార్యక్రమాల కోసం గ్రామీణులు అధికంగా ఖర్చుచేసి అప్పుల పాలవడం
డి) పైవన్నీ
4. ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు అపెక్స్ బ్యాంక్ ?
ఎ) RBI బి) SBI
సి) NABARD డి) DCB
5. 'తక్కావి రుణాలు' అంటే ఏమిటి?
ఎ) ప్రభుత్వం నామమాత్రపు వడ్డీతో రైతులకిచ్చే అతిస్వల్పకాలిక రుణాలు
బి) వ్యవసాయ పనిముట్ల కొనుగోలు కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకిచ్చే రుణాలు
సి) ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్కువ వడ్డీ, ఎక్కువ వాయిదాల్లో తీర్చేలా ప్రభుత్వం రైతులకిచ్చే రుణాలు
డి) సహకార సంస్థలు, గ్రామీణ బ్యాంక్‌లు అతి తక్కువ వడ్డీతో రైతులకిచ్చే స్వల్పకాలిక దీర్ఘకాలిక రుణాలు
6. రామయ్య పశువులను కొనుగోలు చేయటానికి రుణం కోసం బ్యాంక్‌కు దరఖాస్తు చేశాడు. అపుడు బ్యాంక్ ఏ రకమైన రుణాన్ని అతడికి మంజూరు చేస్తుంది?
ఎ) స్వల్పకాలిక రుణం
బి) అతి స్వల్పకాలిక రుణం
సి) మధ్యకాలిక రుణం డి) దీర్ఘకాలిక రుణం
7. కిందివాటిలో రైతులకు ప్రత్యక్షంగా రుణాలివ్వని సంస్థ?
ఎ) ప్రాథమిక భూ అభివృద్ధి బ్యాంకులు
బి) ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు
సి) ఎస్‌బీఐ డి) నాబార్డ్
8. నాబార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసిన కమిటీ?
ఎ) క్రాఫికార్డ్ కమిటీ బి) సరయూ కమిటీ
సి) నరసింహం కమిటీ డి) గోర్వాలా కమిటీ

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) సి;
5) సి; 6) సి; 7) డి; 8) ఎ.

The technique of focus on advertising..

BANK EXAMS
MARKETING AWARENESS



1. The fact that services are sold, produced and consumed at the same time refers to which of the following service characteristics?
a) Intangibility b) Inseparability
c) Variability d) Perishability
e) None of the above
2. Electronic shopping, TV shopping is related with:
a) Advertising
b) Personal Selling
c) Direct Marketing
d) In direct Marketing
e) Personal buying
3. The purpose of which of the following type of advertising is to create repeat purchases?
a) Reminder b) Reinforcement
c) Persuasive d) Informative
e) None of the above
4. ______ is the process of evaluating each market segment's attractiveness and selecting one or more segments to enter.
a) Mass marketing
b) Market segmentation
c) Market targeting
d) Market positioning
e) None of the above
5. The technique of focus on advertising of non-competitive brand with the other brand is called:
a) Cross-promotions
b) Tie-in promotions
c) Premiums d) All the above
e) None of the above
6. Labelling, packaging are associated with:
a) Price mix b) Product mix
c) Place mix d) Promotion mix
e) Cost mix
7. Entry of laggards is in which stage of PLC (Product Life Cycle)?
a) First b) Second
c) Third d) Fourth
e) Fifth
8. ______ factors are the most popular bases for segmenting customer groups.
a) Geographic b) Demographic
c) Psychographic
d) Behavioural
e) None of the above
9. A method in which various products are combined at the same price is:
a) Promotional pricing
b) Product-bundle pricing
c) Captive product pricing
d) Optional product pricing
e) All the above
10. Differentiation in pricing for various geographical customers:
a) Price skimming
b) Psychological pricing
c) Pricing variations
d) Geographical pricing
e) None of the above
11. According to the American Marketing Association, which of the following is marketing of products that are presumed to be environmentally safe?
a) Gray Marketing
b) Green Marketing
c) Global Marketing
d) Social Marketing
e) Internet Marketing
12. One of the following is not included in the 7 Ps of Marketing. Find the same ______.
a) Placement b) Price
c) Production d) Promotion
e) Product
13. Innovation in marketing is same as ______
a) Motivation b) Perspiration
c) Aspiration d) Creativity
e) Team work
14. A call marketing terms means?
a) A newly introduced product
b) Territory allocation for salesperson
c) A Call Centers
d) A Sales meeting
e) To visit a prospect
15. Bank ATMs are______
a) Delivery outlets
b) Market plans
c) Personalized Products
d) Tools for overcoming buyers resistance
e) Motivating tools
16. The USP of current account is ______
a) High minimum balance
b) No restrictions on transactions
c) No internet payable
d) Restricted deposits
e) Easy credits
17. The target group for SME Loan is ______
a) All salaried persons
b) Govt. undertakings
c) All entrepreneurs
d) All students e)All housewives
18. ______ is a principle of enlightened marketing that requires a company seek real product and marketing improvements.
a) Innovative marketing
b) Consumer-oriented marketing
c) Value marketing
d) Sense-of-mission marketing
e) None of the above
19. NAV is the price of______
a) Entire fund value
b) One unit of a fund
c) Surrender value
d) Average value of shares
e) Dividends paid in a year
20. A Master policy in the case of Life insurance indicates ______
a) Policy is sale
b) Policy is in the name of servant
c) Only one life is assured
d) There are several beneficiaries
e) Life assured should be a male
21. The biggest or greatest amount of involvement in a foreign market comes through which of the following?
a) Exporting b) Joint venturing
c) Licensing
d) Direct investment
e) None of the above
22. Financial inclusion needs canvassing the accounts of ______
a) Financial Institutions
b) NRIs c) HNIs
d) Housewives
e) Persons below a specified income level
23. Facilities for sale and purchase of agricultural products are available in ______
a) Commodity exchange
b) Regulated market
c) Stock exchange
d) Unregulated market
e) None of the above
24. The company that overlooks new and better ways to do things will eventually lose customers to another company that has found a better way of serving customer needs is a major tenet of:
a) Innovative marketing
b) Consumer-oriented marketing
c) Value marketing
d) Sense-of-mission marketing
e) None of the above
25. All of the following would be ways to segment within the category of psychographic segmentation EXCEPT:
a) Social class b) Occupation
c) Lifestyle d) Personality
e) Creativity
26. In terms of execution styles, a family seated at the dinner table enjoying the advertised product would be an example of which of the following types of advertising?
a) Slice of life b) Lifestyle
c) Mood or imagery
d) Personality symbol
e) Personality
27. A child in the United States is normally exposed to all of the following values EXCEPT:
a) Achievement and success
b) Activity and involvement
c) Material comfort
d) Collectivism
e) None of the above
28. ______ has contractual authority to sell a manufacturer's entire output.
a) Selling agents
b) Rack jobbers
c) Manufacturer's agents
d) Purchasing agents
e) None of these
29. Sellers that handle their own exports are engaged in:
a) Direct exporting
b) Indirect exporting
c) Licensing
d) Contract manufacturing
e) None of the above
30. More and more salespeople are being evaluated and compensated based on different measures than in the past. All of the following are illustrations of those measures EXCEPT:
a) Long-term customer satisfaction
b) Competitive predatory pricing performance
c) Full customer service
d) Retention rates
e) None of the above
31. ______ includes practices such as overstating the product's features or performance, luring the customer to the store for a bargain that is out of stock, or running rigged contests.
a) Deceptive promotion
b) Deceptive packaging
c) Deceptive pricing
d) Deceptive cost structure
e) None of the above
32. The type of sales presentation approach that requires good listening and problem-solving skills is the:
a) Canned approach
b) Formula approach
c) Need-satisfaction approach
d) Critical-thinking approach
e) None of the above
33. In terms of special product life cycles, a ______ is a basic and distinctive mode of expression.
a) genre b) style
c) fashion d) fad e) None

KEY

1) b	2) c	3) a	4) c	5) a
6) b	7) d	8) b	9) b	10) d
11) b	12) c	13) d	14) e	15) c
16) b	17) c	18) a	19) b	20) d
21) d	22) e	23) d	24) a	25) b
26) a	27) d	28) a	29) a	30) a
31) b	32) a	33) b		